www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

మంగళవారం | 4-3-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 335

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం; తిథి: పంచమి మ.3.17 తదుపరి షష్ఠి; నక్షత్రం: భరణి రా.2.38 తదుపరి కృత్తిక; వర్జ్యం: మ.1.20-2.49; అమృతఘడియలు: రా.10.12-11.40; దుర్ముహూర్తం: ఉ.8.55-9.42; రా.10.20-11.07; రాహుకాలం: మ.3.00-4.30; సూర్యోదయం: 6.34; సూర్యాస్తమయం: 6.18

వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఏపీ సీఎం ఔనన్నా.. టీటీడీ కరుణించట్లే..!

- తెలంగాణ ప్రజాప్రతినిధులు ఇచ్చే సిఫారసు లేఖలపై తిరుమల అధికారుల మల్లగుల్లాలు
- ఇప్పటికే రోజుకు 7500 బ్రేక్ దర్శనాల తాకిడి
- ప్రస్తుతం ఈ దర్శనాలకే మధ్యాహ్నం దాటుతోంది
- తెలంగాణ ప్రజాప్రతినిధుల లేఖలతో మరింత ఒత్తిడి
- ఎలా సర్దుబాటు చేయాలో తోచక సతమతం

12



తెలంగాణ ప్రాజెక్టులపై

అభ్యంతరాలొద్దు

ఎన్డీయే భాగస్వామిగా వేగంగా అనుమతులు ఇప్పించండి



కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌కు వినతిపత్రం ఇస్తున్న ముఖ్యమంత్రి రేవంత్

- అప్పటి వరకూ ఏపీ ప్రాజెక్టులపై అభ్యంతరాలు తెలుపుతాం
- ఏపీ ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టీకరణ
- గోదావరిలో నికర జలాల కేటాయింపులు జరగనప్పుడు
- అదనపు జలాలను వినియోగించుకుంటామనడం సరికాదు
- లెక్కలు తేలేది పూర్తిస్థాయి కేటాయింపులు జరిగిన తర్వాతే..
- గతంలో జరిగిన పొరపాటు వల్ల తెలంగాణకు అన్యాయం
- గోదావరిలో తెలంగాణ నికర వాటా తేల్చాల్సిందే: సీఎం
- పాలమూరు, సీతారామ, సమ్మక్క బ్యారేజీకి అనుమతులివ్వండి
- కృష్ణా జలాల్లో తెలంగాణకు న్యాయబద్ధ వాటా కేటాయించండి
- కేంద్ర జల శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు ముఖ్యమంత్రి వినతి

న్యూఢిల్లీ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): "తెలంగాణ ప్రాజెక్టులపై అభ్యంతరాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉపసంహరించుకోవాలి. ఎన్డీయే ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న ఏపీ సర్కారు కేంద్రంతో మాట్లాడి తెలంగాణ ప్రాజెక్టులకు వేగంగా అనుమతులు ఇప్పించాలి. తెలంగాణకు నీటి కేటాయింపులు జరగకుండా, రాష్ట్ర ప్రాజెక్టుల భవిష్యత్తు అగమ్యగోచరంగా ఉన్నంత వరకూ వరద జలాలపై ఏపీ ప్రాజెక్టులకు అభ్యంతరం తెలుపుతాం. ఈ విషయంలో ఎటువంటి శషబిషలకు తావులేదు" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. గోదావరిపై తెలంగాణ నిర్మిస్తున్న ప్రాజెక్టులకు అనుమతులన్నీ వచ్చిన తర్వాత విభగతా వాటిపై ఏ నిర్ణయం తీసుకున్నా తెలంగాణ ప్రభుత్వానికి అభ్యంతరం లేదని తేల్చి చెప్పారు. తెలంగాణ ప్రాజెక్టులకు అనుమతులన్నీ వచ్చిన తర్వాతే ఏపీ సమస్యకు పరిష్కారం దొరుకుతుందని తెలిపారు. ఢిల్లీలోని శ్రమశక్తి భవన్‌లో కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌తో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి సోమవారం దాదాపు గంటపాటు సమావేశమయ్యారు. అనంతరం, మీడియాతో మాట్లాడారు. ఇటీవలే ప్రధాని మోదీని కలిసి గోదావరిపై ప్రాజెక్టులు, జలాల అనుసంధానం తదితర అంశాలపై వివరించాననే విషయాన్ని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. "కృష్ణా నదీ పరీవాహకంలో సుమారు 70 శాతం తెలంగాణలో ఉంటే 30 శాతం మాత్రమే ఆంధ్రప్రదేశ్‌లో ఉంది. అందుకే, కృష్ణా జలాల్లో 70 శాతం వాటా తెలంగాణ

మిగతా 13వ పేజీలో...



హైదరాబాద్-విజయవాడ హైవే విస్తరణ..

డీపీఆర్ కన్సల్టెంట్ ఖరారు

- పనులు దక్కించుకున్న భోపాల్ కంపెనీ
- అధ్యయనానికి రూ.9.86 కోట్ల ఖర్చు
- త్వరలో సంస్థతో కేంద్రం ఒప్పందం
- ఆరు నెలల్లో కేంద్రానికి నివేదిక
- దండు మల్కాపూర్ నుంచి ఏపీలోని గొల్లపూడి వరకు 6 లేన్లుగా విస్తరణ

హైదరాబాద్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి (ఎన్‌హెచ్-65) ఆరు లేన్ల విస్తరణ ప్రక్రియలో కీలక అడుగు పడింది. ఆ మార్గంలో ప్రస్తుతం ఉన్న నాలుగు లేన్లను ఆరు లేన్లుగా విస్తరించేందుకు అవసరమైన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) తయారీకి కన్సల్టెంట్ సంస్థ ఖరారైంది. ఎన్‌హెచ్-65ను ఆరు లేన్లుగా విస్తరించే అంశంపై అధ్యయనం చేసి సమగ్ర నివేదిక ఇచ్చేందుకు కేంద్ర రవాణా, రహదారుల శాఖ గత ఏడాది టెండర్లను ఆహ్వానించింది. టెండర్ల ప్రక్రియలో సాంకేతిక బిడ్‌లను 2025 జనవరి 20న తెరవగా, అందులో అర్హత సాధించిన ఫైనల్ టెండర్లను జనవరి 30న తెరిచారు. మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌కు చెందిన ఓ కంపెనీ ఈ పనిని

మిగతా 13వ పేజీలో...

నల్లగొండలో పీఆర్‌టీయూ కరీంనగర్‌లో బీజేపీ

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో జయకేతనం



మల్క కొమురయ్య



పింగిళి శ్రీపాల్ రెడ్డి

- కరీంనగర్ స్థానంలో మొదటి ప్రాధాన్య ఓట్లతోనే గెలుపొందిన బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య
- 2వ స్థానంలో పీఆర్‌టీయూ అభ్యర్థి మహేందర్‌రెడ్డి
- నల్లగొండ స్థానంలో పింగిళి శ్రీపాల్‌రెడ్డి విజయం
- రెండో ప్రాధాన్య ఓట్లతో గెలిచిన పీఆర్‌టీయూ నేత
- చివరిదాకా పోటీనిచ్చిన యూటీఎఫ్ అభ్యర్థి నర్సిరెడ్డి
- 19వ రౌండ్‌లో నర్సిరెడ్డి ఎలిమినేషన్‌తో ఫలితం
- బీసీలు బలపరిచిన పూల రవీందర్‌కు 4వ స్థానం
- ఇంకా కట్టలు కట్టే దశలోనే 'పట్టభద్రుల' కౌంటింగ్
- నేటి మధ్యాహ్నం తర్వాత లెక్కింపు షురూ!

ఆంధ్రప్రదేశ్‌లో కూటమికే జేజేలు!

- 'కృష్ణా-గుంటూరు' పట్టభద్రుల స్థానంలో ఆలపాటికి తొలి ప్రాధాన్యంలో భారీ మెజారిటీ
- గోదావరిలోనూ ఆధిక్యంలో..
- ఉత్తరాంధ్రలో పీఆర్టీయూ, ఏపీటీఎఫ్ అభ్యర్థులిద్దరికీ టీడీపీ మద్దతు
- ఇక్కడ పీఆర్టీయూ అభ్యర్థి శ్రీనివాసులునాయుడు గెలుపు

12

కరీంనగర్/నల్లగొండ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాల్లో పీఆర్‌టీయూ, బీజేపీ సత్తా చాటాయి. కరీంనగర్-నిజామాబాద్-ఆదిలాబాద్-మెదక్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాన్ని బీజేపీ గెలుచుకోగా, నల్లగొండ-వరంగల్-ఖమ్మం ఎమ్మెల్సీ స్థానాన్ని పీఆర్‌టీయూ దక్కించుకుంది. కరీంనగర్ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన మల్క కొమురయ్య మొదటి ప్రాధాన్య ఓట్లతోనే ఘన విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి, పీఆర్‌టీయూ బలపరిచిన అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డిపై కొమురయ్య 5,777 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. మరోవైపు నల్లగొండ ఎమ్మెల్సీ స్థానానికి జరిగిన హోరాహోరీ పోరులో పీఆర్‌టీయూ అభ్యర్థి పింగిళి శ్రీపాల్‌రెడ్డి ద్వితీయ ప్రాధాన్య ఓట్లతో విజయం సాధించారు. ఆయన తన సమీప ప్రత్యర్థి, సిటింగ్ ఎమ్మెల్సీ అయిన టీఎస్ యూటీఎఫ్ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డిపై గెలుపొందారు. మొదటి ప్రాధాన్య ఓట్లలో ఎవరికీ కోటా ఓట్లు రాకపోవడంతో.. ద్వితీయ ప్రాధాన్య ఓట్లను లెక్కించారు. అత్యంత ఉత్కంఠభరితంగా సాగిన ద్వితీయ ప్రాధాన్య ఓట్ల

మిగతా 12వ పేజీలో...





శ్రీరామరాజు దశరథ్

10 వేలు లంచం తీసుకుంటూ..

ఏసీబీకి చిక్కిన సబ్‌రిజిస్ట్రార్, డీఈఈ

- కార్యాలయంలోనే పట్టుబడ్డ నిజామాబాద్ సబ్‌రిజిస్ట్రార్ శ్రీరామరాజు
- ఫైల్‌పై సంతకానికి 10 వేలు తీసుకుంటూ దొరికిన జీహెచ్ఎంసీ డీఈఈ దశరథ్

3

పోసాని కోసం పోలీసుల క్యూ!

- ఆయనపై వరుసగా పీటీ వారెంట్లు
- రాజంపేట నుంచి తొలుత నరసరావుపేటకు
- తమకూ అనుమతివ్వాలన్న అనంతపురం, అల్లూరు తదితర జిల్లాల పోలీసులు
- నరసరావుపేట కోర్టులో హాజరు
- పోసానికి 13 వరకూ రిమాండ్

2



నూతన జంటను ఆశీర్వదిస్తున్న సీఎం స్టాలిన్

పెళ్లి చేసుకున్న వెంటనే పిల్లల్ని కనండి

- గతంలో కు.ని.పై గట్టిగా దృష్టి పెట్టాం
- జనాభా తగ్గితే లోక్‌సభ సీట్లు కోల్పోతాం
- పునర్విభజనలో మన రాష్ట్రానికి నష్టం
- ఆ లోపు ఎక్కువ మంది పిల్లల్ని కనండి
- వారికి మంచి తమిళ పేరు పెట్టండి
- నూతన వధూవరులకు తమిళనాడు సీఎం స్టాలిన్ వినతి

2



రుసుము చెల్లిస్తే.. ఎల్‌ఆర్ఎస్

10 రోజుల్లోనే!

- దరఖాస్తు తిరస్కరిస్తే 10 శాతం ప్రాసెసింగ్ ఫీజుగా మినహాయింపు
- ప్రో-రేటా ఓపెన్ స్పేస్ రుసుము చెల్లించకుంటే రాయితీ లేనట్లే
- ఆ రుసుము చెల్లించకపోయినా క్రమబద్ధీకరణకు ఆమోదం
- కానీ, భవన నిర్మాణ సమయంలో మొత్తం సొమ్ము చెల్లించాల్సిందే

హైదరాబాద్ సిటీ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఫీజు చెల్లించిన ఎల్‌ఆర్ఎస్ దరఖాస్తులను పది రోజుల్లోగా పరిష్కరిస్తామని హెచ్ఎండీఏ ప్రకటించింది. క్రమబద్ధీకరణ రుసుముతోపాటు ప్రో-రేటా ఓపెన్ స్పేస్ చార్జీలను కలిపి ఈనెల 31వ తేదీలోగా చెల్లించిన వారికే 25 శాతం రాయితీ వర్తిస్తుందని స్పష్టం చేసింది. రాయితీ కోరుతున్న అర్హులైన ప్లాట్ యజమానులు గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేసింది. ఒకవేళ, వివిధ కారణాలతో దరఖాస్తు తిరస్కరణకు గురైతే.. ప్రాసెసింగ్ చార్జీల కింద 10 శాతం మినహాయించుకుని.. మిగిలిన 90 శాతాన్ని వెనక్కి ఇస్తామని ఓ ప్రకటనలో తెలిపింది. అలాగే, నిషేధిత జాబితాలో లేని భూములు, చెరువులు, కుంటలు, నదులకు 200 మీటర్ల

మిగతా 12వ పేజీలో...

సుంకాల ఆందోళన.. స్టాక్ మార్కెట్ అల్లకల్లోలం

అమెరికాకు గోయల్



- కార్యక్రమాలన్నీ రద్దు చేసుకొని హుటాహుటిన వెళ్లిన కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్
- ఐదు రోజుల పాటు అమెరికాలోనే..
- సుంకాల తగ్గింపు, వాణిజ్య ఒప్పందంపై చర్చలు
- ద్వైపాక్షిక వాణిజ్యాన్ని మెరుగుపర్చడంపై అమెరికా అధికారులతో మంత్రి సమాలోచనలు!

న్యూఢిల్లీ, మార్చి 3: ఓవైపు అమెరికా సుంకాల ఆందోళన.. మరోవైపు దేశీయ స్టాక్ మార్కెట్ల అల్లకల్లోలం వెరసి.. కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ హుటాహుటిన అమెరికాకు బయలుదేరారు. ట్రంప్ సుంకాల ప్రకటనల కారణంగా గత రెండు వారాలుగా దేశీయ స్టాక్ మార్కెట్‌లో తీవ్ర నష్టాలే ఎదురవుతున్నాయి. గత శుక్రవారం ఒక్క రోజులోనే రూ.10 లక్షల కోట్ల మదుపర్ల సంపద ఆవిరైంది. ఇక తాజాగా సోమవారం సెన్సెక్స్ 112.46 పాయింట్లు నష్టపోవడంతో పాటు నిఫ్టీకి 5 పాయింట్ల మేర నష్టం వాటిల్లింది. ఈ క్రమంలోనే నష్ట నివారణ చర్యల నిమిత్తం గోయల్ తన అధికారిక కార్యక్రమాల్ని రద్దు చేసుకొని మరీ అధికారుల

2

మిగతా 2వ పేజీలో...

'నాటో' నుంచి వైదొలగాలి

- ఐరాస నుంచీ అమెరికా బయటపడాలి
- యూఎస్ ఎయిడ్.. క్రిమినల్ సంస్థ: మస్క్
- ఖనిజాల ఒప్పందంపై సంతకానికి సిద్ధం
- అమెరికా ప్రాధాన్యం అర్థం చేసుకున్నా!
- ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ వ్యాఖ్యలు
- పుతిన్ గురించి ఆందోళన అక్కర్లేదు!
- అక్రమ వలసలపై దృష్టి పెట్టాలి: ట్రంప్



లయన్ సఫారీ సందర్భంగా సింహాలను తన కెమెరాలో బంధిస్తున్న మోదీ

ఆసియా సింహాలు పెరిగాయ్

- సింహాల సంరక్షణలో స్థానిక గిరిజనులు, మహిళల పాత్ర భేష్: మోదీ
- ప్రపంచ వన్యప్రాణి దినోత్సవం సందర్భంగా గుజరాత్‌లోని గిర్ అడవుల్లో ప్రధాని లయన్ సఫారీ

సాసన్ (గుజరాత్), మార్చి 3: గిర్ అభయారణ్యంలో ఆసియా సింహాల ఆవాసాలను కాపాడేందుకు స్థానిక గిరిజనులు, మహిళలు చేస్తున్న కృషిని ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. వారందరి కృషి వల్ల ఆసియా సింహాల సంఖ్య క్రమంగా పెరుగుతోందని అన్నారు. మూడు రోజుల పర్యటన నిమిత్తం తన సొంత రాష్ట్రం గుజరాత్‌లో ఉన్న ప్రధాని మోదీ.. ప్రపంచ వన్యప్రాణి దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ఉదయం జునాగఢ్ జిల్లాలోని గిర్ వన్యప్రాణి సంరక్షణ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా లయన్ సఫారీ చేశారు. అక్కడ కనిపించిన సింహాలను కెమెరాలో బంధించారు. అనంతరం వాటిని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'ఈ రోజు ప్రపంచ వన్యప్రాణి

మిగతా 2వ పేజీలో...

ఆస్తి కోసం అయినవారి ప్రాణాలే తీసి..

- రూ.100 కోట్ల భూమి విషయంలో తల్లితో కొడుకు గొడవ
- భూమి పంచివ్వనందుకు ఆమెను కత్తితో పొడిచి హత్య
- సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్‌లో దారుణం
- 5 గుంటల భూమి కోసం భర్తను చంపిన భార్య
- ఆ భూమిని తన పేరిట రాయాలని భర్తకు వేధింపులు
- మహబూబ్‌నగర్ జిల్లాలోని ఇబ్రహీంబాద్‌లో నిద్రిస్తున్న భర్తను కొడుకుతో కలిసి గొంతునులిమి హత్య

రామచంద్రాపురం, హన్వాడ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): అయినవారికన్నా ఆస్తిపాస్తులే ముఖ్యం.. అవసరమైతే ప్రాణాలు తీసేందుకు వెనుకాడం! రెండు వేర్వేరు ఘటనల్లో నిందితులు ఇలానే వ్యవహరించారు. చుక్కపడకుండా క్షణం ఉండలేని ఓ పుత్రరత్నం.. ఆస్తి పంచివ్వాలని, లేదంటే చంపేస్తానని కొన్నాళ్లుగా తల్లిదండ్రులను బెదిరిస్తూ అన్నంత పనీ చేశాడు! రాత్రి గదిలో నిద్రిస్తున్న కన్నతల్లిని కత్తితో విచక్షణారహితంగా పొడిచి చంపాడు. మరో ఘటనలో ఐదు గుంటల భూమిని తన పేరుమీద రాయాలని కొన్నాళ్లుగా భర్తను వేధిస్తున్న భార్య చివరికి అతడిని గొంతు పిసికి చంపేసింది. సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ గ్రామానికి చెందిన నవారి మల్లారెడ్డి, రాధికా రెడ్డి (51) దంపతులకు

మిగతా 3వ పేజీలో...



ఆస్కార్ పురస్కారాలతో అనోరా చిత్ర బృందం

అనోరాకు ఆస్కార్ పంట

- హాలీవుడ్ చిత్రానికి ఐదు అవార్డులు
- ఉత్తమ దర్శకుడిగా సీన్ బేకర్
- ఉత్తమ నటుడిగా అడ్రియన్ బ్రాడీ
- ఉత్తమ నటిగా మైకీ మ్యాడిసన్
- భారతీయ లఘుచిత్రం 'అనూజ'కు నిరాశ
- డ్యూన్-2కు ఆస్కార్..
- తెలంగాణ వాసి సుమంత్‌రెడ్డి పాత్ర

10



మైకీ మ్యాడిసన్

పోస్టులను తొలగించే ముందు నోటీసు ఇవ్వాల్సిందే!

» సుప్రీంకోర్టు ధర్మాసనం అభిప్రాయం

» ఆరు వారాల్లో స్పందన తెలపాలని కేంద్రానికి నోటీసులు

న్యూఢిల్లీ, మార్చి 3: సోషల్ మీడియాలో అభ్యంతకర పోస్టులను తొలగించడానికి ముందు.. సంబంధిత వ్యక్తులకు నోటీసులు ఇవ్వాలని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. ఐటీ నిబంధనలు-2009ని సవాలు చేస్తూ దాఖలైన ఓ ప్రజాహిత వ్యాజ్యం(పిల్)పై విచారణ సందర్భంగా జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ ఏజీ మాసిహ్‌ల ధర్మాసనం.. ఎవరైనా సోషల్ మీడియాలో ఏదైనా సమాచారాన్ని పోస్టు చేస్తే.. దాన్ని తొలగించే ముందు వారి వాదనలను వినాలని భావిస్తున్నట్లు వెల్లడించింది. 'సాఫ్ట్‌వేర్ ఫ్రీడమ్ లా సెంటర్' అనే సంస్థ ఈ పిల్‌ను దాఖలు చేయగా.. సీనియర్ న్యాయవాది ఇందిరాజైసింగ్ వాదనలను వినిపించారు. "ఐటీ చట్టంలోని సెక్షన్ 69(ఏ) ప్రకారం.. సామాజిక మాధ్యమాల నుంచి సమాచారాన్ని తొలగించే అధికారం ప్రభుత్వానికి ఉంది. అయితే.. ఆ సమాచారాన్ని పోస్టు చేసిన వ్యక్తికి నోటీసులు ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఐటీ నిబంధనలు-2009లోని రూల్-8లో 'వ్యక్తి' అనే పదాన్ని సరిగ్గా నిర్వచించలేదు. రూల్-16 ప్రకారం ఫిర్యాదు చేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతూ.. చర్యలు తీసుకోవాలి. కానీ, ప్రభుత్వం వ్యక్తులకు కాకుండా.. 'ఎక్స్' వంటి సామాజిక మాధ్యమ సంస్థలకు మాత్రమే నోటీసులు ఇస్తూ.. కంటెంట్‌ను తొలగిస్తోంది" అని వివరించారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. పోస్టు చేసిన వ్యక్తులను గుర్తిస్తే.. వారి కంటెంట్‌ను తొలగించే ముందు నోటీసులు జారీ చేసి, వారి వాదనలను వినాలని భావిస్తున్నట్లు తెలిపింది. రాజ్యాంగం ప్రకారం వాక్‌స్వాతంత్ర్య హక్కు, జీవించే హక్కుకు భంగం వాటిల్లకూడదని అభిప్రాయపడింది. ఈ పిల్‌పై ఆరు వారాల్లో స్పందన తెలపాలంటూ కేంద్రానికి నోటీసులు జారీ చేస్తూ.. విచారణను వాయిదా వేసింది.



జడ్జి పదవులకు అంధులు అర్హులే

» ఎలాంటి వివక్ష ఉండకూడదు: సుప్రీంకోర్టు స్పష్టీకరణ

న్యూఢిల్లీ, మార్చి 3: జడ్జి పదవులకు అంధులు అర్హులేనని సోమవారం సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. వారి పట్ల ఎలాంటి వివక్ష ఉండకూడదని పేర్కొంది. అంధులు జడ్జి ఉద్యోగాలకు అర్హులు కారన్న నిబంధనను కొట్టివేస్తూ జస్టిస్ జె.బి.పార్డీవాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌ల ధర్మాసనం ఈ మేరకు తీర్పును వెలువరించింది. మధ్యప్రదేశ్ జ్యుడీషియల్ సర్వీసెస్ నిబంధనల్లోని రూల్- 6ఏ ప్రకారం అంధత్వం ఉన్నవారు న్యాయాధికార పరీక్షలు రాయడానికి వీల్లేదు. ఈ కారణంగా అంధుడైన తన కుమారుడు పరీక్ష రాయలేకపోయాడని పేర్కొంటూ ఆయన తల్లి అప్పటి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్‌కు లేఖ రాశారు. దీనిపై విచారణ జరిపిన ధర్మాసనం.. ఆ రూల్ వివక్షాపూరితంగా ఉందని పేర్కొంటూ కొట్టివేసింది. దివ్యాంగుల హక్కుల చట్టం-2016లోని నిబంధనల ప్రకారం అలాంటి వ్యక్తులకు తగిన సదుపాయాలు కల్పించాలని ఆదేశించింది. జడ్జీల పదవులకు అంధులు అర్హులేనని గతంలో సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. ఆ మేరకు రాజస్థాన్, తమిళనాడుల్లో నియామకాలు జరిగాయి.

లోకం తీరు



'నాటో' కూటమి నుంచి అమెరికా వచ్చేయాలి

ఐరాస నుంచి కూడా..: ఎలాన్ మస్క్

వాషింగ్టన్, మార్చి 3: పరస్పర రక్షణ కోసం ఉద్దేశించిన 'నాటో' దేశాల కూటమి నుంచి అమెరికా బయటకు వచ్చేయాలని ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ అభిప్రాయపడ్డారు. ఐక్యరాజ్య సమితి (ఐరా స) నుంచి కూడా బయటపడాలని సూచించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మంత్రివర్గంలో ఆయన సభ్యుడు కానప్పటికీ, ప్రభుత్వ వ్యయాలను తగ్గించడానికి ఉద్దేశించిన ప్రభుత్వ సామర్థ్య విభాగా (డోగ్)నికి ఆధిపత్యం వహిస్తుండడం గమనార్హం. శనివారం ఎవరో ఒక వ్యక్తి 'నాటో, ఐరాస నుంచి అమెరికా బయటకు రావాల్సిన సమయం వచ్చింది' అంటూ సామాజిక మాధ్యమాల్లో పోస్టు పెట్టారు. ఇందుకు మస్క్ స్పందిస్తూ.. 'నేను అంగీకరిస్తున్నా' అని పేర్కొన్నారు. వివిధ దేశాలకు ఆర్థిక సాయం చేయడానికి ఉద్దేశించిన 'యూఎస్ ఎయిడ్' సంస్థను కూడా ఆయన 'క్రిమినల్ ఆర్గనైజేషన్'గా పేర్కొనడం గమనార్హం. ప్రభుత్వ వ్యయాల తగ్గింపు పేరుతో ఆ సంస్థను రద్దు చేయించడానికి కూడా ప్రయత్నిస్తుండడం గమనార్హం. ట్రంప్ కూడా నాటో కూటమిపై అసంతృప్తితో ఉన్నారు. అమెరికా సెనేటర్ మైక్ లీ వంటి వారు మస్క్‌కు మద్దతు తెలిపారు.

అమెరికా వైదొలగితే ఏమవుతుంది?

పశ్చిమ దేశాల ఉమ్మడి రక్షణ కోసం 1949లో నాటో ఏర్పాటయింది. నాటో నుంచి అమెరికా బయటకు వచ్చేస్తే మిలటరీ సామర్థ్యం, నిధులపై తీవ్రమైన ప్రభావం పడుతుంది. రష్యాను అడ్డుకోవడం కష్టమవుతుంది. రెండో ప్రపంచ యుద్ధం అనంతరం ఐక్యరాజ్యసమితి ఏర్పాటయింది. దీని నుంచి కూడా అమెరికా వచ్చేస్తే అధికార సమతౌల్యత మారుతుంది. అంతర్జాతీయ విధానాల రూపకల్పనలో ఇతర దేశాల ప్రభావం పెరుగుతుంది.

అమెరికా ప్రాధాన్యాన్ని అర్థం చేసుకున్నాం

» ఖనిజాల ఒప్పందంపై సంతకానికి సిద్ధం

» ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ వ్యాఖ్యలు



కీవ్, మార్చి 3: అమెరికా ప్రాధాన్యాన్ని అర్థం చేసుకున్నానని, ఆ దేశం అందించిన అన్ని రకాల సాయానికి కృతజ్ఞతతో ఉన్నానని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ అన్నారు. అమెరికాతో ఖనిజాల ఒప్పందంపై సంతకం చేసేందుకూ సిద్ధమని చెప్పారు. శుక్రవారం శ్వేతసౌధంలో జరిగిన విలేకరుల సమావేశంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్, జెలెన్‌స్కీ మధ్య తీవ్ర వాగ్యుద్ధం జరిగిన సంగతి తెలిసిందే. అమెరికాకు కనీసం ధన్యవాదాలు కూడా చెప్పలేదని ట్రంప్, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌లు జెలెన్‌స్కీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఖనిజాల ఒప్పందంపై సంతకం చేయకుండానే జెలెన్‌స్కీ వెనుదిరిగారు. ఈ క్రమంలో సోమవారం అమెరికా పట్ల ఆయన స్వరం మారడం గమనార్హం. "అమెరికా ప్రాధాన్యాన్ని మేం అర్థం చేసుకున్నాం. అమెరికా మాకు అందించిన అన్ని రకాల సహాయానికి కృతజ్ఞతతో ఉన్నాం. మేం అమెరికా పట్ల గౌరవభావంతో లేని రోజంటూ లేదు. మా స్వాతంత్ర్య పరిరక్షణకు, ఉక్రెయిన్‌లో మా ప్రస్తుత స్థితికి మా భాగస్వామి ఏం చేశారు, అదే సమయంలో వారి సొంత భద్రత కోసం ఏం చేశారనేదానిపై ఈ కృతజ్ఞత ఆధారపడి ఉంటుంది" అని జెలెన్‌స్కీ ఎక్స్‌లో పోస్ట్ చేసిన వీడియో సందేశంలో పేర్కొన్నారు. రష్యాతో యుద్ధంపై లండన్‌లో ఈయూ దేశాధినేతలతో జరిగిన కీలక సమావేశం అనంతరం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. తమకు శాంతి కావాలి తప్ప నిరంతర యుద్ధం కాదని.. ఇందుకోసం భద్రతా గ్యారెంటీలే కీలకమని చెబుతున్నామని తెలిపారు. కాగా, ఆదివారం లండన్‌లో జరిగిన సమావేశం అనంతరం జెలెన్‌స్కీ స్థానిక మీడియాతో మాట్లాడుతూ.. అమెరికాతో ఖనిజాల ఒప్పందంపై సంతకం చేస్తామన్నారు.

కేరళ వ్యక్తిని కాల్చి చంపిన జోర్డాన్ సైన్యం

న్యూఢిల్లీ, మార్చి 3: జోర్డాన్ సైన్యం ఓ భారతీయుడిని కాల్చి చంపింది. జోర్డాన్ సరిహద్దు నుంచి అక్రమంగా ఇజ్రాయెల్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న క్రమంలో అతడిపై కాల్పులు జరిపింది. ఈ దాడిలో మరొకరు గాయపడ్డారు. ఈ ఘటన ఫిబ్రవరి 10న జరిగింది. ఈ మేరకు జోర్డాన్‌లోని భారత రాయబార కార్యాలయం ఎక్స్‌లో పోస్టు చేసింది. మరణించిన వ్యక్తిని కేరళకు చెందిన 47 ఏళ్ల థామస్ గ్రేబియేల్ పెరెరాగా గుర్తించారు. థామస్ పర్యాటక వీసాపై ఫిబ్రవరి మొదటివారంలో జోర్డాన్ వెళ్లాడు. అక్కడి నుంచి అతని బంధువు ఎడిసన్‌తో కలిసి ఇజ్రాయెల్‌లోకి అక్రమంగా ప్రవేశించాలని ప్రయత్నించాడు. ఈ క్రమంలో థామస్‌ను ఆపేందుకు జోర్డాన్ జవాన్లు యత్నించినా అతడు వినకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో కాల్పు జరిపారని థామస్ కుటుంబసభ్యులకు భారత రాయబార కార్యాలయం ఈమెయిల్‌లో సందేశం పంపింది.

యూపీ మహిళకు యూఏఈలో ఉరి

» గత నెల 15న శిక్ష అమలు.. రేపు అంత్యక్రియలు

న్యూఢిల్లీ, మార్చి 3: ఉత్తరప్రదేశ్‌కు చెందిన షహజాదీ ఖాన్ అనే 33ఏళ్ల మహిళను 4 నెలల చిన్నారి మృతి కేసులో హత్య అభియోగాలపై యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ప్రభుత్వం ఉరితీసిందని భారత విదేశాంగ శాఖ ఢిల్లీ హైకోర్టుకు తెలిపింది. గత నెల 15న ఆమెను ఉరితీశారని, ఈ నెల 5న ఆమె అంత్యక్రియలు నిర్వహించనున్నారని అడిషనల్ సొలిసిటర్ జనరల్ చేతన్ శర్మ న్యాయస్థానానికి తెలిపారు. షహజాదీ ఖాన్ తండ్రి షబ్బీర్ ఖాన్ తన కుమార్తె విషయంలో న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో భారత విదేశాంగ శాఖ ఈ వివరాలు వెల్లడించింది. యూపీ బాందా జిల్లాకు చెందిన షహజాదీ ఖాన్‌ను ఉజైర్ అనే వ్యక్తి అబుధాబీ వెళ్తే జీవితం బాగుంటుందని మాయమాటలు చెప్పి తన బంధువులైన ఫైజ్-నాడియా దంపతులకు విక్రయించాడు. ఈ క్రమంలో ఆమె 2021 డిసెంబరులో అబుదాబీ చేరుకుంది. ఆమెను అబుధాబీకి తీసుకెళ్లిన ఫైజ్-నాడియా దంపతుల 4 నెలల చిన్నారికి సంరక్షురాలిగా వ్యవహరించేది. 2022 డిసెంబరు 7న వ్యాక్సినేషన్లు ఇవ్వగా చిన్నారి ప్రాణాలు కోల్పోయింది. దంపతులు ఆమెపై హత్య ఆరోపణలు మోపారు. అయితే ఔషధాల విషయంలో దంపతుల నిర్లక్ష్యం కారణంగానే చిన్నారి మృతి చెందిందని షహజాదీ ఆరోపించారు. చివరకు యూఏఈ న్యాయస్థానం ఆమెకు మరణ శిక్షను విధించింది. చివరి కోరిక ఏంటని అడగ్గా తన కుటుంబసభ్యులతో మాట్లాడతానని ఆమె కోరడంతో కోర్టు అనుమతించింది. గత నెలలో తన కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ తాను నిర్దోషినని షహజాదీ ఖాన్ కన్నీటి పర్యంతమైంది. మరోవైపు ఫైజ్-నాడియా దంపతులపై మానవ అక్రమ రవాణా కేసు నమోదైంది.

'ఐఐటీ బాబా'పై గంజాయి కేసు

» రాజస్థాన్‌లో అరెస్టు చేసిన పోలీసులు

జైపూర్, మార్చి 3: మహాకుంభమేళా సమయంలో 'ఐఐటీ బాబా'గా ప్రాచుర్యం పొందిన అభయ్ సింగ్‌ను గంజాయి కేసులో రాజస్థాన్‌లోని జైపూర్‌లో పోలీసులు అరెస్టు చేశారు. ఆయనపై మాదకద్రవ్యాలు, మానసిక వ్యసన పదార్థాల చట్టం (ఎన్‌డీపీఎస్) కింద కేసు నమోదు చేశారు. జైపూర్‌లోని ఓ హోటల్‌లో దిగిన అభయ్ సింగ్.. అక్కడ గొడవ చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో అక్కడకు చేరుకున్న పోలీసులు.. అయన వద్ద నుంచి స్వల్ప మొత్తంలో గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఆయన వద్ద దొరికిన గంజాయి అనుమతించదగిన పరిమితిలోనే ఉండడంతో కొంత సేపు నిర్బంధం తర్వాత పోలీసులు విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. పోలీసుల నిర్బంధం నుంచి బయటకొచ్చిన తర్వాత ఐఐటీ బాబా మీడియాతో మాట్లాడుతూ తన వద్ద దొరికింది 'ప్రసాదం' అని, కుంభ్‌లోని దాదాపు ప్రతి బాబా గంజాయిని ప్రసాదంగా స్వీకరిస్తారని పేర్కొన్నారు.

ఆసియా సింహాలు పెరిగాయ్

(మొదటి పేజీ తరువాయి)

దినోత్సవం. ఈ సందర్భంగా ఆసియా సింహాల ఆవాసానికి నిలయమైన గిర్ అటవీ ప్రాంతానికి వెళ్లడం చాలా ఆనందంగా ఉంది. నేను గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తీసుకున్న చర్యలకు సంబంధించి అనేక జ్ఞాపకాలు గుర్తుకువచ్చాయి. కొన్నేళ్లుగా ఇక్కడ చేస్తున్న సమష్టి కృషి వల్ల ఆసియా సింహాల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. సింహాల ఆవాసాలను కాపాడడంలో గిరిజన సంఘాలు, స్థానిక మహిళల పాత్ర ప్రశంసనీయం' అని మోదీ ఎక్స్‌లో ట్వీట్ చేశారు. గత పదేళ్లలో పులులు, చిరుతలు, ఖడ్గమృగాల సంఖ్య కూడా పెరిగిందని అన్నారు. వన్యప్రాణులను మనం ఎంతగానో ప్రేమిస్తున్నామని, జంతువులకు సుస్థిర ఆవాసాలను నిర్మించడానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రధాని మోదీ వెంట కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి భూపేందర్ యాదవ్, ఇతర మంత్రులు, అటవీశాఖ ఉన్నతాధికారులు ఉన్నారు. అనంతరం గిర్ వన్యప్రాణి సంరక్షణ కేంద్రం ప్రధాన కార్యాలయమైన సాసన్ గిర్‌లో జరిగిన జాతీయ వన్యప్రాణి బోర్డు సమావేశానికి ప్రధాని హాజరయ్యారు. కాగా.. ఆసియా సింహాల పరిరక్షణకు ఉద్దేశించిన లయన్ ప్రాజెక్టు కోసం రూ.2,900 కోట్లకు ఆమోదం లభించిందని కేంద్ర ప్రభుత్వం తెలిపింది.

'క్రిప్టో' మార్కెట్‌కు ట్రంప్ జోష్

అమెరికా వ్యూహాత్మక రిజర్వులో చేర్చబోయే ఐదు క్రిప్టో కరెన్సీల పేర్లను వెల్లడించిన ట్రంప్

రూ.26 లక్షల కోట్ల మేర పెరిగిన మార్కెట్ విలువ



వాషింగ్టన్, మార్చి 3: క్రిప్టో కరెన్సీతో వ్యూహాత్మక రిజర్వు ఏర్పాటుకు గతంలోనే కార్యనిర్వాహక ఉత్తర్వు జారీ చేసిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. తాజాగా ఆ రిజర్వులో ఉంచబోయే క్రిప్టో కరెన్సీల పేర్లను వెల్లడించారు. ఎక్స్ఆర్‌పీ, సోలానా (ఎస్‌వోఎల్), కార్డానో (అడా) అనే మూడు క్రిప్టో కరెన్సీలతో వ్యూహాత్మక రిజర్వు ఏర్పాటు చేయాల్సిందిగా ప్రెసిడెన్షియల్ వర్కింగ్ గ్రూప్‌ను ఆదేశించినట్టు ట్రంప్ తన సొంత సామాజిక మాధ్యమం 'ట్రూత్ సోషల్' పోస్టు ద్వారా తొలుత ఒక ప్రకటన చేశారు. ఆ తర్వాత కొద్దిసేపటికే.. బిట్‌కాయిన్, ఎథేరియం పేర్లను కూడా ప్రస్తావిస్తూ మరో పోస్టు పెట్టారు. క్రిప్టో కరెన్సీ రిజర్వుకు ఆ రెండూ ఆయువుపట్టుగా ఉంటాయని.. తనకు బిట్‌కాయిన్, ఎథేరియం అంటే ఇష్టమని పేర్కొన్నారు. ట్రంప్ ప్రకటన క్రిప్టో మార్కెట్‌లో పెను సంచలనం సృష్టించింది. ఒక్కసారిగా క్రిప్టో కరెన్సీల విలువలు పెరిగిపోయాయి. బిట్‌కాయిన్ విలువ 10% పెరగ్గా.. ఎథేరియం విలువ 13% మేర పెరిగింది. 90వేల డాలర్ల వద్ద ట్రేడ్ అవుతున్న బిట్‌కాయిన్ విలువ.. ట్రంప్ ప్రకటనతో లక్ష డాలర్ల మార్కు దిశగా పరుగులు తీస్తోంది. మొత్తంగా ట్రంప్ రెండు పోస్టులతో క్రిప్టో కరెన్సీ మార్కెట్ విలువ 300 బిలియన్ డాలర్లకు పైగా (దాదాపు రూ.26 లక్షల కోట్ల మేర) పెరిగింది. ఇంతకీ ట్రంప్ ప్రకటించిన ఈ వ్యూహాత్మక క్రిప్టో రిజర్వు ఏమిటి? అంటే.. ప్రతి దేశమూ ద్రవ్యోల్బణం నుంచి తన కరెన్సీ విలువను, ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడుకోవడానికి బంగారాన్ని రిజర్వు చేసుకుంటుంది. దీన్నే గోల్డ్ రిజర్వ్ అంటారు. అలాగే, చమురు ధరల్లో మార్కెట్ హెచ్చుతగ్గులు, ఒడుదొడుకుల నుంచి కాపాడుకోవడానికి చమురును రిజర్వు చేసుకోవడం కద్దు. అది ఆయిల్ రిజర్వ్. ఇలా అనూహ్య ఒత్తిళ్ల నుంచి తమ మార్కెట్లను కాపాడుకోవడానికి అన్ని దేశాలూ పలు ఉత్పత్తులతో కూడిన రిజర్వులను ఏర్పాటు చేసుకుంటాయి. ఇదే క్రమంలో అమెరికా తన కరెన్సీ విలువను కాపాడుకోవడానికి డిజిటల్ కరెన్సీతో వ్యూహాత్మక రిజర్వ్ ఏర్పాటుకు సిద్ధమైంది. ఇంతకీ ఈ బిట్‌కాయిన్ల రిజర్వును అమెరికా ప్రభుత్వం ఎలా ఏర్పాటు చేస్తుంది? బిట్‌కాయిన్ మైనింగ్ అంత సులువు కాదు కదా? అంటే.. మైనింగ్ చేయాల్సిన అవసరం లేకుండానే అగ్రరాజ్యం వద్ద పెద్ద ఎత్తున క్రిప్టో కరెన్సీ ఉన్నట్టు సమాచారం. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ దొరికిపోయినవారి నుంచి అధికారులు స్వాధీనం చేసుకున్న బిట్‌కాయిన్ల విలువే 19 బిలియన్ డాలర్ల (రూ.1.65 లక్షల కోట్ల) దాకా ఉంటుందని అంచనా. చైనా కూడా ఇదే తరహాలో పెద్ద ఎత్తున క్రిప్టో కరెన్సీ రిజర్వులను కలిగి ఉన్నట్టు చెబుతారు. అలాగే.. ఒక దేశం అధికారికంగా క్రిప్టో కరెన్సీ రిజర్వును ఏర్పాటు చేసుకోవడం ఇదే మొదలు కాదు. గతంలో ఎల్‌సాల్వడార్ క్రిప్టో కరెన్సీ రిజర్వును ఏర్పాటు చేసుకుంది.

పుతిన్ గురించి ఆందోళన అక్కర్లేదు!

» వలసదారులు, హంతకులపైనే దృష్టి పెట్టాలి: ట్రంప్

వాషింగ్టన్, మార్చి 3: రష్యా అధ్యక్షుడు పుతిన్ గురించి ఎక్కువగా ఆలోచించాల్సిన, చింతించాల్సిన అవసరం లేదని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యానించారు. దానికి బదులు దేశంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ఎక్కువ సమయం కేటాయించాలన్నారు. ఆయన సొంత సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్‌లో ఈ మేరకు పోస్ట్ చేశారు. "పుతిన్ గురించి ఎక్కువగా ఆందోళన చెందనక్కర్లేదు. దానికి సమయం తగ్గించి.. వలసదారుల అత్యాచార ముఠాలు, డ్రగ్ లార్డ్స్, హంతకులు, మానసిక వైద్యశాలల నుంచి మన దేశంలోకి వస్తున్నవారిపై దృష్టి పెట్టాలి. ఈ అంశాలపై ఎక్కువ సమయం కేటాయించాలి. అప్పుడే మనం యూరోప్‌లా మారకుండా ఉంటాం" అని ట్రంప్ పేర్కొన్నారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో జరిగిన విలేకరుల సమావేశంలో తీవ్ర వాగ్వాదం జరిగిన నేపథ్యంలో ట్రంప్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

బీజేపీ ప్రభుత్వ తరహాలోనే కాంగ్రెస్ సర్కార్‌లోనూ దందా

» కర్ణాటక ప్రభుత్వంపై కాంట్రాక్టర్ల విమర్శలు

బెంగళూరు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో బీజేపీ ప్రభుత్వం తరహాలోనే కాంగ్రెస్‌లోనూ కమీషన్ దందా పెరిగిందని, బకాయిలు విడుదలకు వేధింపులు తీవ్రమయ్యాయని కాంట్రాక్టర్ల సంఘం ఆరోపించింది. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీనియర్ నేత రాహుల్‌గాంధీకి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించింది. దీంతో సోమవారం మధ్యాహ్నం విధానసౌధలోని కాన్ఫరెన్స్ హాల్‌లో రాష్ట్ర కాంట్రాక్టర్ల సంఘం పదాధికారులతో సీఎం సిద్దరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ తదితరులు సమావేశమయ్యారు. అనంతరం సీఎం మీడియాతో మాట్లాడుతూ, బకాయిల విడుదలకు ఏప్రిల్ వరకు వేచి ఉండాలని సూచించారు. కాంట్రాక్టర్లు ఎవరికైనా ఫిర్యాదు చేసుకోవచ్చునని అన్నారు. ప్రభుత్వ ఆర్థిక పరిస్థితికి అనుగుణంగా కాంట్రాక్టర్‌లకు బిల్లులు చెల్లిస్తామని ఆయన స్పష్టం చేశారు.

మనుషులా? రోబోలా?

» వారానికి 90 గంటల పనా?: అఖిలేశ్

న్యూఢిల్లీ, మార్చి 3: ఉద్యోగులు ఎక్కువ గంటల పాటు పనిచేయాలంటూ కార్పొరేట్ సంస్థలు చేస్తున్న ప్రకటనలపై సమాజ్‌వాదీ పార్టీ నాయకుడు అఖిలేష్ యాదవ్ ఘాటుగా స్పందించారు. ఉద్యోగులు మనుషులని భావిస్తున్నారా, రోబోలని అనుకుంటున్నారా అని ప్రశ్నించారు. మనుషులను బదులు రోబోలను పెట్టుకోవడానికే ఇలాంటి ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రముఖులు కొందరు వారానికి 70 గంటలు, వారానికి 90 గంటలు ఉద్యోగులు పని చేయాలని తమ తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఆ వ్యాఖ్యలపై అఖిలేష్ యాదవ్ స్పందించారు. ఉద్యోగుల సంక్షేమాన్ని పట్టించుకోని వారే ఇలాంటి సలహాలు ఇస్తుంటారని విమర్శించారు. ఎక్కువ గంటల పాటు పనిచేస్తే ఉత్పాదకత పెరగదని, మనస్ఫూర్తిగా, పూర్తి సమర్థతతో పనిచేసినప్పుడు మాత్రమే పెరుగుతుందని చెప్పారు. వినోదం మనుషుల్లో పునరుత్తేజాన్ని కలిగిస్తుందని, దానివల్లనే నాణ్యత పెరుగుతుందని, అది గుర్తించని వారే ఇలాంటి సలహాలు ఇస్తుంటారన్నారు.

బీఎస్పీ నుంచి మేనల్లుడిని బహిష్కరించిన మాయావతి

న్యూఢిల్లీ, మార్చి 3: బీఎస్పీ నుంచి తన మేనల్లుడు ఆకాశ్ ఆనంద్‌ను బహిష్కరిస్తూ సోమవారం ఆ పార్టీ చీఫ్ మాయావతి నిర్ణయం తీసుకున్నారు. ఆకాశ్ ఆనందే ఆమె వారసుడని ఇంతవరకు భావించగా, ప్రస్తుతం పార్టీ నుంచి తొలగించడం గమనార్హం. పార్టీ ప్రయోజనాలను కాదని మామ అశోక్ సిద్ధార్థ్ ప్రభావంతో పనిచేస్తుండడమే ఇందుకు కారణమని తెలిపారు. రాజకీయ పరిపక్వత లేకుండా, స్వార్థంతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. తన జీవిత కాలంలో వారసుడి పేరును ప్రకటించబోనని స్పష్టం చేశారు. ఆదివారం ఆనంద్‌ను పార్టీ నేషనల్ కోఆర్డినేటర్, ఇతర పార్టీ పదవుల నుంచి తొలగించారు. నేషనల్ కోఆర్డినేటర్ పదవిని ఆయన తండ్రి ఆనంద్ కుమార్‌కు ఇవ్వడం గమనార్హం. రాజ్యసభ సభ్యుడు రామ్‌జీ గౌతమ్‌ను కూడా మరో జాతీయ కోఆర్డినేటర్‌గా ప్రకటించారు.

అమెరికాకు గోయల్

(మొదటి పేజీ తరువాయి)

బృందంతో అమెరికాకు బయలుదేరారు. మార్చి 8 వరకు అక్కడే ఉండి యూఎస్ అధికారులతో అత్యవసర వాణిజ్య చర్చలు జరిపే అవకాశమున్నట్టు తెలుస్తోంది. ప్రతిపాదిత సుంకాల గురించి అగ్ర దేశాన్ని స్పష్టత కోరడం, వాటి వల్ల దేశంపై పడే ప్రభావాన్ని అంచనా వేయడం వంటి విషయాలతో సుంకాల తగ్గింపు, ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యాన్ని మెరుగుపర్చడానికి రూపొందించిన వాణిజ్య ఒప్పందంపై చర్చలు వంటి వాటిపై కేంద్రమంత్రి దృష్టి పెట్టినట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. 'భారత్ ఆటోమొబైల్స్, రసాయనాల వంటి వాటి పారిశ్రామిక వస్తువులపై సుంకాలను తగ్గించడానికి అగ్రదేశంతో చర్చలు జరపడానికి సిద్ధంగా ఉన్నాం. ఇరు దేశాల మధ్య వాణిజ్య ఉద్రిక్తతలను తగ్గించడానికి భారత్ ఇప్పటికే పలు చర్యలు చేపట్టింది. హై ఎండ్ మోటార్ సైకిళ్లపై సుంకాలు 50 శాతం నుంచి 30 శాతానికి తగ్గించింది. బోర్బన్ విస్కీ టారిఫ్‌లను 150 నుంచి 100 శాతానికి తగ్గించింది. ఇతర టారిఫ్‌లను సమీక్షిస్తామని.. ఇంధన దిగుమతులను పెంచడానికి చర్యలు తీసుకుంటామని కేంద్రం తెలిపింది. అమెరికా భారత్‌పై విధించే పరస్పర టారిఫ్‌ల వల్ల భారత్‌కు ఏడాదికి 7 బిలియన్ డాలర్ల వరకు నష్టం వాటిల్లుతుందని బ్లూమ్‌బెర్గ్ నివేదిక సైతం వెల్లడించింది.

పోసాని కోసం పోలీసుల క్యూ!

» నరసరావుపేట కోర్టులో హాజరు..

13 వరకూ రిమాండ్

నరసరావుపేట లీగల్/రాజంపేట/అనంతపురం క్రైం, మార్చి 3, (ఆంధ్రజ్యోతి): సినీనటుడు, వైసీపీ నేత పోసాని కృష్ణమురళిపై విచారణ పరంపర కొనసాగుతోంది. ఆయన్ను అదుపులోకి తీసుకోవడానికి ఏపీలోని పలు జిల్లాల పోలీసులు క్యూ కడుతున్నారు. పోసానిపై నరసరావుపేటతో పాటు, బాపట్ల, అనంతపురం రూరల్, యాదగిరి, పుత్తూరు, విజయవాడ, పాలకొండ, పాతపట్నం తదితర ప్రాంతాల్లో పలు కేసులు నమోదైన విషయం తెలిసిందే. అనంతపురం రూరల్ పోలీసులు కూడా సోమవారం పీటీ వారెంట్ దాఖలు చేశారు. ఆయన్ని అదుపులోకి తీసుకునేందుకు అల్లూరి జిల్లా పోలీసులు కూడా పీటీ వారెంట్ కోసం కోర్టు అనుమతి కోరారు. కాగా.. పల్నాడు జిల్లా నరసరావుపేట కోర్టులో ఆయన్ని హాజరుపరిచేందుకు అన్నమయ్య జిల్లా రాజంపేట సబ్‌జైలు నుంచి పీటీ వారెంట్‌పై సోమవారం తరలించారు. పోసానిని తీసుకెళ్లేందుకు ప్రత్యేక పోలీసు బృందం వచ్చినప్పుడు ఆయన తనకు గుండె నొప్పి వస్తోందని చెప్పారు. వెంటనే రాజంపేటలో వైద్యపరీక్షలు చేయించగా.. ఏ సమస్యా లేదని తేలింది. దీంతో ప్రత్యేక వాహనంలో ఆయన్ను నరసరావుపేటకు తరలించారు. అక్కడ నమోదైన ఒక కేసుకు సంబంధించి ఆయనను మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో రాత్రి 7.15 సమయంలో హాజరు పరిచారు. తాను రుమటాయిడ్ ఆర్థరైటిస్‌తో బాధపడుతున్నానని, గొంతుకు ఆపరేషన్ చేయించుకున్నానని పోసాని చెప్పారు. వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేయాలని కోరారు. అయితే వాటికి సంబంధించి ధ్రువీకరణ పత్రాలు ఏమీ సమర్పించకపోవడంతో.. పోసానికి ఈనెల 13 వరకు రిమాండ్ విధిస్తూ న్యాయాధికారి ఉత్తర్వులు జారీ చేశారు. కోర్టు ఆదేశాల మేరకు పోసానిని రాత్రి గుంటూరు జిల్లా జైలుకు తరలించారు.

అయోధ్య రామ మందిరంపై ఐఎస్ఐ కన్ను

కుట్రను భగ్నం చేసిన గుజరాత్ పోలీసులు

అనుమానితుడి అరెస్టు, రెండు గ్రెనేడ్ల స్వాధీనం

న్యూఢిల్లీ, మార్చి 3: అయోధ్య రామ మందిరాన్ని లక్ష్యంగా చేసుకొని ఉగ్రవాద దాడి జరపాలన్న పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐ చేసిన కుట్ర భగ్నమయింది. గుజరాత్ యాంటీ టెర్రరిజం స్క్వాడ్ (ఏటీఎస్) పోలీసులు ఉత్తరప్రదేశ్‌లోని ఫరీదాబాద్‌కు చెందిన స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్‌టీఎఫ్) సిబ్బంది సహకారంతో అనుమానితుడిని పట్టుకున్నారు. అతడిని అబ్దుల్ రహ్మాన్‌గా గుర్తించారు. పాలీ ఏరియాలో నిర్మానుష్యంగా ఉన్న ఇంట్లో నాలుగు గంటల పాటు సోదాలు చేసి రెండు గ్రెనేడ్లను స్వాధీనం చేసుకున్నారు. రహ్మాన్ మటన్ షాపు నిర్వహించడంతో పాటు, ఆటో కూడా నడుపుతుంటాడు. అతడు పలుమార్లు అయోధ్య వెళ్లి రామమందిరాన్ని నిశితంగా పరిశీలించాడు. కీలకమైన సమాచారాన్ని ఐఎస్ఐకి అందజేశాడు. రెండు గ్రెనేడ్లు తీసుకొని అయోధ్య వెళ్తాడన్న సమాచారం అందుకున్న కేంద్ర నిఘా వర్గాలు దానిని ఏటీఎస్, ఎస్టీఎఫ్‌కు అందించాయి. దానికి అనుగుణంగా సోదాలు జరపడంతో అనుమానితుడు పట్టుబడ్డాడు. ఆదివారం అరెస్టు చేసి అతడిని విచారణ నిమిత్తం గుజరాత్ తీసుకెళ్లారు.

అమెరికాలో మళ్లీ కార్చిచ్చు

వాషింగ్టన్, మార్చి 3: అమెరికా ఉత్తర, దక్షిణ కరోలినా రాష్ట్రాల్లోని అటవీ ప్రాంతంలో కార్చిచ్చు వ్యాపించింది. అధికారులు ఇప్పటికే వేలాది మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పేందుకు ప్రయత్నిస్తున్నారు. దక్షిణ కరోలినాలో ఇప్పటి వరకు 4.9 చదరపు కిలోమీటర్ల మేర అటవీ భూమి దగ్ధమైందని అధికారులు వెల్లడించారు. ఈ కార్చిచ్చు కారణంగా ఎటువంటి ఆస్తి, ప్రాణాపాయం సంభవించలేదని తెలిపారు. దక్షిణ కరోలినాలో అత్యవసర పరిస్థితి విధిస్తున్నట్లు ఆ రాష్ట్ర గవర్నర్ హెన్రీ మెక్‌మాస్టర్ ప్రకటించారు. మొత్తం 175 ప్రదేశాల్లో మంటలు వ్యాపించాయని, వాటిని ఆర్పేందుకు అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని ఆయన చెప్పారు. ఉత్తర కరోలినాలో నాలుగు వేర్వేరు ప్రాంతాల్లో చెలరేగిన కార్చిచ్చులో 400 ఎకరాల మేర అటవీ భూమి దగ్ధమైనట్లు అధికారులు తెలిపారు. ఒక్క ఉవారీ జాతీయ అటవీ కేంద్రంలోనే దాదాపు 300 ఎకరాల మేర అడవి దగ్ధమైందని వెల్లడించారు.

పెళ్లి చేసుకున్న వెంటనే పిల్లల్ని కనండి

» నూతన వధూవరులకు తమిళనాడు సీఎం స్టాలిన్ వినతి

» జనాభా తగ్గడంతో లోక్‌సభ సీట్లకు గండి

» పునర్విభజనలో నష్టం కలుగుతుంది

» ఎక్కువ మంది పిల్లల్ని కనాలని పిలుపు



చెన్నై, మార్చి 3(ఆంధ్రజ్యోతి): పునర్విభజనలో తమ రాష్ట్రంలో లోక్‌సభ నియోజకవర్గాలు తగ్గిపోతాయంటూ గత కొంతకాలంగా ఆందోళన వ్యక్తం చేస్తున్న తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్.. జనాభాను పెంచడంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇకపై కొత్తగా పెళ్లి చేసుకునే వధూవరులు ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే పిల్లల్ని కనాలని ఆయన కోరారు. పునర్విభజన ప్రక్రియ మొదలయ్యేలోగా ఎక్కువ మంది పిల్లల్ని కంటే రాష్ట్రానికి మేలు జరుగుతుందన్నారు. సోమవారం నాగపట్టణం జిల్లా పర్యటన సందర్భంగా ఓ వివాహ వేడుకలో పాల్గొన్న సీఎం వేదికపై మాట్లాడుతూ.. గతంలో పెళ్లయిన వెంటనే పిల్లల్ని కనవద్దని, కాస్త వేచి చూడాలంటూ విజ్ఞప్తి చేసేవారమన్నారు. కానీ, ఇపుడు అలా చెప్పాల్సిన అవసరం లేదన్నారు. ఎందుకంటే రాష్ట్ర జనాభా లెక్కల ప్రకారం రిజర్వేషన్లు, పార్లమెంట్ స్థానాల సంఖ్యను నిర్ధారిస్తామని కేంద్రం చెబుతోందని, అలా జరిగితే అధిక జనాభా కలిగిన రాష్ట్రాలకు లోక్‌సభ సీట్లు అధికంగా వస్తాయన్నారు. కానీ, మనమంతా కుటుంబ నియంత్రణపై గట్టిగా దృష్టి పెట్టి విజయం సాధించామన్నారు. ఇపుడు లోక్‌సభ సీట్ల కేటాయింపులో రాష్ట్రానికి అన్యాయం జరిగే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇకపై కొత్తగా పెళ్లి చేసుకున్నవారు వెంటనే పిల్లల్ని కనాలని మనస్ఫూర్తిగా విజ్ఞప్తి చేస్తున్నట్లు చెప్పారు. అలాగే తమ సంతానానికి కూడా అందమైన తమిళ పేరును పెట్టాలని సూచించారు. ఇదే తన హృదయపూర్వక వినతిగా పేర్కొన్నారు. దివంగత కలైంజర్ కృషి ఫలితంగా తమిళ భాషకు ప్రాచీన హోదా వచ్చిందని, అలాంటి ప్రాచీన భాషలో పిల్లలకు పేర్లు పెట్టాలని సీఎం స్టాలిన్ పిలుపునిచ్చారు.


ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని సిమెంట్ పరిశ్రమ

ఆదిలాబాద్ సిమెంట్ పరిశ్రమలో స్క్రాప్ విక్రయానికి టెండర్లు

» 7న టెండర్లు తెరిచేందుకు సీసీఐ కసరత్తు

ఆదిలాబాద్, మార్చి3 (ఆంధ్రజ్యోతి): గత 27 ఏళ్ల క్రితం మూతబడిన ఆదిలాబాద్‌లోని సిమెంట్ పరిశ్రమ స్క్రాప్‌ను విక్రయించేందుకు సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) రంగం సిద్ధం చేసింది. ఇప్పటికే టెండర్ ప్రక్రియను మొదలు పెట్టింది. ప్రారంభపు టెండర్ ధరను రూ.43.30 కోట్లుగా నిర్ణయించింది. ఈఎండీగా 1.92 కోట్లను చెల్లించాలన్న నిబంధన విధించింది. ఈ నెల 7న టెండర్లను తెరిచేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. కొన్నాళ్ల క్రితమే ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్‌తో కలిసి పరిశ్రమను సందర్శించారు. పరిశ్రమ పునరుద్ధరణకు అవసరమైన చర్యలను తీసుకుంటామని ప్రకటించారు. అయితే, ఊహించని విధంగా భారీ యంత్రాలు, ఇతర సామాగ్రి పూర్తిగా శిథిలమై, తుప్పుపట్టి పోగా వేలం వేసేందుకు సీసీఐ నిర్ణయించడంతో పరిశ్రమ పునరుద్ధరణపై ఆశలు ఆవిరవుతున్నాయి. కాగా, 2017 నాటికి పెండింగ్ వేతనాలు చెల్లించకుండా స్క్రాప్ టెండర్లను పిలవడంపై కార్మికులు మండిపడుతున్నారు. ఈ నెల 6న తిరిగి హైకోర్టును ఆశ్రయించేందుకు సిద్ధమవుతున్నారు.

దుబాయ్‌లోనే కేదార్ అంత్యక్రియలు పూర్తి

మరణం వెనుక కుట్ర లేదని తేల్చిన అధికారులు.. అంత్యక్రియలకు సినీ ప్రముఖులు దూరం

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

సినీ నిర్మాత కేదార్ సెలగంశెట్టి అంత్యక్రియలు దుబాయ్‌లోనే పూర్తయ్యాయి. హిందూ సంప్రదాయం ప్రకారం.. ఆయనకు దహన సంస్కారాలు నిర్వహించారు. వారం రోజులుగా కేదార్ మృతదేహం అప్పగింతపై నీలినీడలు అలుముకున్న విషయం తెలిసిందే..! దుబాయ్ పోలీసులు ఆయన మృతిపై విచారణ జరిపి, క్లీన్‌చిట్ ఇచ్చారు. కేదార్ మృతి పట్ల ఎలాంటి కుట్ర, నేరం లేదని తేల్చారు. అయితే.. భారతీయ కాన్సులేట్ నిరభ్యంతర పత్రం జారీలో ఆలస్యం ఏర్పడడంతో మృతదేహాన్ని అందించడంలో జాప్యం జరిగింది. తెలంగాణ సర్కారు ఎంబసీని సమాచారం కోరడంతో.. ఎన్‌వోసీ జారీలో ఆలస్యమైంది. సోమవారం కేదార్ అంత్యక్రియలను యూఏఈలో జరపడానికి తమకేమీ అభ్యంతరం లేదంటూ భారతీయ కాన్సులేట్ తరఫున అసిస్టెంట్ కాన్సులర్ ఆఫీసర్ ఉమేశ్‌యాదవ్ ఎన్‌వోసీని జారీ చేశారు. "అమెరికా పాస్‌పోర్టు ఉన్న కేదార్ భార్య రేఖావీణ నలితంకు మృతదేహాన్ని అప్పగించడానికి ఎలాంటి అభ్యంతరం లేదు" అని ఆ ఎన్‌వోసీలో పేర్కొన్నారు. అన్ని ప్రక్రియలు పూర్తవ్వడంతో కేదార్ కుటుంబానికి మృతదేహాన్ని అప్పగించారు. ఆ వెంటనే.. కేదార్ భార్య రేఖావీణ, ఇతర కుటుంబ సభ్యులు దుబాయ్‌లోనే అంత్యక్రియలు నిర్వహించారు. తమ కుటుంబం ఇప్పటికే సినీ, రాజకీయ ప్రముఖులతో సంబంధాల కారణంగా అన్నివిధాలుగా నష్టపోయిందని, అంత్యక్రియల విషయంలోనైనా వారికి దూరంగా ఉండాలని కోరుకున్నట్లు కేదార్ కుటుంబసభ్యులు తెలిపారు. స్వదేశంలో అంత్యక్రియలు నిర్వహిస్తే.. విమానాశ్రయంలో దిగినప్పటి నుంచి దహన సంస్కారాల వరకు మీడియా హడావుడి ఉంటుందని, అందుకే దుబాయ్‌లో ఆ కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలుస్తోంది. కేదార్ మరణంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మీడియాతో చిట్‌చాట్‌లో చేసిన వ్యాఖ్యల తర్వాత కేదార్‌తో సన్నిహిత సంబంధాలున్న రాజకీయ, సినీ ప్రముఖులు ప్రస్తుత పరిణామాలకు దూరంగా ఉంటున్నారు. ఈ కారణంగా కేదార్ అంత్యక్రియల్లో వారు పాల్గొనలేదని సమాచారం. కాగా.. 2018లో సినీనటి శ్రీదేవి మృతి చెందినప్పుడు.. మూడ్రోజుల్లోనే దుబాయ్ పోలీసులు విచారణను పూర్తిచేసి, మృతదేహాన్ని ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు. కేదార్ విషయంలో దర్యాప్తులో.. ఫోరెన్సిక్ నివేదిక రావడంలో చాలా ఆలస్యం ఏర్పడడం గమనార్హం..!


కేదార్ (ఫైల్)

కేదార్ మరణంపై విచారణ జరిపించండి

» కిషన్‌రెడ్డికి కాంగ్రెస్ ఎంపీ చామల లేఖ

హైదరాబాద్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ఇటీవల దుబాయిలో అనుమానాస్పద స్థితిలో చనిపోయిన సినీ నిర్మాత, రియల్ వ్యాపారి కేదార్ మృతిపై కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారణ జరిపించాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి లేఖ రాశారు. కేదార్‌నాథ్ చనిపోయినప్పుడు బీఆర్ఎస్ ముఖ్య నేతలు కొందరు దుబాయిలోనే ఉన్నారని, కేదార్ మరణంలో వారి ప్రమేయం ఉందన్న ఆరోపణలు తీవ్రస్థాయిలో ఉన్నాయని పేర్కొన్నారు. పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని లూటీ చేసిన బీఆర్ఎస్ నేతలు.. ఆ డబ్బులను కేదార్ ద్వారా దుబాయిలో పెట్టుబడి పెట్టించారన్న ఆధారాలు ఉన్నాయని తెలిపారు. సోమవారం గాంధీభవన్‌లో చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ప్రతి విషయాన్నీ సోషల్ మీడియా ద్వారా పంచుకునే హరీశ్ రావు.. దుబాయి పర్యటన వివరాలను ఎందుకు పెట్టలేదని నిలదీశారు. హరీశ్‌రావు దోస్తు బిడ్డ పెళ్లి మార్చి 6న ఉంటే.. ఫిబ్రవరి 22నే ఎందుకు వెళ్లారని ప్రశ్నించారు. ఆయన దుబాయి వెళ్లాకే కేదార్ చనిపోయాడని చామల తెలిపారు.

10 వేలు లంచం తీసుకుంటూ.. ఏసీబీకి చిక్కిన సబ్‌రిజిస్ట్రార్, డీఈఈ

ఖిల్లా(నిజామాబాద్), హైదరాబాద్ సిటీ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : లంచం తీసుకుంటూ నిజామాబాద్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో జాయింట్-2 సబ్‌రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న చెన్నమాధవాని శ్రీరామరాజు, జీహెచ్ఎంసీ డిప్యూటీ ఈఈ సోమవారం ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. నిజామాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి తాను కొనుగోలు చేసిన స్థలాన్ని తన పేరిట మార్చే విషయమై ఇటీవల సబ్‌రిజిస్ట్రార్ శ్రీరామరాజును కలిశాడు. అందుకుగాను తనకు రూ. 10 వేలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. దీంతో ఆ వ్యక్తి ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. సోమవారం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో శ్రీరామరాజుకు రూ. 10వేల లంచం ఇస్తుండగా.. ఏసీబీ డీఎస్పీ శేఖర్‌గౌడ్.. శ్రీరామరాజుతో పాటు ఆయన వద్ద సహాయకుడిగా పనిచేస్తున్న రంగ్‌సింగ్ వెంకటరావ్‌ను కూడా అరెస్టు చేశారు. జీహెచ్ఎంసీ డివిజన్2 నాణ్యత నియంత్రణ విభాగంలో ఎ. దశరథ్ ముదిరాజ్ డిప్యూటీ ఈఈగా విధులు నిర్వహిస్తున్నారు. బాధితుడి ఫైల్‌ను క్లియర్ చేసి పై అధికారులకు పంపాలంటే రూ. 20 వేల లంచం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇందులో రూ. 10 వేలు తీసుకున్నారు. మిగిలిన రూ. 10 వేలూ ఇవ్వాలని డిమాండ్ చేయడంతో బాధితుడు ఏసీబీ అధికారులకు సమాచారమందించారు. బాధితుడి నుంచి మిగిలిన రూ.10 వేల లంచం సోమవారం తీసుకుంటుండగా కాపు కాసిన ఏసీబీ అధికారులు దశరథ్‌ను పట్టుకున్నారు.

అప్పుల బాధతో మహిళా రైతు ఆత్మహత్య

» వరంగల్ జిల్లా మహ్మదాపురంలో ఘటన


గంధం లక్ష్మి (ఫైల్)

దుగ్గొండి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయం, వ్యాపారంలో ఆర్థికంగా నష్టపోయిన ఓ మహిళా రైతు అప్పుల బాధతో మనోవేదనకు గురై ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం మహ్మదాపురంలో జరిగింది. మహ్మదాపురం గ్రామానికి చెందిన గంధం లక్ష్మి (52), మొగిలి దంపతులు వ్యవసాయంతో పాటు గొర్రెలు, గేదెల వ్యాపారం చేస్తున్నారు. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. వారు గత ఐదేళ్లుగా తమ స్వగ్రామంలోనే ఆరు ఎకరాల పంట భూమి కౌలుకు తీసుకొని పత్తి, మిర్చి, మొక్కజొన్న సాగు చేస్తున్నారు. కాగా, ఈ ఏడాది పంట దిగుబడి అనుకున్న మేరకు రాలేదు. దాంతోపాటు పంటకు గిట్టుబాటు ధర లేక పెట్టిన పెట్టుబడులూ తిరిగి రాలేదు. అలాగే వారు చేసే గొర్రెలు, గేదెల వ్యాపారంలో కూడా రూ.10 లక్షల మేర నష్టం వచ్చింది. దాంతో పంట కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక తీవ్ర మనోవేదనకు గురైన లక్ష్మి గత నెల 27న తన ఇంట్లోనే పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబసభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం వెంటనే ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం లక్ష్మి మృతి చెందింది. లక్ష్మి భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు నామినేషన్లు షురూ

హైదరాబాద్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు సోమవారం నోటిఫికేషన్ విడుదలైంది. తొలి రోజే ఒక నామినేషన్ దాఖలైంది. హైదరాబాద్‌కు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీరు ఈ నామినేషన్‌ను దాఖలు చేశారు. అయితే ప్రతిసారి ఇలాంటి నామినేషన్లు దాఖలవుతుంటాయని, ఎమ్మెల్యేల సంతకాలు లేకుండా దాఖలయ్యే నామినేషన్లు పరిశీలనలో తిరస్కరణకు గురవుతాయని అసెంబ్లీ వర్గాలు తెలిపాయి.

పీఎం కుసుమ్ దరఖాస్తులకు ఈ నెల 10 వరకు గడువు

హైదరాబాద్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): పీఎం కుసుమ్ పథకం కింద వివిధ పరికరాల కోసం రైతులు దరఖాస్తు చేసుకునేందుకు తుది గడువును ఈ నెల 10 సాయంత్రం 5 గంటల వరకు కేంద్ర ప్రభుత్వం పొడిగించింది. ఈమేరకు తెలంగాణ పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది. వివరాల కోసం పీఎం కుసుమ్ పోర్టల్‌ను సందర్శించాలని సూచించింది.


విరిగిన కాలుతో ఆటోలో పాఠశాలకు వస్తున్న విద్యార్థిని తబిత

ఆ టీచర్ల వేధింపులకన్నా చావే నయం అనుకొని...

» పాఠశాల భవనమ్మీద నుంచి దూకేసిన బాలిక

» కాలు విరగడంతో చికిత్స కోసం ఆస్పత్రికి తరలింపు

» వికారాబాద్ కొత్తగడి సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో ఘటన

వికారాబాద్, మార్చి3 (ఆంధ్రజ్యోతి): పాఠాలు చెప్పడమే కాదు.. పిల్లల మనసెరిగి, వారిని ప్రోత్సహించడమూ ఉపాధ్యాయుల బాధ్యత! అలాంటిది.. ఆ ఇద్దరు మహిళా టీచర్లు ఆ విద్యార్థినిపై పగబట్టారు. గతంలో ఆమె తల్లిదండ్రులతో జరిగిన గొడవను మనసులో పెట్టుకొని బాలికపై కక్షసాధింపు చర్యలకు దిగారు. బోధనాభ్యాసాల పరంగా ఎప్పటికప్పుడు విద్యార్థినిని నిరుత్సాహపరచడమే కాకుండా స్నేహితులనూ దూరం చేసి బడిలో ఒంటరిని చేసేందుకు ఆమె ప్రవర్తనపైనే విష ప్రచారం మొదలుపెట్టారు. ఆ టీచర్ల అవమానాలను భరించలేక చివరికి ఆ విద్యార్థిని స్కూలు భవనమ్మీద నుంచి దూకి ఆత్మహత్యాయత్నం చేసింది. వికారాబాద్‌లో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. వికారాబాద్ జిల్లా మర్పల్లి మండలం కొత్లాపూర్‌కు చెందిన యాదయ్య కూతురు తబిత (15) వికారాబాద్ కొత్తగడి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. ఆ పాఠశాలలోని ఉపాధ్యాయులు శ్రవంతి, సంధ్య కొన్నాళ్లుగా తబితను ఆమె స్నేహితుల ముందే అసభ్య పదజాలంతో దూషిస్తున్నారు. ఆ టీచర్ల తీరుతో స్నేహితులంతా దూరమవడంతో తబిత ఒంటరైంది. ఇటీవల ఆమె క్యారెక్టర్ గురించి ఆ టీచర్లు అభ్యంతరకరంగా మాట్లాడటంతో మనోవేదనకు గురై ఫిబ్రవరి 24న పాఠశాల భవనం మొదటి అంతస్తు నుంచి కిందకు దూకింది. ఈ ఘటనలో తబిత కాలు విరిగింది. హాస్టల్ సిబ్బంది వికారాబాద్‌లోని ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. కాలుజారి పడిందంటూ తల్లిదండ్రులకు ఫోన్ చేయడంతో వారొచ్చి తబితను ఇంటికి తీసుకెళ్లారు. మహిళా ఉపాధ్యాయుల వేధింపులు భరించలేకే తబిత స్కూలుభవనం మీద నుంచి దూకిందన్న విషయం సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరిగి.. తల్లిదండ్రుల దృష్టికి వచ్చింది. సోమవారం తబితతో కలిసి పాఠశాలకు వచ్చిన తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. చదువు నేర్పిస్తారని పంపిస్తే వేధింపులకు గురిచేస్తారా? అని ప్రిన్సిపల్‌ను, ఉపాధ్యాయులను నిలదీశారు. ఈ సందర్భంగా విద్యార్థి తబిత మీడియాతో ఆవేదనను పంచుకుంది. టీచర్లు తనను తీవ్రంగా అవమానించారని.. 'బయట తిరిగే లక్షణాలు' అంటూ తోటి విద్యార్థుల ముందే తనను వేధించారని, అవమానం భరించలేకే ఆత్మహత్యకు యత్నించానని చెప్పింది. విద్యార్థి సంఘాల నాయకులు పాఠశాల వద్ద ఆందోళన నిర్వహించారు. బాలికను వేధించిన ఉపాధ్యాయులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఇంతజరిగినా ప్రిన్సిపల్ సాయిలత.. విద్యార్థిని తబిత భవనమ్మీద నుంచి కాలుజారి పడిందని చెప్పడం గమనార్హం. ఈ ఘటన తన దృష్టికి రావడంతో స్పీకర్ ప్రసాద్ కుమార్ విద్యార్థినితో మాట్లాడారు. విచారణ జరిపించి చర్యలు తీసుకుంటానని ఆమెకు భరోసా ఇచ్చారు.

ఆస్తి కోసం అయినవారి ప్రాణాలే తీసి..

(మొదటి పేజీ తరువాయి)

ఇద్దరు కుమారులు. ఈ కుటుంబానికి తెల్లాపూర్‌లో రూ.100 కోట్ల విలువైన రెండెకరాల భూమి ఉన్నట్లు సమాచారం. పెద్ద కొడుకు సందీప్ రెడ్డి వివాహం గత ఏడాది నవంబరులో జరిపించారు. చిన్నకొడుకు కార్తీక్‌రెడ్డి (26) మద్యానికి బానిసగా మారాడు. ఆ మత్తులో తరచూ కుటుంబసభ్యులను వేధించేవాడు. తనకు ఆస్తి పంచి ఇవ్వాలని తల్లిదండ్రులతో గొడవపడేవాడు. మద్యం మాన్పించడానికి కార్తీక్‌రెడ్డిని కుటుంబసభ్యులు కోయంబత్తూరులోని డీ అడిక్షన్ కేంద్రంలో చేర్పించారు. అక్కడి నుంచి తిరిగొచ్చాక కూడా కార్తీక్‌రెడ్డి ప్రవర్తనలో మార్పు రాలేదు. మద్యం తాగడం, తల్లిదండ్రులను వేధించడం మానలేదు. ఆదివారం రాత్రి కూడా తల్లిదండ్రులతో గొడవపడ్డాడు. వారిని చంపుతానని బెదిరించాడు. సోమవారం తెల్లవారుజామున తల్లిదండ్రులు నిద్రిస్తుండగా కత్తితో గదిలోకి ప్రవేశించి తల్లి రాధికపై కత్తితో దాడి చేశాడు. పొట్ట, వీపు సహా తొమ్మిది చోట్ల కత్తితో పొడిచాడు. అడ్డుకోబోయిన తండ్రిపైనా దాడికి పాల్పడ్డాడు. మల్లారెడ్డి, రాధిక అరుపులకు మరో గదిలో నిద్రిస్తున్న సందీప్‌రెడ్డి రావడంతో కార్తీక్ అక్కడి నుంచి పారిపోయాడు. తీవ్రంగా గాయపడిన రాధికను కుటుంబసభ్యులు హుటాహుటిన ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం ఆమె మృతిచెందింది. తండ్రి మల్లారెడ్డికి స్వల్ప గాయాలయ్యాయి. ఘటనపై కేసు నమోదైంది. నిందితుడు పోలీసుల అదుపులో ఉన్నాడు. మహబూబ్‌నగర్ జిల్లా, హన్వాడ మండలంలోని ఇబ్రహీంబాద్ గ్రామానికి చెందిన శ్రీనివాస్‌గౌడ్ (47)కు భార్య లక్ష్మి ఉంది. తర్వాత జయమ్మను అతడు రెండో పెళ్లి చేసుకున్నాడు. నాలుగేళ్ల క్రితం జయమ్మను వదిలేసి మొదటి భార్య లక్ష్మి వద్దే ఉంటున్నాడు. శ్రీనివాస్‌గౌడ్‌కు ఐదు గుంటల భూమి ఉంది. ఈ భూమి విషయంలో భార్యాభర్తల మధ్య 15 రోజులుగా గొడవ జరుగుతోంది. ఉన్న ఐదు గుంటలను తన పేరుమీద రాయాలని శ్రీనివాస్‌ను లక్ష్మి సతాయిస్తోంది. 'నువ్వు చేస్తే రైతుబీమా కింద నాకు రూ.5లక్షలు వస్తాయి' అని తిడుతోంది. ఆదివారం రాత్రి కూడా ఇద్దరి మధ్య గొడవ జరిగింది. అర్ధరాత్రి లక్ష్మి, తన కుమారుడి సహకారంతో నిద్రిస్తున్న భర్తను గొంతు నులిమి చంపేసింది. హతుడి సోదరుడు తిరుమలేశ్ ఘటనపై సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనపై కేసు నమోదైంది.


మృతురాలు రాధిక(ఫైల్), ఆమె కుమారుడు కార్తీక్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్ (ఫైల్)



భగభగలు మొదలు

» 28 జిల్లాల్లో 38 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు

హైదరాబాద్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఈ నెల ప్రారంభంలోనే రాష్ట్ర వ్యాప్తంగా భానుడి ప్రతాపం మొదలైంది. ఉదయం 11 నుంచి సాయంత్రం నాలుగున్నర వరకు రోడ్లు ఖాళీగా కనిపిస్తున్నాయి. ఎండ వేడిమి దెబ్బకు రోడ్ల పైకి వచ్చేందుకు జనం జంకుతున్నారు. సోమవారం తెలంగాణ వ్యాప్తంగా 28 జిల్లాలో 38 డిగ్రీలకుపైగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. జగిత్యాల జిల్లా బీర్‌పూర్‌లో అత్యధికంగా 38.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. హైదరాబాద్, జనగాం, మెదక్, సంగారెడ్డి, నారాయణపేట్ జిల్లాల్లో మాత్రమే 36-37 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. రాబోయే రెండు రోజులు ప్రస్తుతం కంటే మరో 2-3 డిగ్రీల ఉష్ణోగ్రతలు అధికంగా నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. మరో రెండు వారాల్లో 40 డిగ్రీల దాటే అవకాశం కనిపిస్తోందని వెల్లడించింది. ఇక హైదరాబాద్ నగరంలో 36.7 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. నాలుగు రోజుల వ్యవధిలోనే నగరంలో నాలుగు డిగ్రీల మేరకు పగటిపూట ఉష్ణోగ్రతలు పెరిగాయి. ఎండ వేడిమి పెరగడంతో వేడిగాలుల తీవ్రత కూడా పెరిగింది.

అధికారుల సందర్శనతో విద్యార్థుల డైట్‌లో మెరుగైన ఫలితాలు: సీఎస్

హైదరాబాద్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): గురుకుల విద్యాలయాలు, సంక్షేమ హాస్టళ్లను ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, ఇతర సీనియర్ అధికారులు సందర్శించడం మొదలుపెట్టిన తరువాత విద్యార్థుల డైట్‌లో మెరుగైన ఫలితాలు కనిపిస్తున్నాయని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. పంటల పరిస్థితి, గురుకుల విద్యాలయాలు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నియంత్రణపై సోమవారం ఆమె సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ... గురుకులాలు, హాస్టళ్లలో నాణ్యమైన ఆహార పదార్థాలను అందిస్తుండడం, ఇతర సదుపాయాల కల్పనపై సంతృప్తి వ్యక్తం చేశారు. హాస్టళ్ల, గురుకులాల్లో ఇలాంటి పరిస్థితులు కల్పించిన కలెక్టర్లను ఆమె అభినందించారు. అదేవిధంగా యాసంగిలో సాగునీటిని ప్రణాళికబద్ధంగా వినియోగించాలని కలెక్టర్లను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారానికి మండల స్థాయి అధికార బృందాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

పౌరుల లేఖలే వ్యాజ్యాలుగా స్వీకరణ

» నోటీసులు జారీ చేసిన హైకోర్టు

హైదరాబాద్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): వివిధ సమస్యలపై పౌరులు రాసిన లేఖలను హైకోర్టు వ్యాజ్యాలుగా స్వీకరించింది. యునెస్కో గుర్తింపు పొందిన కుతుబ్ షాహీ సమాధులు నిర్వహణ సరిగా లేక ధ్వంసమవుతున్నాయంటూ కాంగ్రెస్ నేత మధు యాష్కి గౌడ్ లేఖరాశారు. దీనిని వ్యాజ్యంగా స్వీకరించిన తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజాయ్‌పాల్, జస్టిస్ రేణుక ధర్మాసనం వివరణ ఇవ్వాలని సంబంధిత శాఖల అధికారులకు నోటీసులు జారీచేసింది.

● ఖమ్మం జిల్లాలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా చేపడుతున్న మైనింగ్, స్టోన్ క్రషింగ్‌పై ఎన్. రాము రాసిన లేఖను సుమోటో పిటిషన్‌గా స్వీకరించింది. సంబంధిత అధికారులకు నోటీసులు జారీ చేసి విచారణ నాలుగువారాలకు వాయిదా వేసింది. ● కోతుల బెడదను శాశ్వతంగా నివారించాలని కోరుతూ తెలంగాణ రైతు సమస్యల సాధన సమితి అధ్యక్షుడు ఎం. మల్లన్న రాసిన లేఖను పిటిషన్‌గా స్వీకరించింది.

జీతాలు రావు.. ఇంక్రిమెంట్లు లేవు

ఆరు నెలలుగా వేతనాలు అందక అవస్థ.. ఏడేళ్లుగా జీతాలు పెరగక తీవ్ర ఇక్కట్లు

» ఏడున్నరేళ్లుగా ఒకే ఏజెన్సీది ఇష్టారాజ్యం

» సంచార పశు వైద్యశాల ఉద్యోగులకు కష్టం

» రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలకు సిద్ధం

జనగామ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న సంచార పశు వైద్యశాలల ఉద్యోగుల పరిస్థితి దయనీయంగా మారింది. ఆరు నెలలుగా జీతాలు లేకపోవడంతో కుటుంబ పోషణకు కూడా డబ్బులు లేక బిక్కుబిక్కుమంటున్నారు. ఏడేళ్లుగా వేతనాల పెంపు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సంచార పశు వైద్యశాలల నిర్వహణ బాధ్యతలు తీసుకున్న ఏజెన్సీగానీ, ఇటు రాష్ట్ర ప్రభుత్వం గానీ పట్టించుకోకపోవడంతో ఉద్యోగులు అల్లాడుతున్నారు. పశువులకు అత్యవసర సమయాల్లో ఎక్కడికక్కడ చికిత్స అందించాలన్న ఉద్దేశంతో 2017లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం సంచార పశు వైద్యశాల కార్యక్రమాన్ని తీసుకువచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా 100 గ్రామీణ నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. 2017 సెప్టెంబరు 17న అప్పటి సీఎం కేసీఆర్ దీనిని ప్రారంభించారు. ఒక్కో నియోజకవర్గానికి ఒక వాహనం చొప్పున వంద నియోజకవర్గాలకు 100 వాహనాలను కేటాయించారు. ఒక్కో వాహనంలో వెటర్నరీ డాక్టర్, వెటర్నరీ అసిస్టెంట్, డ్రైవర్, హెల్పర్‌లను నియమించారు. ఈ లెక్కన 100 నియోజకవర్గాలకు 400 మందిని అప్పటి ప్రభుత్వం నియమించింది. డాక్టర్లకు రూ.25,000, వెటర్నరీ అసిస్టెంట్లకు రూ.13,500, డ్రైవర్లకు రూ.8,300, హెల్పర్లకు రూ.6,700 చొప్పున వేతనాన్ని నిర్ణయించారు. రైతులు, పశువుల కాపరులు అత్యవసర సమయాల్లో 1962 టోల్ ఫ్రీ నంబరుకు కాల్ చేస్తే సంచార పశు వైద్య వాహనం ద్వారా నేరుగా పశువులు ఉన్న చోటుకే వెళ్లి చికిత్స అందించడం ఈ కార్యక్రమం ఉద్దేశం.


జనగామలో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

జాడలేని జీతాలు.. ఇంక్రిమెంట్లు..

సంచార పశువైద్యశాలల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఏడేళ్లుగా ఇంక్రిమెంట్లు కూడా రావడం లేదు. 2017లో కార్యక్రమం ప్రారంభమైన సమయంలో వైద్య శాలల నిర్వహణ బాధ్యతలను ప్రభుత్వం జీవీకే సంస్థకు అప్పగించింది. ఏటా ఇంక్రిమెంట్లు ఇవ్వడంతోపాటు ప్రతీ మూడేళ్లకు ఒకసారి రీ టెండరు నిర్వహించాల్సి ఉంటుంది. దీని వల్ల ఆసక్తి ఉన్న ఏజెన్సీలు ముందుకొస్తాయి. దీంతో ఉద్యోగుల వేతనాలు సైతం పెరిగే అవకాశం ఉంటుంది. కానీ ఏడేళ్లుగా కనీసం ఒక్క ఇంక్రిమెంట్ కూడా రాలేదు. ఇక, ఉద్యోగులకు జీతాలు ఇవ్వడంలోనూ ఏజెన్సీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ప్రభుత్వం నుంచి రావాల్సిన బిల్లులను సాకుగా చూపుతూ ఆరు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదు. దీంతో సంచార పశు వైద్యశాల ఉద్యోగులు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టాలని నిర్ణయించారు. ఆందోళనలతోనైనా పెండింగ్‌లో ఉన్న వేతనాలు వస్తాయని ఆశిస్తున్నారు. ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి చొరవ చూపాలని కోరుతున్నారు.

పెండింగ్ వేతనాలు ఇవ్వాలి



సంచార పశు వైద్యశాల కార్యక్రమంలో పనిచేస్తున్న మాకు 6 నెలలుగా వేతనాలు అందడం లేదు. ఏడున్నరేళ్లుగా పనిచేస్తున్నా కనీసం ఒక్క ఇంక్రిమెంట్ ఇవ్వలేదు. చాలీచాలని వేతనాలతో కుటుంబాలను వెళ్లదీస్తున్నాం. ప్రభుత్వం స్పందించి వేతనాలు పెంచడంతో పాటు పెండింగ్‌లో ఉన్న ఆరు నెలల జీతాలను విడుదల చేయాలి.

- డాక్టర్ విజయ్‌కుమార్, వెటర్నరీ వైద్యుడు, జనగామ

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

మొరటు దౌత్యం

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ నోరు అదుపులో పెట్టుకొనే వ్యక్తి కాదు కనుక, ఆవేశపరుడైన ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో జరిగిన భేటీ చివరకు అలా ముగిసింది. బలమైన శత్రువుతో పోరాడుతున్న ఒక చిన్న దేశాధ్యక్షుడు, యుద్ధం మధ్యలో ఉంటూ, మూడేళ్ళుగా తనకు అందుతున్న సాయం ప్రమాదంలో పడిన స్థితిలో కూడా ఇంతటి గుండె ధైర్యంతో అమెరికా అధ్యక్షుడిని ఎదిరించడం అందరికీ నచ్చింది. నీ విలువైన వనరులన్నీ ఇస్తే తప్ప నా సాయం కొనసాగదని బ్లాక్ మెయిల్ చేసిన అమెరికా అధ్యక్షుడు ఆ పనేదో చూసుకోకుండా, తనను తప్పుబడుతూ, తన ప్రత్యర్థిని ఆకాశానికి ఎత్తేస్తూ మాట్లాడటంతో ఉక్రెయిన్ అధ్యక్షుడికి ఉక్రోషం ఆగలేదు. తనను తన దేశాన్ని అవమానిస్తున్నవారి ఎదుట తలవంచుకొని ఉండాల్సిన అవసరం లేదనుకున్నాడేమో ఆయన. మూడేళ్ళుగా అండగా ఉంటూ వచ్చిన అమెరికా అర్థంతరంగా ఆయుధసాయం నిలిపివేస్తే, బలమైన శత్రువు చేతుల్లో మరింత నలిగిపోవాల్సివస్తుందని జెలెన్‌స్కీకి తెలుసు. దీనితో పాటే, అమెరికా అధ్యక్ష ఉపాధ్యక్షులు కట్టకట్టుకొని ఇలా ఎందుకు విరుచుకుపడుతున్నారో, హితవు ముసుగులో ఎందుకు తనను విలన్ చేస్తున్నారో కూడా ఆయనకు తెలుసు. ఐదువందల బిలియన్ డాలర్ల ఆస్తులు అప్పగిస్తూ కూడా కుట్రలు సహించాల్సిన, శత్రు సంకీర్తనలను భరించాల్సిన అవసరం లేదనుకున్నాడు ఆయన.


ఒక దేశాధ్యక్షుడిని పిలిచి మరీ ఇలా అవమానించడంతో అమెరికా పరువు దిగజారిందని అక్కడి మీడియా వ్యాఖ్యానిస్తోంది. గతనెలలో జెలెన్‌స్కీని ఉద్దేశించి ట్రంప్ చేసిన వ్యాఖ్యలు గుర్తున్న వారికి ఇప్పటి వాగ్వాదం ఒక కొనసాగింపుగా కనిపించవచ్చు. జెలెన్‌స్కీని నియంతగా, యుద్ధానికి ఆద్యుడిగా, దేశాన్ని ముంచేసిన దుందుడుకు నాయకుడిగా ట్రంప్ ఆదిలోనే జెలెన్‌స్కీని అభివర్ణించారు. పూర్తిగా పుతిన్ పరిభాషలోనే ఆ విమర్శలు సాగాయి. తద్వారా ఉక్రెయిన్‌లోని అరుదైన, విలువైన వనరులను అమెరికన్ కంపెనీలకు అప్పగించే ఒప్పందానికి ఆయన జెలెన్‌స్కీ మెడలు వంచి, అమెరికా ఆయుధసాయానికి ప్రతిఫలంగా అనేక రెట్లు దోచుకొనే అవకాశం ఏర్పడింది. ట్రంప్ చేసిన ఒక వ్యాఖ్యను అందిపుచ్చుకొని, రష్యా అధ్యక్షుడు పుతిన్ సైతం తన దేశంలోనూ విలువైన ఖనిజాలను తవ్వుకోవచ్చుననీ, ఉక్రెయిన్ నుంచి తాను ఆక్రమించుకున్న భూభాగాలను కూడా అందుకు ఇస్తానని ఓ చవుక బేరాన్ని ప్రతిపాదించారు. ఇది జెలెన్‌స్కీమీద మరింత ఒత్తిడి పెంచింది. ఉక్రెయిన్ కులీనులు ఈ ఒప్పందాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని, కేవలం వనరుల దోపిడీతప్ప, భవిష్యత్ భద్రత, సహకారంమీద అమెరికా నుంచి ఏ హామీ లేని ఈ ఒప్పందాన్ని జెలెన్‌స్కీ బలవంతంగా అంగీకరించాల్సివచ్చిందని అందరికీ తెలుసు. నాటో సభ్యత్వానికి తావేలేదనడం, భద్రత ఊసెత్తక పోవడంతో పాటు, మాటకు కట్టుబడని తన ప్రత్యర్థిని వెనకేసుకు రావడంతో పాటు, నీ దేశం సర్వనాశనమైందనీ, నీ సైన్యం పారిపోతోందని తననూ ఉక్రెయిన్‌నూ అవమానించడం ఆయన సహించలేకపోయారు.

టెలివిజన్ స్క్రీన్‌మీద ఈ ఘట్టాన్ని చూసిన సామాన్యులకు జెలెన్‌స్కీ తెగనచ్చేశాడు. ఇద్దరు దేశాధ్యక్షుల మధ్య ఈ తరహా ఘర్షణ చోటుచేసుకోవడం, అది ప్రత్యక్షంగా చూడగలగటం, అందునా అమెరికా అధ్యక్షుడికి వ్యతిరేకంగా ఓ నాయకుడు ఘాటుగా మాట్లాడటం వారికి ఆశ్చర్యం కలిగించింది. తన చర్యలూ చేష్టలతో ప్రపంచాన్ని భయపెడుతున్న ఓ నాయకుడు కెమెరాల సాక్షిగా ఆత్మరక్షణలో పడటం వారికి నచ్చింది. దేశాధ్యక్షులు ఎంతో ఉన్నతంగా, గంభీరంగా, పరస్పరగౌరవంతో మాట్లాడుకుంటారనే భ్రమలను ఈ ఘట్టం పటాపంచలు చేసింది. వినయంగా తలూపకుండా మా దేశానికి వచ్చి మమ్మల్నే అవమానిస్తావా అన్న రీతిలో అధ్యక్ష, ఉపాధ్యక్షులు రగిలిపోయారనడానికి అనంతర పరిణామాలే సాక్ష్యం. అందరినీ చూడనివ్వండి అంటూనే ఒక అతిపెద్ద ప్రజాస్వామిక దేశాధినేత ఎదుటివ్యక్తిని నోరువిప్పనివ్వకుండా ఎంత అవమానకరంగా మాట్లాడారో ప్రపంచం చూసింది. మధ్యవర్తిగా ఉంటానని చెప్పిన పెద్దమనిషి పూర్తిగా ఒకవైపు మొగ్గడం మరోమారు గమనించింది. ఆప్తులను సైతం అర్థంతరంగా వదిలేసే అమెరికాతో అంటకాగేవారికి ఈ ఘట్టం మరో గుణపాఠం.

నేర నియంత్రణలో భాగస్వామ్యం ప్రజల బాధ్యత

దేశంలో పెరిగిపోతున్న నేరాల సంఖ్య ఆందోళన కలిగిస్తోంది. జాతీయ నేర రికార్డుల బ్యూరో నివేదిక (2022) ప్రకారం రోజూ 16,000 తీవ్ర నేరాలు నమోదవుతున్నాయి. మరో పక్క 54.2శాతం కేసుల్లో మాత్రమే నేర నిరూపణ అవుతున్నది. ఇది బ్రిటన్‌లో 80శాతం, అమెరికాలో 90శాతంగా ఉంది. ఇందుకు కారణం అక్కడి ప్రజల భాగస్వామ్యం. నేరాలు జరిగినప్పుడు పరిశోధన భారం పోలీసు శాఖ పైనే పడుతోంది. కానీ ప్రజల తోడ్పాటు ఉంటే సాక్ష్యాధారాల సేకరణ సులభమై శాంతిభద్రతలు మెరుగవుతాయి.

నేరం గురించి కీలక సమాచారం తెలిసినప్పటికీ చాలా మంది పోలీసులతో నేరుగా మాట్లాడటానికి భయపడతారు. వారి భద్రత గురించి లేదా సాక్షిగా కోర్టులో నిలబడాలని ఆందోళన చెందుతారు. ప్రస్తుతం ప్రజలు తమకు తెలిసిన నేర సమాచారం పోలీసు అధికారికి చేరవేయాలంటే హెల్ప్‌లైన్ 100కు ఫోన్ చేయాలి. ఉదాహరణకు ఒక విద్యార్థి తన కళాశాలలోని విద్యార్థులకు డ్రగ్స్ అక్రమ రవాణా చేసున్న వారిని గుర్తించి, వెంటనే ఆ నేరం ఆపాలని భావిస్తాడు. ఫోన్ చేయడానికి ఇదివరకు పబ్లిక్ టెలిఫోన్ బూత్‌లు ఉండేవి. మొబైల్ ఫోన్‌ల పుణ్యమా అని ఇప్పుడా సౌలభ్యం లేదు, కనుక తన మొబైల్ ఫోన్ నుంచే కాల్ చేయాలి. అప్పుడు తన నెంబర్ అవతలి వారికి కనబడటం పెద్ద అవరోధంగా మారి, అతడు నిస్సహాయంగా ఉండిపోయే అవకాశమే ఎక్కువగా ఉంది. ఈ అవరోధాన్ని అధిగమించడం కోసమే కొన్ని దేశాల్లో 'క్రైమ్ స్టాపర్స్' అనే అజ్ఞాత నెంబర్ వ్యవస్థను ప్రవేశ పెట్టారు. 'క్రైమ్ స్టాపర్స్' అనేది పోలీసులు, పౌర సమాజం మధ్య సహకారంతో నడిచే సంస్థ. ఏదైనా నేరం గురించి సమాచారం తెలిసినవారు కాల్ చేస్తే దీని సాంకేతికత వల్ల వారి ఫోన్ నెంబర్ అధికారికి కనిపించదు. అతను చెబితే తప్ప పేరు, వివరాలు తెలిసే అవకాశమే లేదు.



క్రైమ్ స్టాపర్స్ మొదట 1976లో అమెరికాలో స్థాపించబడింది. తర్వాత బ్రిటన్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికాలో ఏర్పాటయింది. ఇందులో పౌర సమాజానికీ పాత్ర ఉండటం వల్ల ఈ వ్యవస్థలు ప్రజల నమ్మకం పొందాయి. సమాచారం ఇచ్చిన వారికి కొన్నిసార్లు రహస్యంగా బహుమతి ఇచ్చే ఏర్పాటు కూడా ఉంటుంది. కాలిఫోర్నియా వంటి రాష్ట్రాలలో 'P 3 మొబైల్ క్రైమ్ టిప్స్' వంటి యాప్ కూడా అజ్ఞాతంగా నేర సమాచారం ఇచ్చేందుకు అందుబాటులో ఉంది. బ్రిటన్‌లోనే క్రైమ్ స్టాపర్ సమాచారం ఆధారంగా 1,51,000 మంది నేరస్థులను అరెస్టు చేశారు. 36 కోట్ల పౌండ్ల విలువైన అక్రమ డ్రగ్స్ జప్తు చేశారు. ఆస్ట్రేలియాలో ఒక అజ్ఞాత కాలర్ అందించిన సమాచారం ఆధారంగా గత ఏడాది 896 కిలోల మెథాంఫెటమైన్ జప్తు చేశారు.

అంతేగాక, తీవ్ర నేరాలు జరిగినపుడు పోలీసులే అలర్ట్ (హెచ్చరిక) చేసి సమాచారం సేకరించి ఛేదించిన కేసులూ ఉన్నాయి. నేరం జరిగిన వెంటనే టీవీ, రేడియో, రహదారి డిజిటల్ బోర్డులు, సోషల్ మీడియా వంటి ప్రసార సాధనాల ద్వారా, ముఖ్యంగా ఫోన్ సంక్షిప్త సందేశం (ఎస్ఎంఎస్) రూపంలో స్థానిక భాషలలో ప్రజలకు హెచ్చరిక పంపే అవకాశం ఉంది. అమెరికాలో, ఈ అలర్ట్ వ్యవస్థ బాలల అపహరణ వంటి నేరాల్లో కూడా ఉపయోగిస్తున్నారు. మసాచుసెట్స్‌లో 11 ఏళ్ల బాలిక కిడ్నాప్‌కు గురైనప్పుడు, ఈ అలర్ట్ అందుకున్న సాక్షులు ఇచ్చిన కీలక సమాచారం ఆమెను సురక్షితంగా కాపాడటానికి దోహదపడింది. పిల్లల అపహరణ జరిగిన వెంటనే అంబర్ అలర్ట్, అదృశ్యమైన వృద్ధులను కనుగొనడానికి సిల్వర్ అలర్ట్, పోలీసు అధికారులపై దాడి జరిగినప్పుడు బ్లూ అలర్ట్, ఇంకా తీవ్ర వాతావరణ మార్పులు, ప్రజా భద్రత అప్రమత్తతలు, జాతీయ అత్యవసర సందేశాలు పంపబడతాయి. అజ్ఞాతంగా నేర సమాచారం అందించే క్రైమ్ స్టాపర్, నేర హెచ్చరిక వ్యవస్థల వల్ల, నేర నియంత్రణలో ప్రజల బాధ్యత పెరిగి సమాజంలో శాంతి నెలకొంటుంది.

– శ్రీనివాస్ మాధవ్

విద్యార్థి ఎన్నికలు.. ప్రగతికి బాటలు

చదువుకుంటూనే సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులను అర్థం చేసుకుంటూ అసాంఘిక శక్తులపై పోరాటం చేసేవాడు విద్యార్థి. అతని నిస్వార్థపు ఆలోచనలు, చర్యలు దేశ నిర్మాణానికి, ప్రగతికి దోహదం చేస్తాయి. ఇలా యూనివర్సిటీల్లో విద్యార్థి సంఘ నేతలుగా ఎదిగిన అనేక మంది దేశానికి ప్రధానులు, రాష్ట్రపతులు, ఆయా రాష్ట్రాలకు సీఎంలుగా ప్రజలకు సేవ చేశారు. ప్రస్తుతం సెంట్రల్ వర్సిటీలు, కొన్ని రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో తప్పితే.. ప్రభుత్వాలు విద్యార్థి సంఘం ఎన్నికలు నిర్వహించడం లేదు. దీంతో సమాజానికి, దేశానికి నిస్వార్థంగా పనిచేసేందుకు రాజకీయాల్లోకి వచ్చే నాయకులు తగ్గిపోతున్నారు.

విద్యార్థి సంఘ ఎన్నికల జరిగిన కాలంలో విద్యార్థులందరూ సామాజిక స్పృహతో చైతన్యంగా ఉండేవారు. నాణ్యమైన విద్యాబోధన డిమాండ్ చేయడంతో పాటు కాలేజీ, హాస్టల్ ఫీజులు సామాన్యుడికి కూడా అందుబాటులో ఉండేందుకు ప్రభుత్వంతో పోరాటం చేసేవారు. విద్య ప్రైవేటీకరణకు, వ్యాపారీకరణకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు నడిచేవి. ప్రశ్నించే తత్వం ప్రతి విద్యార్థిలో ఉండటంతో విద్యాసంస్థలు బాధ్యతాయుతంగా, జవాబుదారీతనంతో పనిచేసేవి. అటు సామాజిక ఉద్యమాల్లోనూ విద్యార్థులు కీలక పాత్ర పోషించేవారు.


ప్రస్తుతం చాలా మంది రాజకీయ నాయకులు ప్రజల కంటే వారి స్వప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తూ కుల, మత, ప్రాంతీయ భావాలను రెచ్చగొడుతున్నారు. పదవుల్లో ఉండగానే వారసులను రాజకీయరంగ ప్రవేశం చేయించి, భవిష్యత్తు తరాలపై వారిని బలవంతంగా రుద్దుతున్నారు. ఈ పోకడలను మనం ప్రోత్సహించినా, కొనసాగించినా ప్రజాస్వామ్యానికి పెనుముప్పుగా మారతాయి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత చాలాకాలం పాటు సాధారణ ఎన్నికలతో సమాంతరంగా విద్యార్థి సంఘం ఎన్నికలు కూడా నిర్వహించేవారు. తద్వారా విద్యార్థి సంఘాల నుంచి గొప్ప నాయకులు వచ్చేవారు. 1980–1985 మధ్యకాలంలో వివిధ రాష్ట్రాల్లోని విశ్వవిద్యాలయాల్లో జరిగిన కొన్ని హింసాత్మక సంఘటనల వల్ల విద్యార్థి సంఘ ఎన్నికలను ప్రభుత్వాలు రద్దు చేశాయి. తరువాత సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కేంద్ర ప్రభుత్వం మాజీ ఎన్నికల అధికారి జె.ఎం. లింగ్డో అధ్యక్షతన ఒక కమిటీ వేసింది. 2006 సెప్టెంబర్‌లో ఆ కమిటీ ప్రతిపాదించిన రిపోర్టును అమలు చేయాలని యూనివర్సిటీలకు, కాలేజీలకు సుప్రీం కోర్టు సూచించింది. దీంతో కేంద్ర విశ్వవిద్యాలయాలైన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ, కేరళ, పశ్చిమబెంగాల్, అస్సాం, రాజస్థాన్, పంజాబ్ రాష్ట్రాల్లోని వర్సిటీల్లో కొన్నిచోట్ల మాత్రమే విద్యార్థి సంఘ ఎన్నికలు నిర్వహిస్తున్నారు.

విద్యలో ప్రైవేటీకరణ, ఫీజుల దోపిడీ, ప్రైవేటు యూనివర్సిటీల ఏర్పాటు, నిరుద్యోగం, కులం, మతం, ప్రాంతాల పేరుతో విద్వేషాలు సృష్టించడం ఇలా విద్యార్థుల భవిష్యత్తును అంధకారం చేసే అనేక వైపరీత్యాలు జరుగుతున్నా విద్యార్థులు, విద్యార్థి సంఘాల నేతలు కనీసం వారి హక్కుల కోసం గళం ఎత్తలేని అచేతన స్థితిలో ఉంటున్నారు. ప్రశ్నించే తత్వం తగ్గిపోతోంది. విద్యార్థి సంఘం ఎన్నికల అంశం తెరమీదకు వచ్చినప్పుడల్లా పాలకవర్గాలు, ఆయా యూనివర్సిటీల యాజమాన్యాలు శాంతిభద్రతల అంశాన్ని సాకుగా చూపుతున్నాయి. శాంతిభద్రతలే సమస్యైతే సాధారణ ఎన్నికలు ఎలా నిర్వహిస్తున్నారు? ఇప్పటికైనా విశ్వవిద్యాలయాలు, కాలేజీలలో విద్యార్థి ఎన్నికలను నిర్వహించి ప్రజాస్వామ్యానికి అవసరమైన ప్రజా నాయకులను, సామాజికవేత్తలను దేశానికి అందించవలసిన ఆవశ్యకత ఉన్నది.

– ఎన్. సీతారామయ్య

హిందీ ఆధిపత్యం దేశ భవితవ్యానికి చేటు

బహుశా, ఒక ముఖ్యమంత్రి రాసిన చాలా అసాధారణ లేఖ అది. సమస్త భారతీయులను ఉద్దేశించి రాసిన బహిరంగ లేఖ అది. సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్ట్ చేసిన ఆ లేఖకు వెన్వెంటనే వేలాది ప్రతిస్పందనలు వచ్చాయి. ఆ లేఖ రాసింది తమిళనాడు ముఖ్యమంత్రి ఎమ్.కె.స్టాలిన్. 'ఇతర రాష్ట్రాలకు చెందిన నా ప్రియమైన సోదరీ సోదరుల్లారా' అంటూ ప్రారంభమైన ఆ లేఖ ఇలా కొనసాగింది: ఎన్ని ఇతర భారతీయ భాషలను హిందీ ఇప్పటివరకు కబళించిందో తెలిస్తే మీరు ఆశ్చర్యపోరూ? భోజ్‌పురి, మైథిలి, గఢ్వాలి, అవధి, బ్రజ్, కుమౌనితో సహా 19 భాషలు మాయమైపోయాయి. ఇంకా మరిన్ని భాషలు అస్తిత్వాన్ని కాపాడుకునేందుకు ఆరాటపడుతున్నాయి. ఏకరూప హిందీకి గుర్తింపు తీసుకువచ్చేందుకు చూపుతున్న పట్టుదల పురాతన మాతృభాషలను హరించివేసింది ఉత్తరప్రదేశ్, బిహార్‌లు హిందీ భాష మాట్లాడే ప్రాంతాల నడిబొడ్డు రాష్ట్రాలు కానేకావు. ఆ రాష్ట్రాల ప్రజానీకం అసలు భాషలు ఇప్పుడు గత కాలం అవశేషాలు. చరిత్ర గురించిన అవగాహన ఉన్నవారికి ఇదంతా ఎక్కడకు దారితీస్తుందో తెలుసు. అవును ఇది ఎక్కడ ముగుస్తుందో మాకు తెలుసు కనుకనే హిందీ ప్రాబల్యాన్ని తమిళనాడు ప్రతిఘటిస్తోంది'.



> రాజకీయ, సామాజిక దురభిమానాల అజెండాలతో కాకుండా సమస్త ప్రజల శ్రేయస్సుకు సంకల్పించిన విశాల లక్ష్యాలతో విధ్యుక్త ధర్మాలను నిర్వహించినప్పుడే భారత్ సుస్థిరంగా పురోగమనపథంలో ప్రస్థానిస్తుంది. కుల మతాల పేరిట సామాజిక జనసముదాయాల మధ్య విభేదాలు, కలహాలు సృష్టించడానికి ప్రయత్నించడం మన గణతంత్ర రాజ్య సంస్థాపనా సూత్రాలకు ఎనలేని హాని చేస్తుంది. ప్రగతి సాధనలో తడబడుతున్న హిందీ రాష్ట్రాల భాషను దక్షిణ భారతావని నేర్చుకోవాల్సిందేనని నిర్దేశించడం భారత్ భవిష్యత్తుకు ముప్పుగా పరిణమిస్తుంది.

'ఏకరూప హిందీకి గుర్తింపునకు వ్యతిరేకంగా స్టాలిన్ ఆక్షేపిస్తున్న సమయంలోనే కేంద్ర హోం మంత్రి అమిత్ షా చెన్నైలో ఉన్నారు. ప్రణాళికాబద్ధంగా నియోజకవర్గాల పునర్విభజన అనంతరం తమిళనాడు ఒక్క పార్లమెంటరీ స్థానాన్ని కోల్పోకుండా ఉండేలా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జాగ్రత్త వహిస్తారని రాష్ట్ర ప్రజలకు అమిత్ షా హామీ ఇచ్చారు. అయితే నియోజకవర్గాల పునర్విభజన అనంతరం తమిళనాడుకు కేటాయించే సీట్ల సంఖ్య తగ్గదనే విషయమై అమిత్ షా ఎటువంటి హామీ ఇవ్వలేదు. ప్రస్తుత సీట్ల సంఖ్య కేటాయింపు జరిగినప్పుడు భారతదేశ జనాభా వృద్ధి రేట్లు భిన్నంగా ఉన్నాయి. ఉత్తర భారతావని రాష్ట్రాలలో జనాభా పెరుగుదల చాలా హెచ్చు స్థాయిలో ఉన్నది. తత్కారణంగా ఉత్తరప్రదేశ్‌లో ఇప్పుడు ఒక నియోజకవర్గంలో 30 లక్షల మంది జనాభా ఉండగా తమిళనాడులో ఆ సంఖ్య ఇంచుమించు 18లక్షలుగా ఉన్నది. జనాభా సంఖ్య ఆధారంగా కొత్త లోక్‌సభ సీట్లు నిర్ణయించడం జరిగితే తమిళనాడు లోక్‌సభ సీట్ల సంఖ్య తగ్గిపోయే అవకాశమున్నది. ఉత్తరప్రదేశ్‌లో వాటి సంఖ్య పెరుగుతుంది. నియోజకవర్గాల పునర్విభజన అనంతరం లోక్‌సభలో సీట్ల సంఖ్య 753కు పెరిగితే ఇప్పటికే అత్యధిక ఎంపీలను పంపుతున్న ఉత్తరప్రదేశ్‌లో లోక్‌సభ స్థానాల సంఖ్య 80 నుంచి 128కి పెరిగే అవకాశం తప్పకుండా ఉన్నది.

దీనివల్ల ఉత్తర దక్షిణ భారతదేశాల మధ్య రాజకీయ సమతౌల్యతకు వాటిల్లేదేమిటో స్పష్టమే. హిందీ భాష మాట్లాడే ప్రాంతాల నడిబొడ్డు రాష్ట్రాలలో దక్షిణాది రాష్ట్రాలలో కంటే లోక్‌సభ సీట్ల సంఖ్య పెరుగుతుంది. దీని పర్యవసానమేమిటంటే జాతీయ రాజకీయాలపై ఉత్తరాది ప్రాబల్యం బాగా పెరిగిపోతుంది. హిందీ రాష్ట్రాలను పరిపాలించే రాజకీయ పక్షాలే జాతీయ రాజకీయాలలో ప్రాధాన్యం పొందుతాయి. జాతీయ రాజకీయాలలో దక్షిణాది రాష్ట్రాల ప్రభావ ప్రాబల్యాలు గణనీయంగా తగ్గిపోతాయి.

ఉత్తర, దక్షిణాది రాష్ట్రాల మధ్య రాజకీయ సమతౌల్యత ఇలా తలకిందులు కావడం సరికాని ఆలోచనగా భారతీయ జనతా పార్టీ భావించడం లేదు. ఉత్తర భారతావనిలో లోక్‌సభ సీట్ల సంఖ్య పెరుగుదల ఏ స్థాయిలో ఉన్నా బాగా లబ్ధి పొందేది బీజేపీనే. దేశ రాజకీయాలపై తిరుగులేని పట్టుకు హిందీ రాష్ట్రాలలో ఆధిక్యత ఆ పార్టీకి ఎంతైనా అవసరం. అందుకు ఆ పార్టీకి లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన తోడ్పడనున్నది. ఈ కారణంగానే స్టాలిన్, ఇతర దక్షిణాది నాయకులు హిందీ ప్రాబల్యం, జాతీయ రాజకీయాలలో ఉత్తరాది పెత్తనం విషయమై అమితంగా కలవరపడుతున్నారు.

సకల రంగాలలో విజయాల మీద విజయాలు సాధిస్తూ పురోగమిస్తున్న కారణంగా దక్షిణాది రాష్ట్రాలను నియోజకవర్గాల పునర్విభజన తదితర చర్యలతో శిక్షిస్తున్నారని స్టాలిన్, ఇతర దక్షిణాది నాయకులు వాదిస్తున్నారు. నిజమే. ఆర్థికాభివృద్ధిలో దక్షిణ భారతావని ఉత్తర భారత రాష్ట్రాల కంటే బాగా ముందంజలో ఉన్నది. ఉత్తరప్రదేశ్‌లో అక్షరాస్యత రేటు 68శాతం కాగా కేరళలో అది 94శాతంగా ఉన్నది. ఆర్థికాభివృద్ధిలోనూ ఆ రెండు రాష్ట్రాల మధ్య ఈ వ్యత్యాసం స్పష్టంగా కనిపిస్తుంది. చాలా సంవత్సరాల క్రితం, సామాజిక మాధ్యమాలు రంగంలోకి రాక ముందు దక్షిణాది రాష్ట్రాల వృద్ధిరేట్లను టీవీ మోహన్ దాస్ పాయ్ గణించారు. ఆ వృద్ధి రేట్లు ఆసియన్ టైగర్స్‌గా సుప్రసిద్ధమైన సింగపూర్, దక్షిణ కొరియా మొదలైన ఆగ్నేయాసియా దేశాల వృద్ధిరేట్లతో సమాన స్థాయిలో ఉన్నాయి. జనాభా పెరుగుదల విషయంలోనూ ఇటువంటి వ్యత్యాసమున్నది. ఉత్తరాది, దక్షిణాది లోక్‌సభ నియోజకవర్గాల పరిమాణాలలో వ్యత్యాసానికి ప్రధాన కారణం జనాభా నియంత్రణలో దక్షిణాది రాష్ట్రాలు సంపూర్ణ ఫలితాలు సాధించడమే అన్నది స్పష్టం. హిందీయేతర రాష్ట్రాలలో ఇప్పుడు జనాభా రేట్లు, మరణాల రేట్ల కంటే తక్కువగా ఉన్నాయి. 1960, 70ల్లో అనియంత్రిత జనాభా పెరుగుదల విషయమై వ్యక్తమైన భయాందోళనలు నిరాధారమైనవని రుజువయింది. ఇందుకు ప్రధాన కారణం హిందీ భాషాయేతర రాష్ట్రాలు జనాభా నియంత్రణలో సంపూర్ణంగా విజయవంతమవడమేనని చెప్పక తప్పదు.

చాలా మంది దక్షిణ భారతీయులు భావిస్తున్న, అయితే తప్పనిసరిగా బయటకు చెప్పని విషయాలనే స్టాలిన్ బహిరంగ లేఖ వ్యక్తం చేసింది. హిందీ రాష్ట్రాల వైఫల్యాల కారణంగా దక్షిణాది రాష్ట్రాలు మరింతగా ముందుకు సాగకుండా ఎంతకాలం నిలువరిస్తారు? భారతదేశ రాజకీయాలపై అన్నిటా వెనుకబడిన రాష్ట్రాలే ప్రభావ ప్రాబల్యాలు నెరపేందుకు అవకాశం కల్పించడం దేశ శ్రేయస్సుకు మేలు చేస్తుందా? మనది ప్రజాస్వామిక సమాజం మాత్రమే కాకుండా ఒక సమాఖ్య పాలనా వ్యవస్థ కూడా. దేశం మరింతగా పురోగమించాలంటే రాష్ట్రాల హక్కులను గౌరవించాలి. దేశాన్ని ప్రగతిపథంలో నిరంతరం ముందుకు తీసుకు వెళుతున్న రాష్ట్రాలను స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం శిక్షించడం దేశానికి ఏ విధంగా మేలు చేస్తుంది? దక్షిణ భారతదేశ ప్రజల మనస్సుల్లో సుడులు తిరుగుతున్న ప్రశ్నలివి.

ఇటువంటి నిరసన భావాల నుంచే హిందీ భాషపై మళ్లీ చర్చ ప్రారంభమయింది. దేశ ప్రజలకు స్టాలిన్ బహిరంగ లేఖే అందుకు తార్కాణం. హిందీ వ్యతిరేకత ద్రవిడ ఉద్యమంలో ఒక ప్రధాన భాగంగా ఉందన్న వాస్తవాన్ని మనం దాదాపుగా మరచిపోయాము. తమిళ ప్రజల సాంస్కృతిక స్వాభిమానం, దక్షిణ భారతావని ప్రాంతీయ మనోభావాలను గుర్తించి గౌరవించిన మన జాతీయ నాయకులు హిందీ వ్యతిరేకతను రూపుమాపేందుకు విశేషంగా దోహదం చేశారు. హిందీ, ఇంగ్లీషును అధికార భాషలుగా నిరవధికంగా కొనసాగేందుకు హామీనిస్తూ 1967లో ఇందిరాగాంధీ ప్రభుత్వం అధికార భాషల చట్టాన్ని సవరించింది. 1965లో తమిళనాడులో హిందీ వ్యతిరేకత ఉద్యమం ఉధృతంగా జరిగిన ఫలితంగానే ఇందిరాగాంధీ చొరవతో ఆ చట్టాన్ని సవరించడం జరిగింది.

స్టాలిన్ తన లేఖలో వ్యక్తం చేసిన అభిప్రాయాలు సమంజసమైనవని చరిత్ర చెప్పుతుంది. హిందీ సాపేక్షంగా ఒక కొత్త భాష. హిందీని సంస్కృతమయం చేసేందుకు బ్యూరాక్రాట్లు, రాజకీయవేత్తలు, పండితులు, ఆకాశవాణి విశేషంగా దోహదం చేశాయి. హిందీ మాత్రమే 'జాతీయ' భాష అని ఆ భాషాభిమానులు వాదించడం కద్దు. అయితే ఇది తప్పుడు భావన. ఇంగ్లీషు అనుసంధాన భాషగా ఉపయోగపడడమే కాకుండా సాఫ్ట్‌వేర్ మొదలైన అంతర్జాతీయ వ్యాపార వాణిజ్యాలలో ఇతర ఆసియా దేశాల కంటే మనకు స్పష్టమైన ఆధిక్యతను, అనేక ప్రయోజనాలను సమకూరుస్తోంది.

దక్షిణాది రాష్ట్రాలపై హిందీని రుద్దడానికి ఆరాటపడుతున్నవారు దేశవ్యాప్తంగా హిందీ వ్యాప్తిచెందుతున్న వాస్తవాన్ని విస్మరిస్తున్నారు. అయితే హిందీ భాషా రాష్ట్రాల సంకుచిత రాజకీయవేత్తలు, హిందీ భాషా దురభిమానుల కారణంగా హిందీ దేశ ప్రజలకు సుపరిచితం కావడం లేదు. సినిమా, టీవీ, స్ట్రీమింగ్, సంగీతం మొదలైన వాటి ఆలంబనతో ఆ భాష వ్యాప్తి చెందుతోంది. దక్షిణ భారతీయులు హిందీ భాషను మాట్లాడాలని డిమాండ్ చేస్తున్న వారు అదే సమయంలో బాలీవుడ్ (ఉర్దూవుడ్ అని వారే అగౌరవంగా మాట్లాడడం కద్దు) ప్రభావాన్ని తేలిగ్గా తీసిపారేస్తున్నారు. కొన్ని సంవత్సరాల క్రితం రాజకీయ దురుద్దేశాలతో బాలీవుడ్‌కు వ్యతిరేకంగా తీవ్ర ప్రచారం జరగడం గమనార్హం. ఇంగ్లీషును అనుసంధాన భాషగా ఉపయోగిస్తున్న వారిని 'వలసవాద బానిసలు' 'ఆంగ్ల మానసపుత్రులు' అని ఈసడిస్తున్నవారు పరాయి పాలకులకు వినాయక్ దామోదర్ సావర్కార్ రాసిన క్షమాపణ లేఖలను ఉపేక్షిస్తున్నారు!

సత్యమేవ జయతే. మన భారత గణతంత్ర రాజ్యం గురించిన సత్యమేమిటి? రాజకీయ, పాక్షిక, సామాజిక దురభిమానాల అజెండాలతో కాకుండా సమస్త ప్రజల శ్రేయస్సుకు సంకల్పించిన విశాల లక్ష్యాలతో విధ్యుక్త ధర్మాలను నిర్వహించినప్పుడే భారత్ సుస్థిరంగా పురోగమనపథంలో ప్రస్థానిస్తుంది. కుల మతాల పేరిట సామాజిక జనసముదాయాల మధ్య విభేదాలు, కలహాలు సృష్టించడానికి మీరు ప్రయత్నిస్తే మన సమున్నత గణతంత్ర రాజ్య సంస్థాపనా సూత్రాలకు మీరు ఎనలేని హాని చేస్తున్నట్లే, సందేహం లేదు. ప్రగతి సాధనలో తడబడుతూ, విఫలమవుతోన్న హిందీ రాష్ట్రాల భాషను దక్షిణ భారతావని నేర్చుకోవాల్సిందేనని మీరు మొండిగా పట్టుపడితే మీరు మన దేశ భవిష్యత్తుకు తీవ్ర ముప్పు కలిగించినవారవుతారు.

• వీర్ సంఘ్వీ
సీనియర్ జర్నలిస్ట్
(ది ప్రింట్)

కమ్యూనిస్టులను గట్టెక్కించే స్నేహితులెవరు?

శతవార్షికోత్సవాలు జరుపుకుంటున్న భారత కమ్యూనిస్టు పార్టీలు ప్రజల్లో మళ్ళీ ఉత్తేజాన్ని, ఉత్సాహాన్ని నింపగలవా? అనే ప్రశ్న ఇప్పుడు బలంగా వినిపిస్తున్నది. మన దేశంలో కమ్యూనిస్టు పార్టీలు వంద చీలికలు కావచ్చు గానీ అవి సాధించిన విజయాలు కూడా అంతకు మించి ఉన్నాయి. రాజ్యాంగ రచన సాగుతున్న కాలంలో కమ్యూనిస్టు పార్టీ రెండు చోట్ల రైతాంగ సాయుధ పోరాటాలకు నాయకత్వం వహిస్తున్నది. అలాంటి పోరాటాలను నివారించే ఒక రక్షణాత్మక విధానంగా కూడ రాజ్యాంగ రచన సాగింది. రాజ్యాంగం అమల్లోనికి వచ్చిన తరువాత, సామాన్య ప్రజల హితం కోసం రూపుదిద్దుకున్న అనేక చట్టాలు కమ్యూనిస్టుల ప్రభావంతో వచ్చినవే. జమిందారీవ్యవస్థ రద్దు, భూపరిమితి చట్టాలు, పారిశ్రామిక వివాదాల చట్టం, కనీస వేతనాల చట్టం, వెట్టిచాకిరీ వ్యవస్థ రద్దు, అటవీ భూములపై ఆదివాసులకు హక్కులు మొదలైనవన్నీ కమ్యూనిస్టు – నక్సలైట్ ఉద్యమాల ప్రభావంతో వచ్చినవే. ఇందిరాగాంధీ 'గరిబీ హటావో', ఎన్.టి. రామారావు కిలో రెండు రూపాయల బియ్యం, జనతా వస్త్రాలు, పేదలకు ఇళ్ళు వగయిరా పథకాలు కూడా కమ్యూనిస్టు అభిమానుల్ని తమ వైపునకు లాక్కోవడానికి ప్రవేశపెట్టిన పథకాలే.

కమ్యూనిస్టు పార్టీ, సంఘపరివార్ ఒకేసారి పుట్టాయి. అన్ని రకాల వనరులు, వంద అనుబంధ సంస్థలు ఉన్నప్పటికీ సంఘపరివార్ సంపూర్ణ అధికారాన్ని హస్తగతం చేసుకోవడానికి దాదాపు తొంభై ఏళ్లు పట్టింది. దానికి కారణం కమ్యూనిస్టు పార్టీలు అనుసరించిన మతసామరస్య భావజాలమే. అయితే, కమ్యూనిస్టు పార్టీల నాయకులకు కూడా స్థలకాల పరిమితులు ఉన్నాయి. తొలితరం కమ్యూనిస్టు నాయకులు గ్రామాల్లో భూమి సంబంధిత సామాజికవర్గాల నుండి వచ్చినవారు. వ్యవసాయం, నీటిపారుదల గురించి పరిజ్ఞానం ఉన్నవారు. వ్యవసాయ కూలీల మీద సానుభూతి ఉన్నవారు. అప్పటి పరిస్థితుల్లో వ్యవసాయ కూలీల విముక్తే దేశవిముక్తి అని గట్టిగా నమ్మినవారు. ఆ దృక్పథంతోనే 'ఆంధ్రాథీసిస్', 'వ్యవసాయిక విప్లవం' వంటి కార్యక్రమాలు పుట్టాయి. జాతీయ స్థూల ఉత్పత్తిలో వ్యవసాయరంగానికి సింహవాటా ఉన్న కాలం అది. అందువల్ల కమ్యూనిస్టు పార్టీలు అప్పట్లో వెలుగులో కొనసాగాయి. ఒక మహా యంత్రవిప్లవం ఒకటి వస్తుందని గానీ, ఉత్పత్తి సంబంధాల సమీకరణలు సమూలంగా మారిపోతాయనిగానీ వాళ్ళు ఊహించలేదు. అది వారి కాలపరిమితి.

1990వ దశకంలో ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిజానికి ఆమోదాంశం సంక్షోభంలో పడింది. ప్రపంచ విప్లవ కేంద్రంగా ఒక వెలుగు వెలిగిన రష్యా సోషలిస్టు దేశంగా పతనమైంది. చైనా సోషలిజం మీద కూడ అనుమానాలు తలెత్తాయి. కమ్యూనిజం మీద అంతిమపోరుకు ప్రపంచ బ్యాంకు సిద్ధమైంది. ప్రపంచ వాణిజ్య సంస్థ ఆవిర్భవించింది. సరళీకృత ఆర్థిక విధానం వ్యాపించింది. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విజృంభించింది. జాతీయ స్థూల ఉత్పత్తిలో వ్యవసాయం వాటా 15శాతానికి పడిపోయింది, పారిశ్రామిక ఉత్పత్తి వాటా కూడా ఆ స్థాయికే పరిమితం అయ్యింది. సేవారంగం అనూహ్యంగా పెరిగి దాదాపు 70శాతానికి చేరుకుంది. వర్గ స్పృహ వెనుకంజ వేసి ఉనికివాదం పెరిగింది.

ఇండియాలో చేపట్టాల్సిన విప్లవ కార్యక్రమం ఏమిటో తోచక నలుగురు సభ్యులతో కూడిన ఒక బృందం 1951 ఫిబ్రవరిలో స్టాలిన్ దగ్గరకు వెళ్ళింది. "ముందు మీ దేశాన్ని, మీ సమాజాన్నీ క్షుణ్ణంగా అధ్యయనం చేసి, దానికి అనువైన ఒక విప్లవ కార్యక్రమాన్ని రూపొందించుకోండి" అన్నాట్ట స్టాలిన్. భారత కుల మత తెగ రంగాల్లో తీవ్రంగా కొనసాగుతున్న సంఘర్షణ కూడ వర్గపోరాటమేనని కమ్యూనిస్టు నాయకులకు అర్థం కాలేదు. ఫలితంగా, ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనారిటీలు, మహిళలు తదితర ఉనికివాద సమూహాలు చాలావరకు కమ్యూనిస్టు పార్టీలకు దూరం అయ్యాయి. చైనాలో 1940 ప్రాంతంలో మావో చెప్పిన నూతన ప్రజాస్వామిక విప్లవమే ఇప్పటికీ మనదేశంలో అనేక కమ్యూనిస్టు పార్టీల కార్యక్రమంగా వుందంటే దిగ్భ్రాంతి కలుగుతుంది. చైనా నూతన ప్రజాస్వామిక విప్లవంలో సామ్రాజ్యవాద వ్యతిరేకత అనే కోణం కూడ వుంది. ఇక్కడ అదిలేదు.

సరైన సమయం కోసం ఎదురు చూస్తున్న సంఘపరివార్ శక్తులు కమ్యూనిస్టు పార్టీల బలహీన సమయంలో ఆ 1990లలోనే విజృంభించారు. రాజకీయరంగంలో కమ్యూనిస్టుల వెనుకంజతో ఏర్పడిన శూన్యాన్ని వాళ్లు ఆక్రమించుకున్నారు. భౌగోళికంగానూ, బౌద్ధికంగానూ వ్యాపించారు. సంఘపరివార్ నాయకత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వాన్ని 2004 ఎన్నికల్లో ఓడించిన ప్రజలు కమ్యూనిస్టుల మీద తమ నమ్మకాన్ని మరోసారి వ్యక్తం చేశారు. ఆ ఎన్నికల్లో వామపక్షాలకు 60 సీట్లు వచ్చాయి. రష్యా పతనం తరువాత ఇదొక అద్భుతం. కాంగ్రెస్, కమ్యూనిస్టులు కలిసి 'రైట్ ఆఫ్ ద సెంటర్'కు వ్యతిరేకంగా 'లెఫ్ట్ ఆఫ్ ద సెంటర్'గా యూపీఏ-1 ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. దేశంలో ఆర్థిక సంస్కరణల రూపశిల్పి అయిన మన్మోహన్ సింగ్ ప్రధాని అయ్యారు. అయినప్పటికీ యూపీఏ-1 ప్రభుత్వం వామపక్షాల ప్రభావంతో ప్రజలకు అనేక మేళ్లు తలపెట్టింది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అలా రూపొందిందే.

అయితే, అమెరికాతో పౌర అణు ఒప్పందాన్ని వ్యతిరేకించిన వామపక్షాలు జులై 9, 2008న యూపీఏ-1 నుండి బయటికి వచ్చాయి. పార్లమెంటరీ ప్రజాస్వామంలో ప్రజలు ఇచ్చిన ఒక సువర్ణ అవకాశాన్ని వామపక్షాలు చేజేతులా పాడుచేసుకున్నాయి. ఇదో మహాతప్పిదం. వామపక్షాలు వదిలి వెళ్ళిపోయాక అధికారాన్ని నిలబెట్టుకోవడానికి కాంగ్రెస్ పార్టీ రకరకాల వాళ్ళతో చేతులు కలిపి భ్రష్టుపట్టింది. ఇవన్నీ సంఘపరివార్ సంపూర్ణ అధికారాన్ని చేపట్టడానికి దోహదం చేశాయి. ప్రజలకు కమ్యూనిస్టుల చర్యలు నచ్చలేదు. 2014 ఎన్నికల్లో వాళ్ళు కమ్యూనిస్టుల్ని కఠినంగా శిక్షించారు.



> 2026 కల్లా కమ్యూనిస్టు 'నక్సలైట్ ముక్త్' దేశాన్ని నిర్మిస్తామని సాక్షాత్తు దేశ హోంమంత్రి ప్రతినబూనారు. మరోవైపు 2024 లోక్‌సభ ఎన్నికల్లో వామపక్షాలకు పడిన ఓట్లు 3 శాతం కూడలేవు. రెండు పంథాల్లోనూ కమ్యూనిస్టు పార్టీలకు ఇది సంక్షోభ సమయం. స్నేహహస్తాన్ని అందించే మిత్రులుంటే కష్టాలు సంక్షోభాలను అధిగమించడం పెద్ద కష్టం ఏమీ కాదు.

భారత కమ్యూనిస్టు ఉద్యమంలో మొదటి నుండీ రెండు పంథాల మధ్య ఒక చర్చ సాగుతూనే వుంది. ఇందులో మొదటిది: సాయుధ పోరాటం ద్వారా అధికారాన్ని చేజిక్కించుకోవడం. రెండోది: పార్లమెంటరీ ప్రజాస్వామ్య ఎన్నికల ద్వారా అధికారాన్ని చేపట్టడం. ఇప్పటికీ ఒకటి రెండు కమ్యూనిస్టు పార్టీలు మొదటి పంథాలోనూ, మిగిలిన కమ్యూనిస్టు పార్టీలు రెండో పంథాలోనూ కొనసాగుతున్నాయి. ఈ రెండు పంథాలూ ఇప్పుడు ఉనికిని కోల్పోయే ప్రమాదంలో పడ్డాయి.

2026 కల్లా కమ్యూనిస్టు తీవ్రవాదులులేని (నక్సలైట్ ముక్త్) దేశాన్ని నిర్మిస్తామని దేశ హోంమంత్రి ప్రతినబూనారు. మరో వైపు, 2024 లోక్‌సభ ఎన్నికల్లో వామపక్షాలకు పడిన ఓట్లు 3 శాతం కూడలేవు. మొత్తం 543 సీట్లలో మూడు కమ్యూనిస్టు పార్టీలకు కలిపి 6 సీట్లు మాత్రమే వచ్చాయి. రెండు పంథాల్లోనూ కమ్యూనిస్టు పార్టీలకు ఇది సంక్షోభ సమయం.

స్నేహహస్తాన్ని అందించే మిత్రులుంటే కష్టాలు సంక్షోభాలను అధిగమించడం పెద్ద కష్టం ఏమీకాదు. ఇప్పుడు కమ్యూనిస్టుల మిత్రులు ఎవరు? అన్నది ప్రధాన ప్రశ్న. దేశంలో అనేకానేక ప్రజాసమూహాలు కష్టాల్లో ఉన్నాయి. వాటిల్లో ఆదివాసులు, ముస్లింలు అత్యధిక అణిచివేతను అనుభవిస్తున్నాయి. ఆరెస్సెస్ సిద్ధాంతవేత్త గురూజీ ఎంఎస్ గోల్వాల్కర్ 1968లో ప్రచురించిన 'బంచ్ ఆఫ్ థాట్స్' గ్రంథంలో 'హిందూరాష్ట్ర'కు ముస్లింలు, కమ్యూనిస్టులు, క్రైస్తవులు అంతర్గత శత్రువులని ప్రకటించారు. 2014లో ఢిల్లీలో జరిగిన వరల్డ్ హిందూ కాంగ్రెస్-మార్క్సిజం, మెకాలేయిజం, మిషనరీస్, మెటీరియలిజం, ముస్లిం ఎక్స్ట్రీమిజం –లను హానికరమైన ఐదు (malicious–5)గా ప్రకటించింది. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోభాల్ 2014 ఫిబ్రవరిలో తంజావూర్‌లోని శాస్త్ర యూనివర్శిటీలో ఓ స్మారక ప్రసంగం చేస్తూ 'నాలుగు యుద్ధ రంగాలు' అనే సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు: "సరిహద్దుల్లో శత్రుదేశాలతో, దేశంలో ఉగ్రవాదులతో, తీవ్రవాదులతో పోరాడడమే గాకుండా దేశ శ్రేయస్సు కోసం పౌరసమాజం మీద కూడ యుద్ధం చేయాల్సి ఉంటుంది" అని వారు సిద్ధాంతీకరించారు.

ఒక చారిత్రక సందర్భంలో కమ్యూనిస్టుల నుంచి దూరం జరిగిన ఫూలే-అంబేడ్కరిస్టుల్లో ఇప్పుడు ఒక స్పష్టమైన చీలిక కనిపిస్తున్నది. ఒక సమూహం బీజేపీతో కలిసి నడుస్తున్నది. అది నచ్చని సమూహం కూడ ఒకటున్నది. అది కమ్యూనిస్టులు తమకు – బీజేపీ కన్నా మెరుగయిన మిత్రులు అనుకుంటున్నది. వీటన్నింటినీ క్రోడీకరించుకుంటే కమ్యూనిస్టు పార్టీలతో కలిసి పనిచేయడానికి ఒక మహాసముద్రం సిద్ధంగా ఉందని అర్థం అవుతుంది. ఆ దిశగా అడుగులు వేస్తే మరోసారి ఉజ్వల చరిత్రను సృష్టించడం కమ్యూనిస్టులకు అసాధ్యమేమీ కాదు.

■ డానీ
సామాజిక విశ్లేషకులు

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : మంగళవారం
సా.. 6.29 గం॥
సహర్ : బుధవారం
ఉ..5.10 గం॥



కమిషనరేట్‌లో.. కావాలి కొత్త ఠాణాలు

వరంగల్ క్రైం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : పట్టణాలు విస్తరిస్తుండటం.. కాలనీలు, జనాభా పెరుగుతుండటంతో పాటు వాహనాల సంఖ్య రెట్టింపుతుండటం, హైదరాబాద్ తర్వాత రెండో రాజధానిగా పేరున్న వరంగల్‌కు భారీ షాపింగ్ మాల్స్, ఐటీ పరిశ్రమలు రావడం లాంటివి మరింత పటిష్ట పోలీసు పర్యవేక్షణ అవసరమన్నది స్పష్టం చేస్తున్నాయి. ఇక మామునూర్ ఎయిర్‌పోర్టుకు కూడా కేంద్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడం.. ఆ పనులు పూర్తయితే రానున్న రోజుల్లో వివిధ ప్రాంతాల నుంచి రాకపోకలు పెరిగి రద్దీ రెట్టింపు కానుంది. నగరం వెలుపల ఉన్న రింగ్‌రోడ్డుతో పాటు పలు జాతీయ రహదారులు వరంగల్ పోలీస్ కమిషనరేట్ మీదుగా వెళ్తున్న నేపథ్యంలో ట్రాఫిక్ పోలీసుల సేవలు కూడా ఇంకా అవసరమవుతాయన్న అభిప్రాయాలున్నాయి. ఈ నేపథ్యంలో వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లోని మూడు జోన్లయిన.. హనుమకొండ, వరంగల్, జనగామల్లో పోలీస్టేషన్ల సంఖ్య పెంచాల్సిన అవసరం అనివార్యంగా మారింది. ఈ క్రమంలోనే ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా కొత్తపోలీస్‌స్టేషన్లను ఏర్పాటు చేసే యోచనలో ఉండగా వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు లా అండ్ ఆర్డర్ పోలీస్‌స్టేషన్లు, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లు మొత్తం కలిపి సుమారు 11వరకు అదనంగా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. అయితే ప్రస్తుతం చాలా ప్రాంతాల్లో పోలీసింగ్ నిర్వహణలో సమస్యలు తలెత్తుతున్నాయని, ఠాణాల పరిధులు ఎక్కువగా ఉండటంతో అటు శాంతి భద్రతలపరిరక్షణ, ఇటు ట్రాఫిక్ పర్యవేక్షణ కష్టతరవుతోందన్న వాదనలు వినిపిస్తున్నాయి.

గ్రేటర్‌కు మూడు లా అండ్ ఆర్డర్ ఠాణాలు అవసరం

వరంగల్ గ్రేటర్ పరిధిలో ఇప్పుడున్న పోలీస్‌స్టేషన్లకు అదనంగా మూడు లా అండ్ ఆర్డర్ పోలీస్‌స్టేషన్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. హనుమకొండ డివిజలోని సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధి చాలా విస్తరించి ఉంది. అంబేద్కర్ విగ్రహం నుంచి సుబేదారిలోని ఫారెస్టు ఆఫీసు తర్వాత వచ్చే పెట్రోల్ పంపు వరకు వస్తోంది. హంటర్‌రోడ్డులో ఖమ్మం ఫ్లైఓవర్ వరకు ఎన్జీవోస్‌కాలనీ రోడ్డులో వడ్డెపల్లి చర్చి వరకు అటు రిజిస్ట్రేషన్ ఆఫీస్ వరకు సుబేదారి పరిధిలోకి వస్తోంది. 20 ఏళ్లుగా సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలో కొత్తగా రెండు పోలీస్‌స్టేషన్లు ఏర్పాటు చేసి న్యూశాయంపేటలో ఒకటి, వడ్డెపల్లి చర్చి దగ్గర ఒకటి నిర్మించాలని అనుకున్నా ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదు. ఈ రెండు పోలీస్‌స్టేషన్ల ఏర్పాటుతో కేయూసీ, మట్టెవాడ పోలీస్‌స్టేషన్ పరిదిలోని కొన్ని ప్రాంతాలను కొత్త పోలీస్టేషన్లలో

మిగతా 6వ పేజీలో...

- పట్టణాలు, కాలనీల విస్తరణతో పోలీస్ పర్యవేక్షణలో సమస్యలు
- రోజురోజుకు పెరుగుతున్న వాహనాల సంఖ్య
- రద్దీకి తగినట్టుగా లేని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లు
- కొత్త ట్రాఫిక్ స్టేషన్ల ఏర్పాటూ అనివార్యమే
- జనగాం, పరకాల, నర్సంపేటతో పాటు గ్రేటర్‌లో వాటి అవసరం
- హసన్‌పర్తి సబ్‌డివిజన్‌తో గ్రామీణులకు చేరువగా ఏసీపీ కార్యాలయ సేవలు



జనగామకు మరో మూడు స్టేషన్లు...

జనగామను జిల్లా కేంద్రంగా మార్చడం, నగరం విస్తరిచడం హైదరాబాద్ రూట్‌లో ఉన్నందున వాహనాల రద్దీ విపరీతంగా పెరిగింది. ఈ క్రమంలో ఇక్కడ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ అనివార్యం కానుంది. అదే విధంగా పట్టణానికి అంతా కలిపి ఒకటే పోలీస్‌స్టేషన్ ఉండటంతో నేరాలను నిలువరించడం, ప్రజలకు అందుబాటులో ఉండటం ఇబ్బందిగానే ఉన్నట్లు తెలుస్తోంది. హైద్రాబాద్ టూ వరంగల్ రహదారికి మధ్యలో ఉండటంతో వీఐపీలకు ఎస్కార్ట్ కల్పించడం, సెక్యూరిటీ తదితర విషయాల్లో సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ క్రమంలో మరో పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేసి జనగామ అర్బన్, రూరల్ పోలీస్‌స్టేషన్లుగా విభజించి పోలీసులు ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉందని జనగామ ప్రజలు కోరుతున్నారు. ఇదే కాకుండా మహిళా పోలీస్‌స్టేషన్ కూడా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. మహిళలు తమ ఫిర్యాదులు ఇవ్వడానికి సుబేదారి పోలీస్‌స్టేషన్ ఆవరణంలో ఉన్న మహిళా పోలీస్‌స్టేషన్‌కు రావాల్సిన పరిస్థితి ఉంది. మహిళా పోలీస్‌స్టేషన్ అక్కడే ఉంటే ఇక్కడి వరకు ఇబ్బందులుపడుతూ రావాల్సిన అవసరం ఉండదు.

హసన్‌పర్తి సబ్‌డివిజన్ చేస్తే..

కాజీపేట పోలీస్ సబ్‌డివిజన్ పరిధిలో తొమ్మిది పోలీస్‌స్టేషన్లున్నాయి. కరీంనగర్ సరిహద్దు నుంచి మొదలుపెడితే ఇటు జనగామ జిల్లా వరకు విస్తరించి ఉంది. ప్రస్తుతం కాజీపేట సబ్‌డివిజన్‌లో కాజీపేట, మడికొండ, ధర్మసాగర్, వేలేరు, హసన్‌పర్తి, ఎల్కతుర్తి, భీమదేవరపల్లి, వంగర, కమలాపూర్ పోలీస్టేషన్‌లున్నాయి. కాజీపేట సబ్‌డివిజన్‌లో కొత్తగా హసన్‌పర్తి కేంద్రంగా సబ్‌డివిజన్ ఏర్పాటు చేసి దీంట్లో హసన్‌పర్తి, ఎల్కతుర్తి, వంగర, భీమదేవరపల్లి, కమలాపూర్ పోలీస్టేషన్లు ఏర్పాటు చేస్తే పటిష్ఠ పోలీసింగ్‌కు అవకాశం ఉంటుందన్న అభిప్రాయాలున్నాయి. ఆయా ప్రాంతాల ప్రజలకు కూడా దూరం తగ్గుతుంది. కాగా, మామునూర్ సబ్‌డివిజన్ పరిధిలోని ఎనుమాముల పోలీస్‌స్టేషన్‌ను వరంగల్ సబ్‌డివిజన్‌లో కలిపితే ప్రజలకు, అధికారులకు అందుబాటులో ఉంటుంది. ఆసియాలోని అతిపెద్ద మార్కెట్, నిత్యం రైతులతో ఉండే మార్కెట్‌లో ఏరియాలో పోలీస్‌స్టేషన్‌ను అయితే స్థాపించారు కానీ గెజిట్ రాలేదని గెజిట్ తీసుకొచ్చి శాశ్వత పోలీస్‌స్టేషన్‌గా తీర్చిదిద్దాలని స్థానికులు, వ్యాపారులు కోరుతున్నారు. అదే విధంగా పోలీస్ స్టేషన్ ఒక జోన్‌లో ఉండటం, జిల్లా వచ్చేసరికి వేరే కావడం, ఒక మండలంలోని గ్రామాలు మరో మండలంలోని పోలీస్‌స్టేషన్ పరిధిలోకి రావడం లాంటి సమస్యలు అక్కడక్కడ ఉన్నాయి వాటిన్నింటిపై పోలీస్ కమిషనర్ దృష్టి సారించి పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

శ్రీపాల్‌రెడ్డిదే విజయం

వరంగల్, నల్లగొండ, ఖమ్మం టీచర్స్ ఎమ్మెల్సీగా ఎన్నిక

- హోరాహోరీ పోరులో గెలిచిన పీఆర్‌టీయూ అభ్యర్థి పింగిళి
- అతి పెద్ద సంఘం కావడం కలిసొచ్చింది..



ఓట్లు లెక్కిస్తున్న సిబ్బంది, విజయం సాధించిన శ్రీపాల్‌రెడ్డి

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): హోరాహోరీగా సాగిన వరంగల్, నల్లగొండ, ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ (పీఆర్టీయూ) అభ్యర్థిగా బరిలో దిగిన పింగిళి శ్రీపాల్‌రెడ్డి విజయం సాధించారు. నల్లగొండ జిల్లా కేంద్రం ఆర్జాల బావిలోని ఓట్ల లెక్కింపు కేంద్రంలో స్టేట్ వేర్ హౌజ్ గోదాంలో సోమవారం ఉదయం 8గంటలకు ప్రారంభమైన ఓట్ల లెక్కింపు ప్రక్రియ 20రౌండ్లలో కొనసాగింది. ప్రతీ రౌండ్‌లో శ్రీపాల్‌రెడ్డిదే ఆధిపత్యం కొనసాగింది. అయితే ఎలిమినేషన్ ప్రక్రియలో భాగంగా చివరకు శ్రీపాల్‌రెడ్డి ఆధిక్యం సాధించారు. పూర్తి స్థాయిలో గెలుపు కోటా ఓట్లు రాకపోయినా ఆధిక్యత ప్రామాణికంగా శ్రీపాల్‌రెడ్డిని విజేతగా ప్రకటించారు. సిట్టింగ్ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, యూటీఎఫ్ నుంచి బరిలో నిలిచిన అలుగుబెల్లి నర్సిరెడ్డి రెండో స్థానంలో నిలిచారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొత్తం 19మంది పోటీ చేసినా ఆది నుంచి అయిదుగురు మధ్యే పోటీ ఉంటుందనేది ఉపాధ్యాయ వర్గాల చర్చ. ఓట్ల లెక్కింపులో కూడా అదే రుజువైంది. అయితే ఒక్కొక్కరుగా ఎలిమినేట్ కాగా శ్రీపాల్‌రెడ్డి విజయాన్ని అందుకున్నారు.

ఆది నుంచి ఆధిక్యమే...

ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం నుంచి శ్రీపాల్‌రెడ్డి ఆధిపత్యం కొనసాగుతూ వచ్చింది. మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో శ్రీపాల్ రెడ్డికే ఎక్కువ ఓట్లు పోలయ్యాయి. మొదటి రౌండ్ మొదలు చివరి రౌండ్ వరకు శ్రీపాల్‌రెడ్డిదే ఆధిపత్యం కొనసాగింది. అయితే రౌండ్ల లెక్కింపు కొనసాగుతున్న క్రమంలో ఎలిమినేషన్ ప్రక్రియ ప్రారంభం అయ్యింది. మొదటి ప్రాధాన్యత, రెండవ ప్రాధాన్యత ఓట్లు లెక్కింపు పూర్తయినప్పటికీ పూర్తి స్థాయిలో గెలుపు కోటా ఓట్లు రాకపోయినా

మిగతా 6వ పేజీలో...

చివరి ఆయకట్టుకూ నీరందేలా చర్యలు

రాష్ట్ర ముఖ్య కార్యదర్శి శాంతికుమారి




వరంగల్ కలెక్టరేట్ నుంచి కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్

హనుమకొండ కలెక్టరేట్/వరంగల్ కలెక్టరేట్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : చివరి ఆయకట్టు వరకు రైతులకు సాగునీరు అందేలా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముఖ్య కార్యదర్శి శాంతికుమారి అన్నారు. యాసంగి సాగునీటి సరఫరా, నీటిపారుదల శాఖ పనితీరుపై జిల్లాల కలెక్టర్‌లతో సోమవారం వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా శాంతికుమారి మాట్లాడుతూ రాబోయే 10రోజుల పాటు అధికారులు అప్రమత్తంగా ఉంటూ నీటిసరఫరాపై పర్యవేక్షించాలన్నారు. ఎత్తిపోతల పథకాలకు, వ్యవసాయానికి విద్యుత్ సరఫరా లోటు రాకుండా చర్యలు తీసుకోవాలని, రిజర్వాయర్‌ల నుంచి విడుదల చేసే నీటిని సమర్థవంతంగా వినియోగించాలన్నారు. రాష్ట్రంలో ఉన్న గురుకులాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో కలెక్టర్లు, అదనపు కలెక్టర్ల తనిఖీ తర్వాత పరిస్థితులలో మార్పులు వచ్చాయని, పిల్లలకు అందించే ఆహార నాణ్యత పెరిగిందని, కామన్ మెనూ డైట్ పక్కాగా అమలు అవుతుందన్నారు. ఈ వీడియోకాన్ఫరెన్స్‌లో హనుమకొండ కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, వరంగల్ కలెక్టరేట్ నుంచి కలెక్టర్ సత్యశారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి ఇతర అధికారులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఇంటర్ పరీక్షలు

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికార యంత్రాంగం
- వరంగల్‌లో పరీక్ష రాయనున్న 12,321, హనుమకొండ జిల్లాలో 39,980 మంది విద్యార్థులు
- 'నిమిషం' ఎత్తివేత.. అమల్లోకి ఐదు నిమిషాల నిబంధన



వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. పరీక్షలకు వరంగల్ జిల్లా నుంచి 12,321 మంది, హనుమకొండ జిల్లా వ్యాప్తంగా 39,980 మంది ఇంటర్ ఫస్ట్, సెకెండ్ ఇయర్ విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. ఈ నెల 5న ప్రారంభమవుతున్న పరీక్షలు 25తో ముగియనున్నాయి. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లాల ఇంటర్మీడియెట్ విద్యాశాఖలు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాయి. ఇప్పటికే సంబంధిత అన్ని శాఖలతో కలెక్టర్లు డాక్టర్ సత్యశారద, పి. ప్రావీణ్యలు సమన్వయ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటర్ విద్యాశాఖలకు దిశా నిర్దేశం చేశారు. పరీక్షల్లో ఎలాంటి పొరపాట్లు దొర్లకుండా పారదర్శకంగా నిర్వహించాలని వారు అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. వరంగల్‌లో 68, హనుమకొండలో 124 జూనియర్ కళాశాలల నుంచి విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. ఇందు కోసం వరంగల్ జిల్లాలో 26, హనుమకొండ జిల్లాలో 55 పరీక్ష కేంద్రాలను అన్ని వసతులతో ఏర్పాటు చేశారు. ప్రతీ పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. కాగా, ఈ ఏడాది ఒక్క నిమిషం ఆలస్యాన్ని ఎత్తివేస్తున్నట్లు ఇంటర్ బోర్డు ప్రకటించింది. పరీక్ష సమయానికి 5 నిమిషాలు ఆలస్యంగా వచ్చినా పరీక్షకు అనుమతించనున్నట్లు బోర్డు కార్యదర్శి ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

ఎయిర్‌పోర్ట్‌తో వరంగల్ దశ మారనుంది

- సీఎం జీఎంఆర్ సంస్థను ఒప్పించి ఎన్‌వోసీ తెచ్చారు
- వరంగల్ అభివృద్ధికి రూ.6వేల కోట్లు మంజూరు చేశారు
- బీఆర్ఎస్ నాయకులు పదేళ్లలో ఎయిర్‌పోర్ట్‌ను విస్మరించారు
- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, ఎంపీ కడియం కావ్య

6



రాజస్థాన్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న మేయర్, కమిషనర్

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మంచి ర్యాంకు వచ్చేలా కృషి

- ఆర్ఆర్ఆర్ సదస్సులో వెల్లడించిన మేయర్, కమిషనర్
- నాలుగు రోజుల పాటు రాజస్థాన్‌లో పర్యటన

వరంగల్ కార్పొరేషన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛ సర్వేక్షణలో వరంగల్‌కు మంచి ర్యాంకు వచ్చే విధంగా కృషి చేస్తున్నామని మేయర్, కమిషనర్ వెల్లడించారు. రాజస్థాన్ రాష్ట్రం జైపూర్‌లో కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ హౌజింగ్ ఎఫైర్స్, పట్టణాభివృద్ధి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు జరుగుతున్న ఆర్ఆర్ఆర్ సదస్సులో వరంగల్ బల్దియా నుంచి మేయర్ గుండు సుధారాణి, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో పాటు సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్ర గృహ నిర్మాణ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ కట్టర్ పాల్గొని మాట్లాడారు. సీటీస్ 2.0 స్టేట్ లెవల్ క్లైమెట్ యాక్షన్ ప్లాన్‌లో వరంగల్‌కు గుర్తింపు రావడం వల్ల బల్దియా నుంచి అధికారులకు పాల్గొనే అవకాశం లభించింది. ఈ సదస్సులో మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో పాటు హైదరాబాద్ సీడీఎంఏ డాక్టర్ శ్రీదేవి, బల్దియా సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి హాజరయ్యారు. వరంగల్ నగరంలో చేపడుతున్న పలు అబివృద్ధి పనులపై ప్రసంగించారు. కాగా, వరంగల్ కార్పొరేషన్ పరిధిలో అమలవుతున్న వివిధ అబివృద్ధి పనులు, చెత్త శుద్దీకరణ, పచ్చదనం, బయోమైనింగ్, బయో మిథనైజేషన్ ప్లాంట్లు, స్వచ్ఛ వరంగల్ కార్యక్రమాలపై కమిషనర్ పవర్‌పాయింట్ ప్రజంటేషన్ చేశారు.

కలెక్టరేట్‌లోకి డీఎంహెచ్‌వో కార్యాలయం

వరంగల్ మెడికల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ సమీకృత కలెక్టరేట్‌లోని రెండవ అంతస్తులో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య సోమవారం ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. డీఎంహెచ్‌వో కార్యాలయం కలెక్టరేట్ ప్రాంగణంలో ఉండటం వల్ల అందరికి అనుకూలంగా ఉంటుందన్నారు. డీఎంహెచ్‌వో నాయకత్వంలో ప్రోగ్రాం అధికారులు, సిబ్బంది అందరూ సమష్టిగా పని చేస్తూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ ఎ.అప్పయ్య, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయ్ కుమార్, అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ టి.మదన్ మోహన్‌రావు, పీవోడీటీ డాక్టర్ కె.లలితాదేవి, జిల్లా టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ హిమబిందు, డాక్టర్ అహ్మద్, కె.రాజేష్ కుమార్, వి.అశోక్‌రెడ్డి, ప్రసన్న కుమార్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలి

- అధికారులను ఆదేశించిన బల్దియా అసిస్టెంట్ కమిషనర్ జోనా
- ప్రజావాణికి వినతుల వెల్లువ
- 63 దరఖాస్తులు స్వీకరించిన అధికారులు



ఏసీకి ఫిర్యాదులు అందిస్తున్న ఫిర్యాదుదారులు

వరంగల్ కార్పొరేషన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : నగర ప్రజలకు అందించాల్సిన మౌలిక సదుపాయాలపై అధికారులు చొరవ చూపాలని అసిస్టెంట్ కమిషనర్ జోనా అధికారులను ఆదేశించారు. కమిషనర్ రాజస్థాన్‌లో జరుగుతున్న ఆర్ఆర్ఆర్ సదస్సులో ఉండడం వల్ల బల్దియా కౌన్సిల్ హాల్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ జోనా ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగిన గ్రీవెన్స్‌లో 63 ఫిర్యాదులు స్వీకరించినట్టు అదనపు కమిషనర్ వెల్లడించారు. వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలో పని చేస్తున్న శానిటేషన్ కార్మికులకు ఇటీవల పెంచిన అదనపు వేతనంతో కలిపి ఇస్తున్నట్టు బల్దియా ఇంజనీరింగ్ విభాగం నీటి సరఫరా చేసే కార్మికులకు ఇవ్వాలని కార్మికులు అధికారులను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, డిప్యూటి కమిషనర్లు ప్రసన్నరాణి, రాజేశ్వర్, డీఎఫ్‌వో శంకర్‌లింగం, హెచ్‌వోలు రమేష్, లక్ష్మారెడ్డి, ఇంచార్జీ సీపీ రవీంద్ర రాడేకర్, పన్నుల అధికారి వై. రామకృష్ణ, పాటు వివిధ విభాగాల వింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అధికారులు స్వీకరించిన ఫిర్యాదులు ఇలా ఉన్నాయి. ఇంజనీరింగ్ - 13, హెల్త్, శానిటేషన్ - 6, ప్రాపర్టీ ట్యాక్స్, రెవెన్యూ - 8, టౌన్‌ప్లానింగ్ - 31, తాగునీటి సరఫరా - 4, హార్టికల్చర్ - 1 ఇలా మొత్తం 63 దరఖాస్తులు వచ్చినట్టు తెలిపారు.

- బల్దియా పరిధిలోని ఫిల్టర్‌బెడ్లు, వాటర్ ట్యాంకులు, పైప్‌లైన్‌లపై పని చేస్తున్న కార్మికులకు ప్రభుత్వం పెంచిన వెయ్యి రూపాయల అలవెన్స్‌ను జీతంతో పాటు కలిపి ఇవ్వాలని జాక్ నాయకులకు ఏసీకి ఫిర్యాదు చేశారు.
- గ్రేటర్ వరంగల్ 9వ డివిజన్ కాకతీయ కాలనీలో కొందరు వ్యక్తులు రోడ్డును ఆక్రమించి ఇండ్లు నిర్మించడం వల్ల ఇండలో నుంచి వస్తున్న మురుగు నీరు రోడ్లపై నిలుస్తుందని కాలనీవాసులు ఫిర్యాదు చేశారు.
- హనుమకొండ 54వ డివిజన్ హనుమాన్‌నగర్ మెయిన్ రోడ్డు ఫేజ్ -4 కిందికొండ కాలనీలో గత 20 రోజులుగా వీది లైట్లు వెలుగుతూనే ఉన్నాయి. దీనిపై సంబంధిత లైన్‌మెన్‌కు ఫోన్ చేస్తే సెన్సార్ పోయిందని, కాంట్రాక్ట్ కార్మికులకు జీతాలు ఇవ్వకపోవడం వల్లనే రావడం లేదని చెప్పుకొస్తున్నారని అభివృద్ధి కమిటీ నాయకులు ఏసీకి ఫిర్యాదు చేశారు.
- కాజీపేట ఎన్ఐటీ సమీపంలోని దేవినగర కాలనీలో ఉంటున్న తమకు చాలా రోజులుగా మంచి నీటి సరఫరా కావడం లేదని కాలనీవాసులు ఫిర్యాదు చేశారు.
- గ్రేటర్ వరంగల్ 55వ డివిజన్ భద్రకాళి నగర్‌లో రోడ్డు పక్కన వ్యవసాయ భూమిలో నిరుపయోగంగా బావి ఉంది. ఈ బావిలో రాత్రి సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయని కాలనీవాసులు ఫిర్యాదు చేశారు.



గూడూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు వివరాలను వెల్లడిస్తున్న సీఐ సూర్యప్రకాష్

5.440 కిలోల ఎండుగంజాయి పట్టివేత

గూడూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : గూడూరు నుంచి మహబూబాబాద్‌కు తరలిస్తున్న 5.440 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు గూడూరు సీఐ సూర్యప్రకాష్, ఎస్సై గిరిధర్‌రెడ్డిలు సోమవారం తెలిపారు. ఈ నెల 2న గూడూరు నుంచి మహబూబాబాద్ గంజాయి తరలిస్తున్నారన్న పక్కా సమాచారంతో మచ్చర్ల వద్ద వాహనాల తనిఖీ చేపట్టినట్లు చెప్పారు. అటుగా ద్విచక్రవాహనంపై వస్తున్న గూడూరుకు చెందిన మేడ సుజిత్, గూడూరు మండలం పొనుగోడు శివారు టేకుల తండా కు చెందిన భూక్య మనేష్‌లను పోలీసులు ఆపి తనిఖీ చేయగా వారి వద్ద 5.440 కిలోల ఎండుగంజాయి ఉన్నట్లు గుర్తించి దానితో పాటు రవాణాకు ఉపయోగించిన ద్విచక్రవాహనం, రెండు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. సుమారు దీని విలువ రూ.2.72 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే దురుద్దేశ్యంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని సీలేరు నుంచి తక్కువ ధరకు గంజాయిని తీసుకువచ్చి మహబూబాబాద్ ప్రాంతంలో ఎక్కువ ధరకు విక్రయించేందుకు తీసుకువెళ్తున్నట్లు చెప్పారు. ఇరువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో ఏఎస్సైబిచ్యానాయక్, సిబ్బంది రాజేష్, ప్రణీత్, అమ్రు, సుధాకర్ పాల్గొన్నారు.

డిప్లొమా కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

జనగామ రూరల్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): టెక్స్‌టైల్ టెక్నాలజీ డిప్లొమా కోర్సుకు దరఖాస్తులను ఆహ్వానిస్తునట్లు చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకులు పి.చౌడేశ్వరీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ హైదరాబాద్ 2025-26 సంవత్సరానికి చేనేత టెక్స్‌టైల్ టెక్నాలజీ డిప్లొమా మూడు సంవత్సరాల కోర్సుకు 60సీట్లు కేటాయించడం జరిగిందన్నారు. అర్హులు ఏప్రిల్ మొదటి వారంలోగా హైదరాబాద్ పోట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీలో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. ఇతర వివరాలకు 90300 79242ను సంప్రదించగలరని తెలిపారు.

ఆస్కార్ సాధించిన బృందంలో అమినాపురం వాసి

'డూన్' చిత్రం వీఎఫ్‌ఎక్స్ టీంలో పనిచేసిన సుమంత్‌రెడ్డి



సుమంత్‌రెడ్డి

కేసముద్రం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన ఆస్కార్ అవార్డు పొందిన బృందంలో మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మునిసిపాలిటీ అమినాపురం వాసి ఎడ్ల సుమంత్‌రెడ్డి ఉండడం విశేషం. అమెరికా లాస్‌ఏంజెల్స్‌లో ఆదివారం రాత్రి నిర్వహించిన వేడుకల్లో ఉత్తమ విజువల్ ఎఫెక్ట్ విభాగంలో 'డూన్ పార్ట్ 2' చిత్రం అస్కార్ అవార్డును దక్కించుకుంది. అయితే ఈ చిత్రానికి ముంబై కేంద్రంగా 'డినెగ్ అనే సంస్థ విజువల్ ఎఫెక్ట్స్‌ను అందించగా ఆ విజువల్ ఎఫెక్ట్ బృందంలో అమినాపురానికి చెందిన సుమంత్‌రెడ్డి కూడా పనిచేశారు. సుమంత్‌రెడ్డి హైదరాబాద్ జేఎన్‌టీయూలో బ్యాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ పూర్తి చేసి 2021లో ఈ చిత్రం కోసం సంస్థలో మోడలింగ్ టెక్నికల్ డైరెక్టర్‌గా పనిచేశారు. వర్క్‌ఫ్రం హోం విధానంలో అమినాపురంలోని ఇంటి నుంచే పనిచేసిన తాను ఈ సినిమాలో బటిస్టా, హర్కొనెన్ సహా ఆరు క్యారెక్టర్లను డిజైన్ చేసినట్లు సుమంత్‌రెడ్డి తెలిపారు. ప్రసిద్ధ హాలీవుడ్ సినిమాలు 'ఫాస్ట్ ఎక్స్, ఫెరిస్సా, బోర్డర్‌ల్యాండ్' చిత్రాలకు కూడా పనిచేశానని, ప్రపంచస్థాయి అవార్డులో భాగస్వామ్యమైన సుమంత్‌రెడ్డిని ఈ సందర్భంగా పలువురు అభినందించారు.

ఎయిర్‌పోర్ట్‌తో వరంగల్ దశ మారనుంది

- సీఎం జీఎంఆర్ సంస్థను ఒప్పించి ఎన్‌వోసీ తెచ్చారు
- వరంగల్ అభివృద్ధికి రూ. 6వేల కోట్లు మంజూరు చేసిన రేవంత్‌రెడ్డి
- బీఆర్‌ఎస్ నాయకులు పదేళ్లలో ఎయిర్‌పోర్ట్‌ను విస్మరించారు
- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, ఎంపీ కడియం కావ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు, రేవూరి ప్రకాష్‌రెడ్డి, కేఆర్ నాగరాజు

హనుమకొండటౌన్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): మామునూరు ఎయిర్‌పోర్ట్ నిర్మాణంతో వరంగల్ దశ మారనుందని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాష్‌రెడ్డి, కేఆర్ నాగరాజు అన్నారు. సోమవారం హనుమకొండ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మామునూరు ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమకొండ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. 32 ఏళ్ల కిందట మూతపడిన మామునూరు విమానాశ్రయానికి మళ్లీ రెక్కలు రానున్నాయని ఇప్పటికే 696 ఎకరాల భూమి ఉందని, అదనంగా 253 ఎకరాల భూసేకరణ కోసం రైతులతో ఎమ్మెల్యేలు మాట్లాడుతున్నట్లు తెలిపారు. పదేళ్ల అధికారంలో ఉన్నా బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు మామునూరు ఎయిర్‌పోర్ట్ తీసుకురాలేదన్నారు. ఒక్క ఎకరం భూమి సేకరించలేదని, బీఆర్‌ఎస్ నాయకులు రైతులకు ఎకరానికి నాలుగు కోట్లు ఇవ్వాలంటున్నారని, రైతులకు ఎంత ఇవ్వాలో మీ వద్ద నేర్చుకోవాల్సిన అవసరం లేదన్నారు. బీఆర్‌ఎస్ పదేళ్లలో ఉన్న సెంట్రల్ జైలును కూలగొట్టి కమీషన్ల కోసమే 24 అంతస్తుల భవనంలో ఆసుపత్రి పనులు 20శాతం పూర్తి చేసినట్లు విమర్శించారు. బీఆర్‌ఎస్ నేతలు చేసిన అక్రమాలకు ఒక సపరేట్ జైలును పెట్టాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరుతామన్నారు. హైదరాబాద్‌కు దీటుగా వరంగల్‌ను అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఇప్పటికే 190 ఎకరాల భూసేకరణ పూర్తయిందన్నారు.

వరంగల్ ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి కృషి వల్లే మామునూరు ఎయిర్‌పోర్ట్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఒక్క ఎన్‌వోసీకూడా తీసుకురాలేదని విమర్శించారు. భూసేకరణకు ప్రభుత్వం రూ.205 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఇప్పటికే వరంగల్ అభివృద్ధి కోసం రూ. 6వేల కోట్లతో అనేక అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు ఎంపీ తెలిపారు. ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలుచేస్తూ ప్రజా పాలనలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు.

పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ.. 2014లో వరంగల్ కు వచ్చిన కేసీఆర్ వరంగల్ నగరాన్ని డల్లాస్ చేస్తానన్నారు. అది ఏమైందని కేసీఆర్‌ను ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి మామునూరు ఎయిర్‌పోర్ట్‌పై ఫోకస్ పెట్టడంవల్లే అనుమతులు వచ్చినట్లు తెలిపారు. ఆరు నెలల నుంచి మామునూర్‌లో భూసేకరణ ప్రారంభించినట్లు నేటి నుంచి సర్వే పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.

ఎయిర్‌పోర్ట్ భూసేకరణ కు సహకరిస్తున్న రైతులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల కోడ్ ఉన్నా లెక్క చేయకుండా బీజేపీ నాయకులు తామే సాధించామని ఎయిర్‌పోర్ట్ ప్రదేశంలో నానా హంగామచేశారని. వారిపై పోలీస్‌లు కేసు లు నమోదు చేయాలని కోరుతామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, కూడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, మాజీ మేయ ర్ ఎర్రబెల్లి స్వర్ణ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీపాల్‌రెడ్డిదే విజయం



కౌంటింగ్ కేంద్రం వద్ద అభ్యర్థులు

(5వ పేజీ తరువాయి)

అధికృత ప్రామాణికంగా శ్రీపాల్‌రెడ్డిని విజేతగా ప్రకటించారు. సిట్టింగ్ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, యూటీఎఫ్ నుంచి బరిలో నిలిచిన అలుగుబెల్లి నర్సిరెడ్డి రెండో స్థానంలో నిలిచారు.

అతి పెద్ద సంఘమే కలిసి వచింది...

రాష్ట్రంలోని ఉపాధ్యాయ సంఘాల్లో పీఆర్టీయూ అతి పెద్ద సంఘంగా ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా 70వేలకు పైగానే ఉపాధ్యాయులు పీఆర్టీయూలో సభ్యత్వాలు కలిగి ఉన్నారు. నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో కూడా ఈ సంఘం బలంగానే ఉంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పీఆర్టీయూదే హవా కొనసాగుతోంది. దీంతో శ్రీపాల్‌రెడ్డి గెలుపు ఖాయమనే ధోరణిలోనే ఆ సంఘం నాయకులతో పాటు ఉపాధ్యాయ వర్గాలు ఉన్నాయి. ఎక్కువ సంఖ్యలో ఉపాధ్యాయులు సభ్యులుగా ఉన్న సంఘంగా పీఆర్టీయూ ఉండటం, ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా ఎమ్మెల్సీగా పోటీలో దిగడం అన్ని శ్రీపాల్‌రెడ్డికి కలిసి వస్తూనే ఉన్నాయి.

ఆది నుంచి పీఆర్టీయూ నుంచి బరిలో నిలిచిన ఎమ్మెల్సీలకు విజయాలే.. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో పూల రవీందర్ అపజయం తప్ప పీఆర్టీయూ అభ్యర్థులు ఎప్పుడూ విజేతలుగానే నిలిచిన చరిత్ర ఉంది. ధర్మారెడ్డి, బి. మోహన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, పూల రవీందర్, కాటేపల్లి జనార్ధన్‌రెడ్డి, కూర రఘోత్తంరెడ్డి పీఆర్టీయూ నుంచి విజయాలు సాధించగా ఇప్పుడు శ్రీపాల్‌రెడ్డి అదే సంఘం నుంచి ఎమ్మెల్సీ బరిలో నిలిచి జయకేతనం ఎగురవేశారు.

శ్రీపాల్ గురించి...

వరంగల్, నల్లగొండ, ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలుపొందిన పింగిళి శ్రీపాల్‌రెడ్డిది పూర్వ ఉమ్మడి వరంగల్ జిల్లా. ప్రస్తుత మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రానికి చెందిన పోస్ట్‌మ్యాన్ పింగిళి రాంరెడ్డి-సరస్వతి దంపతులకు 1973 జనవరి 20న జన్మించారు. ఒకటి నుంచి ఆరో తరగతి వరకు గూడూరులోని ప్రభుత్వ పాఠశాలలో, ఏడో తరగతి నుంచి 10వ తరగతి వరకు వరంగల్‌లోని మహబూబియా పంజేతన్ స్కూల్లో చదివారు. ఇంటర్, డిగ్రీ వరంగల్‌లోని సీకేఎం కళాశాలలో పూర్తి చేసిన అనంతరం హనుమకొండలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో టీటీసీ పూర్తి చేశారు. బీఈడీని ఇగ్నోలో, ఎమ్మెస్సీ ఫిజిక్స్‌ని దూర విద్యా విధానంలో పూర్తి చేశారు. 1996లో ఎస్టీటీగా ఎంపికై డిసెంబరు 12న నెక్కొండ మండలం గొల్లపెల్లి యూపీఎస్‌లో ఎస్టీటీ ఉపాధ్యాయుడిగా చేరారు. 2003 జూలైలో మ్యాథ్స్ స్కూల్ అసిస్టెంట్‌గా నెక్కొండ మండలంలోని అప్పల్‌రావుపేట యూపీఎస్‌కు ప్రమోషన్‌పై వచ్చారు. అక్కడ నుంచి బదిలీపై నెక్కొండ మండలం బొల్లికొండ యూపీఎస్‌కు వెళ్లారు. అక్కడ నుంచి గీసుగొండ మండలం శాయంపేట జడ్పీహెచ్‌ఎస్‌కు వచ్చారు. ఇక యూనియన్ విషయానికొస్తే 2000 సంవత్సరంలో పీఆర్టీయూ నెక్కొండ మండల ప్రధానకార్యదర్శిగా ఎన్నికయ్యారు. తర్వాత 2002 నుంచి 2008 వరకు అదే మండలానికి అధ్యక్షుడిగా పనిచేశారు. 2008 నుంచి 2012 వరకు వరంగల్ జిల్లా ప్రధానకార్యదర్శిగా పనిచేశారు. 2015లో వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. 2016 నుంచి 2017 వరకు వరంగల్ రూరల్ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగారు. ఫిబ్రవరి 2019 నుంచి పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

రౌండ్ల వారీగా లెక్కింపు ఇలా...

శ్రీపాల్‌రెడ్డి తొలి రౌండ్‌లో 6035 ఓట్లతో ముందంజలో ఉన్నారు. ఈ రౌండ్‌లో అలుగుబెల్లి నర్సిరెడ్డికి 4820 ఓట్లు వచ్చాయి. రెండు, మూడు, నాలుగో రౌండ్‌లోనూ అదే పరంపర కొనసాగింది. రెండో రౌండ్‌లో ఎలివినేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. రెండో రౌండ్‌లో ఒక్కరు, మూడో రౌండ్‌లో ఇద్దరు అభ్యర్థులు ఎలిమినేట్ అయ్యారు. శ్రీపాల్‌రెడ్డికి అయిదో రౌండ్‌లో 6035, ఆరవ రౌండ్‌లో 6042, 7వ రౌండ్‌లో 6045, 8వ రౌండ్‌లో 6047, 9వ రౌండ్‌లో 6048, 10, 11 రౌండ్లలో 6054, 12వ రౌండ్‌లో 6090, 13వ రౌండ్‌లో 6105, 14లో 6165, 15లో 6916, 16లో 7673, 17లో 9021, 18లో 11099, 19లో 13,969 ఓట్లు వచ్చాయి. 19వ రౌండ్ ఓట్ల లెక్కింపు ముగిసే సరికి పోటీలో ఉన్న 18 మంది అభ్యర్థులు ఎలిమినేట్ అయ్యారు. దీంతో శ్రీపాల్‌రెడ్డిని అధికారికంగా విజేతగా ప్రకటించారు.

నేడు అకూట్ ఎన్నికలు

- ఉదయం 10 నుంచి 2 గంటల వరకు
- రెండు ప్యానళ్ల మధ్య హోరాహోరీ పోటీ
- విస్తృతంగా ప్రచారం



సమావేశంలో మాట్లాడుతున్న అకూట్ అధ్యక్షకార్యదర్శి అభ్యర్థులు ప్రొఫెసర్ వెంకట్రామిరెడ్డి, ఎల్‌పీ రాజ్‌కుమార్

కేయూ క్యాంపస్ మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : అసోసియేషన్ ఆఫ్ కాకతీయ యూనివర్సిటీ టీచర్స్ (అకూట్)ఎన్నికలు మంగళవారం జరుగనున్నాయి. గతంలో కంటే ఈ దఫా అకూట్ ఎన్నికల పోటీ వర్సిటీలో రసావత్తరంగా మారింది. నువ్వా నేనా అన్నట్లు అకూట్ ఎన్నికల పోటీ హోరాహోరీగా సాగుతోంది. అకూట్ అధ్యక్షకార్యదర్శుల పదవులకు ఫిజిక్స్ సీనియర్ ప్రొఫెసర్ బైరు వెంకట్రామిరెడ్డి, మ్యాథ్స్ అసోసియేట్ ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్‌ల ప్యానల్‌తో పాటు జియాలజీ ప్రొఫెసర్ రాగి మల్లికార్జున్‌రెడ్డి, బయోటెక్నాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పోడేటి శ్రీనివాస్ ప్యానళ్ళు పోటీ పడుతున్నాయి. వర్సిటీలో పేరొందిన ప్రొఫెసర్లు రెండు ప్యానళ్ళ అధ్యక్షకార్యదర్శుల పదవులకు పోటీకి దిగారు. దీంతో వర్సిటీలో అకూట్ ఎన్నికల్లో ద్విముఖ పోటీ నెలకుంది. మిగతా పదవులన్ని ఏకగ్రీవం అయ్యాయి. కాగా, అధ్యక్ష, కార్యదర్శుల అభ్యర్థులు గత నాలుగు రోజులనుంచి వర్సిటీ క్యాంపస్, సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, పీజీ కళాశాలతో పాటు కొత్తగూడెంలోని ఇంజనీరింగ్ కళాశాలలో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు పోటాపోటీగా ప్రచారం నిర్వహించారు. కాగా గతంలో రెండు దఫాలుగా ప్రొఫెసర్ ఆర్.మల్లికార్జున్‌రెడ్డి అకూట్ అధ్యక్షులుగా పనిచేసిన అనుభవం ఉండగా తొలి సారిగా ఈ సారి తమ ప్యానల్‌కు అవకాశం ఇవ్వాలని ప్రొఫెసర్ బి. వెంకట్రామిరెడ్డి, ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్‌లు అధ్యాపకులను కోరుతూ ఓట్లను అభ్యర్థిస్తున్నారు. సోమవారం ప్రొఫెసర్ ఆర్. మల్లికార్జున్‌రెడ్డి, డాక్టర్ పోడేటి శ్రీనివాస్‌లు కేయూ ఉమెన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇతర విభాగాల్లో , ప్రొఫెసర్ బి. వెంకట్రామిరెడ్డి, ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్ ప్యానల్ కేయూ దూరవిద్య కేంద్రంలో అధ్యాపకులతో పాటు ఇతర విభాగాల్లో అధ్యాపకులను కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

10 నుంచి 2 గంటల వరకు పోలింగ్...

మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పోలింగ్ జరుగనుంది. పోలింగ్ కోసం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, టీచింగ్ ఏఆర్ సీహెచ్.ప్రణయ్‌కుమార్ నేతృత్వంలో ఏర్పాట్లు చేశారు. కేయూ క్యాంపస్‌లోని అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్‌తో పాటు కొత్తగూడెంలోని ఇంజనీరింగ్ కళాశాలలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. 77 మంది అధ్యాపకులు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

ఒకే బ్యాలెట్ పేపర్....

అధ్యక్ష కార్యదర్శుల పోస్టులకు ఒకే బ్యాలెట్ పేపర్ల ఇస్తారు. రెండు ప్యానళ్ళ నుంచి నలుగురి పేర్లు ముద్రించి ఉంటాయి. వారిలో అధ్యక్ష పదవికి ఒక్కరూ కార్యదర్శి పదవికి ఒక్కరికి తమ ఓటును వేయాలి. పొరపాటుగా అధ్యక్షకార్యదర్శి పదవులకు ఒక్కోటి కంటే ఎక్కువగా ఏ కేటాగిరిలో ఓటు వేసినా అవి చెల్లవు. అధ్యక్ష పదవికి ఒక్కరికీ, కార్యదర్శి పదవికి ఒక్కరికే ఓటు వేయాలని సూచించారు. ఎన్నికలలో నలుగురు అధికారులతో పాటు ఇతర సపోర్టింగ్ సిబ్బందిని కేటాయించారు. కౌంటింగ్‌ను మార్చి 5న మధ్యాహ్నం 2 గంటల నుంచి వర్సిటీ సెనెట్ హాల్‌లో నిర్వహించి ఫలితాలను ప్రకటిస్తారు.

అప్పుల బాధతో మహిళా రైతు ఆత్మహత్య



లక్ష్మి(ఫైల్)

దుగ్గొండి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయం, వ్యాపారంలో ఆర్థికంగా నష్ట పోయి అప్పుల బాధతో జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మహిళా రైతు మృతి చెందిన సంఘటన వరంగల్ జిల్లా దుగ్గొండి మండలంలోని మహ్మదాపురంలో సోమవారం చోటు చేసుకొంది. ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. మండలంలోని మహ్మదాపురం గ్రామానికి చెందిన గంధం లక్ష్మి(52), మొగిలి దంపతులు వ్యవసాయంతో పాటు గొర్రెలు, గేదెల వ్యాపారం చేస్తూ జీవనం గడుపుతారు. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. గ్రామానికి చెందిన ఓ భూమి యజమాని దగ్గర ఆరు ఎకరాల పంట భూమి కౌలుకు తీసుకొని ఐదేళ్లుగా వ్యవసాయ పంటలు సాగు చేస్తున్నారు. గత ఏడాదిలాగానే ఈ ఏడాది కూడా కౌలుకు తీసుకున్న పంట భూమిలో పత్తి, మిర్చి, మొక్కజొన్న పంటలు సాగు చేశారు. సాగు చేసిన పంట భూమిలో పంటలు దిగుబడి రాలేదు. పండిన పంటకు గిట్టుబాటు ధర లేని కారణంగా పంట కోసం పెట్టిన పెట్టుబడులు రాక ఆర్థికంగా నష్ట పో యారు. వ్యవసాయంతో పాటు గంధం లక్ష్మి భర్త మొగిలి గొర్రెలు, గేదెల వ్యాపారం చేసేవాడు. వ్యాపారంలో కూడా ఆర్థికంగా నష్ట వచ్చింది. వ్యవసాయం, వ్యాపారం పరంగా సుమారు రూ.10 లక్షలు నష్ట పోయిన దంపతులు మానసికంగా బాధపడేవారు. ఫిబ్రవరి 27న ఇంట్లో ఉన్న పురుగుల మందును గంధం లక్ష్మి తాగింది. దీంతో కుటుంబ సభ్యులు చికిత్స కోసం ఎంజీఎం ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. మృతిరాలు భర్త మొగిలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కమిషనరేట్‌లో.. కావాలి కొత్త ఠాణాలు

(5వ పేజీ తరువాయి)

కలుపుకొంటే ప్రజలతో పాటు పోలీసులకు భారం తప్పనుంది. నేరాలను నియంత్రించడానికి వీలుగా ఉంటుంది. అదే విధంగా మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధి చాలా పెద్దగా ఉంది. ఆ పోలీస్‌స్టేషన్ పరిధిలోని లేబర్‌కాలనీ ఏరియాలో కొత్త పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేస్తే ప్రజలకు పోలీసులు అందుబాటులో ఉంటారు. ప్రస్తుం ఉన్న కొన్ని పోలీస్‌స్టేషన్ల స్థాయిని పెంచి సౌకర్యాలను కల్పించాల్సిన అవసరం ఉంది. అదే విధంగా కొత్తగా ఏర్పడిన నడికూడలో పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయాలి.. ప్రస్తుతం మండలం ఏర్పడినా పోలీస్ సేవల కోసం ఇప్పటికీ దామెర లేదా పరకాలకు వెళ్లాల్సివస్తోంది.

ట్రాఫిక్ పోలీసుస్టేషన్లూ అవసరం..

కమిషరేట్ పరిధిలోని గ్రేటర్ వరంగల్‌తో పాటు నర్సంపేట, పరకాల, జనగాం పట్టణాల్లో వాహనాల రద్దీ విపరీతంగా పెరిగింది. నూతన రోడ్లు నిర్మించడం, జాతీయ రహదారులు, నగరం శివార్ల నుంచి రింగ్ రోడ్లు వెళ్తుండటంతో ప్రయాణించేవారి సంఖ్య ఎక్కువైంది. కేయూసీపీఎస్ లిమిట్స్‌లో నూతన ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేస్తే కరీంనగర్ రోడ్డులోని ట్రాఫిక్ క్లియరెన్స్ వారు చూసుకునే ఆవకాశం ఉంది. సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలో మరో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతంలోని ట్రాఫిక్‌ను నియంత్రించొచ్చు. ఇప్పటి వరకు ఈ ఏరియా అంతా కాజీపేట ట్రాఫిక్ పోలీసులే పర్యవేక్షిస్తుండటంతో ట్రాఫిక్ నియంత్రణ కష్టంగా మారింది. అదే విధంగా మిల్స్‌కాలనీ పీఎస్ పరిధిలో మరో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేస్తే ఖమ్మం రోడ్డు నుంచి మామునూరు వరకు, నర్సంపేట రోడ్డులోని ట్రాఫిక్‌ను పర్యవేక్షించవచ్చు. అదే విధంగా ఏనుమాముల లేదా దామెర పోలీస్‌స్టేషన్‌ను ప్రతిమ ఆసుపత్రి దగ్గర మెయిన్ రోడ్డుకు నిర్మించి అనుసంధానంగా మరో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేసినట్లయితే ములుగు రోడ్డు హనుమాన్ జంక్షన్ నుంచి అరెపల్లి ఓఆర్‌ఆర్ అటు వైపు జరిగే ట్రాఫిక్‌ను వారు క్లియర్ చేసుకోవచ్చని పలువురు వాహనదారులు, స్థానికులు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

9న కమల్ కింగ్ చెస్ పోటీలు

హనుమకొండ టౌన్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ఈ నెల 9వ తేదీన న్యూసైన్స్ డిగ్రీ కాలేజీలో కమల్ సింగ్ అకాడమీ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు అకాడమీ చైర్మన్ రాంప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ ఫస్ట్ క్లాస్ 7,9,11,13,15 విభాగాల్లో వేర్వేరుగా పోటీలు జరుగుతాయని తెలిపారు. ఈ పోటీలో పాల్గొనే ఆసక్తి ఉన్న క్రీడాకారులు 9676056744, 9154570257 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు. గెలుపొందిన విజేతలకు క్యాష్ ప్రైజ్, మెడల్స్ అందజేస్తామని పేర్కొన్నారు.

హాస్టల్స్ జేడీ సాంబశివరావుకు అభినందనలు

కేయూ క్యాంపస్ మార్చి 3 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ వివేకనంద రిసెర్చ్ స్కాలర్స్ కొత్త జాయింట్ డైరెక్టర్‌గా నియామితులయిన అర్థశాస్త్ర విభాగం అధ్యాపకులు డాక్టర్ అంకశాల సాంబశివరావును సోమవారం కేయూ జాక్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ మంద వీరాస్వామి నేతృత్వంలో శాలువ, పుష్పగుచ్ఛం అందచేసి అభినందించారు. సాంబశివరావు కేయూ ఎకానమిక్స్ విభాగంలో సీనియర్ కాంట్రాక్టు అధ్యాపకులుగా పనిచేస్తున్నారు. ఈ కార్యక్రమంలో మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎంఎస్ఎఫ్) కేయూ ఇన్‌చార్జి డాక్టర్ వడ్డెపల్లి మధు, బీఆర్‌ఎస్వీ హనుమకొండ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ఆరూరి రంజిత్, డాక్టర్ మద్దిరాల మోహన్‌రెడ్డి, అంబేద్కర్ స్టూడెంట్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మంద నరేశ్, యూత్ కాంగ్రెస్ నాయకులు మహ్మద్ పాషాతో పాటు కేయూ బోధన, బోధనేతర సిబ్బంది అభినందించారు.

కేయూలో బోధనేతర సిబ్బంది అంతర్గత బదిలీలు

కేయూ క్యాంపస్ మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీలో సోమవారం వర్సిటీలోని కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్న 24 మంది బోధనేతర సిబ్బంది అంతర్గత బదిలీలు చేస్తూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం వేర్వేరుగా ఉత్తర్వులు జారీ చేశారు. కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న 12 మంది సీనియర్ అసిస్టెంట్లు, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న మరో 12మంది డాటా ఎంట్రీ ఆపరేటర్లు, ల్యాబ్ అసిస్టెంట్లు, ఆఫీస్ సబార్డినేటర్లు, స్వీపర్లను వర్సిటీ క్యాంపస్‌లోని వివిధ విభాగాలతో పాటు ఆర్ట్స్ కళాశాల, సుబేదారిలోని పీజీ కళాశాల, వుమెన్స్ కళాశాలకు బదిలీ చేశారు. బదిలీ ఉత్తర్వులు వెంటనే అమల్లోకి వస్తాయని ఉత్తర్వుల్లో రిజిస్ట్రార్ స్పష్టం చేశారు. ఉద్యోగులు వెంటనే బదిలీయైన స్థానాల్లో రిపోర్టు చేయాలని పేర్కొన్నారు.

కృషి



సిరులు కురిపిస్తున్న పొగాకు

తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం

పంటపై సాగుకు ఆసక్తి చూపుతున్న అన్నదాతలు

జనగామ జిల్లాలో పెరుగుతున్న విస్తీర్ణం



పొగాకును కుచ్చుతున్న రైతు, ఆరబెట్టిన పొగాకు దొర్నాలు

రఘునాథపల్లి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): పొగాకు పంట రైతులకు సిరులు కురిపిస్తోంది. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వస్తుండడంతో జనగామ జిల్లాలో పొగాకు సాగు ఏటికేడు పెరుగుతోంది. స్టేషన్‌ఘన్‌పూర్, రఘునాథపల్లి, పాలకుర్తి, దేవరుప్పుల, నర్మెట, లింగాలఘణపురం, కొడకండ్ల మండలాల్లో రైతులు ఎక్కువగా పొగాకు సాగు చేస్తున్నారు. జిల్లాలో సుమారు 1250 మంది రైతులు ఆరువేల ఎకరాలలో సాగు చేశారు. క్వింటా పొగాకు రూ.15,500ధర పలుకుతోంది. ఎకరాకు సుమారు 10 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి వస్తుండడంతో రూ.25 వేల నుంచి రూ.30 వేల ఖర్చు వస్తుంది. అంటే సుమారుగా ఎకరం పొగాకు పంట సాగు చేసిన రైతుకు అన్ని ఖర్చులు పోను రూ.1.20లక్షల ఆదాయం వస్తోందని పొగాకు రైతులంటున్నారు.

రఘునాథపల్లిలో కొనుగోలు కేంద్రం..

రైతుల నుంచి పొగాకు పంటను కొనేందుకు చేసేందుకు వీఎస్‌టీ ఆధ్వర్యంలో రఘునాథపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. రైతులు పొగాకు ఉత్పత్తులకు నాణ్యత, రంగును బట్టి క్వింటాకు రూ.12 వేల నుంచి రూ.15,500 వరకు ధర పలుకుతోంది. దళారులు లేకపోవడంతో మోసాలు జరగడం లేదని రైతులు చెబుతున్నారు. పెట్టుబడులు పోను ఎకరానికి సగటున రూ.1.10 లక్షల వరకు ఆదాయం వస్తోందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పొగాకు సాగు చేసే గ్రామాలు..

రఘునాథపల్లి మండలంలోని కుర్చపల్లి, గబ్బెట, కోడూరు, రామన్న గూడెం, కన్నాయిపల్లి, గోవర్ధనగిరి, స్టేషన్ ఘన్‌పూర్ మండలంలోని ఛాగల్లు, రాఘవ పురం, అక్కరాజుపల్లి, శివరెడ్డిపల్లి, మీదికొండ, ఇప్ప గూడెం, నర్మెట, లింగాలఘణపురం మండలంలోని నేలపోగుల, గుమ్మడవెల్లి, బండ్లగూడెం తదితర గ్రామాల్లోని రైతులు పొగాకును ఎక్కువ సాగు చేస్తారు.



పొగాకు సాగే మేలు: ఉత్తేపు కుమార్, బండ్లగూడెం

నేను రెండు ఎకరాల్లో పొగాకు సాగు చేశాను. ఇప్పటివరకు 10 క్వింటాళ్ల పొగాకును అమ్మగా రూ.1.40 లక్షలు వచ్చాయి. ఇంకా 10 నుంచి 12 క్వింటాళ్ల పొగాకు పంట చేతికి రావాల్సిఉంది. ఇతర పంటలకు అవరమైన పెట్టుబడులు పొగాకుకు అవసరం ఉండదు.అందుకే ఇతర పంటలకన్న పొగాకు సాగే మేలు..



తక్కువ పెట్టుబడి.. : పుట్టల గట్టయ్య, ఇప్పగూడెం

పొగాకు పంటకు ఇతర పంటలతో పోలిస్తే తక్కువ పెట్టుబడి, ఎక్కువ లాభం వస్తోంది. 15 ఏళ్ల నుంచి పొగాకు సాగు చేస్తున్నాను .పొగాకుకు ఎక్కువ సాగు నీరు, రసాయన ఎరువుల వాడకం ఉండక పోవడం వల్ల తక్కువ పెట్టుబడి మాత్రమే అవసరముంటుంది. నేను 3 ఎకరాలలో పొగాకు సాగు చేశాను. పెట్టుబడి రూ.90 వేలు పోను రూ.2.20 లక్షల ఆదాయం లభించడం అంటే కేవలం పొగాకు సాగుతోనే సాధ్యం.

ఆదర్శం

నిరక్షరాస్యుడైనా..

మిర్చి సాగులో విజయం సాధించాడు

అధికారులు, శాస్త్రవేత్తల సలహాలతో అధిక దిగుబడి

జాతీయ అవార్డుకు ఎంపికైన రైతు బోడ వీరన్న



మహబూబాబాద్ మండలం మల్యాల శివారులోని మేగ్యాతండాలోని తన మిర్చితోటలో తనకు వచ్చిన అవార్డుతో రైతు బోడ వీరన్న

మహబూబాబాద్ అగ్రికల్చర్, మార్చి 3 (ఆంధ్ర జ్యోతి) : ఆయనో సాధారణ రైతు. నిరక్షరాస్యుడు. ఉన్న 3.10 ఎకరాల్లో మిర్చి పంట వేయాలని నిర్ణయిం చుకున్నాడు. కానీ ఏరకం విత్తనం వేస్తే బాగుంటుం దనే దానిపై అందరిక కంటే మిన్నగా ఆలోచించాడు. చదువుకోకపోయినా సాగుపై ఉన్న ప్రేమతో ఉద్యాన శాస్త్రవేత్తలను ఆశ్రయించాడు. వారి సలహాలు పాటిం చాడు.. సాగులో విజయం సాధించాడు. రైతులంతా నల్లతామర, వైరస్ తెగుళ్లతో దిగుబడి రాక భారీగా నష్టపోతున్న సయయంలో ఆయన మాత్రం అధిక దిగుబడి సాధించి ఆదర్శంగా నిలిచాడు. అంతే కాదు జాతీయ ఉత్తమ రైతు అవార్డు కూడా అందుకున్నాడు. దేశవ్యాప్తంగా 14మంది ఉత్తమ ఉద్యాన రైతులుగా ఎంపికై తే.. వారిలో ఒకరిగా నిలాచాడు మ హబూబాబాద్ మండలం మల్యా ల గ్రామపరిధి లోని మేగ్యాతండాకు చెందిన బోడ భన్యా-శాంతిల కుమారుడైన వీరన్న. ఫిబ్రవ రి 27న బెంగళూరు లోని జాతీయ పరిశోధన సంస్థ (ఐసీఏఆర్-ఐఐహెచ్ఆర్) నేషనల్ హార్టికల్చరల్ ఫెయిర్‌లో కేంద్రమంత్రి సుశ్రీ శోభా కరండ్లజే నుంచి ఆయన అవార్డు అందుకున్నాడు.

సాధారణ రైతు విజయమిదీ..

తనకున్న 3.10ఎకరాల్లో మల్యాలలోని జేవీ ఆర్ ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్తల సహకారంతో భారతీయ ఉద్యాన పరిశోధన సంస్థ అభివృద్ధి చేసిన ఆర్కా తేజస్వి మిర్చిరకానికి చెందిన 3 ప్యాకెట్ల విత్తనాలను వేశాడు. ఆయనకు ఆ విత్తనాలను ఎస్సీ, ఎస్టీ కోటా కింద ఉచితంగా అందించగా.. మిర్చినారు నాటిన నాటి నుంచి దుక్కిమందులైన యూరియా, పోటాష్ మందులను పంట దిగుబడి వచ్చే వరకు ఆరు సార్లు వేశాడు. 5 నుంచి 8 రోజుల కొకసారి పైమందులను పిచికారీ చేశాడు. శాస్త్రవేత్తల సాంకేతిక సూచనలు పాటిస్తూ పంట దిగు బడి వచ్చే వరకు వారు చెప్పిన వి ధంగానే మందులను వాడాడు. పంట చేతికి వచ్చిన సమయం వరకు రూ.1.50 లక్షలు ఖర్చు చేశాడు. నల్లతామర కొద్దికొద్దిగా ఆశించినప్పటికీ శాస్త్రవేత్తల సూచ నలు పాటించి క్రిమిసంహారిక మందులు వాడడంతో నల్లతామర, వైరస్ నశించిపో యాయి. చిన్నచిన్న చెట్లు ఉండగానే కాతకు వచ్చింది. పచ్చి మిర్చి కోతకు రావడంతో ముందుగా కోత కోయగా.. 2.86 క్వింటాళ్ల (ఆరు బస్తాల) దిగుబడి వచ్చింది. ఇక మొదటి క్రాప్ కింద ఎకరానికి 30 క్వింటాళ్ల వరకు ఎండు మిర్చి దిగుబడి వచ్చింది. మొత్తం 2.50 ఎకరాల్లో 75 క్వింటాళ్ల మిర్చి దిగుబడి వచ్చింది. అందులో 27 క్వింటాళ్ల ఎండుమిర్చి దశల వారీగా అమ్మేయడం, పచ్చిమిర్చి అమ్ముకోవడంతో రూ.3.93 లక్షల ఆదాయం సమకూరింది. ఇంకా కల్లంపై 48 క్వింటాళ్ల వరకు మిర్చిని ఎండబెట్టాడు. మార్కెట్‌లో మిర్చికి అధిక ధరలు పలికితే విక్ర యిస్తానని 2వ క్రాప్‌లో ఎకరానికి 15 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉందని రైతు బోడ వీరన్న ఆంధ్రజ్యోతికి చెప్పారు. కాగా, మిర్చి ఏ వైరస్ లేకుండా పండితే 32 క్వింటాళ్ల వరకు సాధారణంగా దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు. అలాంటిది నాలుగు సంవత్సరాల నుంచి ఈ ప్రాంతాల్లో నల్లతామర, ఇతర వైరస్‌లు రావడం వల్ల మిర్చి పంట దిగుబడి బాగా తగ్గిపోయింది. మహబూబాబాద్ జిల్లాలోని కొన్నిమండలాల్లోనైతే నల్లతామర, వైరస్ సోకడం ద్వారా ఆరు, ఏడు క్వింటాళ్ల వరకే దిగుబడి వచ్చింది. ఇలాంటిపరిస్థి తుల్లో ఈ రైతు బోడ వీరన్న భారత ఉద్యాన పరిశోధన సంస్థ అభివృద్ధి చేసిన ఆర్కా తేజస్వీ వేయడం వల్ల ఎకరానికి మొదటి క్రాప్‌లోనే 30 క్వింటాళ్ల దిగుబడి రావడం ఓ సాధారణ రైతు సాధించిన విజయంగా అభివర్ణిస్తున్నారు.

ఎంతో ఆనందంగా ఉంది

మల్యాలలోని జేవీఆర్ పరిశోధన స్థానం నుంచి భారత ఉద్యాన పరిశోధనసంస్థ అభి వృద్ధి చేసిన ఆర్కా తేజస్విని విత్తనాల మూడు ప్యాకెట్లను ఉచితంగా అందుకున్నా. జేవీఆర్ శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటించి.. ఎకరాకు 30 క్వింటాళ్ల దిగుబడిని సాధించా. దాంతో భారతీయ ఉద్యాన పరిశో ధన సంస్థ అధికారులు జాతీయ స్థాయిలో ఉత్తమ రైతు అవార్డుకు ఎంపిక చేశారు. దేశ వ్యాప్తంగా 14 మంది రైతుల్లో నిరక్షరాస్యుడ నైన నేను ఓ రైతుగా అందుకోవడం ఆనందం గా ఉంది. నాకు సహకరించిన శాస్త్రవేత్తలకు ధన్యవాదాలు.

- బోడ వీరన్న

సొంత ఖర్చులతో సైన్స్ ల్యాబ్

• విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన టీచర్ • ఆదర్శంగా నిలిచిన చక్రధర్



చక్రధర్ స్వయంగా నిర్వహిస్తున్న ల్యాబ్‌ను పరిశీలిస్తున్న కాంప్లెక్స్ హెచ్ఎం సంపత్ (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, మార్చి 3 (ఆంధ్ర జ్యోతి): తాను పాఠాలు చెప్పే విద్యార్థులకు మరింత ఉపయుక్తంగా ఉండేలా సొంతఖర్చు లతో సైన్స్ ల్యాబ్ ఏర్పాటు చేసి ఆదర్శంగా ని లిచారు జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ హై స్కూల్ ఉపాధ్యాయుడు ఎం.చక్రధర్. విద్యా ర్థులకు భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం పా ఠ్యాంశాలు సులభంగా అర్థం కావాలన్న లక్ష్యం తో ఆయన ఈ కార్యక్రమం చేపట్టారు. పాఠశా లలోని ఒక గదిలో సైన్స్ పరికరాలను అమర్చా రు. సుమారు 300 ప్రాథమిక, హైస్కూల్ వి ద్యార్థులకు సంబంధించిన సైన్స్ కృత్యాలు, ప్ర యోగాలు ఏర్పాటు చేశారు. ల్యాబ్‌లో ప్రయోగాత్మకంగా, చిత్రాలు, పట్టికల రూపం లో విద్యార్థులకు చూపుతు పాఠ్యాంశాలు సు లభంగా అర్థం కావడానికి కృషి చేస్తున్నారు. ప్రతీ నెలా తన వేతనం నుంచి కొంత భరిస్తు పాఠశాల హెచ్ఎం ఎం.సంపత్ సహకారంతో ల్యాబ్ ఏర్పాటు చేశారు.





ల్యాబ్‌లో ఏర్పాటు చేసిన ఫిజిక్స్ ఎగ్జిబిట్లు, రసాయన పరికరాలు

ఇవీ ల్యాబ్‌లో ఉన్న పరికరాలు

ఈ ల్యాబ్‌లో పలు భౌతిక శాస్త్ర పాఠ్యాంశాలకు చెందిన కృత్యాలు, పరికరాలు ఏర్పాటు చేశారు. వాటిలో కాంతి ప్రయోగాలు, లేజర్ కాంతి, ధ్వని, అయస్కాంతాలు, మన వి శ్వం ఉన్నాయి. ఇక రసాయన శాస్త్రానికి సంబంధించి 118 మూలకాలతో నూతన పీరియాడిక్ టేబుల్, ఆక్సిజన్, హైడ్రోజన్, కార్బన్ డయాక్సైడ్ తయారు చేయడం, రసాయన చర్యలకు సంబంధించిన ప్రయోగాలు ఏర్పాటు చేశారు. లోహాలు, అలోహాలు, వాటి ధర్మాలు, ఆమ్లాలు, క్షారాలు, బేసిక్ ఎలక్ట్రానిక్స్ ప్రకృతి చక్రం, రవాణా, రోడ్డు భద్రతా నియమాలు, పీహెచ్ స్కేల్ తదితర అంశాలకు చెందిన కృత్యాలు ఉన్నాయి. ల్యాబ్ ఉపయోగించి విద్యార్థులకు పాఠ్యాంశాలపై అవగాహన కల్పించడమే కాకుండా వారికి డ్రాయింగ్, లేబులింగ్, జత పరచడం, ప్రయోగాలు, పోస్టర్ డిజైనింగ్, ప్రాజెక్టు వర్క్, రీడింగ్, రైటింగ్ అభ్యాసం చేయిస్తున్నామని సైన్స్ టీచర్ చక్రధర్ చెబుతున్నారు.

రాయితీ ఇచ్చినా..



- ఎల్ఆర్ఎస్‌లో కానరాని స్పందన
- ఆసక్తిచూపని దరఖాస్తుదారులు
- సర్వేయర్ల కొరతతో ముందుకుసాగని పరిశీలన
- ఎన్‌వోసీలను అడుగుతున్న రిజిస్ట్రేషన్ అధికారులు
- అవి ఇచ్చేవారు లేక యజమానుల ఇబ్బందులు
- లైసెన్సుడు సర్వేయర్ల సాయం తీసుకోవడం మేలని అభిప్రాయం
- గతంలో వీరి భాగస్వామ్యంతో త్వరితగతిన పరిశీలన
- తమను వాడుకోవాలని కోరుతూ లైసెన్సుడు సర్వేయర్ల వినతి

హనుమకొండ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : అనుమ తి లేని లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్ఆర్ ఎస్) విజయవంతంగా అమలయ్యే పరిస్థితులు కనిపించడం లేదు. గతంలోలాగానే ఈ సారి కూడా ఆటంకాలు ఎదురేయ్యేలా ఉన్నాయి. ఎల్ఆర్ఎస్ అమలుకు సర్వేయర్ల కొరత తీవ్ర ప్రతిబంధకంగా మారనుంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వరంగల్ నగర పాలక సంస్థ సహా తొమ్మిది మున్సిపాలిటీల్లో ప్రభుత్వ సర్వేయర్ల కొరత తీవ్రంగా ఉంది. సర్వేయ ర్లు లేకుండా ఎల్ఆర్ఎస్ ఎలా అమలు చేసేదని మున్సిపల్ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. గతంలో ఎల్ఆర్ఎస్ అమలు వైఫల్యానికి ఇదే ప్రధాన కారణం. ఈ సారి కూడా అదే పరిస్థితి ఏర్పడనుంది. ఈ ప్రధాన సమస్యను పరిష్కరిం చకుండా ప్రభుత్వం ఎల్ఆర్ఎస్‌తో ముందుకు వెళ్లాలని నిర్ణయించుకుంది. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ను పరిష్కరించే బాధ్యతను ప్రభుత్వ సబ్ రిజిస్ట్రార్‌ల కు అప్పగించింది. ఇంత వరకు బాగానే ఉన్నా.. చెరువులు, వాటి బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్, రవాణా, కొండలు, గుట్టలు, హెరిటేజ్ తదితర ప్రాంతాలను నిర్ధారించేది ఎవరన్నది ప్రశ్నార్థకంగామారింది. రిజిస్ట్రేషన్ విభాగంలో పని చేసే సిబ్బందికి మాస్టర్ ప్లాన్ ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్, అసైన్డ్ భూములు తది తర వాటి గురించి ఏ మేరకు అవగాహన ఉంటుంద నేది ప్రశ్నగా మిగిలింది. పైగా ఎన్‌వోసీలు తెచ్చినవా రికే ఎల్ఆర్ఎస్ చేస్తామని రిజిస్ట్రేషన్ అధికారులు అంటుండగా.. అసలు ఈ ఎన్‌వోసీలు ఎవరు ఇవ్వాలన్నది పెద్ద సమస్యగా మారింది. ఎల్ఆర్ఎస్ పలు ప్రభుత్వ శాఖలతో ముడిపడి ఉన్న నేపథ్యంలో ఎన్‌వోసీలను రెవెన్యూశాఖ, మున్సిపాలిటీ, నీటిపారు దల శాఖల నుంచి తెచ్చుకోవలసి ఉంటుంది. ఈ శాఖలు కూడా క్షేత్ర స్థాయిలో తనఖీలు చేసిన తర్వా తగానీ ఇవ్వలేవు. దీని వల్ల అన్ని ఎన్‌వోసీలు అందేస రికి తీవ్ర జాప్యం చోటు చేసుకునే అవకాశం ఉంది. ఈ సమస్యను అధిగమించేందుకు గతంలో సంబంధి త శాఖకు చెందిన సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సమన్వయ లోపం వల్ల ఇవి ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారంలో భాగంగా క్షేత్రస్థాయిలో తనఖీలు నిర్వహించలేదు. ఇప్పుడు కూడా అదే పరిస్థితి ఏర్పడనుంది.

యజమానుల్లో అనాసక్తి..

ప్లాట్లదారులు ఈ సారి ఎల్ఆర్ఎస్ పట్ల అంత అసక్తిగా లేరు. ఇప్పటికిప్పుడు ఎల్ఆర్ఎస్ చేయిం చుకోవాలనే ఆతృత అంతగా కనిపించడం లేదు. ఎల్ఆర్ఎస్ చేయించుకుంటే ఫీజులో 25శాతం రాయితీ సైతం ఇవ్వనున్నట్టు ప్రభుత్వం ప్రకటించినా స్పందన అంతంత మాత్రంగానే ఉండటం నిదర్శనం గా కనిపిస్తోంది. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులు సాధారణంగా తమ ప్లాట్ల క్రయవిక్రయాలు జరిగి నప్పుడు, సేల్ డీడ్ అయినప్పుడు మాత్రమే రిజి స్ట్రేషన్ కార్యాలయానికి వెళతారు. ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు సమయంలో రూ.వెయ్యి చెల్లించినవారు ఇప్పటికిప్పుడు ఎల్ఆర్ఎస్ కోసం రిజిస్ట్రేషన్ కార్యా లయానికి వెళ్లాలని అనుకోవడం లేదు. ప్లాట్లదారుల్లో చాలా మంది వాటిని కొన్న తర్వాత పెట్టుబడి రూ పంలో అలా వాటిని అనుమతి లేకున్నా కొని వదిలే శారు. మార్కెట్‌లో మంచి రేటు పలికినప్పుడు లేదా ఆ ప్లాట్‌లో ఇల్లు నిర్మించాలనుకున్నప్పుడు మాత్రమే ఎల్ఆర్ఎస్ చేయించుకోవాలని చాలా మంది అను కుంటున్నారు. దీనితో ఎల్ఆర్ఎస్ విషయంలో ప్రభు త్వం ఆశించినంత కదలిక కనిపించడం లేదు. ప్రస్తు తం మున్సిపాలిటీల పరిధిలో ఎల్ఆర్ఎస్ దరఖా స్తుల క్షేత్ర స్థాయిలో తనఖీలకు మాస్టర్ ప్లాన్‌తో పాటు ఎల్ఆర్ఎస్ బఫర్ జోన్ తదితర అంశాల పట్ల. అవగాహన లేని వార్డు ఆఫీసర్లకు, బిల్డింగ్ ఇన్స్‌పెక్టర్లు, చేయిన్ మెన్లకు ఈ బాధ్యత అప్పగిం చారు. ఇప్పటికే వారు పని ఒత్తిడితో సతమతమవు తున్నారు. ఈ పరిస్థితుల్లో ఉమ్మడి జిల్లాలో దాఖలైన 1.41 లక్షల దరఖాస్తులను ఎప్పటికి పరిష్కరించేదన్న ప్రశ్న తలెత్తుతోంది.

ధరలు పడిపోవడమూ కారణమే!

ప్రధానంగా ఉమ్మడి జిల్లాలోని గ్రామ పంచాయ తీల పరిధిలో ఏర్పాటు చేసిన అక్రమ వెంచర్లలో కొనుగోలు చేసిన ప్లాట్ల యజమానులు ఎల్ఆర్ఎస్ కోసం పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ప్లాట్ల ధరలు గణనీయంగా పడిపోవడం ఇందుకు ప్రధాన కారణం గా తెలుస్తోంది. 2020లో ప్రవేశపెట్టిన ఎల్ఆర్ఎస్ స్కీం ఆలస్యం కావడంతో ప్రస్తుతం ఉన్న ధరలకు, ప్లాట్ల యజమానులు కొనుగోలు చేసిన ధరల్లో భారీ గా మార్పులు చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన అక్రమ లేఅవుట్ల లో ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్నవారి నుం చి స్పందన కరువైంది. మునిసిపాలిటీల పరిధిలోని దరఖాస్తుదారులు మాత్రమే రెగ్యులరైజ్ చేసుకునేం దుకు కాస్త ముందుకు వస్తున్నారు.


కొత్తవిధానమేదీ?

ఎల్ఆర్ఎస్ అమలు విషయంలో ప్రస్తుత ప్రభు త్వం కొత్త విధానాన్ని అనుసరించడం లేదు. గత బీఆర్ఎస్ సర్కార్ అనుసరించిన పద్ధతులనే అనుస రించేందుకు ప్రయత్నిస్తోంది. దీంతో పాత విధానం లోని లోపాలు ఎల్ఆర్ఎస్ అమలుకు మళ్లీ అడ్డంకు లుగా మారుతున్నాయి. అమలులో సరళీకరణగానీ, స్పష్టత గానీ లేదు. గతంలో ఎదురైన అడ్డంకులను తొలగించే ప్రయత్నమూ కనిపించడం లేదు. దీనితో గతంలో ఎల్ఆర్ఎస్ విషయంలో చేదు అనుభవాల ను ఎదుర్కొన్న దరఖాస్తుదారులు ప్రభుత్వం మరో అవకాశం ఇచ్చినా అంత ఆసక్తి చూపడం లేదు.

ఏం చేయాలి?

ఎల్ఆర్ఎస్ అమలులో మున్సిపల్ సర్వేయర్ల కొర త తీవ్రంగా ఉన్నందు వల్ల లైసెన్సుడు సర్వేయర్ల సహకారం తీసుకోవడం మేలన్న అభిప్రాయం సర్వ త్రా వ్యక్తం అవుతోంది. ఎల్ఆర్ఎస్‌లో పాలుపం చుకోవడానికి లైసెన్సుడు సర్వేయర్లు కూడా సుము ఖంగానే ఉన్నారు. తమ సేవలను వాడుకోవలసిం దిగా గతంలోనే సంబంధిత శాఖల మంత్రులు, అధికారులను కలిసి వినతి పత్రాలను అందించారు. గతంలో ఆయా ఏరియాలను సర్వేపై చేయడానికి గతంలో జీడబ్ల్యూఎంసీ లైసెన్సుడ్ సర్వేయర్లకు ఈ బాధ్యత అప్పగించారు. వీరు కుడా మాస్టర్ ప్లాన్ ప్రకారం ల్యాండ్ యూజ్‌ను దృష్టిలో ఉంచుకొని ప్లాన్లను, మ్యాప్‌లను తయారు చేసి ఇచ్చినందు వల్ల ఎల్ఆర్ఎస్ 2007, 2010, 2013లో విజయవంతంగా అమలయ్యాయి. కానీ తర్వాత బీఆర్ఎస్ పార్టీ అధికా రంలోకి వచ్చిన తర్వాత లైసెన్సు సర్వేయర్లను పక్కనబెట్టింది. దీనితో సరైన ప్లాన్లు లేకపోవడం, క్షేత్ర స్థాయిలో పరిశీలనల్లో జాప్యం వల్ల అప్పటి నుంచి ఎల్ఆర్ఎస్ అమలు నత్తనడకన సాగుతూ వస్తోంది. ఇప్పటికైనా ఎల్ఆర్ఎస్ అమలులో తమ సేవలను వినియోగించుకోవాలని లైసెన్సుడు సర్వేయర్లు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. గతంలో ఇదే విషయమై వారు ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి, రెవెన్యూ శాఖ, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి వినతి పత్రాలను సైతం అందజేశారు.

లైసెన్సుడ్ సర్వేయర్లను వాడుకోవాలి



- గాజుల రఘు, జిల్లా లైసెన్సుడ్ సర్వేయర్ల సంఘం అధ్యక్షుడు

రాష్ట్ర వ్యాప్తంగా వెయ్యి మందికిపైగా లైసెన్సుడ్ సర్వేయర్లు ఉండగా ఉమ్మ డి వరంగల్ జిల్లా పరిధి లో 200 మంది వరకు ఉన్నారు. వీరిని ఎల్ఆర్ ఎస్ దరఖాస్తుల క్షేత్ర స్థాయిలో పరిశీలించి రిపో ర్టులు ఇవ్వడానికి లైసెన్సుడ్ సర్వేయర్లను వాడు కోవాలి. దీని వల్ల దరఖాస్తుల పరిశీలన త్వరిత గతిన జరుగుతుంది. ప్రభుత్వం ఆశించిన లక్ష్యం నెరవేరుతుంది. అంతేకాకుండా ఆదాయం సమ కూరుతుంది. పైగా మున్సిపాలిటీల నుంచి లైసె న్సులు పొందిన సర్వేయర్లు కనుక బాధ్యతాయు తంగా, నిజాయితీగా పని చేస్తారు. ఏ చిన్న త ప్పు చేసినా లైసెన్సులు రద్దు చేసినా లైసెన్సులు రద్దు చేసే అధికారం మున్సిపల్ అధికారులకు ఎలాగో ఉంది. గతంలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ను క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనుభవం ఉంది.



ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న లైసెన్సుడు సర్వేయర్లు

• ఇవిగో సాక్ష్యాలు..



అలనాటి గుర్తులను చూపుతున్న ఆలయ గైడ్

రామప్ప శిల్పాలు చెక్కింది ఇక్కడే..

వెంకటాపూర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): రామప్ప ప్రధాన ఆలయానికి సమీపంలోని మట్టికోట నుంచి సరస్సు వరకు ఉన్న స్థలంలో రామప్ప శిల్పాలు చెక్కినట్లు ఆనవాళ్లు దర్శనమిస్తున్నాయి. క్రీస్తు శకం 1213లో సరిగ్గా 812సంవత్సరాల క్రితం రామప్ప ఆలయ నిర్మాణం కోసం రామప్ప అనే ప్రధాన శిల్పి నేతృత్వంలో 300మంది శిల్పులు 40 సంవత్సరాలు కష్టపడి గుడి నిర్మించాలని పురావస్తుశాఖ ద్వారా తెలుస్తోంది. సుదూర ప్రాంతాల నుంచి శిల్పాలను చెక్కి తీసుకువస్తే శిల్పాలు దెబ్బతినే అవకాశం ఉందని ఆనాడే శిల్పులు గుర్తించినట్లు తెలుస్తోంది. ఎలాంటి సంఘటనలు జరుగకుండా ఆ రోజుల్లోనే ప్రస్తుతం ప్రధాన గుడి తూర్పు ముఖద్వారం వైపు నుంచి 100మీటర్ల దూరంలో ఉన్న మట్టికోట నుంచి సరస్సును ఆనుకుని ఓ ప్రదేశాన్ని ఎంచుకున్నారు. ఈ ప్రదేశంలో శిల్పాలు చెక్కేందుకు వీలుగా 300నుంచి 400వరకు బండలను (పల్లెటూర్లో తాత్కాలికంగా నిర్మించే పందిరి వలె) నిలబెట్టినట్టు తెలుస్తోంది. రామప్ప ఆలయ సమీపంలోని వనగుట్ట నుంచి సాండ్‌స్టోన్, ఇతర ప్రాంతాల నుంచి నల్లరాళ్లను ఈ ప్రదేశానికి తరలించి శిల్పాలు చెక్కినట్టు తెలుస్తోంది. వీటిలో ప్రధానంగా నాలుగు నల్లరాతి స్తంభాలు, శివలింగం, ప్రధాన ఆలయ ద్వారం, గర్భగుడిలాంటి వాటిని రమణీయంగా చెక్కారు. అదేవిధంగా శిల్పాలు చెక్కే సమయంలో భూమిలోకి దిగబడకుండా మూడుమీటర్ల లోతు గుంతను తీసి ఆ గుంతలో రాయిని వేసి వాటిపై శిల్పాలు చెక్కినట్లు ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. ఈ ప్రాంతంలో అలనాడు నిలబెట్టిన బండ కొయ్యలు ఇప్పటికీ దర్శనమిస్తున్నాయి. వందల సంవత్సరాల నాటిక్రితమే రమణీయంగా తీర్చిదిద్దిన రామప్ప చరిత్ర వెనుక ఈ స్థలానికి ఎంతో ప్రాముఖ్యత ఉన్నట్లు చరిత్రకారులు చెబుతున్నారు.



ప్రస్తుతం కనిపిస్తున్న ఆనవాళ్లు ఇవే..

జలేశ్వరాలయంలో అన్నపూజ

రెడ్డికాలనీ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండలోని జలేశ్వరాలయంలో సోమవారం నిర్వహించిన అన్నపూజ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రధాన అర్చకులు శ్రీనివాస కేసరి విశేష పూజలు నిర్వహించి అనంతరం తీర్థ ప్రసాద వితరణ చేశారు. చైర్మన్ మట్టా శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మట్టా కార్తీక్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.


పూజలో పాల్గొన్న భక్తులు


విశ్వవ్యాలీ స్కూల్లో సైన్స్ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిట్లతో ప్రిన్సిపాల్

'విశ్వవ్యాలీ'లో ఘనంగా సైన్స్ దినోత్సవం

హనుమకొండ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ జవహర్ కాలనీలోని విశ్వవ్యాలీ స్కూల్లో సోమవారం సైన్స్ దినోత్సవం ఘనంగా జరిగింది. విద్యార్థులు స్వయంగా తయారు చేసిన సైన్స్ ఎగ్జిబిట్లను ఈ సందర్భంగా ప్రదర్శనకు పెట్టారు. సుమారు 100కుపైగా సైన్స్ ఎగ్జిబిట్లు, సైన్స్ చాట్లు, సైన్స్ బోధనా పరికరాలు ఇందులో ఉన్నాయి. వీటితో పాటు వివిధ రకాల ఫుడ్ ఐటెమ్స్ కూడా ప్రదర్శనకు పెట్టారు. ప్రీనర్సరీ నుంచి అయిదవ తరగతి వరకు సుమారు 100 మంది విద్యార్థులు ఇందులో పాల్గొన్నారు. విద్యార్థులు ఎగ్జిబిట్ల గురించి వివరించారు. ఉపాధ్యాయులు సైతం ఈ సందర్భంగా సైన్స్ ప్రాధాన్యతను చిన్నారి విద్యార్థులకు ఆట, పాటలు, ప్రదర్శనల ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో విశ్వవ్యాలీ స్కూల్ ప్రిన్సిపాల్ తిరుమలరెడ్డి, పాఠశాల డైరెక్టర్లు శ్రీధర్ రావు, విజయకుమార్, కొమురయ్యతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంటర్ వర్సిటీ హ్యాండ్‌బాల్ మహిళ జట్టు ఎంపిక


ఎంపికైన క్రీడాకారులతో స్పోర్ట్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ వెంకయ్య

కేయూక్యాంపస్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మార్చి 3 నుంచి మార్చి 7 వరకు తమిళనాడులోని పెరియార్ యూనివర్సిటీలో జరిగే సౌత్ జోన్ ఇంటర్ వర్సిటీ క్రీడలకు కేయూ మహిళ హ్యాండ్‌బాల్ జట్టును 2024-25 ఏడాదికి గాను సోమవారం ఎంపిక చేసినట్లు కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్య తెలిపారు. ఎంపికైన క్రీడాకారులలో ఎస్.భాగ్యశ్రీ, (కేయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల, కేయూ క్యాంపస్), బి. శాంత, (కేయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల, కేయూ క్యాంపస్), బి.కావ్య, (టీజీఎస్ డబ్ల్యూఆర్‌డీసీ డిగ్రీ కళాశాల, వరంగల్ పశ్చిమ), బి. రమ్య (యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల, కేయూక్యాంపస్), టి. స్నేహ, (వాగ్దేవి ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల, బొల్లికుంట), ఎం. త్రివేణి, (టీజీఎస్‌డబ్ల్యూఆర్‌డీసీ డిగ్రీ కళాశాల, వరంగల్ పశ్చిమ), బి.నందిని, ఎ.శ్రీలేఖ, టి. టాన్సీ (వాగ్దేవి ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల, బొల్లికుంట)లున్నట్లు పేర్కొన్నారు.

కేయూ దూరవిద్యలో ప్రామాణిక పుస్తకాలు

- ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ సురేశ్‌లాల్
- దూరవిద్య కొత్త సెమిస్టర్ పుస్తకాల ఆవిష్కరణ


కొత్త పుస్తకాలను ఆవిష్కరిస్తున్న డైరెక్టర్ ప్రొఫెసర్ సురేశ్‌లాల్, కోఆర్డినేటర్ డాక్టర్ కొట్టే భాస్కర్

కేయూ క్యాంపస్ మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం ప్రామాణిక పుస్తకాలను ప్రచురిస్తుందని, అభ్యర్థులందరూ వాటిని సద్వినియోగం చేసుకుని వృద్ధిలోకి రావాలని కేయూ దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ బి. సురేశ్‌లాల్ తెలిపారు. సోమవారం కేయూ ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ చాంబర్‌లో లాంగ్వేజెస్ కోఆర్డినేటర్ డాక్టర్ కొట్టే భాస్కర్ నేతృత్వంలో దూర విద్య కేంద్రం ప్రచురించిన సెమిస్టర్ పుస్తకాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా డైరెక్టర్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్ మాట్లాడుతూ.. కేయూ దూరవిద్య కేంద్రం ఈ ఏడాది నుంచి డిగ్రీ, పీజీ కోర్సుల్లో సెమిస్టర్ విధానాన్ని తీసుకువచ్చిందని, ఆయా సెమిస్టర్ పరీక్షలకు అనుగుణంగా ప్రామాణిక పుస్తకాలను వెలువరించినట్లు వెల్లడించారు. ఎస్డీఎల్‌సీఈ కోర్సుల్లో అడ్మిషన్లు పొందిన ప్రతీ విద్యార్థికి ఆయా ప్రామాణిక గ్రంథాలను ఉచితంగా అందచేస్తామని స్పష్టం చేశారు. ఎస్డీఎల్‌సీఈ దేశంలోని అన్నివర్సిటీల కంటే తక్కువ ఫీజులతో డిగ్రీ, పీజీ ఇతర ప్రొఫెషనల్స్ కోర్సులను అందిస్తోందన్నారు. కేయూ దూరవిద్య కేంద్రంలో ఈ ఏడాది రెండోదఫా అడ్మిషన్ల నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు. మార్చి 24 వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా నేరుగా, ఆన్‌లైన్‌లోనూ అడ్మిషన్లు పొందవచ్చునని వెల్లడించారు. ఇతర వివరాలన్ని దూరవిద్య కేంద్రం వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. ఎస్డీఎల్‌సీఈ లాంగ్వేజెస్ కోఆర్డినేటర్ డాక్టర్ కొట్టే భాస్కర్ మాట్లాడుతూ.. సెమిస్టర్ల వారీగా సెలబస్‌కు అనుగుణంగా నాణ్యమైన పుస్తకాలను ఇస్తామన్నారు. విషయ నిపుణులు సంపాదకులుగా, రచయితలుగా ఉన్నారని స్పష్టం చేశారు. ఎస్డీఎల్‌సీఈ కోర్సులను అభ్యర్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కేయూ ఎస్డీఎల్‌సీఈ బుక్స్ స్టోర్స్ ఇన్‌చార్జి డాక్టర్ తాటికాయల కుమార్‌తో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కార్మిక ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను నిరసించండి

ఏఐకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగర్


మాట్లాడుతున్న ఏఐకేఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సాగర్

హనుమకొండ టౌన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : దేశంలో సామాన్య ప్రజలపై భారాలను మోపుతూ కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేసే మోదీ సర్కార్ కార్మిక, రైతు ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను నిరసిస్తూ పోరాడాలని ఏఐకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిలుపునిచ్చారు. సోమవారం హనుమకొండ రాంనగర్‌లోని సుందరయ్య భవన్‌లో సీఐటీయూ, ఏఐఏడబ్ల్యూ, ఏఐకేఎస్, హనుమకొండ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో 'కేంద్ర బడ్జెట్-ప్రజలపై భారాలు' అనే అంశంపై జిల్లా సెమినార్‌ను సారంపల్లి వాసుదేవరెడ్డి, టీ. ఉప్పలయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సెమినార్‌కు ముఖ్య వక్తగా ఏఐకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. సాగర్ మాట్లాడుతూ బడ్జెట్ లోటును పూడ్చేందుకు ప్రభుత్వ రంగ సంస్థల్లోని 47 వేల కోట్ల రూపాయల విలువ చేసే వాటాలను విక్రయించాలని ప్రతిపాదించారని బీమా రంగంలో 74 శాతం నుంచి 100 శాతం వరకు విదేశీ పెట్టుబడులను అనుసరిస్తూ దేశీయ బీమా రంగాన్ని ప్రమాదంలో పడేసిందని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుర్రి ప్రసాద్, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రాగుల రమేష్, ఏఐఏడబ్ల్యూ జిల్లా ప్రధానకార్యదర్శి గుమ్మడి రాజుల రాములు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.చుక్కయ్య సీఐటీయూ జిల్లా ఆఫీస్‌బేరర్స్ బొట్ల చక్రపాణి, పుల్ల అశోక్, ఎన్. రజిత, మహేష్, సంపత్, యాకయ్య, రాఘవులు, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు గడువులోపు పూర్తి చేయాలి

కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, మార్చి3 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పనులు సంబంధించిన నిర్దేశించిన లక్ష్యాన్ని గడువులోగా పూర్తిచేయించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో సోమవారం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు, వాటి పురోగతి, నిర్దేశిత లక్ష్యం పూర్తిచేయడంపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ మార్చి నెలాఖరుకల్లా మంజూరైన, ఇప్పటివరకు చేపట్టిన పనులు, పనులకు సంబంధించిన ప్రణాళిక, ఇతర అభివృద్ధి పనులపై ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులతో చర్చించారు. అనంతరం కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మండలాల్లో ఉపాధి హామీ పనులు నిర్దేశిత లక్ష్యాన్ని చేరే విధంగా పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీఓ మేన శ్రీను, అదనపు డీఆర్‌డీఓ శ్రీనివాసరావు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

వాగ్దేవిలో సైన్స్ సెమినార్ పోస్టర్ ఆవిష్కరణ

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ నయీంనగర్‌లోని వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాలలో ఈ నెల 12, 13 తేదీల్లో సైన్స్ అకాడమీస్ సెమినార్, వర్క్‌షాప్ నిర్వహిస్తున్నారు. ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను అకాడమిక్ డైరెక్టర్ సీహెచ్. వాహినీదేవి సోమవారం కళాశాల ప్రాంగణంలో ఆవిష్కరించారు. భారత జాతీయ సైన్స్ అకాడమి, భారతీయ అకాడమీ ఆఫ్ సైన్సెస్, జాతీయ అకాడమీ ఆఫ్ సైన్సెస్ సహకారంతో ఈ సెమినార్ నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.శేషాచలం, వైస్ ప్రిన్సిపాల్ పి.హరీందర్‌రెడ్డి, సెమినార్ కోఆర్డినేటర్ ఎ.శ్రీనివాస్‌రెడ్డి, కెమిస్ట్రీ హెడ్ సి.గోవిందరావు, ఎస్.రజిత పాల్గొన్నారు.



పీఎస్‌లో రిజిస్టర్లను పరిశీలిస్తున్న ఏసీపి తిరుమల్

మడికొండ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన ఏసీపీ తిరుమల్

మడికొండ, మార్చి 3(ఆంధ్రజ్యోతి): మడికొండ పోలీస్ స్టేషన్ ను సోమవారం కాజీపేట సబ్ డివిజన్ ఏసీపి తిరుమల్ సందర్శించారు. జనరల్ డైరీ రిజిస్టర్లను, సన్నిహిత రిజిస్టర్లను సమీక్షించారు. స్టేషన్ పరిసరాలలో కలియతిరిగి స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్థానిక ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ స్టేషన్‌లో చేపట్టిన సుందరీకరణ పనులు, స్టేషన్ వెనుక ప్రదేశంలో చేస్తున్న అభివృద్ధి పనులు పరిశీలించి అభినందించారు. ఈసందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ స్టేషన్ పరిధిలో ఎక్కడ ఎలాంటి సంఘటనలు జరిగినా పోలీసులు వెంటనే స్పందించి బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూస్తామన్నారు. ఈ స్టేషన్ పరిధి అని ఆస్టేషన్ పరిధి అని సమయం వృథా చేయకుండా బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు పోలీస్ వ్యవస్థ కృషి చేస్తోందని స్పష్టం చేశారు.

పెయింటింగ్ కార్మికుల సభ్యత్వ నమోదు ప్రారంభం

వడ్డెపల్లి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో ఐనవోలు మండలం కొండపర్తి గ్రామ నేతాజీ పెయింటింగ్ యూనియన్ కార్మికుల సభ్యత్వ నమోదును యూనియన్ జిల్లా కన్వీనర్ కట్కూరి రాజు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ ప్రతీ కార్మికుడు లేబర్ కార్డు కలిగి ఉండాలన్నారు. ఈనెల 4నుంచి 9వ వరకు యూనియర్ సభ్యత్వాన్ని తీసుకోవాలని పేర్కొన్నారు. యూనియన్ నేతలు కట్కూరి చంద్రమౌళి, గద్దల ప్రభాకర్, కట్కూరి శంకర్, బొక్కల సారయ్య, గద్దల రాజ్‌కుమార్, బొక్కల భిక్షపతి, బొజ్జ కుమార్, సంపత్, బొక్కల స్వామి, మాదాసు కిషన్ పాల్గొన్నారు.

కాంక్రీట్ లారీ బోల్తా

- విరిగిన విద్యుత్ స్తంభం
- తప్పిన పెను ప్రమాదం

హసన్‌పర్తి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రగట్టుగుట్ట క్రాసు రోడ్డులోని తెలంగాణ బాలికల గురుకుల విద్యాలయం ప్రధాన రహదారిపై సిమెంట్ కాంక్రీట్ లోడు లారీ బోల్తా పడింది. దీంతో గురుకులంనకు వెళ్లే రహదారి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో విద్యుత్ వైర్లు తెగిపోవడంతో లారీ డ్రైవర్ భయంతో షాక్‌కు గురయ్యాడు. స్థానికులు లారీలో చిక్కుకున్న డ్రైవర్‌ను బయటకు తీసి 108లో ఎంజీఎంకు తరలించారు. విష యం తెలిసిన కేయూ ఎస్సై ఓ.రవిందర్, హసన్‌పర్తి ఎస్సై దేవేందర్ పోలీసు సిబ్బందితో హుటాహుటిన ప్రమాద స్థలానికి చేరుకొని పరిశీలించారు. లారీ నుంచి డీజిల్ లీకై ప్రమాదం జరుగుతుందని ఊహించిన పోలీసులు ఫైర్‌స్టేషన్ నుంచి వాహనాన్ని తెప్పించి రోడ్డుపై పడిన డీజిల్‌ను నీటితో కడిగించి శుభ్రం చేశారు. లారీ డ్రైవర్ రెడ్‌మిక్స్ లోడు తో రివర్స్ తీసి తిరిగి వెళ్లే క్రమంలో రహదారి పక్కనే ఉన్న మిషన్ భగీరథ గేట్‌వాల్‌లో టైరు ఒక్కసారిగా దిగబడడంతో లారీ బోల్తా పడినట్లు స్థానికులు తెలిపారు. విద్యుత్ స్తంభం విరిగిపోయి కాలనీలో వి ద్యుత్ అంతరాయం ఏర్పడింది. విద్యుత్ సిబ్బంది అప్రమత్తమై విద్యుత్ లైన్ పునరుద్ధరణకు చర్యలు చేపట్టారు.ఈ ప్రమాదంలో ఎవరికి ప్రాణనష్టం కలగకపోవడంతో స్థానికులు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

యువతి అదృశ్యం

మడికొండ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): కాజీపేట మండలం కడిపికొండలో రెండు రోజులుగా ఓ యువతి కనిపించడం లేదు. మడికొండ ఎస్సై రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కడిపికొండకు చెందిన ఎండీ. ఖాసిం కూతురు లీమా ఈనెల 1న రాత్రి ఎవరికీ చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదు. ఆమె ఆచూకీ కోసం బంధువులు, స్నేహితుల వద్ద విచారించినా తెలియలేదు. దీంతో తల్లిదండ్రులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. యువతి ఇంట్లో నుంచి వెళ్లిన సమయంలో ఆకుపచ్చ రంగు పంజాబీ డ్రెస్ వేసుకుని ఉందని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ఆచూకీ తెలిసిన వారు మడికొండ పోలీస్‌స్టేషన్‌లో తెలియజేయాలని కోరారు.

కేయూలో పార్ట్‌టైం ఆశావహుల ఆందోళన

- వీసీ చాంబర్‌లో బైఠాయింపు
- కేయూ రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రం హామీతో విరమణ


కేయూలో నిరసన ఆందోళన చేస్తున్న పార్టుటైం ఆశావహులు, విద్యార్థి నేతలు

కేయూ క్యాంపస్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీలో సోమవారం కేయూ పార్టుటైం ఆశవహులతో పాటు విద్యార్థి సంఘాల నేతలు నిరసనకు దిగారు. సోమవారం వర్సిటీ పరిపాలన భవనంలో వీసీ చాంబర్‌లో బైఠాయించారు. వర్సిటీ క్యాంపస్‌తో పాటు ఇతర కళాశాలల్లో ఖాళీగా ఉన్న పార్టుటైం అధ్యాపకుల పోస్టుల నోటిఫికేషన్ వెలువరించి, అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేయాలని వర్సిటీ అధికారులను డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పార్టుటైం అశవాహులు, విద్యార్థి సంఘాల నేతలు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని వర్సిటీల్లో పార్టుటైం అధ్యాపకుల నోటిఫికేషన్ విడుదల చేయగా కేయూలో 10 ఏళ్ళుగా నియామకాలు లేవని ఆందోళన వ్యక్తం చేశారు. వర్సిటీ అధికారులు పార్టుటైం నోటిఫికేషన్‌పై నిర్లక్ష్యంగా వ్యవరిస్తున్నారని మండిపడ్డారు. విద్యార్థుల భవిష్యత్, వర్సిటీ మనుగడను దృష్టిలో ఉంచుకుని వెంటనే ప్రభుత్వంతో పాటు వర్సిటీ అధికారులు స్పందించి పార్టుటైం నోటిఫికేషన్‌ను వెలువరించాలని డిమాండ్ చేశారు. నిరసన ఆందోళనలకు దిగిన వారిని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో స్వల్ప వాగ్విదం చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం ఆందోళన దిగిన అభ్యర్థులతో ఫోన్‌లో మాట్లాడారు. త్వరలోనే పార్టుటైం నోటిఫికేషన్ వెలువరిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. దీంతో అభ్యర్థులు నిరసన ఆందోళనలను విరమించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ కేయూ ఇన్‌చార్జి డాక్టర్ వడ్డెపల్లి మధు, బీఆర్ఎస్వీ హనుమకొండ కోఆర్డినేటర్ డాక్టర్ అరూరి రంజిత్, కూడా కన్వీనర్ డాక్టర్ మద్దిరాల మోహన్‌రెడ్డి, డాక్టర్ పంతంగి చందర్‌రావు, యూత్ కాంగ్రెస్ నేత మహమ్మద్ పాషా, డాక్టర్ బండి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసును ఛేదించిన ఏసీపీ, సీఐలకు నగదు పురస్కారం



ఏసీపీ, సీఐకి నగదు రివార్డు అందజేస్తున్న సీపీ

వరంగల్ క్రైం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) మిస్టరీగా మారిన హత్య కేసులో నిందితుడిని పట్టుకున్న పరకాల ఏసీపీ సతీష్‌బాబు, శాయంపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పొన్నమనేని రంజిత్‌రావు లను వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా నగదు పురస్కారంతో అభినందించారు. వివరాల్లోకి వెళితే.. పరకాల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ధర్మారం గ్రామ శివారులో 2023 సంవత్సరం జూలైలో శాయంపేట మండలం అరెపల్లికి చెందిన వాడికారి బొందమ్మ హత్యకు గురైంది. ఈ కేసులో ఏలాంటి క్లూస్ దొరకకపోవడంతో మిస్టరీగా మారింది. సీపీ ఆదేశాలతో పరకాల ఏసీపీ పర్యవేక్షణలో ప్రస్తుత శాయంపేట సీఐ పొన్నమనేని రంజిత్‌రావు దర్యాప్తు ప్రారంభించి అరెపల్లికి చెందిన ఇంటి రాజిరెడ్డి అనే వ్యక్తి బంగారు ఆభరణాల కోసం వృద్ధురాలిని దారుణంగా హత్యచేసినట్లుగా గుర్తించడం జరిగింది. కాగా, రాజిరెడ్డిని గత నెలలోనే రిమాండ్‌కు తరలించగా మిస్టరీని ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన ఏసీపీ, సీఐలను నెలవారీ నేరసమీక్ష సమావేశంలో సీపీ నగదు పురస్కారంతో అభినందించారు.

వినికిడి లోపాన్ని నివారించవచ్చు

డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య

వరంగల్ మెడికల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : వినికిడి లోపాన్ని నివారించవచ్చని అందుకు గల కారణాలను ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య అన్నారు. సోమవారం లష్కర్ సింగారంలోని పట్టణ ఆరోగ్యకేంద్రంలో ప్రపంచ వినికిడి దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. వినికిడి సమస్యల నివారణ, నియంత్రణ కోసం ఈ కార్యక్రమాన్ని రూపొందించడం జరిగిందని, ఎన్‌సీడీ కార్యక్రమానికి అనుసంధానం చేయడం జరిగిందన్నారు. పంచేంద్రియాలలో చెవులు కూడా ముఖ్యమైనవేనని, హెడ్‌ఫోన్‌ల వినియోగం, సురక్షితమైన శ్రవణంపై అలాగే చెవులకు ఇన్ఫెక్షన్ జరిగినప్పుడు అశ్రద్ధ చేయకుండా వైద్యులను సంప్రదించాలని సూచించారు. మొబైల్ వినియోగం కూడా అవసర ఉన్నంత వరకు వినియోగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అహ్మద్, డాక్టర్ ఇక్తెధర్ అహ్మద్, వైద్యాధికారి హైదర్, వి.అశోక్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బాబు, శ్రీనివాస్, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

హాల్ టికెట్లు ఇవ్వని ప్రైవేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

ఏబీఎస్ఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మంద నరేశ్

కేయూ క్యాంపస్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఫీజుల పేరుతో విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తూ హాల్ టికెట్లు ఇవ్వని ప్రైవేట్ జూనియర్ కళాశాలలపై విద్యాశాఖ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఏబీఎస్ఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మంద నరేశ్ డిమాండ్ చేశారు. సోమవారం కేయూలో ఏబీఎస్ఎఫ్ నేతృత్వంలో విద్యార్థుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంద నరేశ్ మాట్లాడారు. ఇంటర్ పరీక్షల నేపథ్యంలో ప్రైవేట్ కళాశాలలు ఫీజుల పేరుతో విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎలాంటి పర్మిషన్ లేకుండా కాలేజీలను నడుపుతూ వేల రూపాయాలను అక్రమంగా విద్యార్థుల నుంచి వసూల్ చేస్తున్నారని మండిపడ్డారు. హాల్ టికెట్లు ఇవ్వకుండా విద్యార్థులను మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్న కళాశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఏబీఎస్ఎఫ్ నేతృత్వంలో ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏబీఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు దార సురేశ్, కేయూ ప్రధానకార్యదర్శి పృథ్వీరాజ్, అర్షం చరణ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

నిరంతర విద్యుత్ సరఫరాకు సిద్ధంగా ఉండాలి

ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి



వీసీలో మాట్లాడుతున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

రాంనగర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : రానున్న వేసవిలో నిరంత రాయంగా విద్యుత్‌ను సరఫరా చేసేందుకు ముందస్తు ప్రణాళికలతో విద్యుత్ శాఖ యంత్రాంగం సిద్ధంగా ఉండాలని టీజీ ఎన్పీడీసీ ఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం ఎన్పీడీసీఎల్ పరిధిలోని 16 సర్కిళ్ల ఎస్ఈలు, డీఈలు, ఏడీఈలు, ఏఈలతో సీఎండీ నక్కలగుట్ట కార్పొరేట్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ ఇంటర్ లింకింగ్ పనులతో పాటు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాట్లను త్వరతగిన పూర్తి చేయాలన్నారు. మార్చి, ఏప్రిల్ నెలల పరీక్ష సమయం అయినందున విద్యుత్ అంతరాయం లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులకు ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా ఉండేటట్లు చూడాలన్నారు. పురోగతిలో ఉన్న సబ్‌స్టేషన్‌ల పనులను వేగవం తం చేయాలని సూచించారు. వోల్టేజీను మరింత మెరుగుపరచడానికి లైన్‌లలో కెపాసిటర్ బ్యాంకులను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జీ డైరెక్టర్లు అశోక్‌కుమార్, సదర్‌లాల్, మధుసూదన్, తిరుపతిరెడ్డి, సీఈలు తిరుమల్‌రావు, రాజు చౌహాన్, అశోక్, బీకంసింగ్, వెంకటరమణ, జీయంలు పాల్గొన్నారు.

సంరక్ష ఆస్పత్రికి రెండు పీజీ ఆర్థోపెడిక్ సీట్లు

గిర్మాజిపేట,మార్చి3(ఆంధ్రజ్యోతి): వరంగల్‌లోని సంరక్ష ఆస్పత్రికి కేంద్ర వైద్య ప్రజారోగ్యశాఖ 2 పోస్టుగ్రాడ్యుయేట్ ఆర్థోపెడిక్ సీట్లు మంజూరు చేసింది. మూడు సంవత్సరాల వ్యవధి కలిగిన పోస్టుగ్రాడ్యుయేట్ కోర్సు ఎం.డి, ఎం.ఎస్‌లతో సమానం. ఎంబీబీఎస్ అనంతరం చదివే ఈ ఆర్థోపెడిక్ కోర్సుకు నీట్ ద్వారా అడ్మిషన్‌లను నిర్వహిస్తారు. కేంద్ర వైద్య, ప్రజారోగ్యశాఖ ఆధ్వర్యంలోని డైరెక్టర్ ఆఫ్ జనరల్ హెల్త్ సర్వీసెస్, మెడికల్ కౌన్సిలింగ్ కమిటీ నీట్ మెడికల్ కౌన్సిలింగ్ 2024లో న్యూఢిల్లీకి చెందిన డాక్టర్ హిమాలయ గుప్తాకు పీజీ డీఎన్‌బి ఆర్థోపెడిక్ సీటును కేటాయించగా సోమవారం తను సంరక్ష ఆస్పత్రిలో రిపోర్టు చేశారు. ఈ సందర్భంగా హిమాలయ గుప్తాను కేఎంసీ ప్రిన్సిపాల్, రాష్ట్ర ఆర్థోపెడిక్ అసోసియేషన్ అధ్యక్షుడు కాటం రామ్‌కుమార్ రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైస్ చైర్మన్ డాక్టర్ కె.తిరుపతి రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్లు దిడ్డి శ్రవణ్, ఇతర వైద్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు

హసన్‌పర్తి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): నాగారం క్రాసు రోడ్డులోని పెట్రోల్ పంపు సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలైనట్లు ఎస్సై శీలం రవి తెలిపారు. బాధితుల కథనం ప్రకారం.. నాగారం గ్రామానికి చెందిన ఐదుగురు మహిళలు బొద్దుకూరి ప్రమీల, బూర్న స్వరూప, కుక్కముడి మణ్యత, బండారి కిష్ట, సందరాజు సౌమ్యలు ఆటోలో సోమవారం నాగారం నుంచి ఎర్రగట్టుగుట్ట క్రాసు రోడ్డు వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో రోడ్డు పక్కనే వీరు ప్రయాణిస్తున్న ఆటో నిలిచి ఉండగా వెనక నుంచి మరో ఆటో అతివేగంగా వచ్చి ఢీకొట్టడంతో ఐదుగురికి గాయాలైనట్లు బాధితులు తెలిపారు. గాయపడిన వారిని స్థానికులు ఎంజీఎంకు తరలించారు. బాధితురాలి భర్త బొద్దుకుమారస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అక్రమంగా మొరం తరలిస్తున్న ట్రాక్టర్ స్వాధీనం

మడికొండ, మార్చి 3(ఆంధ్రజ్యోతి):మొరం తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్ర కారం కానిస్టేబుళ్లు వాసు, నవీద్ అలీ పెట్రోలింగ్ చేస్తుండగా రాంపేటకు చెందిన హరీష్ ట్రాక్టర్‌లో అక్రమంగా మొరం తరలిస్తూ పట్టుబడ్డాడు. అదుపులోకి తీసుకొని ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

పౌష్టికాహారం

లేత కొబ్బరిలో...

ఎండ పెరుగుతోంది కాబట్టి అప్పుడప్పుడూ కొబ్బరినీళ్లు తాగుతూ ఉంటాం. అయితే కొబ్బరినీళ్లు తాగేసి కాయ విసిరేయకుండా, దాన్లోని లేత కొబ్బరిని కూడా తింటూ ఉండాలి. ఎందుకంటే...

- లేత కొబ్బరిలో పీచు ఎక్కువగా ఉంటుంది. కాబట్టి జీర్ణశక్తి మెరుగు పడుతుంది. పేగులు కూడా ఆరోగ్యంగా ఉంటాయి
- లేత కొబ్బరిలో ఉండే పొటాషియం, ఎలక్ట్రొలైట్లు వ్యాయామం నుంచి కోలుకునే అత్యవసర పోషకాలను భర్తీ చేస్తాయి. కాబట్టి లేత కొబ్బరిని వ్యాయామం తర్వాత అల్పాహారంగా తీసుకోవచ్చు
- లేత కొబ్బరిలోని ఆరోగ్యకరమైన కొవ్వులు గుండెకు మేలు చేస్తాయి
- లేత కొబ్బరిలో యాంటీబ్యాక్టీరియల్, యాంటీవైరల్ గుణాలు కలిగిన లారిక్ యాసిడ్ ఉంటుంది. దీంతో వ్యాధినిరోధకశక్తి మెరుగవుతుంది
- దీన్లోని మీడియం చైన్ ట్రైగ్లిజరైడ్స్ తక్షణ శక్తిని అందిస్తాయి.



అవగాహన

పచ్చబొట్లతో ప్రమాదాలు

పచ్చబొట్లు ఫ్యాషన్‌లో భాగమైపోయాయి. నలుగురినీ ఆకట్టుకునే అందమైన పచ్చబొట్టు పొడిపించుకునేటప్పుడు దాంతో పొంచి ఉండే ప్రమాదాలను కూడా గుర్తు పెట్టుకోవాలి.

అలర్జీలు: టాటూల కోసం ఉపయోగించే సిరాతో, ప్రత్యేకించి ఎర్ర సిరాతో కొందరికి చర్మపు అలర్జీలు తలెత్తుతాయి. దాంతో పచ్చబొట్టు పొడిపించుకున్న చోట దురదలు, దద్దుర్లు ఏర్పడతాయి. అలాగే పచ్చబొట్టు పొడిపించుకున్న ప్రదేశం ఎండకు బహిర్గతం అవడం వల్ల కొందర్లో ఫొటోఅలర్జిక్ రియాక్షన్ కూడా తలెత్తుతుంది



ఇన్‌ఫెక్షన్లు: టాటూలు చర్మపు సహజసిద్ధ రక్షణ పొరను ఛిద్రం చేస్తాయి. పరిశుభ్రత, స్టెరిలైజేషన్‌లను పాటించకపోతే వాటితో చర్మపు ఇన్‌ఫెక్షన్లు వేధిస్తాయి. హెపటైటిస్ బి, హెపటైటిస్ సి లాంటి వైరల్ ఇన్‌ఫెక్షన్లతో పాటు, కొన్ని రకాల బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్లు సోకే అవకాశాలుంటాయి.

కెలాయిడ్ మచ్చలు: కొందర్లో కెలాయిడ్ స్కారింగ్ సమస్య ఉంటుంది. ఈ సమస్య ఉన్నవాళ్లలో టాటూ వేయించుకున్న ప్రదేశం ఉబ్బెత్తుగా, అందవిహీనంగా మారిపోతుంది. అలాగే ఎమ్మారై స్కానింగ్ సమయంలో టాటూలు ఇబ్బందికరంగా మారతాయి. ఇమేజింగ్ నాణ్యతను దెబ్బతీస్తాయి.

చర్మం పలుచన: సోరియాసిస్ లాంటి చర్మ సమస్యలున్నవాళ్లలో టాటూల వల్ల చర్మం మరింత పలుచబడి, మచ్చలు ఏర్పడతాయి.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

- టాటూలు వేయించుకునే ముందు, వైద్యుల చేత చర్మ తత్వాన్ని పరీక్షించుకోవాలి.
- నాణ్యమైన సిరా, పనిముట్లు వాడే టాటూ కళాకారులను ఎంచుకోవాలి
- అనుభవమున్న, పరిజ్ఞానమున్న ఆర్టిస్టులకే ప్రాధాన్యం ఇవ్వాలి
- సున్నిత చర్మం కలిగి ఉన్న వాళ్లు టాటూలకు దూరంగా ఉండడమే మేలు

తెలుసుకుందాం

మెదడు దెబ్బతినకుండా...



దైనందిన జీవితంలో మనం అనుసరించే కొన్ని అలవాట్లు మెదడు ఆరోగ్యాన్ని నిశ్శబ్దంగా దెబ్బతీస్తూ ఉంటాయి. నిరంతరం మెదడు చురుగ్గా ఉండాలంటే ఆ అలవాట్లకు స్వస్తి చెప్పాలి.

ఎక్కువ సేపు కూర్చుంటే: గంటల తరబడి కదలకుండా కూర్చోడానికీ, జ్ఞాపకశక్తికి కీలకమైన మెదడులోని ఒక భాగంలో మార్పులకూ సంబంధం ఉందని పరిశోధనల్లో తేలింది. ఆ ప్రభావాన్ని తగ్గించడం కోసం ప్రతి గంటకూ లేచి నిలబడి కనీసం ఐదు నిమిషాల పాటైనా నడుస్తూ ఉండాలి.

సరిపోని నిద్ర: కనీసం ఏడు నుంచి ఎనిమిది గంటలు నిద్రాభంగం కలగకుండా కంటి నిండా నిద్రపోవాలి. నిద్ర లోపిస్తే, జ్ఞాపకశక్తితో పాటు, సమస్యను పరిష్కరించే నైపుణ్యాలు కూడా దెబ్బతింటాయి. కాబట్టి రాత్రి నిద్రకు రెండు గంటల ముందు నుంచి మెదడును మెలకువగా ఉంచే ఫోన్లు, టివిలకు దూరంగా ఉండాలి.

ఒంటరితనం: మెదడు ఆరోగ్యానికి ఒంటరితనం ప్రమాదకరం. తరచూ ఇతరులతో కలుస్తూ కాలక్షేపం చేస్తూ ఉండడం వల్ల మెదడు చైతన్యమవుతూ చురుగ్గా ఉంటుంది. ఒంటరితనంలో బయటి నుంచి ప్రేరణ లోపించడం మూలంగా మానసిక కుంగుబాటు, ఆందోళన, మతిమరుపు సమస్యలు వేధిస్తాయి. కాబట్టి తరచూ స్నేహితులు, కుటుంబసభ్యులతో సరదా సమయాలు గడుపుతూ ఉండాలి.

మోతమోగే హెడ్‌ఫోన్స్: సంగీతం వినడం ద్వారా సేద తీరడం మంచిదే కానీ, చెవులు మోతమోగేలా పెద్ద శబ్దంతో హెడ్‌ఫోన్స్‌లో పాటలు వినడం వల్ల మెదడుకు చేటు జరుగుతుంది. పెద్ద శబ్దాలు వినికిడి లోపం సమస్యకు దారి తీస్తాయి. వినికిడి లోపం క్రమేపీ డిమెన్షియా, అల్జీమర్స్ వ్యాధులకు దారి తీస్తుంది.

ఔషధ వినియోగం

మనం రకరకాల మందులు వాడుకుంటూ ఉంటాం. వాటిలో పరగడుపున తీసుకోవాల్సిన మందులుంటాయి. తినే ముందు, తిన్న తర్వాత వేసుకోవలసినవీ ఉంటాయి. మందులు సమర్థంగా పనిచేయాలంటే, వాటిని ఎలా వాడుకోవాలో, వాటి వాడకంలో ఎలాంటి నియమాలు పాటించాలో వైద్యులు ఇలా వివరిస్తున్నారు.



మందుల మంచీ చెడూ

పోపుల డబ్బా లేకపోతే వంటింట్లో వంట పూర్తి కానట్టే, మందుల డబ్బా లేకపోతే ఆరోగ్యం అటకెక్కే పరిస్థితి చాలా ఇళ్లలో ఉంటుంది. అధిక రక్తపోటు, మధుమేహం, థైరాయిడ్, రక్తం పలుచన చేసే మందులు... ఇలా మన మందుల డబ్బాలో రకరకాల మందులు ఉంటూ ఉంటాయి. ఏ మాత్రను ఎప్పుడు మింగాలో వైద్యుల ప్రిస్క్రిప్షన్‌లో స్పష్టంగా పేర్కొని ఉంటుంది. అయినా ఆ నియమాలను తూచ తప్పకుండా పాటించేవాళ్లను వేళ్ల మీద లెక్క పెట్టవచ్చు. ఉదయం మింగవలసిన మాత్ర మర్చిపోయి, మధ్యాహ్నం వేసుకునేవాళ్లుంటారు. పరగడుపున తీసుకోవలసిన మందును తిన్న తర్వాత వేసుకునేవాళ్లుంటారు. వేసుకోవలసిన మాత్రలన్నిటినీ ఒకేసారి కలిపి మింగేసేవాళ్లూ ఉంటారు. కానీ తీసుకునే మందుల సామర్థ్యం పూర్తి స్థాయిలో దక్కాలన్నా, శరీరం మందును సంపూర్తిగా శోషించుకోవాలన్నా వైద్యులు సూచించిన నియమాలను తప్పనిసరిగా అనుసరించాలి.

ఖాళీ కడుపుతో...

కొన్ని మందులను శరీరం సమర్థంగా శోషించుకోవాలంటే వాటిని ఖాళీ కడుపుతోనే తీసుకోవాలి. థైరాయిడ్ మాత్ర అలాంటిదే! థైరాయిడ్ హార్మోన్ ఉత్పత్తి ఉదయం వేళ ఎక్కువగా ఉంటుంది. కాబట్టి ఈ మాత్రను తప్పనిసరిగా పరగడుపునే తీసుకోవాలి. సెమాగ్లూటైడ్ అనే మధుమేహం మందు, ఉదయం అల్పాహారానికి గంట ముందు తీసుకోవాల్సి ఉంటుంది. సల్ఫనైలూరియాస్ అనే మధుమేహ మందును ఆహారానికి అరగంట ముందు వేసుకోవాలి. మెట్‌ఫార్మిన్ అనే ఇంకొక రకం మందు ఆహారం తర్వాత తీసుకోవచ్చు. ఇంకొన్ని రకాల మధుమేహం మందులు తిన్న తర్వాతే తీసుకోవలసి ఉంటుంది. ఎప్పుడు తీసుకోవడం మేలన్నది చక్కెర మందు రకం మీద ఆధారపడి ఉంటుంది. అధిక రక్తపోటుకు వాడుకునే కొన్ని మందులతో పొట్టలో సమస్యలు వేధిస్తాయి కాబట్టి వీటిని ఆహారం తిన్న తర్వాత తీసుకోవాలి.

కొన్ని ఆహారం తర్వాతే...

ఒకే పూట ఒకటి కంటే ఎక్కువ మందులు వాడుకునే పరిస్థితి ఉంటుంది. అలాంటప్పుడు వాటిని కలిపి వేసుకున్నా సమస్య ఉండదు. అయితే ఖాళీ కడుపుతో వేసుకోవలసిన మాత్ర పరగడుపునే ఆ ఒక్క మాత్రకే పరిమితం కావడం ఉత్తమం. నొప్పి నివారణ మందులతో గ్యాస్ట్రైటిస్ సమస్య ఎక్కువగా ఉంటుంది. కాబట్టి ఈ మందులను ఆహారం తిన్న తర్వాతే తీసుకోవాలి. అలాగే మందుల ప్రభావం ఆహారం మీద కూడా ఆధారపడి ఉంటుంది. పాంటాప్రొజోల్ లాంటి అసిడిటీ మందులు ఆహారం తినడానికి అర గంట ముందే వేసుకోవాలి. కొన్ని క్యాల్షియం మందులను ఖాళీ కడుపుతో వేసుకుంటే గ్యాస్ట్రైటిస్ సమస్య వేధిస్తుంది. కాబట్టి వీటిని కూడా తిన్న తర్వాత తీసుకోవాలి. అలాగే ఐరన్ మందులతో కొందరికి మలబద్ధకం, మరికొందరికి డయేరియా రావచ్చు. కాబట్టి వాటిని కూడా ఆహారం తిన్న తర్వాత తీసుకోవాలి.

మందులు వికటిస్తే?

మోతాదు పెరగడం వల్ల, ఊహించని పరిణామాల వల్ల మందులు వికటించే అవకాశాలుంటాయి. ఒకసారి సమర్థంగా పనిచేసిన మాత్ర, కొన్ని రోజుల తర్వాత రెండోసారి తీసుకున్నప్పుడు డ్రగ్ రియాక్షన్‌కు దారి తీయవచ్చు. ఆ నిర్దిష్ట సమయంలో, ఆ నిర్దిష్ట మందుకు, మన శరీరం అవసరానికి మించి స్పందించడమే ఈ పరిస్థితికి కారణం. కొన్ని సందర్భాల్లో మందు మోతాదు పెరగడం వల్ల కూడా డ్రగ్ రియాక్షన్ సంభవించవచ్చు. ఇలా మందులు వికటించినప్పుడు ప్రధానంగా కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. అవేంటంటే...

- చర్మం మీద దద్దుర్లు, దురదలు
- వాంతులు
- కడుపులో నొప్పి
- కళ్లు తిరగడం

> సాధారణంగా ఎవరైనా నీళ్లతోనే మందులు మింగుతారు. కానీ మందులు మింగడం ఇష్టం లేని వాళ్లు పాలు, పండ్లరసాల మీద ఆధారపడుతూ ఉంటారు. అయితే మధుమేహం, అధిక రక్తపోటు, హృద్రోగాలు.. ఇలా ఒకటికి మించి రుగ్మతలున్నవాళ్లు పాలు, పండ్ల రసాలతో కలిపి మందులు మింగడం వల్ల అదనపు క్యాలరీలు శరీరంలోకి చేరిపోయే అవకాశాలుంటాయనే విషయం గుర్తుపెట్టుకోవాలి.



తీవ్రమైన డ్రగ్ రియాక్షన్‌లో...

సాధారణంగా సిప్రోఫ్లాక్సిన్, నార్‌ఫ్లాక్సిన్ లాంటి ఫ్లోరోక్వినోలోన్స్ తాలూకు మందులతో, ఎప్టాయిన్, కార్బామజెపీన్, వ్యాల్‌ప్రొవేట్ లాంటి కొన్ని మూర్ఛ మందులతో, కొన్ని నొప్పి నివారణ మందులతో, కొన్ని యాంటీబయాటిక్స్‌తో కొందర్లో తీవ్ర డ్రగ్ రియాక్షన్ తలెత్తే అవకాశాలుంటాయి. ఎంతో అరుదుగా కొన్ని కీమోథెరపీ మందులు కూడా వికటిస్తూ ఉంటాయి. అలాంటి సందర్భాల్లో కొన్ని లక్షణాలు కనిపిస్తాయి.

- రక్తపోటు పూర్తిగా పడిపోతుంది
- అంతర్గత వాపులు ఏర్పడతాయి
- శ్వాస నాళికలో వాపు వల్ల శ్వాస అందని ప్రమాదకర పరిస్థితి తలెత్తవచ్చు

కాబట్టి తేలికపాటి లక్షణాలైనా, తీవ్రమైనా లక్షణాలైనా వాటిని వైద్యుల దృష్టికి తీసుకువెళ్లడం అత్యవసరం. అలాగే వికటించిన మందులను గుర్తు పెట్టుకుని, వైద్యులను కలిసి, చికిత్స తీసుకునే ప్రతి సందర్భంలో వాటి గురించి వైద్యులకు తెలియపరచాలి.

మందుల నిల్వ ఇలా...

- ప్రొబయాటిక్ మందులను ఫ్రిడ్జ్‌లో నిల్వ చేసుకోవాలి
- ఇన్సులిన్ మందులను ఫ్రీజర్‌లో నిల్వ చేసుకోవాలి
- కీమోథెరపీ మందులు, వ్యాక్సిన్లు ఫ్రీజ్ చేసుకోవాలి
- మధుమేహం, అధిక రక్తపోటు, ఇతరత్రా సాధారణ మందులన్నీ సూర్యరశ్మి సోకకుండా, నీడలో, గది ఉష్ణోగ్రతలో నిల్వ చేసుకోవాలి.

మద్యంతో మందులు?

మద్యం ఔషధాల ప్రభావాన్ని తగ్గిస్తుంది. మద్యంతో కలిపి తీసుకోవడం వల్ల, కొలెస్ట్రాల్ మందులు, రక్తం పలుచబడే మందుల ప్రభావం కూడా సన్నగిల్లుతుంది. అయితే మద్యం వల్ల రియాక్షన్ వచ్చే మందులు కూడా కొన్ని ఉన్నాయి. మద్యం మానేయడానికి తోడ్పడే డైసల్ఫిరామ్, నీళ్ల విరేచనాల కోసం తీసుకునే మెట్రోజిల్ గ్రూపు సంబంధిత మందులను మద్యంతో కలిపి తీసుకున్నప్పుడు రియాక్షన్ రావచ్చు. వాంతులు, చర్మం వాపులు, కడుపులో నొప్పి, శ్వాస సమస్యలు తలెత్తవచ్చు. కాబట్టి ఈ మందులను మద్యంతో కలిపి తీసుకోకూడదు.

సొంత వైద్యం ఎంత మేరకు?

సొంత వైద్యం అలవాటుగా మారకూడదు. మరీ ముఖ్యంగా యాంటీబయాటిక్స్ వైద్యులు సూచించినంత కాలం, సూచించిన మోతాదుల్లో మాత్రమే వాడుకోవాలి. సూచించిన రోజుల కంటే తక్కువ రోజులకు పరిమితం కావడం, ఎక్కువ రోజులు వాడుకోవడం... రెండూ శ్రేయస్కరం కాదు. యాంటీబయాటిక్ రెసిస్టెన్స్ (మందులు పనిచేయని స్థితి) లేదా దుష్ప్రభావాలకు గురి కాకుండా ఉండాలంటే వైద్యులు సూచించకుండా వాటిని వాడుకోకూడదు.

కాలం చెల్లిన మందులతో...

కాలం చెల్లినంత మాత్రాన మందులు విషపూరితంగా మారిపోవు. ముందువరకూ సమర్థంగా పనిచేసిన మందులు, ఒక్క రోజు దాటిన వెంటనే విషంగా మారిపోయే పరిస్థితి ఉండదు. కానీ కాలం చెల్లిన తర్వాత మందులు వాటి ప్రభావాన్ని కోల్పోతాయి. టెట్రాసైక్లిన్ గ్రూపుకు చెందినకాలం చెల్లిన మందులతో మాత్రం కొన్ని దుష్ప్రభావాలు ఉండవచ్చు. కాబట్టి ఏ మందైనా దాని తయారీ, కాలం చెల్లే తేదీలను గమనించుకుని వాడుకోవాలి.

డాక్టర్ శశి కిరణ్
సీనియర్ జనరల్ ఫిజీషియన్,
యశోద హాస్పిటల్స్,
సోమాజిగూడ, హైదరాబాద్.



మీకు తెలుసా?

అధిక చక్కెర చేటు

చక్కెరలో పోషకాలు ఉండవు. అయినా అందరం తీపిని ఇష్టంగా తింటాం. అయితే కొందరు తీపి పదార్థాలను విపరీతంగా తింటూ ఉంటారు. ఇలాంటి అలవాటుతో ఒరిగే నష్టాల గురించి తెలుసుకుందాం!

ఆకలి పెరుగుతుంది

చక్కెర ద్వారా శరీరంలోకి ఎక్కువ క్యాలరీలు చేరడం వల్ల ఆకలి పెరుగుతుంది. తీపితో రుచి మొగ్గలు సంతృప్తి పడినా పొట్ట నిండదు. ప్రాథమిక పోషకాలు లోపించే శుద్ధి చేసిన పదార్థాలు ఎక్కువగా తినడం వల్ల శరీరం చక్కెరను ఖర్చు చేసుకుని వెంటనే ఆకలిని పెంచుతుంది. దాంతో అదనపు ఆహారంతో అదనపు క్యాలరీలు శరీరంలోకి చేరుకుంటాయి.



చికాకు పెరుగుతుంది

అదనపు చక్కెరతో చికాకు, ఆందోళనలు పెరుగుతాయి. అలాగే అదనపు చక్కెరలు జోడించిన పదార్థాలు తినడం వల్ల ఇన్‌ఫ్లమేషన్ పెరుగుతుంది. భావోద్వేగాలు అదుపు తప్పుతాయి. మానసిక కుంగుబాటు కూడా వేధిస్తుంది

నిస్సత్తువ ఆవరిస్తుంది

శరీరం చక్కెరను సులభంగా శోషించుకుంటుంది. త్వరగా జీర్ణమైపోతుంది. దాంతో సులభంగా నిస్సత్తువ ఆవరిస్తుంది. త్వరిత శక్తిని అందిస్తుంది కాబట్టే ఎంత తీపి తిన్నా తిన్న అరగంటకే నిస్సత్తువం వేధిస్తుంది.

తీపి మీద యావ

మనసు చక్కెర వైపే లాగుతోందంటే మనం చక్కెరకు బానిసలమయ్యామని అర్థం. చక్కెర మెదడులో ఉత్పత్తయ్యే హ్యాపీ హార్మోన్‌ను ప్రేరేపిస్తుంది. కాబట్టి చక్కెర తిన్న వెంటనే కలిగే సంతృప్తికి వ్యసనపరులుగా మారిపోతాం! పదే పదే ఆ సంతృప్తిని పొందడం కోసం మళ్లీ మళ్లీ తీపి కోసం ఆరాటపడతాం!

అధిక రక్తపోటు

అధిక చక్కెర అధిక రక్తపోటుకు దారి తీస్తుంది. చక్కెర వల్ల, కొలెస్ట్రాల్ లాంటి కొవ్వులు రక్తనాళాల్లోని లోపలి గోడలకు అతుక్కుపోయి, రక్తనాళాలను గట్టిపరుస్తాయి. దాంతో రక్తపోటు పెరుగుతుంది.

కీళ్ల నొప్పులు

చక్కెర కీళ్ల నొప్పులను పెంచుతుంది. వాపు, నొప్పులకు దారి తీస్తుంది. తీపి పదార్థాల వల్ల కీళ్ల నొప్పుల సమస్య మరింత పెరిగినట్టు, రుమటాయిడ్ ఆర్థ్రయిటిస్‌తో బాధపడే వారు పేర్కొన్నట్టు అధ్యయనాలు చెప్తున్నాయి.

మాంసకృత్తులు మన భోజనంలోనే...

భారతీయ భోజనంలో మాంసకృత్తుల లోటు ఉంటుందన్నది అపోహ మాత్రమే! నిజానికి వృక్షాధారిత పదార్థాలను సమపాళ్లలో తీసుకోగలిగితే సరిపడా ప్రొటీన్‌ను సమకూర్చుకోవచ్చు. అదెలాగో తెలుసుకుందాం!

తృణధాన్యాలు, చిక్కుళ్లు, పండ్లు, కూరగాయలతో కూడిన సంప్రదాయ భారతీయ భోజనాలన్నీ ప్రధానంగా వృక్షాధారితమైనవే! అలాగని భారతీయ భోజనంలో మాంసకృత్తులు లోపించాయనుకుంటే పొరపాటు. వృక్షాధారిత పదార్థాల్లో కూడా ప్రొటీన్ పుష్కలంగా దొరికే పదార్థాలను భోజనంలో ఉండేలా చూసుకుంటే మాంసకృత్తుల లోపాన్ని నియంత్రించుకోవచ్చు.



మాంసకృత్తుల అవసరత

వయసు, శరీర బరువు రోజువారీ పనుల ఆధారంగా మాంసకృత్తుల మోతాదును ఎవరికి వారు లెక్కించుకోవాలి. ఇందుకోసం పోషకాహార నిపుణుల సహాయం తీసుకోవచ్చు. వారి సలహాల ఆధారంగా సరిపడా మాంసకృత్తులు సమకూరే భోజనాన్ని ప్రణాళికాబద్ధంగా రూపొందించుకోవాలి. స్థానికంగా లభించే ఎన్నో ఆహారపదార్థాల్లో మాంసకృత్తులు పుష్కలంగా ఉంటాయి. అవేంటంటే...

కాయధాన్యాలు: కందిపప్పు, పెసరపప్పు, సెనగపప్పు, ఎర్ర కందిపప్పు
చిక్కుళ్లు, పప్పులు: సోయా బీన్స్, రాజ్మా, అలసందలు
పాల ఉత్పత్తులు: పెరుగు, జున్ను, పనీర్, నెయ్యి
చిరుధాన్యాలు, తృణ ధాన్యాలు: రాగులు, సజ్జలు, జొన్నలు, మొక్కజొన్న, గోధుమలు
గింజలు, విత్తనాలు: బాదం, నువ్వులు, పొద్దుతిరుగుడు, గుమ్మడి విత్తనాలు
- **స్నాక్స్:** వేరుసెనగలు, సెనగపప్పు, మొలకలు

పోషకాహార లోపం

- పుట్టగొడుగులు, టోఫు
- అవకాడొ

లెక్కలేనన్ని అపోహలు

ప్రొటీన్ పరంగా భారతీయ భోజనం చుట్టూరా ఎన్నో అపోహలు అలుముకుని ఉన్నాయి. ఆ అపోహలు, వాస్తవాల గురించి తెలుసుకుందాం!

- భారతీయ భోజనంలో ప్రొటీన్లు పరిమితమనే అపోహ ప్రచారంలో ఉంది. కానీ పప్పుధాన్యాలు, మొలకలు, తృణధాన్యాలలో ప్రొటీన్ పుష్కలంగా ఉంటుంది.
- శాకాహారుల భోజనంలో ప్రొటీన్ లోపిస్తుందన్నది కూడా అపోహే! పనీర్, సెనగలు లాంటి వాటిని భోజనంలో చేర్చుకోవడం ద్వారా ప్రొటీన్‌ను తేలికగా భర్తీ చేసుకోవచ్చు.
- అధిక ప్రొటీన్ మూత్రపిండాలకు హానికరం. ముందు నుంచీ మూత్రపిండాల సమస్యలున్నవారికి అధిక ప్రొటీన్ చేటు చేస్తుంది తప్ప, ఆరోగ్యంగా ఉన్న వాళ్లకు ప్రొటీన్ ఎటువంటి చేటూ చేయదు.

భోజనం ప్రణాళికాబద్ధంగా...

ప్రొటీన్ లోపం తలెత్తకుండా ఉండాలంటే ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రాత్రి భోజనంలో సరిపడా ప్రొటీన్ ఉండేలా చూసుకోవాలి. అందుకోసం...

బ్రేక్‌ఫాస్ట్ ఇలా...

గుడ్లు: ఉడికించినవి, స్క్రాంబుల్ చేసినవీ, లేదా కూరగాయ ముక్కలతో కలిపి ఆమ్లెట్ వేసి తినొచ్చు
పెరుగుతో: బెర్రీస్, నట్స్ కలుపుకుని తినొచ్చు
కాటేజ్ చీజ్: పండ్ల ముక్కలు కలుపుకుని తినొచ్చు. లేదా కూరగాయలతో కలిపి తినొచ్చు
ప్రొటీన్ స్మూదీస్: బాదం పాలు, అరటిపండు, షియా విత్తనాలు కలిపి తాగొచ్చు
టోఫు: టోఫు, కూరగాయ ముక్కలను వేయించుకుని తినొచ్చు
ఓట్స్: ఓట్స్, షియా విత్తనాలను కలిపి రాత్రంతా నీళ్లలో నానబెట్టుకుని, ఉదయాన్నే పండ్ల ముక్కలతో కలిపి తినొచ్చు

లంచ్‌లో...

పప్పుధాన్యాలు: కందిపప్పు లేదా పెసలతో పప్పు వండుకుని, అన్నంతో, రోటీతో తినొచ్చు. పప్పుకు కూరగాయలు, ఆకుకూరలు జోడించుకోవాలి.
కాబూలీ చనా: నానబెట్టి ఉడికించుకుని సలాడ్‌తో కలిపి తినొచ్చు. టమాటాలతో కలిపి వండుకుని, అన్నంతో, రోటీతో తినొచ్చు
కాటేజ్ చీజ్: షాహి పనీర్, పనీర్ టిక్కా, పాలక్ పనీర్‌లను రోటీ లేదా అన్నంతో కలిపి తినొచ్చు
మూంగ్ దాల్ చిల్లా: పెసరపప్పు దోసె, పెరుగుతో, కూరలతో కలిపి తినొచ్చు
రాజ్మా లేదా కడి: ఈ రెండూ వంటకాలూ అన్నంతో, రోటీతో తినొచ్చు
ఢోక్లా: సెనగపిండితో తయారయ్యే ఈ గుజరాతీ వంటకం బలవర్ధకమైనది. తేలికపాటి లంచ్‌లో భాగంగా ఢోక్లాను చట్నీతో కలిపి తినొచ్చు
సోయా చంక్స్: కూరలా వండుకుని తినొచ్చు. కూరగాయలతో కలిపి వేయించుకుని తినొచ్చు
పచ్చి బఠాణీ: వీటితో పులావ్ వండుకోవచ్చు. పనీర్‌తో కలిపి కూర తయారుచేసుకుని రోటీ, అన్నంతో తినొచ్చు.

డిన్నర్ ఇలా...

పనీర్ టిక్కా: పుదీనా చట్నీతో కలిపి తినొచ్చు లేదా దోస, టమాటా సలాడ్‌తో కలిపి తినొచ్చు
పెసరపప్పు: రోటీ లేదా అన్నంతో కలిపి తినొచ్చు
కిచిడి: క్యారట్స్, పచ్చి బఠాణీ, పాలకూర, పెసరపప్పు, బియ్యంతో తయారుచేసుకునే కిచిడి బలవర్ధకమైన ఆహారం
చనా మసాలా: బ్రౌన్ రైస్, క్వినోవా లేదా పొట్టుతీయని గోధుమపిండితో తయారుచేసిన రోటీలతో కలిపి తినొచ్చు
పాలక్ పనీర్: రోటీలు, అన్నంతో కలిపి తినొచ్చు.

కట్టుకున్నవాడే కాలయముడు?

కొట్టి, గొంతు నులిమి చంపి గుండెపోటుగా చిత్రించే యత్నం?

- హైదరాబాద్‌లో వివాహిత అనుమానాస్పద మృతి
- తన భార్య గుండెపోటుతో మృతి చెందిందంటూ ఆమె కుటుంబసభ్యులకు ఫోన్ చేసి చెప్పిన భర్త
- సొంతూరికి తరలించి దహనం చేసే ప్రయత్నం
- మృతురాలి మేనమామ ఫిర్యాదు ఆధారంగా వెంటనే భర్తను వెనక్కి రప్పించిన పోలీసులు
- హత్యేనని ప్రాథమిక నిర్ధారణకు వచ్చిన పోలీసులు?


సింగం శిరీష(ఫైల్)

చాదర్‌ఘాట్/హైదరాబాద్ సిటీ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): కట్టుకున్నవాడే తన మేనకోడలిపాలిట యముడయ్యాడని.. కొట్టి, గొంతు నులిమేసి చంపేసి గుండెపోటుతో చనిపోయినట్టు చెబుతున్నాడని ఓ వ్యక్తి చేసిన ఫిర్యాదుతో ఒక వివాహిత అనుమానాస్పద మృతి కేసు వెలుగులోకి వచ్చింది! ఆ ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు.. అప్పటికే ఆమె మృతదేహంతో సొంతూరికి బయల్దేరిన సదరు భర్తను వెనక్కి రప్పించారు. మృతదేహాన్ని శవపరీక్షలకు పంపించి.. అతణ్ని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం జరిగిందీ ఘటన. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మలక్‌పేట నల్గొండ చౌరస్తాలోని జమున టవర్స్‌లో నివాసముంటున్న సింగం శిరీష (34) హయత్‌నగర్‌లోని వివేరా ఆస్పత్రిలో స్టాఫ్ నర్సుగా పనిచేస్తోంది. ఆమెకు ఇద్దరు అక్కచెల్లెళ్లున్నారు. చిన్నప్పుడే వారి తల్లిదండ్రులు మృతి చెందడంతో కరీంనగర్‌కు చెందిన ఒక ప్రొఫెసర్ శిరీషను దత్తత తీసుకున్నట్టు సమాచారం. 2013లో ఉస్మానియా స్కూల్ ఆఫ్ నర్సింగ్‌లో డీఎన్‌ఎం శిక్షణ పూర్తిచేసుకున్న ఆమెకు.. మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పనిచేస్తున్న వినయ్ కుమార్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడి అది ప్రేమగా మారింది. ప్రొఫెసర్ కుటుంబం వద్దని వారించినా వినకుండా, ఇంటి నుంచి బయటకు వచ్చేసి ఎనిమిదేళ్ల క్రితం అతణ్ని పెళ్లి చేసుకుంది. 2016లో వారి వివాహం కాగా.. 2019లో పాప పుట్టింది. ఆ చిన్నారికి ఇప్పుడు ఐదేళ్లు.

పెళ్లయినప్పటి నుంచి వేధింపులు!

తనకు తల్లిదండ్రులు లేకపోవడం, ప్రేమించి పెళ్లి చేసుకోవడంవల్ల ఎలాంటి కట్న కానుకలు తేకపోవడంతో.. భర్త, అత్త, మామ, వారి కుటుంబ సభ్యులు వేధిస్తున్నారంటూ శిరీష తరచూ తన అక్కా చెల్లెళ్ల వద్ద వాపోయేదని సమాచారం. భార్యభర్తల మధ్య కూడా నిత్యం గొడవలు జరిగేవని తెలుస్తోంది. ఇదిలా ఉండగా.. శిరీషకు ఆదివారం ఉదయం ఛాతీలో నొప్పి రావడంతో ఆస్పత్రికి తీసుకెళ్లానని, అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు తెలిపారని వినయ్‌కుమార్ ఆదివారం ఆమె అక్కచెల్లెళ్లకు, బంధువులకు ఫోన్ చేసి చెప్పాడు. ఆమె మృతదేహాన్ని తమ సొంతూరైన నాగర్‌కర్నూల్ జిల్లా దోమలకుంటకు అంబులెన్స్‌లో తీసుకెళ్తున్నట్టు తెలిపాడు. విషయం తెలుసుకున్న మృతురాలి మేనమామ మధుకర్.. శిరీష మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు ఆస్పత్రిలోని సీసీ టీవీ ఫుటేజీని పరిశీలించి, అంబులెన్స్‌లో శిరీష మృతదేహాన్ని తీసుకెళ్తున్నట్టు గుర్తించారు. వెంటనే వినయ్‌కుమార్‌కు ఫోన్ చేశారు. అతని నంబర్ కలవకపోవడంతో అంబులెన్స్ డ్రైవర్ నంబర్ తెలుసుకొని ఫోన్ చేశారు. శిరీష మృతిపై అనుమానాలున్నాయని.. వెంటనే ఆమె మృతదేహంతో చాదర్‌ఘాట్ పీఎస్‌కు రావాలని ఆదేశించారు. పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ఆమె మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. మృతురాలి మేనమామ మధుకర్ అనుమానించినట్లుగానే శిరీష మెడపై కమిలిన గాయాలు, కొట్టిన ఆనవాళ్లు ఉండటంతో ఇది హత్యే అని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చినట్లు తెలిసింది. ఈ క్రమంలోనే.. శిరీష భర్త వినయ్‌కుమార్‌ను, అతడి సోదరుణ్ని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. పోస్టుమార్టం నివేదికతో ఆమెది హత్యా, గుండెపోటా అనే విషయం తేలనుంది. కాగా.. పోస్టుమార్టం అనంతరం వైద్యులు ఆమె మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించడంతో సోమవారం సాయంత్రం ఎర్రగడ్డ శ్మశాన వాటికలో అంత్యక్రియలు పూర్తిచేసినట్లు తెలిసింది.

ఎదురెదురుగా బులెట్ బండ్లు ఢీకొని..

తలకు తీవ్రగాయాలై ముగ్గురి దుర్మరణం

- భూపాలపల్లి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం


మృతులు రవీందర్ రెడ్డి, కొమ్మిడి నర్సింహా రెడ్డి, నర్సింగోజు సతీశ్ (ఫైల్)

భూపాలపల్లి కృష్ణకాలనీ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): తలకు హెల్మెట్ ధరించి ఉంటే గాయాలైనా కూడా ప్రాణాలు దక్కేవేమో! కానీ ఆ రెండు బులెట్ బండ్ల మీద ఉన్న ముగ్గురిలో ఏ ఒక్కరూ హెల్మెట్ పెట్టుకోలేదు! రెండువైపుల నుంచి దూసుకొస్తున్న ఆ బైక్‌లు ఓ మూల మలుపు వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో బైక్‌ల మీదున్న ముగ్గురూ ఎగిరిపడి.. తలకు తీవ్రగాయాలై ప్రాణాలు విడిచారు. భూపాలపల్లి రూరల్ మండలం రాంపూర్ శివార్లో ఈ ఘోర ప్రమాదం సంభవించింది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. మహాముత్తారం మండలం మీనాజీపేట గ్రామానికి చెందిన పింగిళి రవీందర్‌రెడ్డి (45), అదే గ్రామానికి చెందిన కొమ్మిడి నర్సింహారెడ్డి(35) కలిసి బులెట్‌పై భూపాలపల్లి మండలంలోని పెద్దాపూర్(పెర్కపల్లి) సమీపంలో జరిగిన వివాహ వేడుకకు హాజరయ్యారు. తిరిగి రాత్రి రాంపూర్ మీదుగా మీనాజీపేటకు బయల్దేరారు. భూపాలపల్లి మండలంలోని పంబాపూర్ గ్రామానికి చెందిన నర్సింగోజు సతీశ్ (30) మరో బుల్లెట్ వాహనంపై సొంత పని నిమిత్తం భూపాలపల్లికి వస్తున్నాడు. ఈ రెండు బైక్‌లు రాంపూర్ మలుపు వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో నర్సింహారెడ్డి, సతీశ్ ఘటనాస్థలిలోనే మృతిచెందారు. తీవ్ర గాయాలపాలైన రవీందర్ రెడ్డిని ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. కాగా మృతుల్లో ఒకరైన సతీశ్ భార్య నిండు గర్భిణి. మంగళవారం ఆమెకు కాన్పు జరగాల్సి ఉండగా భర్త మృతిచెందడం ఇంట్లో తీవ్ర విషాదాన్ని నింపింది.

చిత్రజ్యోతి
SINCE 1965

ఆస్కార్ వేడుకలు..

అనోరాకు అగ్రస్థానం



ప్రపంచ సినీ రంగంలో ఉన్నత పురస్కారంగా భావించే 97వ ఆస్కార్ అవార్డుల వేడుక కన్నులపండువగా సాగింది. అమెరికాలోని లాస్‌ఏంజిల్స్‌లోని డాల్బీ థియేటర్‌లో ఆదివారం సాయంత్రం (భారత కాలమానం ప్రకారం సోమవారం ఉదయం) నిర్వహించిన ఈ కార్యక్రమానికి కానన్ ఓబ్రియాన్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఆయన భారతీయులను ఉద్దేశించి హిందీలో మాట్లాడడంతో పాటు 'బ్రేక్ ఫాస్ట్ చేశారా' అని అనడం అందర్నీ ఆకట్టుకుంది.





ఈ వేడుకలో అందర్నీ ఆశ్చర్యపరిచిన చిత్రం 'అనోరా'. చిన్న చిత్రంగా తెరకెక్కిన ఈ సినిమా ఏకంగా ఐదు అకాడమీ అవార్డులను దక్కించుకుంది. ఉత్తమ చిత్రం, ఎడిటింగ్, స్క్రీన్ ప్లే, దర్శకుడు, నటి విభాగంలో పురస్కారాలు దక్కించుకుంది. దర్శకత్వంతో పాటు ఎడిటింగ్, స్క్రీన్ ప్లే అందించిన సీన్ బేకర్.. ఒకే చిత్రానికి నాలుగుసార్లు అవార్డు అందుకున్న మొదటి వ్యక్తిగా చరిత్ర సృష్టించారు. వాల్ట్ డిస్నీ గతంలో వేర్వేరు సినిమాల ద్వారా నాలుగు అవార్డులను అందుకున్న సంగతి తెలిసిందే. సీన్ బేకర్ ఈ అవార్డును వేశ్యలకు అంకితం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ థియేటర్ల మనుగడను కాపాడాల్సిన అవసరాన్ని చెప్పారు.

ఉత్తమ నటుడిగా అడ్రియన్ బ్రాడీ

బ్రాడీ కార్బెట్ తెరకెక్కించిన 'ద బ్రూటలిస్ట్' చిత్రానికి గాను ఉత్తమ నటుడిగా అవార్డును అందుకున్నారు అడ్రియన్ బ్రాడీ. ఆయనకు ఇది రెండో ఆస్కార్ పురస్కారం. 2002లో రోమన్ పొలాన్‌స్కీ దర్శకత్వంలో తెరకెక్కిన 'పియానిస్ట్' అతి పిన్న వయస్కుడిగా తొలిసారి ఆస్కార్‌ను అందుకున్నారు. ఈ రెండు సినిమాలు హోలోకాస్ట్ నేపథ్యంలో రూపొందినవే. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాధించిన విజయాలు, ఘనతలు శాశ్వతం కాదని తెలిపారు. అలాగే, 'ద రియల్ పెయిన్' చిత్రానికి గాను ఉత్తమ సహాయ నటుడిగా అవార్డును అందుకున్నారు కీరన్‌కైల్ కల్కిన్.

ఉత్తమ నటిగా మైకీ మ్యాడిసన్

'అనోరా' చిత్రానికి ఉత్తమ నటిగా పురస్కారం అందుకున్నారు మైకీ మ్యాడిసన్. ఈ రొమాంటిక్ కామెడీ డ్రామాలో ఆమె వేశ్య పాత్రలో నటించారు. ఈ అవార్డును అందుకోవడం కలలా ఉందని మ్యాడిసన్ చెప్పారు. అలాగే, 'ఎమిలియా పెరెజ్' చిత్రానికి గాను ఉత్తమ సహాయ నటిగా జో సాల్డాన అవార్డును అందుకున్నారు. అత్యధిక నామినేషన్లతో రేసులో నిలిచిన నాన్ ఇంగ్లీష్ చిత్రం 'ఎమీలియా పెరెజ్' కేవలం రెండు అవార్డులతో సరిపెట్టుకుంది. పది నామినేషన్లు సాధించిన 'బ్రూటలిస్ట్' చిత్రం మూడు అవార్డులు పొందింది. 'డ్యూన్ 2' చిత్రం రెండు అవార్డులను సొంతం చేసుకుంది.

ఆస్కార్ గెలుపులో తెలంగాణ వాసి పాత్ర



ఉత్తమ విజువల్ ఎఫెక్ట్స్‌లో పురస్కారం పొందిన 'డ్యూన్ 2' చిత్రం వీఎఫ్ఎక్స్ టీమ్‌లో తెలంగాణ వాసి ఉండడం విశేషం. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మునిసిపాలిటీ అమినాపురంకు చెందిన ఎడ్ల సుమంత్‌రెడ్డి ఈ చిత్రానికి ఆరు క్యారెక్టర్లను డిజైన్ చేశారు. ఈ సందర్భంగా పలువురు ఆయనను అభినందించారు.

కేసముద్రం (ఆంధ్రజ్యోతి)


విజేతల వివరాలు

ఉత్తమ చిత్రం: అనోరా
ఉత్తమ దర్శకుడు: సీన్ బేకర్ (అనోరా)
ఉత్తమ నటుడు: అడ్రియన్ బ్రాడీ (ద బ్రూటలిస్ట్)
ఉత్తమ నటి: మైకీ మ్యాడిసన్(అనోరా)
ఉత్తమ సహాయ నటుడు: కీరన్‌కైల్ కల్కిన్ (ద రియల్ పెయిన్)
ఉత్తమ సహాయ నటి: జో సాల్డాన (ఎమిలియా పెరెజ్)
ఉత్తమ ఎడిటింగ్ : అనోరా (సీన్ బేకర్)
ఉత్తమ సినిమాటోగ్రఫీ: ద బ్రూటలిస్ట్ (లాల్ క్రాలే)

అనూజకు నిరాశ

భారత్ తరఫున ఆస్కార్ నామినేషన్ పొందిన లైవ్ యాక్షన్ షార్ట్ ఫిల్మ్ 'అనూజ' చిత్రానికి నిరాశ ఎదురైంది. ఈ విభాగంలో పోటీపడుతున్న చిత్రాలను ఓడించి, 'ఐ యామ్ నాట్ ఏ రోబో' లఘు చిత్రం పురస్కారాన్ని కైవసం చేసుకుంది.


కాకుల కథ.. మరింత కొత్తగా!



రెగ్యులర్ సినిమాల జోలికి పోకుండా ఓ కొత్త పంథాలో వెళ్లాలని హీరో నాని ప్రయత్నిస్తున్నారనే దానికి ఆయన ఇంతకుముందు చేసిన 'దసరా', ఇప్పుడు విడుదల కాబోయే 'ద ప్యారడైజ్' సినిమాలే నిదర్శనం. 'దసరా' 1980 నాటి కథ. ఆ చిత్ర దర్శకుడు శ్రీకాంత్ ఓదెల రూపొందిస్తున్న 'ద ప్యారడైజ్' కథ ఇంకా పాతది. సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ చిత్రం గ్లింప్స్‌ను 'రా స్టేట్‌మెంట్' పేరుతో విడుదల చేశారు. 'చరిత్రలో అందరూ చిలకలు, పావురాలు గురించి రాసిర్రు గానీ అదే జాతిలో పుట్టిన కాకుల గురించి రాయలే. ఇది కడుపు మండిన కాకుల కథ. జమానా జమానా కెళ్లి నడిచే శవాల కథ. అమ్మ రొమ్ములో పాలు లేక రక్తంబోసి పెంచిన ఓ జాతి కథ. ఒక దగడ్ వొచ్చి మొత్తం జాతిలో జోష్ తెచ్చిండు.. థూ అనిపించుకున్న కాకులు తల్వార్‌లు పట్టినయ్.. ఇది ఆ కాకులను ఒక్కటి చేసిన తిరుగుబాటుదారుడి కథ' అంటూ ఈ గ్లింప్స్‌లో నేపథ్యంలోంచి వినిపించిన వాయిస్ ఓవర్ ఆకట్టుకుంది. అలాగే ఇందులో నాని గెటప్ కూడా చాలా విభిన్నంగా ఉంది. పాత్ర కోసం ఆయన అద్భుతమైన మేకోవర్ అదిరిపోయింది, అలాగే అనిరుధ్ రవిచంద్రన్ నేపథ్య సంగీతం సూపర్‌గా ఉంది. తెలుగు, తమిళ, హిందీతో పాటు ఇంగ్లీష్, స్పానిష్ భాషల్లో 'ద ప్యారడైజ్' వచ్చే ఏడాది మార్చి 26న విడుదల కానుంది.

సినిమా వాళ్ల నట్లు, బోల్టులు టైట్ చేస్తా

- కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్



శాండల్‌వుడ్ నటీ నటులపై కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కన్నడ భూమి, భాషను నటీనటులు పట్టించుకోవడం లేదని, అలాంటి వాళ్ల నట్లు, బోల్టులు టైట్ చేస్తానని హెచ్చరించారు. బెంగళూరులో జరుగుతున్న చలనచిత్రోత్సవంలో అనేక మంది శాండల్‌వుడ్ నటీ నటులు పాల్గొనడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. విధానసౌధలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 'రాష్ట్రానికి అన్యాయం జరిగినప్పుడు ఇండస్ట్రీ నుంచి ఎవరూ మద్దతు ఇవ్వడం లేదు. మన నీరు, మన హక్కు పోరాటంలో సినిమా వాళ్లెవరూ పాల్గొనలేదు' అని అన్నారు. దీంతో సోషల్ మీడియాలో వ్యతిరేకత రావడాన్ని గమనించిన డీకే తన వ్యాఖ్యలను సమర్థించుకుంటూ ' సినిమా ప్రముఖులు ఏమి కావాలంటే అది చేసుకోని, ధర్నాలు చేసినా ఫర్వాలేదు. నా మాటల్లో నిజాలున్నాయి' అని అన్నారు. డిప్యూటీ సీఎం వ్యాఖ్యలను కర్ణాటక ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు నరసింహులు ఖండించారు. ఆయన అధికార దర్పంతో అలా అని ఉండవచ్చని అన్నారు.



రష్మికకు గుణపాఠం చెప్పాల్సిందే

- కాంగ్రెస్ ఎమ్మెల్యే రవిగౌడ గణిగ

కర్ణాటకలో జన్మించి, కిరిక్ పార్టీ సినిమా ద్వారా నటిగా వృత్తిని ప్రారంభించిన రష్మికా మందన్న, కన్నడ అంటే తెలియదని చేసిన వ్యాఖ్యలపై మండ్య జిల్లా కాంగ్రెస్ ఎమ్మెల్యే రవిగౌడ గణిగ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమెకు తగిన గుణపాఠం చెప్పాల్సిందేనని అన్నారు. విధానసౌధలో సోమవారం మీడియా పాయింట్‌లో మాట్లాడుతూ, గత ఏడాది చలనచిత్రోత్సవాలకు రష్మికను ఆహ్వానించామని, సమయం లేదని చెప్పి ఆమె హాజరు కాలేదన్నారు. ఓ ఎమ్మెల్యే రష్మిక ఇంటికి 10-12 సార్లు వెళ్లి ఆహ్వానించారని అన్నారు. 'హైదరాబాద్‌లో నివసిస్తున్నా, అక్కడికి రాలేను' అంటూ పరుషంగా సమాధానమిచ్చారని చెప్పారు. కాగా, రష్మిక వ్యాఖ్యలపై కర్ణాటక రక్షణ వేదిక (కరవే) అధ్యక్షులు నారాయణగౌడ తీవ్రంగా మండిపడ్డారు.

బెంగళూరు, (ఆంధ్రజ్యోతి)

శివాజీ గణేశన్ ఇంటి జప్తునకు కోర్టు ఆదేశం



'నడిగర్ తిలగం' దివంగత శివాజీ గణేశన్ ఇంటిని జప్తు చేయాలని మద్రాస్ హైకోర్టు సోమవారం ఆదేశాలు జారీచేసింది. శివాజీ గణేశన్ మనవడు దుష్యంత్ (రామ్ కుమార్ కుమారుడు), భార్య అభిరామి, మరికొందరు కుటుంబ సభ్యులు భాగస్వాములుగా ఉన్న ఈసాన్ ప్రొడక్షన్స్ నిర్మాణ సంస్థ.. 'జగజాల కిల్లాడి' అనే సినిమా నిర్మాణం కోసం ధనభాగ్యం ఎంటర్‌ప్రైజెస్ నుంచి రూ.3.74 కోట్ల రుణం తీసుకొని చెల్లించలేదు. దీంతో ధనభాగ్యం ఎంటర్‌ప్రైజెస్ హైకోర్టును ఆశ్రయించింది. మధ్యవర్తిగా రిటైర్డ్ న్యాయమూర్తి రవీంద్రన్‌ను హైకోర్టు నియమించింది. తీసుకున్న రుణం, దానికి వడ్డీ కలిపి రూ.9.39 కోట్లు చెల్లించాలని, 'జగజాల కిలాడి'కి సంబంధించిన అన్ని హక్కులను ధనభాగ్యంకు అప్పగించాలని 2024 మే 4వ తేదీన మధ్యవర్తి రవీంద్రన్ ఆదేశించారు. సినిమా రైట్స్ తమకు అప్పగించాలని ధనభాగ్యం ఎంటర్‌ప్రైజెస్ కోరగా, చిత్ర నిర్మాణం పూర్తి కాలేదని నిర్మాతలు తెలిపారు. దీంతో ధనభాగ్యం ఎంటర్‌ప్రైజెస్ మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. శివాజీ గణేశన్ ఇంటిని జప్తు చేయాలని న్యాయమూర్తి అబ్దుల్ ఖుద్దూస్ ఆదేశించారు.

చెన్నై(ఆంధ్రజ్యోతి)

తెలుగులోనూ 'ఛావా' ఘన విజయం సాధిస్తుంది



విక్కీ కౌశల్, రష్మిక నటించిన బాలీవుడ్ సెన్సేషన్ 'ఛావా' చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులకు అందిస్తోంది గీతా ఆర్ట్స్ సంస్థ. లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ప్రస్తుతం బాలీవుడ్ వసూళ్ల పరంగా కొత్త చరిత్ర సృష్టిస్తూ దూసుకుపోతోంది. ఛత్రపతి శంభాజీ మహారాజ్ వీరోచిత గాథ ఈ నెల 7న తెలుగు ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా సోమవారం తెలుగు వెర్షన్ ట్రైలర్‌ను విడుదల చేశారు. అనంతరం నిర్మాత బన్నీ వాసు మాట్లాడుతూ 'ఇది మామూలు సినిమా కాదు మన చరిత్రను అద్భుతంగా చిత్రీకరించిన చిత్రం. చివరి 25 నిమిషాలు ఇండియా మొత్తంతో కన్నీళ్లు పెట్టించాయి. ఇటువంటి సినిమా తెలుగులో కూడా రావాలని కోరుకున్న వాళ్లు చాలామంది ఉన్నారు. చాలా అద్భుతమైన క్వాలిటీతో తెలుగులో డబ్బింగ్ చేశాం. రష్మిక, విక్కీ కౌశల్ తెలుగు రిలీజ్ పట్ల చాలా ఆసక్తితో ఉన్నారు. పవన్‌కల్యాణ్‌గారికి కూడా చిత్రాన్ని చూపించాలనే ప్రయత్నం చేస్తున్నాం. తెలుగులో కూడా 'ఛావా' ఘన విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది' అని వివరించారు.


రుణాలకు మహిళల పరుగులు

గడచిన ఐదేళ్లలో 22% పెరుగుదల

సెమీ అర్బన్, గ్రామీణ ప్రాంతాల్లోనే అధికం

క్రెడిట్ స్కోర్ పర్యవేక్షణ కూడా ఎక్కువే..

సిబిల్-నీతి ఆయోగ్ నివేదిక వెల్లడి



న్యూఢిల్లీ: మహిళలు రుణాల కోసం పురుషులతో పోటీ పడుతున్నారు. గత ఐదేళ్ల కాలం (2019-2024)లో రుణాలు తీసుకునే మహిళల సంఖ్య 22 శాతం పెరిగిందని, వారిలో అధిక శాతం మంది సెమీ అర్బన్, గ్రామీణ ప్రాంతాల వారేనని ట్రాన్స్‌యూనియన్ సిబిల్, నీతి ఆయోగ్‌కు చెందిన మహిళా అంత్రప్రెన్యూర్‌షిప్ ప్లాట్‌ఫామ్ (డబ్ల్యూఈపీ), మైక్రోసేవ్ కన్సల్టింగ్ (ఎంఎస్‌సీ) ఉమ్మడిగా విడుదల చేసిన నివేదిక వెల్లడించింది. రుణగ్రహీతల నుంచి నిర్మాతలుగా పరివర్తన: భారత ఆర్థిక వృద్ధి కథనంలో మహిళల పాత్ర" పేరిట ఈ నివేదిక రూపొందించారు. వారు తీసుకుంటున్న రుణాల్లో అధిక మొత్తం వినియోగ డిమాండ్ పెరగడానికే పోతున్నదని, వ్యాపారాలకు పోతున్న సొమ్ము చాలా తక్కువగా ఉంటున్నదని ఆ నివేదికలో తెలిపారు. వ్యాపార అవసరాల కోసం రుణాలు తీసుకున్న వారి సంఖ్య కేవలం 3 శాతం ఉన్నట్టు పేర్కొన్నారు. వ్యక్తిగత రుణాలు, కన్స్యూమర్ డ్యూరబుల్ రుణాలు, ఇంటి రుణాలు వంటి వ్యక్తిగత రుణాల వాటా 42 శాతం ఉండగా బంగారం రుణాల సంఖ్య 38 శాతం ఉంది. మహిళలు రుణాలు తీసుకోవడమే కాకుండా క్రెడిట్ స్కోర్‌ను చురుగ్గా పర్యవేక్షించుకుంటున్నారని నీతి ఆయోగ్ తెలిపింది. గత ఏడాది డిసెంబర్ నాటికి 2.7 కోట్ల మంది మహిళలు క్రెడిట్ స్కోర్ పర్యవేక్షించుకోవడం వారిలో పెరుగుతున్న ఆర్థిక చైతన్యానికి చిహ్నమని తెలిపింది. 2024లో ఇలా స్వయం పర్యవేక్షణ చేసుకున్న మహిళల వాటా మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక, ఉత్తరప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో 49 శాతం ఉన్నట్టు ఆ నివేదిక తెలిపింది.

బంగారం..బంగారమే

సురక్షిత పెట్టుబడి సాధనం

భవిష్యత్‌లోనూ డిమాండ్

సీఈఏ అనంత నాగేశ్వరన్

న్యూఢిల్లీ: సురక్షిత పెట్టుబడిగా బంగారానికి ఢోకా లేదని కేంద్ర ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు (సీఈఏ) వీ అనంత నాగేశ్వరన్ అన్నారు. ఈ కోణంలో చూస్తే భవిష్యత్‌లో పసిడికి డిమాండ్ మరింత పెరుగుతుందన్నారు. పసిడి, పసిడి మార్కెట్లపై ఐజీపీసీ-ఐఐఎంఏ నిర్వహించిన వార్షిక సదస్సులో ఆయన ఈ అభిప్రాయం వ్యక్తం చేశారు. పెట్టుబడుల వివిధీకరణ (డైవర్సిఫికేషన్) కోసం చూసే ప్రతి మదుపరి పోర్టుఫోలియోలో బంగారం తప్పనిసరిగా ఉండాలన్నారు. 'స్టోర్ వాల్యూ, సాంస్కృతిక, మతపరమైన ఉత్సవాల్లో నగగానేగాక, పసిడి ప్రతి వ్యక్తి పెట్టుబడుల పోర్టుఫోలియోలో ఉండాల్సిన ఆస్తి' అని ఆయన అన్నారు.



పదింతలు పెరిగిన విలువ

గత 23 సంవత్సరాలకు చూసినా ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం ధర 250/290 డాలర్ల నుంచి పదింతలు పెరిగిందని నాగేశ్వరన్ అన్నారు. గత మూడు నెలల్లో దేశీయ స్టాక్ మార్కెట్ 8 శాతం నష్టపోతే, ఔన్స్ మేలిమి (24 క్యారట్స్) బంగారం విలువ మాత్రం 200 డాలర్లు (8 శాతం) పెరిగి 2,860 డాలర్లకు చేరిన విషయాన్ని గుర్తు చేశారు. పసిడి ప్రాముఖ్యత ముందు ముందు మరింత పెరుగుతుందన్నారు. ప్రస్తుతం మన దేశంలో బంగారాన్ని నగల తయారీ లేదా సురక్షిత పెట్టుబడిగానే ఉపయోగిస్తున్నారు. భవిష్యత్‌లో ఈ ధోరణి మారి, మరింత ప్రయోజనకరంగా ఉపయోగించే అవకాశం ఉందని నాగేశ్వరన్ ఆశాభావం వ్యక్తం చేశారు.

అప్పులపై జర జాగ్రత్త

ప్రపంచవ్యాప్తంగా పెరిగిపోతున్న ప్రభుత్వాల అప్పులపైనా సీఈఏ నాగేశ్వరన్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఈ అప్పులు అనేక దేశాలకు మోయలేని భారంగా మారాయన్నారు. దీంతో భవిష్యత్‌లో ప్రభుత్వాల ఆదాయాలు ఈ అప్పుల చెల్లింపులకే సరిపోతాయి తప్ప, అభివృద్ధి ఖర్చులకు ఏమీ విగలవన్నారు. ఈ ఏడాది మార్చి ముగిసేనాటికి మన దేశ అప్పు జీడీపీలో 57.1 శాతానికి చేరే అవకాశం ఉందన్నారు. 2026 మార్చి నాటికి దీన్ని 56.1 శాతానికి తగ్గించేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు.

ఐఆర్‌సీటీసీ, ఐఆర్‌ఎఫ్‌సీ ఇక నవరత్నాలు

న్యూఢిల్లీ: రైల్వే శాఖకు చెందిన ప్రభుత్వ రంగ సంస్థలు ఐఆర్‌సీటీసీ, ఐఆర్‌ఎఫ్‌సీలకు నవరత్న హోదా కల్పించడానికి ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. ప్రభుత్వం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపింది. రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఈ ప్రత్యేక గుర్తింపు సాధించినందుకు రైల్వే శాఖ పీఎస్‌యూలను అభినందిస్తూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. "తమ సంస్థలను నవరత్న స్థాయికి నడిపించిన టీమ్ ఐఆర్‌సీటీసీ, టీమ్ ఐఆర్‌ఎఫ్‌సీ ఉద్యోగులకు అభినందనలు" అని ఆ పోస్ట్‌లో ఆయన రాశారు.

ఫిబ్రవరిలో స్టార్టప్స్ రూ.14,418 కోట్ల సమీకరణ

న్యూఢిల్లీ: గత నెలలో దేశీయ స్టార్టప్‌లు మొత్తం 165 కోట్ల డాలర్ల (సుమారు రూ.14,418 కోట్లు) నిధులను సమీకరించాయని ప్రైవేట్ మార్కెట్ పరిశోధన వేదిక ట్రాక్షన్ వెల్లడించింది. దాంతో ఈ ఆర్థిక సంవత్సరంలో గడిచిన 11 నెలల్లో (ఏప్రిల్-ఫిబ్రవరి) స్టార్టప్‌లు సమీకరించిన మొత్తం నిధులు 2,540 కోట్ల డాలర్లకు చేరుకుందని తెలిపింది. ఈ జనవరిలో 138 కోట్ల డాలర్ల ఫండింగ్‌తో పోలిస్తే, గతనెలలో స్టార్టప్‌లు 19.5%అధిక నిధులు సమీకరించగలిగాయి.



సామ్‌సంగ్ ఆండ్రాయిడ్ ఎక్స్‌ఆర్ హెడ్‌సెట్

మొబైల్ వరల్డ్ కాంగ్రెస్‌లో ఆవిష్కరించిన సంస్థ

బార్సిలోనా (స్పెయిన్): దక్షిణా కొరియా ఎలక్ట్రానిక్స్ దిగ్గజం సామ్‌సంగ్.. మిక్స్‌డ్ రియాల్టీ హెడ్‌సెట్ విభాగంలో 'యాపిల్ విజన్ ప్రో'కు గట్టి పోటీ ఇచ్చేందుకు సిద్ధమవుతోంది. ప్రాజెక్ట్ 'మూహన్' (కొరియా భాషలో అనంతం అని అర్థం) పేరుతో ఆండ్రాయిడ్ ఎక్స్‌ఆర్ హెడ్‌సెట్‌ను బార్సిలోనాలో సోమవారం ప్రారంభమైన 'మొబైల్ వరల్డ్ కాంగ్రెస్ 2025'లో ఆవిష్కరించింది. అమెరికన్ టెక్ దిగ్గజం గూగుల్‌తో కలిసి అభివృద్ధి చేస్తోన్న ఈ హెడ్‌సెట్‌ను సామ్‌సంగ్ వచ్చే ఏడాది మార్కెట్లోకి అందుబాటులోకి తేనుంది. అంతేకాదు, ఆండ్రాయిడ్ ఎక్స్‌ఆర్ ప్లాట్‌ఫామ్‌పై అభివృద్ధి చేస్తోన్న తొలి హెడ్‌సెట్ ఇదే. దీన్ని హెడ్‌సెట్‌తో పాటు గ్లాసెస్ రూపంలోనూ అందుబాటులోకి తేనున్నట్లు సమాచారం. అత్యంత నాణ్యమైన డిస్‌ప్లేతో కూడిన ఈ హెడ్‌సెట్‌లో గూగుల్ మ్యాప్స్ ద్వారా నావిగేషన్, క్రీడల వీక్షణ కోసం ఎక్స్‌టెండెడ్ వ్యూ, గూగుల్ జెమినీ ఏఐ హెల్ప్ వంటి ఫీచర్లను పొందుపరిచింది.

హైదరాబాద్‌లో జువారీ హౌసింగ్ ప్రాజెక్ట్

రూ.1,500 కోట్లకు పైగా పెట్టుబడి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ రియల్టీ మార్కెట్లోకి మరో కార్పొరేట్ దిగ్గజం ప్రవేశిస్తోంది. జువారీ ఇండస్ట్రీస్ అనుబంధ సంస్థ జువారీ ఇన్‌ఫ్రావరల్డ్ ఇండియా లిమిటెడ్.. గంగోత్రి డెవలపర్స్‌తో కలిసి ఒక భారీ హౌసింగ్ ప్రాజెక్టు చేపడుతోంది. కొల్లూరు మైక్రో మార్కెట్ సమీపంలో 9.4 ఎకరాల్లో 'జువారీ గంగోత్రి త్రిభుజ' పేరుతో ఈ ప్రీమియం హౌసింగ్ ప్రాజెక్ట్ ఏర్పాటు కానుంది. ఇందుకోసం రూ.1,500 కోట్లకు పైగా వెచ్చించనుంది. రాష్ట్ర సిమెంట్ రంగంలో ఉన్న జువారీ గ్రూప్‌నకు హైదరాబాద్‌లో ఇదే తొలి రియల్ ఎస్టేట్ ప్రాజెక్టు. ఈ ప్రాజెక్టులో భాగంగా 53 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో తొమ్మిది టవర్లతో 1,730 అపార్ట్‌మెంట్లు నిర్మిస్తారు.

హైడ్రోజెన్ వాహనాల కోసం ఐదు పైలట్ ప్రాజెక్టులు

న్యూఢిల్లీ: నేషనల్ గ్రీన్ హైడ్రోజెన్ మిషన్ కింద ప్రయోగాత్మకంగా హైడ్రోజెన్ వాహనాలు నడిపేందుకు ఐదు ప్రయోగాత్మక ప్రాజెక్టులకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. కేంద్ర నూతన, పునరుత్పాదక ఇంధన వనరుల మంత్రిత్వ శాఖ ఈ విషయం తెలియచేసింది. దేశవ్యాప్తంగా అమలు జరిగే ఈ ప్రయోగాత్మక ప్రాజెక్టు కింద 10 విభిన్న రూట్లలో హైడ్రోజెన్ ఇంధనంతో పని చేసే 37 బస్సులు, ట్రక్కులు నడుపుతామని తెలిపింది. టాటా మోటార్స్, రిలయన్స్, ఎన్‌టీపీసీ, ఏఎన్‌ఈఆర్‌టీ, అశోక్ లేలాండ్, హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్, ఐఓసీఎల్ కంపెనీలకు ఈ ప్రాజెక్టులు కేటాయించారు. ఎంపిక చేసిన ఈ ప్రాజెక్టులకు కేంద్రం నుంచి రూ.208 కోట్ల ఆర్థిక సహాయం అందుతుంది.

● షార్ప్ కార్పొరేషన్ అనుబంధ సంస్థ షార్ప్ బిజినెస్ సిస్టమ్స్ (ఇండియా) లిమిటెడ్.. మార్కెట్లోకి సరికొత్త ఎయిర్ కండీషనర్స్ (ఏసీ)ను విడుదల చేసింది. రేర్‌యు, సెరియో, ప్లాస్మా చిల్ సిరీస్‌తో వీటిని తీసుకువచ్చింది. 7 స్టేజ్ ఫిల్టరేషన్, కన్వర్టబుల్, టర్బో మోడ్, సెల్ఫ్-క్లీనింగ్ టెక్నాలజీ, ఆటో రీస్టార్ట్ వంటి కొత్త ఫీచర్లతో వీటిని రూపొందించింది. ఏడేళ్ల సమగ్ర వారంటీతో కూడిన రేర్‌యూ ఏసీల ప్రారంభ ధర రూ.39,999గా ఉండగా సెరియో ప్రారంభ ధర రూ.32,499, ప్లాస్మా చిల్ ధర రూ.32,999గా ఉన్నాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

4వ తేదీ			
హైదరాబాద్	410	విజయవాడ	440
వరంగల్	412	గోదావరి	440
చిత్తూరు	463	విశాఖపట్నం	455
		దజను గుడ్లు రూ. 66	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	100	విజయవాడ	101
వరంగల్	100	గుంటూరు	101
కరీంనగర్	100	ఒంగోలు	101
మహబూబ్‌నగర్	100	చిత్తూరు	94
కర్నూలు	100	నెల్లూరు	99
విశాఖపట్నం	100	అనంతపురం	99
గోదావరి	101		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	86,630 ▲	79,410 ▲	1,05,000 ▼
విజయవాడ	87,700 ▲	82,500 ▼	96,500 ▼
విశాఖపట్నం	85,190 ▲	78,090 ▲	95,750 ▲
రాజమండ్రి	86,670 ▲	79,450 ▲	96,500 ▼
ప్రొద్దుటూరు	87,450 ▲	80,980 ▲	96,500 ▼
ముంబై	85,320 ▲	78,153 ▲	94,398 ▲

నిఫ్టీ తొమ్మిదో రోజూ నష్టాల్లోనే..

సెన్సెక్స్ మరో 112 పాయింట్లు డౌన్

ముంబై: ప్రామాణిక ఈక్విటీ సూచీలు సోమవారం ట్రేడింగ్‌లో ఆరంభ లాభాలను చేజార్చుకుని మళ్లీ నష్టాల బాట పట్టాయి. సెన్సెక్స్ ఒక దశలో 414 పాయింట్ల మేర క్షీణించి 72,784.54 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసింది. ఐరోపా, ఆసియా మార్కెట్ల నుంచి అందిన సానుకూల సంకేతాలతో కాస్త తేరుకున్న సూచీ.. చివరికి 112.16 పాయింట్ల నష్టంతో 73,085.94 వద్ద ముగిసింది. నిఫ్టీ 5.40 పాయింట్లు కోల్పోయి 22,119.30 వద్ద స్థిరపడింది. నిఫ్టీ నష్టపోవడం వరుసగా ఇది తొమ్మిదో రోజు. కాగా, సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 12 నష్టపోగా.. విగతా 18 రాణించాయి. మార్కెట్ దిగ్గజాలైన రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు 2.38 శాతం, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1.72 శాతం పతనమయ్యాయి. బీఎస్ఈలోని స్మాల్‌క్యాప్ సూచీ 0.70 శాతం తగ్గగా.. మిడ్‌క్యాప్ ఇండెక్స్ మాత్రం 0.25 శాతం పెరిగింది. రంగాలవారీ సూచీల్లో ఎనర్జీ 1.11 శాతం నష్టపోగా.. ఫైనాన్షియల్ సర్వీసెస్, బ్యాంకెక్స్, ఆయిల్ అండ్ గ్యాస్, సర్వీసెస్ సెక్టార్ సూచీలూ స్వల్పంగా తగ్గాయి. క్యాపిటల్ గూడ్స్, పవర్, కన్స్యూమర్ డ్యూరబుల్స్, రియల్టీ, కమోడిటీ, టెక్, ఫోకస్డ్ ఐటీ, యుటిలిటీ ఇండెక్స్‌లు మాత్రం రాణించాయి.

ఓలా ఎలక్ట్రిక్‌లో 1,000 ఉద్యోగాల కోత

సరికొత్త ఏడాది కనిష్ఠానికి షేరు

న్యూఢిల్లీ: విక్రయాలపరంగా దేశంలో అతిపెద్ద ఎలక్ట్రిక్ టూ వీలర్ కంపెనీ ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ దాదాపు 1,000 మంది ఉద్యోగులను తొలగించే పనిలో ఉంది. నష్టాలను తగ్గించుకునేందుకు వ్యాపార పునర్‌వ్యవస్థీకరణలో భాగంగా పలు విభాగాల్లో ఉద్యోగాల కోతకు పూనుకున్నట్లు తెలిసింది. ఓలా ఎలక్ట్రిక్ గత ఏడాదిలోనూ 500 మందిని ఉద్యోగం నుంచి తీసివేసింది. ఈ ఆర్థిక సంవత్సరం (2024-25)లో డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికంలో కంపెనీ నష్టాలు రూ.564 కోట్లకు పెరిగాయి. కాగా, కంపెనీలో ఉద్యోగాల కోతల వార్తల నేపథ్యంలో ఓలా ఎలక్ట్రిక్ షేరు ఎన్ఎస్ఈలో 3.40 శాతం క్షీణించి రూ.54.90కి పడిపోయింది. ఒక దశలోనైతే షేరు 5.5 శాతం క్షీణించి రూ.53.71 వద్ద సరికొత్త ఏడాది కనిష్ఠాన్ని నమోదు చేసింది.



ఆసీస్ గండం దాటేనా?

భారత్‌కు కంగారూల సవాల్

నేడు ఇరు జట్ల మధ్య సెమీస్

మధ్యాహ్నం 2.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..



ఐసీసీ నాకౌట్ మ్యాచ్‌ల్లో ఆసీస్‌పై భారత జట్టు చివరిసారిగా 2011 వన్డే వరల్డ్‌కప్ క్వార్టర్స్‌లో గెలిచింది.

తుది జట్లు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), గిల్, కోహ్లీ, శ్రేయాస్, అక్షర్, రాహుల్, హార్దిక్, జడేజా, కుల్దీప్, షమి, వరుణ్.

ఆస్ట్రేలియా: హెడ్, ఇన్‌గ్లిస్, స్మిత్, లబుషేన్, కూపర్, క్యారీ, మ్యాక్స్‌వెల్, డ్వార్షిస్, ఎల్లిస్, జాన్సన్, జంపా.

పిచ్ భారత్-పాక్ మ్యాచ్ కోసం వాడిన పిచ్‌పైనే సెమీస్ జరుగబోతోంది. వికెట్ స్పిన్‌కు అనుకూలించనుంది. మంచు ప్రభావం కనిపించడం లేదు. దీంతో టాస్ నెగ్గిన జట్టు బ్యాటింగ్ ఎంచుకునే అవకాశం ఉంది.

దుబాయ్ మాకూ కొత్తే..

'దుబాయ్ మా సొంత మైదానమేమీకాదు. ఇక్కడ గతంలో ఎక్కువ మ్యాచ్‌లను ఆడలేదు. దీంతో పాటు ఈ టోర్నీలో మేమాడిన మూడు మ్యాచ్‌ల్లోనూ పిచ్ విభిన్నంగా స్పందించింది. ఇక్కడ నాలుగైదు పిచ్‌లను వినియోగిస్తున్నారు. ఎలాంటి పరిస్థితులకైనా సిద్ధంగా ఉండేందుకు ప్రయత్నిస్తాం. ఐసీసీ టోర్నీలో ఆసీస్‌కు ఘనచరిత్ర ఉంది. ఈసారి మాత్రం మాదే పైచేయి ఉండేలా ఆడతాం. ఒత్తిడి ఇరు జట్లపైనా ఉంటుంది కాబట్టి పోరు ఆసక్తికరంగా మారనుంది'

- రోహిత్ శర్మ

సెమీస్ అంపైర్లు వీరే..

భారత్-ఆస్ట్రేలియా జట్ల మధ్య జరిగే తొలి సెమీస్‌కు ఐసీసీ ఆన్ ఫీల్డ్ అంపైర్లను ప్రకటించింది. ఈ మ్యాచ్ కోసం కివీస్‌కు చెందిన గఫానే, ఇంగ్లండ్‌కు చెందిన రిచర్డ్ ఇల్లింగ్‌వర్త్ మైదానంలో అంపైర్లుగా ఉండనున్నారు. అలాగే థర్డ్ అంపైర్‌గా మైకేల్ గాఫ్, రెఫరీగా ఆండీ పైక్రాఫ్ట్ వ్యవహరిస్తారు.

దుబాయ్: స్వదేశంలో 2023 వన్డే వరల్డ్‌కప్.. వరుసగా పది విజయాలతో ఫైనల్‌కు దూసుకెళ్లిన భారత్.. ఇక కప్ లాంఛనమే అని సంబరాలకు సిద్ధంగా ఉన్న అభిమానులు. కానీ కోట్లాది భారతీయులను అవాక్కయ్యేలా ఆస్ట్రేలియా గట్టి ఝలక్ ఇచ్చి విశ్వవిజేతగా నిలిచింది. ఆ తర్వాత ఈ ఫార్మాట్‌లో మళ్లీ ఇప్పుడు ఐసీసీ టోర్నీ సెమీస్ ముందు సై అంటోంది. అంతకుముందు 2015 వన్డే వరల్డ్‌కప్ సెమీస్, 2023 వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్లోనూ భారత్‌ను ఇంటిముఖం పట్టించింది. అందుకే ఐసీసీ నాకౌట్ పోరులో ఆసీస్ ఎదురుపడితే అమ్మో.. అనిపిస్తుంటుంది. తాజాగా చాంపియన్స్ ట్రోఫీ టైటిల్‌ను దక్కించుకోవాలంటే ముందు ఆసీస్ గండాన్ని అధిగమించాల్సి ఉంది. మంగళవారం ఇరు జట్ల మధ్య తొలి సెమీస్ జరుగనుంది. ఇప్పటికే దుబాయ్‌లో హ్యాట్రిక్ విజయాలతో ఉన్న టీమిండియాను ఫేవరెట్‌గా భావిస్తున్నా.. ఐసీసీ టోర్నీల్లో ఎనలేని ఉత్సాహంతో ఆడే ఆసీస్‌ను తక్కువ అంచనా వేయలేం. జట్టులో స్టార్ ఆటగాళ్లు లేకపోవడంతో స్మిత్ సేన గ్రూప్ దశ దాటడం కూడా కష్టమేనని విశ్లేషకులు భావించారు. కానీ అందరి అంచనాలను తలకిందులు చేస్తూ ఆసీస్ చాంపియన్ ఆటతీరును ప్రదర్శిస్తోంది. దీంతో నేటి మ్యాచ్‌లో భారత బౌలింగ్‌కు ఆసీస్ బ్యాటింగ్‌కు మధ్య రసవత్తర పోరు జరుగనుంది.

స్పిన్నర్లే కీలకం

చాంపియన్స్ ట్రోఫీ కోసం భారత జట్టులో ఐదుగురు స్పిన్నర్లను ఎంపిక చేస్తే అంతా విమర్శించారు. కానీ ఇప్పుడు వారే ప్రధాన ఆయుధంగా మారడం విశేషం. భారత జట్టు తొలి రెండింట్లో ఛేదనలో నెగ్గింది. అయితే కివీస్‌తో మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగినా భారీ స్కోరు సాధించలేకపోయింది. అయితేనేం.. ఏకంగా నలుగురు స్పిన్నర్లు తడాఖా చూపారు. వీరు వేసిన 39 ఓవర్లలో 128 డాట్ బాల్స్ కావడంతో కివీస్ ఉక్కిరిబిక్కిరైంది. ప్రత్యర్థి తొమ్మిది వికెట్లను వీరే తీసి 250 పరుగుల లక్ష్యాన్ని కాపాడారు. అందుకే ఈసారి ఆసీస్‌ను దెబ్బతీసేందుకు కూడా స్పిన్ మంత్రాన్నే ప్రయోగించాలని భారత్ భావిస్తోంది. ముఖ్యంగా వరుణ్ చక్రవర్తి వైవిధ్యమైన బౌలింగ్‌తో కీలకంగా నిలిచాడు. అయితే సెమీస్‌లోనూ అతడిని కొనసాగిస్తారా? లేకుంటే షమికి తోడు మరో స్పెషలిస్ట్ పేసర్‌గా హర్షిత్, అర్ష్‌దీప్‌లలో ఒకరిని ఆడిస్తారా? అనేది వేచిచూడాల్సిందే. ఇక బ్యాటింగ్‌లో గిల్, రోహిత్, విరాట్, శ్రేయాస్, అక్షర్, రాహుల్ రూపంలో టాపార్డర్, మిడిలార్డర్ అత్యంత పటిష్ఠంగా కనిపిస్తోంది. డెత్ ఓవర్లలో హార్దిక్ బ్యాట్ ఝుళిపిస్తున్నాడు.

బ్యాటింగ్‌పైనే భారం

ప్యాట్ కమిన్స్, హాజెల్‌వుడ్, స్టార్క్‌లాంటి అగ్రశ్రేణి బౌలర్లు లేకుండానే మెగా టోర్నీకి వచ్చిన ఆసీస్ బలహీనంగానే కనిపిస్తోంది. స్పిన్నర్ ఆడమ్ జంపా మాత్రమే స్టార్ బౌలర్‌గా ఉన్నాడు. అందుకే ఇంగ్లండ్ 351, అఫ్ఘాన్ 273 పరుగులు చేయగలిగాయి. అయితే ఆసీస్ బ్యాటింగ్ ఆర్డర్ మాత్రం ప్రమాదకరంగా కనిపిస్తోంది. ఇంగ్లండ్‌తో తొలి మ్యాచ్‌లో 352 పరుగుల ఛేదనను 47.3 ఓవర్లలోనే ముగించి అబ్బురపరిచింది. తాజా టోర్నీలో ఆసీస్ పూర్తి మ్యాచ్ ఆడింది ఈ ఒక్కసారే. మిగతా రెండు మ్యాచ్‌లు వర్షం కారణంగా రద్దయ్యాయి. దీంతో వీరికి పెద్దగా మ్యాచ్ ప్రాక్టీస్ లేకుండా పోయింది. ఇక భారత్‌కు హెడ్ నుంచి ఎప్పుడూ ప్రమాదమే. స్మిత్, ఇన్‌గ్లిస్, క్యారీ, మ్యాక్స్‌వెల్ రాణిస్తే భారీ స్కోరు ఖాయమే. అయితే మాథ్యూ షార్ట్ దూరం కావడంతో జంపాకు జతగా మరో స్పిన్నర్ లేకుండాపోయాడు. అతడి స్థానంలో కూపర్ కన్నోలిని తీసుకున్నారు. మ్యాక్స్‌వెల్, హెడ్ రూపంలో పార్ట్‌టైమ్ స్పిన్ అందుబాటులో ఉండనుంది. ప్రధాన పేసర్లయిన డ్వార్షిస్, ఎల్లిస్, జాన్సన్ భారత్‌పై రెండు వన్డేలను మాత్రమే ఆడారు.

స్పోర్ట్స్

మూనీ మెరుపులు

డబ్ల్యూపీఎల్



బెత్ మూనీ (59 బంతుల్లో 17 ఫోర్లతో 96 నాటౌట్)

● గుజరాత్ ఆల్‌రౌండ్ షో

● 81 పరుగులతో యూపీ చిత్తు

లఖ్‌నవూ: బెత్ మూనీ (59 బంతుల్లో 17 ఫోర్లతో 96 నాటౌట్) అర్ధ శతకంతోపాటు బౌలర్లు అదరగొట్టడంతో.. మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో ప్లేఆఫ్స్ అవకాశాలను గుజరాత్ జెయింట్స్ సజీవంగా నిలబెట్టుకొంది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో 81 పరుగుల తేడాతో యూపీ వారియర్స్‌ను చిత్తు చేసిన గుజరాత్.. రెండో స్థానానికి ఎగబాకింది. తొలుత గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 186/5 స్కోరు చేసింది. సోఫీ ఎకెల్‌స్టోన్ రెండు వికెట్లు పడగొట్టింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్.. స్వల్ప స్కోరుకే ఓపెనర్ హేమలత (2) వికెట్ కోల్పోయింది. కానీ, మరో ఓపెనర్ బెత్ మూనీ, హర్లీన్ డియోల్ (45) రెండో వికెట్‌కు 101 పరుగుల భాగస్వామ్యంతో భారీ స్కోరుకు బాటలు వేశారు. హాఫ్ సెంచరీ దిశగా సాగుతున్న హర్లీన్‌ను ఎకెల్‌స్టోన్ బౌల్డ్ చేసింది. కెప్టెన్ ఆష్లే గార్డ్‌నర్ (11), దియేంద్ర డోటిన్ (17), లిచ్‌ఫీల్డ్ (8) విఫలమయ్యారు. అనంతరం ఛేదనలో యూపీ 17.1 ఓవర్లలో 105 పరుగులకే కుప్పకూలింది. షినెల్లీ హెన్రీ (28), గ్రేస్ హ్యారిస్ (25) టాప్ స్కోరర్లు. తనూజ కన్వర్, కష్వీ గౌతమ్ చెరో మూడు వికెట్లు పడగొట్టారు.

సంక్షిప్త స్కోర్లు

గుజరాత్: 20 ఓవర్లలో 186/5 (బెత్ మూనీ 96 నాటౌట్, హర్లీన్ 45; ఎకెల్‌స్టోన్ 2/34);
యూపీ: 17.1 ఓవర్లలో 105 ఆలౌట్ (హెన్రీ 28, హ్యారిస్ 25, కష్వీ 3/11, తనూజ 3/17).

పద్మాకర్ శివాల్కర్ మృతి



ముంబై: ముంబై జట్టు దిగ్గజ క్రికెటర్ పద్మాకర్ శివాల్కర్ (84) సోమవారం మృతి చెందాడు. 21 ఏళ్ల వయస్సులో ఫస్ట్‌క్లాస్ క్రికెట్ (1961)లో అడుగుపెట్టిన తను 47 ఏళ్ల వయస్సు వరకు ముంబై జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. అయితే లెఫ్టామ్ స్పిన్నర్ అయిన పద్మాకర్ భారత క్రికెట్ జట్టుకు మాత్రం ఎంపిక కాలేదు. ఆ సమయంలో బిషన్ సింగ్ బేడీ నుంచి తనకు గట్టి పోటీ ఎదురైంది. కెరీర్‌లో 124 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు ఆడి 589 వికెట్లు పడగొట్టాడు. అతడి మృతిపై గవాస్కర్ సంతాపం వ్యక్తం చేశాడు.

కేన్స్ చెస్ విజేత ఇనియన్

న్యూఢిల్లీ: కేన్స్ ఇంటర్నేషనల్ ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో భారత జీఎం పి.ఇనియన్ విజేతగా నిలిచాడు. ఫ్రాన్స్‌లో జరిగిన ఈ పోటీల్లో ఆఖరిదైన తొమ్మిదో రౌండ్‌లో వి.ప్రనేష్‌పై నెగ్గి, విజయంతో ఇనియన్ టోర్నీను ముగించాడు. ఈ టోర్నీలో ఇనియన్ 7.5 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి, ట్రోఫీ దక్కించుకున్నాడు. భారత్‌కే చెందిన ఐఎం ఆరాధ్య గార్గ్ రన్నరప్‌గా నిలిచాడు. ఈ టోర్నీలో 25 దేశాలకు చెందిన 147 మంది క్రీడాకారులు పాల్గొనడం విశేషం.

రహానెకు 'కోల్‌కతా' పగ్గాలు



న్యూఢిల్లీ: ఐపీఎల్ జట్టు కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్) కెప్టెన్‌గా టీమిండియా వెటరన్ బ్యాటర్ అజింక్యా రహానె (36) నియమితుడయ్యాడు. గతేడాది కోల్‌కతాకు టైటిల్ అందించిన శ్రేయాస్ అయ్యర్‌ను మేనేజ్‌మెంట్ వదిలేసుకొంది. అనంతరం జరిగిన మెగా వేలంలో రహానె, వెంకటేష్ అయ్యర్‌లను కొనుగోలు చేసింది. కెప్టెన్ ఎవరన్న సస్పెన్స్‌కు తెరదించుతూ రహానెను కెప్టెన్‌గా, వెంకటేష్‌ను ఉప సారథిగా నియమించారు. ఈ నెల 22న ఐపీఎల్ ఆరంభం కానుంది. దేశవాళీ టోర్నీల్లో ముంబై జట్టుకు రహానె నాయకత్వం వహిస్తున్నాడు.

'లారెస్' అవార్డుకు పంత్ నామినేట్



న్యూఢిల్లీ: ప్రతిష్ఠాత్మక లారెస్ వరల్డ్ స్పోర్ట్స్ అవార్డుకు భారత వికెట్ కీపర్ రిషభ్ పంత్ నామినేట్ అయ్యాడు. 2025కు గాను 'కమ్ బ్యాక్ ఆఫ్ ద ఇయర్' అవార్డు కేటగిరీలో పంత్‌ను ఎంపిక చేశారు. మాడ్రిడ్‌లో వచ్చే నెల 21న ఈ అవార్డుల ప్రదాన కార్యక్రమం జరగనుంది. 2022, డిసెంబరు 30న జరిగిన కారు ప్రమాదంలో పంత్ తీవ్రంగా గాయపడ్డాడు. శస్త్రచికిత్స అనంతరం ఎన్‌సీఏలో క్రమంగా కోలుకొన్న రిషభ్ గతేడాది ఐపీఎల్‌తో మళ్లీ క్రికెట్‌లోకి అడుగుపెట్టాడు.

బీఆర్‌ఎస్‌తో ఒప్పందంలో భాగంగానే..
రాష్ట్రాభివృద్ధిని అడ్డుకుంటున్న కిషన్‌రెడ్డి

టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్



హైదరాబాద్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ, బీఆర్‌ఎస్ లోపాయికారీ ఒప్పందాల్లో భాగంగానే రాష్ట్రాభివృద్ధికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అడ్డుపడుతున్నారని టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ ఆరోపించారు. గాంధీభవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణపై నిత్యం విషం చిమ్ముతున్న కిషన్‌రెడ్డి.. రాష్ట్రాభివృద్ధిని సైంధవుడిలా అడ్డుకుంటున్నారన్నారు. రాష్ట్రానికి చెందిన ఆ పార్టీ 8 మంది ఎంపీలు.. తెలంగాణ అభివృద్ధిపై ఏనాడైనా ప్రధాని మోదీని కలవడంగానీ.. కేంద్రాన్ని ఒప్పించి నిధులు తీసుకురావడం కానీ చేశారా.. అంటూ నిలదీశారు. కేంద్రం వైఖరితో మెట్రో విస్తరణ పనులూ నత్త నడకన సాగుతున్నాయని ఆరోపించారు. మూసీ ప్రక్షాళనకూ కేంద్రం నుంచి సహకారం అందట్లేదన్నారు. వరంగల్ మామునూరు విమానాశ్రయం గురించీ బీజేపీ నేతలు రాజకీయాలు చేయడం సిగ్గుచేటన్నారు. మామునూరు విమానాశ్రయానికి గత కేసీఆర్ ప్రభుత్వం సహకరించలేదని బీజేపీ కేంద్ర మంత్రులే చెప్పారని, ఇప్పుడు తమ ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుంటే రాజకీయాలు చేస్తున్నారన్నారు. ఆదిలాబాద్, భద్రాచలం, నిజామాబాద్ విమానాశ్రయాల మంజూరు ఇంకా పెండింగ్‌లోనే ఉందన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ అభివృద్ధి గురించి ఎందుకు పట్టించుకోవట్లేదంటూ కిషన్‌రెడ్డిని ప్రశ్నించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవిని ఆశిస్తున్న రఘునందన్‌రావు.. తన పాచికలు పారకపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. ఆ గందరగోళంలో రాష్ట్రంలో పాలన పడకేసిందంటూ నిరాధార ఆరోపణలు చేస్తున్నారన్నారు. పింక్ బుక్కు అంటున్న కవిత.. అందులో మొదట బీఆర్‌ఎస్ పార్టీ నేతల స్కామ్‌ల గురించే రాసుకోవాలని సూచించారు.

రేవంత్‌రెడ్డి రాసుకునే చీకటి చరిత్ర ఇదేనా?

» కరోనాకన్నా.. ప్రమాదకర వైరస్ కాంగ్రెస్సే: కేటీఆర్



హైదరాబాద్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో జీఎస్టీ రాబడులు తగ్గడంపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు. కేసీఆర్ పదేళ్ల స్వర్ణయుగాన్ని చెరిపేసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాసుకునే చీకటి చరిత్ర ఇదేనా అని ప్రశ్నించారు. గతేడాది 10శాతం నమోదైన జీఎస్టీ వసూళ్ల కేవలం ఒకే ఒక్కశాతం వృద్ధికి పడిపోవడం సిగ్గుచేటన్నారు. కరోనా కన్నా ప్రమాదకరమైన వైరస్ కాంగ్రెస్ అని, ఏడాది క్రితం తాను చెప్పింది అక్షరాలా నిజమైందన్నారు.ఎస్ఎల్‌బీసీలో సెంటీమీటర్ సొరంగం తవ్వడం కూడా చేతకాని సీఎం, 12 కిలోమీటర్ల టన్నెల్ పూర్తిచేసిన బీఆర్‌ఎస్‌పై నిందలు వేయడం సిగ్గుచేటని కేటీఆర్ చెప్పారు. రేవంత్ రెడ్డి తన వైఫల్యాన్ని గత ప్రభుత్వంపైకి నెట్టాలనుకోవడం దుర్మార్గమన్నారు.

కుటుంబ ఆస్తులు పెంచుకునేలా పాలన: జగదీశ్‌రెడ్డి

నాటి పనులకు నేడు శిలాఫలకాలు: నిరంజన్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా చతికిలబడి పోయిందని, రేవంత్‌రెడ్డి ఆయన కుటుంబసభ్యుల ఆస్తులు పెంచుకునేలా పాలన సాగిస్తున్నారని మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి ఆరోపించారు. సోమవారం తెలంగాణ భవన్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, సీఎంకు పరిపాలనపై చిత్తశుద్ధి లేదని, ప్రజలపట్ల నిబద్ధత కూడా లేదని అన్నారు. కాగా, వనపర్తిలో ఐటీ టవర్‌కు కేటీఆర్ శంకుస్థాపన చేస్తే, దాన్ని పగులగొట్టి సీఎం రేవంత్‌రెడ్డి కొత్తగా శంకుస్థాపన చేశారని సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆరోపించారు. వనపర్తి అంతటా కేసీఆర్ ఆనవాళ్లే ఉన్నాయని, ఆయన మొదలు పెట్టిన పనులకు రేవంత్‌రెడ్డి సిగ్గులేకుండా మళ్లీ శిలా ఫలకాలు వేశారని విమర్శించారు. ఇలాంటి చిల్లర పనులతో సీఎం పదవికే కళంకం ఏర్పడుతుందని అన్నారు.ఐ

విద్యార్థుల డేటా బేస్‌కు అపార్ ఐడీ తప్పనిసరి

» అంబేడ్కర్ వర్సిటీ వీసీ ఘంటా చక్రపాణి

హైదరాబాద్ సిటీ, మార్చి 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల డేటా బేస్ నమోదుకు, వారి విద్యకు సంబంధించిన విషయాలు ఒకే దగ్గర నమోదు చేయడానికి ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ(అపార్) ఐడీ తప్పనిసరి అని బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్(వీసీ) ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి అన్నారు. వర్సిటీలో సెంటర్ ఫర్ స్టాఫ్ ట్రైనింగ్ అండ్ డెవలప్‌మెంట్(సీఎస్‌టీడీ), తెలంగాణ ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో "అపార్ అమలు" అంశంపై రెండురోజుల వర్క్‌షాప్‌ను వీసీ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అంబేడ్కర్ వర్సిటీ రికార్డు స్థాయిలో అపార్ ఐడీలు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఈ ఐడీలను రూపొందించడంలో జాతీయ స్థాయిలో అంబేడ్కర్ వర్సిటీ ప్రత్యేక గుర్తింపు పొందడం గర్వకారణమన్నారు. సీఎస్‌టీడీ డైరెక్టర్ ఎరాంకుశం వెంకటరమణ మాట్లాడుతూ.. విద్యార్థులు అపార్ ఐడీ రూపొందించుకుంటే ప్రభుత్వం నుంచి ఉపకారవేతనాలు పొందడానికి ఎక్కువ అవకాశాలు ఉన్నాయన్నారు.

మూలవాసి బచావో మంచ్‌పై నిషేధాన్ని ఎత్తేయాలి

» ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక

నల్లకుంట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లో యథేచ్ఛగా మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతోందని ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఆరోపించింది. గత నెల 27న రాయ్‌పూర్‌లో ఎన్ఐఏ పోలీసులు అరెస్టు చేసిన మూలవాసి బచావో మంచ్ మాజీ అధ్యక్షుడు రఘుతోపాటు ఆ సంస్థ సభ్యులు గజేంద్ర, లక్ష్మణ్‌ను బేషరతుగా విడుదల చేయాలని వేదిక కన్వీనర్ లక్ష్మణ్ గడ్డం, నాయకులు ఎన్ నారాయణరావు డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని హైదర్‌గూడలో వారు విలేకరులతో మాట్లాడుతూ మూలవాసి బచావో మంచ్ సంస్థకు మావోయిస్టులతో సంబంధాలు ఉన్నాయని ఆరోపించడం సరికాదన్నారు.

దేశంలో 10% విద్యాసంస్థలకే న్యాక్ గుర్తింపు

» తెలంగాణ ఉన్నత విద్యామండలి అధ్యక్షుడు బాలకిష్టారెడ్డి

హైదరాబాద్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా 1,278 విశ్వవిద్యాలయాలు, 50 వేల కళాశాలలుండగా.. కేవలం 10 శాతం విద్యాసంస్థలకే నేషనల్ అసెస్మెంట్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (న్యాక్) గుర్తింపు (అక్రిడిటేషన్) ఇచ్చిందని తెలంగాణ ఉన్నత విద్యామండలి అధ్యక్షుడు ఆచార్య బాలకిష్టారెడ్డి అన్నారు. తెలంగాణలో ఇది కేవలం 12శాతం మాత్రమే ఉందని పేర్కొన్నారు. న్యాక్ గుర్తింపుపై సోమవారం ఉస్మానియా వర్సిటీలో ప్రారంభమైన మూడు రోజుల జాతీయ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఉన్నత విద్యలో నాణ్యతను పెంచేందుకు న్యాక్ గుర్తింపు ఎంతో కీలకమని చెప్పారు. విద్యలో నాణ్యత ఆధారంగా న్యాక్ గుర్తింపు ఇస్తుందని, ఈ దిశగా రాష్ట్రంలోని అన్ని విద్యాసంస్థలు నాణ్యతను పెంచుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు.

తెలుగువారికి రాష్ట్రపతి విజిటర్స్ పురస్కారాలు

న్యూఢిల్లీ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) తెలుగు రాష్ట్రాలకు చెందిన ఇద్దరు పరిశోధకులకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సోమవారం తన చేతుల మీదుగా విజిటర్స్ పురస్కారాలను అందజేశారు. మునిసిపల్ ప్లాస్టిక్ వ్యర్థాల నుంచి పెట్రోల్, డీజిల్ ఉత్పత్తికి తోడ్పడినందుకు డా. వేంకటేశ్వర్లు చింతాల, జాతీయ హైడ్రోజన్ మిషన్‌కు తోడ్పడేవిధంగా క్వాంటమ్ టెక్నాలజీలో వినూత్న పరిష్కారాలను ఆవిష్కరించినందుకు ప్రొఫెసర్ సరిపెల్ల శ్రీకృష్ణకు సోమవారం రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో అవార్డులను అందించారు. బనారస్ హిందూ యూనివర్సిటీ విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న సరిపెల్ల శ్రీకృష్ణ విజయనగరానికి చెందిన వారు. హైదరాబాద్‌కు చెందిన డా.వేంకటేశ్వర్లు చింతాల అహ్మదాబాద్‌లో విశ్వవిద్యాలయంతో పని చేస్తున్నారు. వర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో పనిచేస్తున్న కాన్పూర్‌కు చెందిన ప్రొ. అశ్వినీ కుమార్ నంగియాకు కూడా రాష్ట్రపతి పురస్కారం దక్కింది. తక్కువ ఖర్చుతో ఔషధాల అభివృద్ధిలో కీలక పరిశోధన జరిపినందుకు అవార్డు లభించింది.

రుసుము చెల్లిస్తే.. ఎల్‌ఆర్‌ఎస్ 10 రోజుల్లోనే!

(మొదటిపేజీ తరువాయి)

పరిధిలో లేని ప్లాట్ల దరఖాస్తులకు ఆటోమేటిక్‌గా ఫీజు సమాచారం వచ్చేస్తుంది. వీటి పరిధిలోని దరఖాస్తులను మాత్రం రెవెన్యూ, నీటిపారుదల శాఖలకు పంపిస్తారు. వాటి నుంచి ఆమోదం వస్తే మాత్రమే ఫీజు చెల్లింపు వివరాలు రానున్నాయి. అలాగే, క్రమబద్ధీకరణ చార్జీతోపాటు ప్రొ-రేటా ఓపెన్ స్పేస్ చార్జీని కలిపి చెల్లించిన వారికే 25 శాతం రాయితీ వర్తించనుంది. ఓపెన్ స్పేస్ చార్జీ చెల్లించకుండా కూడా ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. కేవలం క్రమబద్ధీకరణ ఫీజునే చెల్లించవచ్చు. కానీ, అటువంటి వారికి రాయితీ వర్తించదు. దీనికితోడు, సంబంధిత ప్లాట్‌లో భవన నిర్మాణానికి వెళ్లిన సందర్భంలో ప్రొ-రేటా ఓపెన్ స్పేస్ చార్జీలను తప్పనిసరిగా చెల్లించాల్సి ఉంటుంది. రాయితీ వర్తించాలంటే రెండు చార్జీలను కలిపి ఇప్పుడు చెల్లించడమే ఉత్తమమని అధికారులంటున్నారు. ఎల్‌ఆర్‌ఎస్ వివరాలు తెలుసుకునేందుకు ఇప్పటికే www.lrs.telangana.gov.in వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు దరఖాస్తుదారులు ఇందులో దరఖాస్తు ఏ దశలో ఉంది? అనుమతి లభించిందా లేదా!? ఫీజు వివరాలు, ఏమైనా తక్కువ పడిందా? దరఖాస్తును తిరస్కరించారా? వంటి వివరాలను చూసుకునే అవకాశం కల్పించింది. ఎల్‌ఆర్‌ఎస్‌పై సందేహాలను నివృత్తి చేసుకోవడానికి అమీర్‌పేట స్వర్ణ జయంతి కాంప్లెక్స్‌లోని హెచ్‌ఎండీఏ కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. ఫోన్ ద్వారా సందేహాలను నివృత్తి చేసుకోవడానికి టోల్‌ఫ్రీ నంబర్ 1800 599 8838ను హెచ్‌ఎండీఏలో అందుబాటులోకి తీసుకొచ్చారు.

మార్గదర్శకాలను సవరించాలని వినతి

లే అవుట్ క్రమబద్ధీకరణ పథకం(ఎల్‌ఆర్‌ఎస్) మార్గదర్శకాలను సవరించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌కు సోమవారం లేఖ రాశారు. ఎల్‌ఆర్‌ఎస్‌లో దరఖాస్తుదారులకు సౌలభ్యాన్ని కలిగిస్తూ ఫీజులో 25 శాతం రాయితీ ఇవ్వడాన్ని సీపీఎం స్వాగతిస్తుందని జాన్‌వెస్లీ ఆ లేఖలో తెలిపారు. గ్రామ పంచాయతీలు అనుమతించిన లేఅవుట్లలో చాలా మంది పేదలు 100, 200 గజాల ప్లాట్లు కొనుగోలు చేశారని, 70 సంవత్సరాల క్రితం కొనుగోలు చేసిన ప్లాట్లకు కూడా హెచ్‌ఎండీఏ, డీటీసీపీ అనుమతులు లేవని, అలాంటివన్నీ అక్రమమంటూ భారం మోపడం ఎంత మాత్రం సమంజసం కాదని పేర్కొన్నారు.

నల్లగొండలో పీఆర్‌టీయూ..
కరీంనగర్‌లో బీజేపీ

(మొదటిపేజీ తరువాయి)



కరీంనగర్‌లోని కౌంటింగ్ కేంద్రం వద్ద విజయ సంకేతం చూపుతున్న బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య

లెక్కింపు చివరికి.. రెండో స్థానంలో ఉన్న అలుగుబెల్లి నర్సిరెడ్డిని ఎలిమినేట్ చేసేదాకా కొనసాగింది. చివరి, 19వ రౌండ్ పూర్తయ్యాక శ్రీపాల్‌రెడ్డికి 13,969 ఓట్లు వచ్చాయి. కోటా ఓటు 11,821 దాటడంతో శ్రీపాల్‌రెడ్డి గెలుపొందినట్లు ప్రకటించారు.

ఆద్యంతం ఇద్దరి మధ్యే పోటీ..

కౌంటింగ్ ప్రారంభమైనప్పటి నుంచి ముగిసేంత వరకు శ్రీపాల్‌రెడ్డి, నర్సిరెడ్డి మధ్యనే పోటీ నడిచింది. ఈ ఎమ్మెల్సీ స్థానానికి ఫిబ్రవరి 27న ఎన్నిక నిర్వహించగా మొత్తం 25,197 ఓట్లకుగాను 24,135 ఓట్లు పోలయ్యాయి. సోమవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని స్టేట్ వేర్‌హౌసింగ్ గోదాము వద్ద ఓట్ల లెక్కింపు చేపట్టారు. ఇందులో 494 ఓట్లు చెల్లకుండా పోగా, 23,641 ఓట్లను లెక్కించారు. అభ్యర్థి గెలవడానికి 11,821 ఓట్లను కోటా ఓటుగా నిర్ధారించారు. సాయంత్రం 3.40కు మొదటి ప్రాధాన్య ఓట్ల లెక్కింపు పూర్తికాగా.. ఇందులో పీఆర్‌టీయూటీఎస్ అభ్యర్థి శ్రీపాల్‌రెడ్డి 6,035 ఓట్ల ఆధిక్యంలో నిలిచారు. టీఎస్ యూటీఎఫ్ అభ్యర్థి నర్సిరెడ్డి 4,820 ఓట్లతో ద్వితీయ స్థానంలో నిలవగా, పీసీసీ అధికార ప్రతినిధి, టీపీఆర్‌టీయూ అభ్యర్థి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి 4,437 ఓట్లు సాధించి మూడో స్థానం పొందారు. ఇక బీసీ, బహుజన జేఏసీ అభ్యర్థిగా బరిలో నిలిచిన మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్‌కు 3,115 ఓట్లు, బీజేపీ అభ్యర్థి పులి సర్వోత్తంరెడ్డికి 2289 ఓట్లు, బీసీ నినాదంతోనే బరిలో నిలిచిన మరో అభ్యర్థి ఎస్.సుందర్‌రాజ్‌కు 2,040 ఓట్లు వచ్చాయి. దీంతో మొదటి ప్రాధాన్య ఓట్లలో ఎవరికీ కోటా ఓటు రాకపోవడంతో ఎలిమినేషన్ పద్ధతిలో ద్వితీయ ప్రాధాన్య ఓట్లను లెక్కింపు చేపట్టారు. అవరోహణ క్రమంలో ఒక్కో అభ్యర్థిని ఎలిమినేట్ చేస్తూ.. వారి బ్యాలెట్లలో ద్వితీయ ప్రాధాన్య ఓట్లను పోటీలో ఉన్న మిగిలిన అభ్యర్థులకు కలుపుతూ లెక్కింపు చేపట్టారు. అన్ని రౌండ్లలోనూ పీఆర్‌టీయూ అభ్యర్థి శ్రీపాల్‌రెడ్డి ఆధిక్యం కొనసాగుతూ వచ్చింది. 16వ రౌండ్‌లో బీజేపీ అభ్యర్థి పులి సర్వోత్తమ్‌రెడ్డి ఎలిమినేట్ కాగా, 17వ రౌండ్‌లో పూల రవీందర్, 18వ రౌండ్‌లో హర్షవర్ధన్‌రెడ్డి ఎలిమినేట్ అయ్యారు. అప్పటికి శ్రీపాల్‌రెడ్డి 11,099 ఓట్లకు చేరగా, నర్సిరెడ్డి 8,448 ఓట్లకు చేరారు. శ్రీపాల్‌రెడ్డి గెలవడానికి ఇంకా 722ఓట్లు రావాల్సి ఉండడంతో రెండో స్థానంలో ఉన్న నర్సిరెడ్డిని కూడా ఎలిమినేట్ చేసి లెక్కించారు.

కరీంనగర్ స్థానంలో బీజేపీ హవా..

కరీంనగర్-నిజామాబాద్-ఆదిలాబాద్-మెదక్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి కరీంనగర్ జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ స్టేడియంలో ఓట్ల లెక్కింపు చేపట్టారు. ఈ స్థానం నుంచి రాజకీయ పార్టీల్లో బీజేపీ మాత్రమే అభ్యర్థిని పోటీలో నిలపగా.. విఎగతా పార్టీలు పోటీకి దూరంగా ఉన్నాయి. నియోజకవర్గంలో మొత్తం 27,088 మంది ఓటర్లు ఉండగా, 25,041 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో 73 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం పోలైన ఓట్లలో 897 ఓట్లు చెల్లకుండా పోయాయి. 24,144 ఓట్లు చెల్లుబాటు కాగా, అభ్యర్థి గెలుపొందడానికి 12,081 ఓట్లను కోటా ఓటుగా నిర్ధారించారు. కాగా, బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య మొదటి ప్రాధాన్య ఓట్ల లెక్కింపులోనే కోటా ఓటుకు మించి ఓట్లు సాధించి గెలుపొందారు. కొమురయ్యకు 12,959 ఓట్లు రాగా ఆయన సమీప పీఆర్టీయూ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డికి 7182 ఓట్లు వచ్చాయి. అశోక్‌కుమార్‌కు 2,621 ఓట్లతో మూడో స్థానంలో, సిటింగ్ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి 428ఓట్లతో నాలుగో స్థానంలో నిలిచారు. కాగా, కరీంనగర్-నిజామాబాద్-ఆదిలాబాద్-మెదక్ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో చెల్లని ఓట్లు ఎక్కువగా పోలవడానికి కారణం ఓటింగ్‌పై అవగాహన కల్పించక పోవడమేనని పలువురు స్వతంత్ర అభ్యర్థులు ఆరోపించారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం ఓట్ల లెక్కింపు చేపట్టిన అంబేడ్కర్ స్టేడియంలో వారు ఆందోళనకు దిగారు. ఎన్నికల కమిషన్ ఈ ఎన్నికలను రద్దు చేసి తిరిగి పోలింగ్ నిర్వహించాలని కోరారు.

కొనసాగుతున్న పట్టభద్రుల ఓట్ల లెక్కింపు

కరీంనగర్-నిజామాబాద్-ఆదిలాబాద్-మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొనసాగుతోంది. ఈ ఓట్లను లెక్కించేందుకు 21టేబుళ్లను ఏర్పాటు చేశారు. పట్టభద్రుల స్థానంలో 56 మంది అభ్యర్థులు పోటీ చేయగా.. మొత్తం 2,50,106ఓట్లు పోలయ్యాయి. వీటి నుంచి చెల్లిన, చెల్లని ఓట్లను వేరు చేసే ప్రక్రియ సోమవారం రాత్రి వరకూ పూర్తికాలేదు. 25 ఓట్లకు ఒకటి చొప్పున కట్టలు కట్టి, ఆ తర్వాత ఓట్లను లెక్కిస్తారు. కట్టలు కట్టే ప్రక్రియ మంగళవారం మధ్యాహ్నం వరకు పూర్తయ్యే అవకాశముందని, ఆ తర్వాత నుంచే ఓట్ల లెక్కింపు ప్రారంభం కావచ్చని అంచనా వేస్తున్నారు. చెల్లని ఓట్లు పెద్దసంఖ్యలో కనిపిస్తుండడంతో వాటితో ఫలితాలు తారుమారయ్యే అవకాశముంటుందని అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు.



కరీంనగర్‌లో విలేకరులతో మాట్లాడుతున్న సంజయ్

ప్రధాన ప్రతిపక్షం బీజేపీయే అని తేలింది

» టీచర్ ఎమ్మెల్సీ గెలిచాం..
పట్టభద్రుల స్థానాన్ని కూడా గెలుస్తాం: సంజయ్

భగత్‌నగర్, నల్గొండ, మార్చి3(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య గెలుపుతో ప్రధాన ప్రతిపక్షం బీజేపీయే అని తేలిందని కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. సోమవారం కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ టీచర్ ఎమ్మెల్సీగా గెలుపొందిన మల్క కొమురయ్య ధ్రువీకరణ పత్రాన్ని అందుకున్న అనంతరం ఆయన్ను బండి అభినందించారు. తపస్ చిన్న సంస్థ అని హేళన చేసిన వారికి చెంప పెట్టులా తీర్పు వచ్చిందన్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ కుమ్మక్కై బీజేపీ అభ్యర్థి కొమురయ్యను ఓడించాలని కుట్రలు చేశాయన్నారు. కిషన్‌రెడ్డి నాయకత్వంలో ఇది మూడో విజయమన్నారు. ఎనిమిది మంది ఎమ్మెల్యేలు, ఎనిమిది మంది ఎంపీలు, ఒక టీచర్ ఎమ్మెల్సీ గెలిచామని, పట్టభద్రుల స్థానాన్ని కూడా బీజేపీ కైవసం చేసుకుంటుందన్నారు. భవిష్యత్తులో ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటాలు చేస్తామన్నారు. ఉపాధ్యాయ స్థానంలో ఎమ్మెల్సీగా గెలుపొందిన మల్క కొమురయ్య మాట్లాడుతూ బీజేపీ కార్యకర్తల కృషి, తపస్ సహకారం వల్లే తాను గెలిచానన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. కాగా, రాష్ట్రంలో కులగణన నేపథ్యంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలో బీసీ, బహుజన ఐక్యత నినాదంతో మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, ఎస్.సుందర్‌రాజ్ బరిలో నిలిచారు. అయితే ఈ వాదాన్ని, నినాదాన్ని ఉపాధ్యాయవర్గం తేలిగ్గా తీసుకున్నట్లు స్పష్టమైంది. మాజీ ఎమ్మెల్సీ కూడా అయిన పూల రవీందర్ నాలుగో స్థానానికి పరిమితం కాగా, సుందర్‌రాజ్ ఆరో స్థానానికి పరిమితమయ్యారు.



బీజీ కొత్తూరు పంప్‌హౌస్ వద్ద విడుదలవుతున్న నీటిని పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల

కృష్ణమ్మ ఒడికి గోదావరి జలాలు

» సీతారామ ఎత్తిపోతల పథకాల నుంచి..
ఖమ్మం జిల్లాలోని సాగర్ ఆయకట్టుకు నీరు

» నీటిని విడుదల చేసిన మంత్రి తుమ్మల

ఖమ్మం(ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/కొత్తగూడెం(ఆంధ్రజ్యోతి), మార్చి 3: గోదావరిపై నిర్మించిన సీతారామ ఎత్తిపోతల పథకంలో భాగంగా ఉన్న బీజీ కొత్తూరు, పూసూరు, కమలాపురం ఎత్తిపోతల పథకాల నుంచి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం నీటిని విడుదల చేశారు. దీంతో ఏన్కూర్ సమీపంలోని రాజీవ్ కాల్వ నుంచి వైరా రిజర్వాయర్‌కు మంగళవారం రాత్రికి గోదావరి జలాలు చేరబోతున్నాయి. గత ఏడాది ఆగస్టు 15న సీఎం రేవంత్‌రెడ్డి సీతారామ ఎత్తిపోతల లిఫ్టులతో పాటు ఏన్కూరు లింక్ కెనాల్‌ను ప్రారంభించిన విషయం తెలిసిందే. అయితే వానాకాలంలో సాగర్ నీరు రావడంతో అప్పుడు గోదావరి జలాల అవసరం రాలేదు. యాసంగిలో సాగర్ ఆయకట్టుకు నీటి కొరత నెలకొంది. ఈ నేపథ్యంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం అశ్వాపురం మండలం అమ్మగారిపల్లి వద్ద గోదావరి జలాలను పరిశీలించారు. అనంతరం బీజీ కొత్తూరు, కమలాపురం, పూసూరు ఎత్తిపోతల పథకాలను సందర్శించి జలాలను విడుదల చేశారు. ఈ నీళ్లు ఏన్కూరు రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా మంగళవారం రాత్రి వైరా రిజర్వాయర్‌కు చేరుకుని అక్కడి నుంచి సాగర్ ఎడమ కాలువ ద్వారా ఆయకట్టుకు అందనున్నాయి.

రైతులకు అండగా ఉంటాం

» మద్దతు ధరకే పంటల కొనుగోలు: తుమ్మల

హైదరాబాద్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ఆయా పంటలను రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధరలకు కొనుగోలు చేయడం లేదంటూ బీఆర్‌ఎస్ చేస్తున్న ఆరోపణలను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గట్టిగా తిప్పికొట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేసిన పంటల వివరాలను వెల్లడించారు. కేంద్రం కొనుగోలు చేసినా, చేయకపోయినా, సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు రైతులకు మద్దతు ధర దక్కని ప్రతిసారి అన్ని పంటలను మద్దతు ధరకు కొనుగోలు చేశామని తుమ్మల గుర్తు చేశారు. భవిష్యత్‌లోనూ రైతులు పండించిన పంటలకు మద్దతు ధర అందించే విషయంలో అన్నదాతకు అండగా ఉంటామని రాష్ట్ర రైతాంగానికి భరోసానిచ్చారు.

ఏపీలో కూటమికే జేజేలు!

'కృష్ణా-గుంటూరు' పట్టభద్రుల స్థానంలో ఆలపాటి రాజాకు అనూహ్య ఆధిక్యం



ఏలూరులో బ్యాలెట్ పత్రాల లెక్కింపు ప్రక్రియలో సిబ్బంది

» ఉత్తరాంధ్ర టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ మద్దతుతో పీఆర్టీయూ అభ్యర్థి శ్రీనివాసులునాయుడు విజయం

(అమరావతి/గుంటూరు/ఏలూరు - ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లోని అధికార కూటమి విజయ ఢంకా మోగిస్తోంది. కృష్ణా-గుంటూరు, ఉమ్మడి గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికల్లో 'కూటమి' గెలుపు జెండా ఎగురవేయడం ఖాయమైంది. కృష్ణా-గుంటూరు స్థానం నుంచి పోటీ చేసిన టీడీపీ అభ్యర్థి ఆలపాటి రాజా అనూహ్య మెజారిటీతో దూసుకెళుతున్నారు. రౌండు రౌండుకూ ఆయన మెజారిటీ పెరుగుతూ.. మొదటి ప్రాధాన్య ఓట్లతోనే 'రికార్డు గెలుపు' దిశగా సాగుతున్నారు. ఉమ్మడి గోదావరి జిల్లాల స్థానంలో టీడీపీ అభ్యర్థి పేరా బత్తుల రాజశేఖర్ కూడా ఆధిక్యంలో కొనసాగుతున్నారు. మూడుసార్లు ఎమ్మెల్సీగా గెలిచిన, బలమైన అభ్యర్థిగా మరోమారు 'కృష్ణా-గుంటూరు' బరిలోకి దిగిన కేఎస్ లక్ష్మణరావుకు ఘోర పరాజయం ఎదురవుతోంది. జగన్‌తో అంటకాగడం, వైసీపీ పరోక్ష మద్దతే ఆయన కొంపముంచిందని విశ్లేషకులు చెబుతున్నారు. ఇక... ఉత్తరాంధ్ర టీచర్స్ ఎమ్మెల్సీ స్థానంలో 'కూటమి' మద్దతు ప్రకటించిన ఇద్దరు అభ్యర్థుల్లో పీఆర్టీయూ అభ్యర్థి శ్రీనివాసులు నాయుడు విజయం సాధించారు. ఏపీటీఎఫ్ నేత రఘువర్మ రెండోస్థానంలో నిలవగా... వైసీపీ పరోక్ష మద్దతు ప్రకటించిన యూటీఎఫ్ అభ్యర్థి విజయ గౌరి మూడోస్థానానికి పరిమితమయ్యారు.

ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీగా గాదె విజయం

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పీఆర్‌టీయూ అభ్యర్థి గాదె శ్రీనివాసులు నాయుడు విజయం సాధించారు. ఆయన రెండో ప్రాధాన్య ఓట్లతో గెలుపొందారు. గత నెల 27న జరిగిన పోలింగ్‌లో 20,794 ఓట్లు పోలవ్వగా.. అందులో 659 చెల్లనవిగా గుర్తించారు. మిగిలిన 20,135 ఓట్లలో 50 శాతం కంటే ఒక ఓటు అదనంగా సాధించిన వారిని విజేతగా ప్రకటించాల్సి ఉంటుంది. అంటే 10,068 ఓట్లు రావాలి. అయితే తొలి ప్రాధాన్య ఓట్లలో శ్రీనివాసులు నాయుడికి 7,210, ఏపీటీఎఫ్ అభ్యర్థి పాకలపాటి రఘువర్మకు 6,845, యూటీఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరికి 5,804 ఓట్లు లభించాయి. పోటీలో ఉన్న మిగిలిన ఏడుగురు అభ్యర్థులకు వంద కంటే తక్కువ ఓట్లు వచ్చాయి. రెండో ప్రాధాన్య ఓట్లను లెక్కించగా.. శ్రీనివాసులునాయుడికి 9,237 ఓట్లు, వర్మకు 8,527 ఓట్లు లభించాయి. ఇంకా శ్రీనివాసులునాయుడి ఎన్నికకు 831ఓట్లు అవసరమయ్యాయి. దీంతో రెండో స్థానంలో నిలిచిన రఘువర్మకు లభించిన ఓట్ల నుంచి రెండో ప్రాధాన్య ఓట్లను లెక్కించారు. దీంతో మ్యాజిక్ ఫిగర్‌కు అవసరమైన 10,068 ఓట్లు రావడంతో శ్రీనివాసులునాయుడిని విజేతగా ప్రకటించారు. ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి జరిగిన ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ భారీ మెజారిటీ దిశగా దూసుకెళ్తున్నారు. గత నెల 27న జరిగిన పోలింగ్‌లో 2,41,493 ఓట్లు పోలయ్యాయి. కౌంటింగులో నాలుగు రౌండ్లు ముగిసేటప్పటికి సమీప ప్రత్యర్థి పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావుపై ఆలపాటి రాజేంద్రప్రసాద్ 38,491 ఓట్ల ఆధిక్యం సంపాదించారు. అన్ని రౌండ్లు పూర్తయ్యేసరికి మెజారిటీ లక్షకుపైగా చేరుకుంటుందని అంచనా వేస్తున్నారు. గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎన్నికల్లో టీడీపీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం ముందంజలో ఉన్నారు. సోమవారం అర్ధరాత్రి తొలి రౌండ్ పూర్తయ్యేసరికి ఆయన తన సమీప పీడీఎఫ్ అభ్యర్థి దిడ్ల రాఘవులుపై 10,705ఓట్ల ఆధిక్యంతో కొనసాగుతున్నారు. పేరాబత్తులకు 16,520ఓట్లు రాగా.. రాఘవులు5,815ఓట్లు పొందారు. మంగళవారం సాయంత్రం వరకు లెక్కింపు కొనసాగనుంది.

ఏపీ సీఎం ఔనన్నా.. టీటీడీ కరుణించడంలేదు

తెలంగాణ ప్రజాప్రతినిధులు ఇచ్చే సిఫారసు లేఖలపై తిరుమల అధికారుల మల్లగుల్లాలు

» ఇప్పటికే రోజుకు 7500 బ్రేక్ దర్శనాలు

» తెలంగాణ నేతల సిఫారసులతో ఒత్తిడి

» సర్దుబాటు చేసేందుకు సతమతం

(తిరుమల-ఆంధ్రజ్యోతి)



తెలంగాణ ప్రజా ప్రతినిధుల సిఫారసు లేఖలపై బ్రేక్ దర్శన టికెట్లు ఇవ్వాలని ఏపీ సీఎం ఆదేశించినా.. ఇప్పటికే బ్రేక్ దర్శనాల తాకిడి ఎక్కువ కావడంతో టీటీడీ కేటాయించలేకపోతోంది! దీంతో తెలంగాణ నేతలు గుర్రుమంటున్నారు. తిరుమల శ్రీవారి దర్శనానికి సాధారణ భక్తులతోపాటు నిత్యం వీఐపీల తాకిడి కూడా అధికమే. దీంతో బ్రేక్ దర్శనాలకు ఎక్కువ సమయం కేటాయించాల్సి వస్తోంది. ఇప్పటికే రోజురోజుకూ పెరిగిపోతున్న బ్రేక్ టికెట్ల సంఖ్యను ఎలా తగ్గించాలనే ఆలోచనలో తలమునకలై ఉన్న టీటీడీ.. తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలపై కూడా వీఐపీ బ్రేక్, రూ.300 దర్శన టికెట్లు ఇచ్చేందుకు ఏపీ ప్రభుత్వం అంగీకారం తెలపడంతో ఉక్కిరిబిక్కిరవుతోంది. ప్రస్తుతం నిత్యం 60 వేల నుంచి 70 వేల మంది శ్రీవారిని దర్శించుకుంటున్న విషయం తెలిసిందే. వారాంతాలు, విశేష పర్వదినాల్లో ఆ సంఖ్య లక్ష దాకా చేరుతోంది. ప్రస్తుతం ఏపీ నుంచి ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు, ఎంఎల్సీలు ఇలా కేవలం ప్రజాప్రతినిధుల ద్వారానే 1,800 నుంచి 2 వేల వరకు టికెట్లు ఇవ్వాల్సిన పరిస్థితి నెలకొంది. పోలీసు, ప్రెస్, న్యాయవ్యవస్థ, ఐఏఎస్, టీటీడీ ఉద్యోగులు, కేంద్రమంత్రులు, సీఎంవో సిఫారసుతో మరో 1,500 వరకు టికెట్లు జారీ చేస్తున్నారు. ఇక, టీటీడీ బోర్డు చైర్మన్, సభ్యులకు 580 టికెట్లు జారీ చేస్తున్నారు. ఇవికాక.. స్వయంగా వచ్చే వీఐపీలు, టీటీడీ అధికారులు, దాతలకు కలిపి 600 టికెట్లు, శ్రీవాణిట్రస్టుకు విరాళాలు ఇచ్చే భక్తులకు 1,500 బ్రేక్ టికెట్లు ఇస్తున్నారు. విపరీతమైన ఒత్తిడితో ప్రజాప్రతినిధులు అదనంగా మరికొన్ని బ్రేక్ దర్శన టికెట్లు పొందుతున్నారు. ఇలా వీఐపీ బ్రేక్ దర్శనాలు రోజుకు 7 వేల నుంచి 7,500 వరకు వెళ్లిపోతున్నాయి. ప్రస్తుతం వీరందరికీ దర్శనం పూర్తయ్యేసరికే మధ్యాహ్నం అయిపోతోంది. ఈ క్రమంలోనే.. తెలంగాణ ప్రజాప్రతినిధుల కోరిక మేరకు సీఎం రేవంత్‌రెడ్డి ఏపీ సీఎం చంద్రబాబుకు లేఖ రాశారు. దానిపై సానుకూలంగా స్పందించిన చంద్రబాబు తెలంగాణ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీ సిఫారసు లేఖలపై సోమవారం నుంచి గురువారం వరకు ఏదైనా రెండు రోజులు వీఐపీ బ్రేక్ దర్శనం, మరో రెండు రోజులు రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనానికి లేఖలు తీసుకుని జారీ చేసేలా డిసెంబరు నెలలో నిర్ణయం తీసుకున్నారు. ఈ అంశంపై ప్రణాళికలు సిద్ధం చేయాలంటూ టీటీడీకి ఆదేశాలు అందాయి. అయితే ఇప్పటికే పెరిగిన బ్రేక్ దర్శన సిఫారసులను ఎక్కడ తగ్గించాలో అర్థంకాక టీటీడీ అధికారులు సతమతమవుతున్నారు. ఈ క్రమంలో తెలంగాణ సిఫారసు లేఖలతో వస్తున్న తెలంగాణ భక్తులు.. 'మా లెటర్లు ఎందుకు తీసుకోరు' అంటూ వాగ్వాదానికి దిగుతున్నారు. తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలపై దర్శనాలు ఇవ్వడం ప్రారంభిస్తే మరో 1,100 టికెట్లు పెరుగుతాయి. ఫలితంగా మరో గంట సమయం వీఐపీలకు కేటాయించాల్సి వస్తుంది. ఈ సమయాన్ని ఎక్కడ సర్దుబాటు చేయాలనే అంశంపై టీటీడీ గట్టి కసరత్తుచేస్తోంది.

రాజస్థాన్‌లో 3,100 మెగావాట్ల విద్యుత్ కేంద్రాలు

- సింగరేణి, ఆర్‌వీయూఎన్ఎల్ ఆధ్వర్యంలో నిర్మాణం
- 74% సింగరేణి, 26% ఆర్‌వీయూఎన్ఎల్ పెట్టుబడి
- రాజస్థాన్ సీఎం భజన్‌లాల్, తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి సమక్షంలో జాయింట్ వెంచర్ ఏర్పాటుకు ఎంవోయూ

హైదరాబాద్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): వ్యాపార విస్తరణలో భాగంగా సింగరేణి సంస్థ కీలక ముందడుగు వేసింది. రాజస్థాన్ విద్యుత్ ఉత్పాదన్ నిగం లిమిటెడ్ (ఆర్‌వీయూఎన్ఎల్)తో కలిసి 3,100మెగావాట్ల విద్యుత్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు జైపూర్‌లో రాజస్థాన్ సీఎం భజన్‌లాల్, తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమక్షంలో సోమవారం జాయింట్ వెంచర్ ఏర్పాటుకు సింగరేణి, ఆర్‌వీయూఎన్ఎల్ మధ్య పరస్పర అవగాహన ఒప్పందం కుదిరింది. ఇందులో భాగంగా రాజస్థాన్‌లో 1500 మెగావాట్ల సౌర విద్యుత్ కేంద్రం, మరో 1600 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. జాయింట్ వెంచర్‌లో సింగరేణి సంస్థ 74శాతం, ఆర్‌వీయూఎన్ఎల్ సంస్థ 26శాతం చొప్పున పెట్టుబడి పెట్టనున్నాయి. సింగరేణి సంస్థ మూలధన రూపంలో తన వాటా చెల్లించనుండగా, విద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు అవసరమైన స్థలాలు, మౌలిక సదుపాయాల రూపంలో తన వాటాను ఆర్‌వీయూఎన్ఎల్ భరించనుంది. విద్యుత్ కేంద్రాల నిర్మాణం పూర్తయిన తర్వాత సంబంధిత కొనుగోలు ఒప్పందాలు చేసుకునే బాధ్యత సైతం రాజస్థాన్ విద్యుత్ శాఖనే చేపట్టనుంది. కాగా, విద్యుత్ కేంద్రాల ఏర్పాటు, లాభదాయకత, నిర్మాణ అంశాలపై చర్చించేందుకు ఇరుపక్షాల నిపుణులతో కామన్ వర్కింగ్ గ్రూప్‌ను ఏర్పాటు చేయాలని రెండు రాష్ట్రాలు నిర్ణయించాయి. పరస్పర అవగాహనతో లాభదాయకంగా విద్యుత్ కేంద్రాల ఏర్పాటు ఉండేలా ఈ గ్రూపు సూచనలు చేయనుంది.

ప్రాజెక్టులకు కిషన్‌రెడ్డే అడ్డు: పొన్నం



హుస్నాబాద్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): కేంద్రం ఇచ్చిన హామీలు నెరవేర్చడానికి, నిధులు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అడ్డుపడుతున్నారని, అందువల్లే రాష్ట్ర ప్రాజెక్టులకు నిధులు రావడం లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. సోమవారం ఆయన సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మంత్రి క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కిషన్ రెడ్డి అడ్డుకోనట్లయితే తెలంగాణ ప్రాజెక్టులకు నిధులు ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ హయాంలో అభివృద్ధి జరగడం కిషన్‌రెడ్డికి ఇష్టం లేదన్నారు. వరంగల్ ఎయిర్‌పోర్టు తన వల్లే వచ్చిందని పక్క రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రితో చెప్పించుకున్న ఘనత కిషన్‌రెడ్డిదని ఎద్దేవా చేశారు. వరంగల్ ఎయిర్‌పోర్టుకు ఆయన ఎప్పుడైనా ప్రయత్నించారా? అని నిలదీశారు.

మీనాక్షి టాస్క్.. 'మిషన్ సీఎం చేంజ్'

- రేవంత్‌కు ఉత్తమ్ చెక్ పెడుతున్నారు: ఏలేటి

హైదరాబాద్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): వచ్చే డిసెంబరులోగా ముఖ్యమంత్రి మార్పుపై కాంగ్రెస్ అధినాయకత్వం స్పష్టమైన సంకేతాలు ఇచ్చిందని, కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జిగా మీనాక్షీ నటరాజన్‌ను నియమించడం ఇందులో భాగమని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. 'మిషన్ సీఎం చేంజ్' అన్నదే రాహుల్ ఆమెకు ఇచ్చిన టాస్క్ అని చెప్పారు. జూన్ నుంచి డిసెంబరులోగా సీఎం మార్పు ఖాయమన్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి.. సీఎం రేవంత్‌కు ఎక్కడికక్కడ చెక్ పెడుతున్నారని చెప్పారు. ఇక్కడి ప్రతి అంశాన్నీ ఆయన పార్టీ అధినాయకత్వానికి చేరవేస్తున్నారని, రేవంత్‌కు రాహుల్ అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడానికే కాకుండా రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీని మార్చి మీనాక్షీ నటరాజన్‌ను నియమించడంలో మాస్టర్‌ప్లాన్ ఉత్తమ్‌దే అని ఆయన ఆరోపించారు. సోమవారం మహేశ్వర్ రెడ్డి మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. 'డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలు సీఎం పీఠంపై కన్నేశారు. పార్టీ అధినాయకత్వానికి కప్పం కడుతున్నరు. 'మీకు కప్పం కడుతున్నం.. మా రాజ్యం మాదే' అన్నట్లుగా వారు వ్యవహరిస్తున్నరు. వారి శాఖల్లో జోక్యం చేసుకోవద్దని సీఎంకు అధినాయకత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలున్నయి.. అధినాయకత్వం ఇచ్చిన స్వేచ్ఛతో ముగ్గురు మంత్రుల శాఖల్లో అవినీతి విపరీతంగా పెరిగిపోయింది' అని అన్నారు.

ఏలేటి భవిష్యత్తు మేం చెప్తాం: ఆది శ్రీనివాస్

'బీజేపీలో లొసుగులు పెట్టుకుని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల గురించి మాట్లాడతారా? మీ చిలకజోస్యం ఆపకపోతే నీ భవిష్యత్తు మేమే చెప్పాల్సి వస్తుంది' అని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డిని ఉద్దేశించి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నాలుగైదు నెలలు నిద్రపోయిన ఆయన డిసెంబరులో సీఎం మారుతారని, అందుకే మీనాక్షీ నటరాజన్ వచ్చారని పిట్ట కథలు చెబుతున్నారన్నారు. సొంత పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీల మధ్య అసంతృప్తులు కనిపించడం లేదా అని ఆయనను ప్రశ్నించారు.

కేంద్ర మంత్రులతో సఖ్యతగా ఉండండి: శంకర్

హైదరాబాద్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధిని నిజంగానే కోరుకుంటే కేంద్రమంత్రులతో సఖ్యతగా ఉండాలని బీజేఎల్పీ ఉప నేత పాయల శంకర్ సీఎం రేవంత్‌కు సూచించారు. తమ సమస్యలు పరిష్కరించాలని, హామీలను నెరవేర్చాలని రేవంత్‌కు ప్రజలు అవకాశమిస్తే ఆయన కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌ని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారన్నారు. 'కాంగ్రెస్ 6 గ్యారంటీలకు అతీగతీ లేదు. పరిపాలన గందరగోళంగా మారింది. వీటి నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు రేవంత్ కేంద్రమంత్రులను విమర్శిస్తున్నారు' అని అన్నారు.

మహిళల్ని మోసం చేస్తే మట్టి కరిపిస్తాం: కవిత

హైదరాబాద్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీలను తక్షణం అమలు చేయాలని, ఇలాగే మహిళా లోకాన్ని మోసం చేస్తే కాంగ్రెస్ పార్టీని మట్టి కరిపిస్తామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ.. ఈ నెల 8న మహిళా దినోత్సవం లోపు మహిళలకు నెలకు రూ.2,500 ఇవ్వడంతోపాటు అన్ని హామీలపై కార్యాచరణ ప్రకటించాల్సిందేనన్నారు. మహిళలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ.. తెలంగాణ జాగృతి మహిళల ఆధ్వర్యంలో 10 వేల పోస్టుకార్డులను సీఎం రేవంత్ రెడ్డికి పంపించినట్లు చెప్పారు. ఈ నెల 8లోగా సీఎం ప్రకటన చేయకపోతే లక్షలాది పోస్టుకార్డులను సోనియాగాంధీకి పంపిస్తామని తేల్చి చెప్పారు. కాగా, వరంగల్‌లో ఏర్పాటు చేయనున్న విమానాశ్రయానికి రాణి రుద్రమదేవి పేరు పెట్టాలని ప్రభుత్వానికి సూచించారు.

వీలైతే రెండు... కనీసం ఒక ఎమ్మెల్సీ ఇవ్వాల్సిందే

- టీపీసీసీ అధ్యక్షుడిని కోరిన కూనంనేని సాంబశివరావు

హైదరాబాద్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కోటాలో ఐదు ఎమ్మెల్సీ ఖాళీల నేపథ్యంలో ఎన్నికలకు ముందు సీపీఐకి ఇచ్చిన హామీ ప్రకారం ఎమ్మెల్సీ సీట్లపై స్పష్టత ఇవ్వాలని కాంగ్రెస్‌ని కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌ను కలిసి తమకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని కోరారు. గతంలో రెండు ఎమ్మెల్సీ ఖాళీలు వస్తే వాటిని కాంగ్రెస్ పార్టీ తీసుకుందని, తమకు మరో విడతలో సర్దుబాటు చేస్తామని అప్పుడు చెప్పిన హామీని గుర్తు చేశామని కూనంనేని 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు.

తుమ్మడి హట్టి వద్ద బరాజ్ నిర్మాణం చేపట్టాలి

- సీఎం రేవంత్‌కు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి వినతి

హైదరాబాద్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : గోదావరి నదిపై తుమ్మడి హట్టి వద్ద బరాజ్‌ను నిర్మించాలంటూ సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిలకు కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ బరాజ్ నిర్మాణానికి రానున్న బడ్జెట్లో నిధులు కేటాయించాలని కోరారు. గాంధీభవన్‌లో సోమవారం జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో సాగునీటి ఇబ్బందులకు కారణం బీఆర్ఎస్ పార్టీనేనని, ఆ పార్టీ హయాంలో.. ప్రాజెక్టుల నిర్మాణంలో కేసీఆర్ సొంత అజెండా అనుసరించినందునే ఈ ఇబ్బందులు ఏర్పడ్డాయన్నారు. ఇప్పటికైనా బీఆర్ఎస్ నేతలు విజ్ఞత ప్రదర్శించి చేసిన తప్పులను ఒప్పుకొంటే ప్రజలు హర్షిస్తారన్నారు.

తెలంగాణ ప్రాజెక్టులపై అభ్యంతరాలొద్దు

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రానికి కేటాయించాలి" అని కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌కు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు న్యాయబద్ధమైన వాటా కేటాయించాలని కోరారు. తెలంగాణ వాటా నికర జలాలను తేల్చిన తర్వాతే గోదావరిపై ఏపీ నిర్మిస్తున్న ప్రాజెక్టులపై నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కృష్ణా పరీవాహక ప్రాంతం తెలంగాణలో ఎక్కువగా ఉన్నప్పటికీ కేఆర్ఎంబీ పక్షపాత ధోరణితో ఏపీకి 66 శాతం, తెలంగాణకు 34 శాతం నీటిని కేటాయించిందని, ఫలితంగా, అనేక సంవత్సరాలుగా తాము నష్టపోతున్నామని, ఈ ఏడాది సైతం తమకు కేటాయించిన మొత్తానికి మించి నీటిని ఏపీ తరలించుకుపోతోందని ఆరోపించారు. ఇకపై ఏపీ తనకు కేటాయించిన వాటాకు మించి కృష్ణా నీటిని తరలించకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కృష్ణా ప్రాజెక్టుల నుంచి నీటి విడుదలకు సంబంధించి వెంటనే టెలిమెట్రీ యంత్రాలను ఏర్పాటు చేయాలని, అవసరమైతే అందుకయ్యే మొత్తాన్ని తామే భరిస్తామని పునరుద్ఘాటించారు. "పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి 2022లోనే డీపీఆర్ సమర్పించాం. అయినా, అనుమతులు ఇవ్వడానికి ఆలస్యం చేస్తున్నారు. అలాగే, సీతారామ ఎత్తిపోతలు, సమ్మక్క సాగర్ బ్యారేజీలకు కూడా అనుమతులు ఇవ్వలేదు. కానీ, న్యాయస్థానాల పరిధిలో ఉన్న అప్పర్ భద్రకు మాత్రం అనుమతులు ఇచ్చారు. సీతారామ, సమ్మక్క సాగర్‌లకు సీడబ్ల్యూసీ, సాంకేతిక సలహా మండలి అనుమతులు ఇప్పించాలి" అని కోరారు. పునర్విభజన చట్టం నిబంధనలకు విరుద్ధంగా ఏపీ ప్రభుత్వం బనకచర్ల పథకానికి రూపకల్పన చేసిందని, దీనికి సీడబ్ల్యూసీ, జీఆర్ఎంబీ, కేఆర్ఎంబీ అనుమతుల్లేవని తెలిపారు. అపెక్స్ కౌన్సిల్లోనూ దీనిపై ఎటువంటి చర్చ జరగలేదని గుర్తు చేశారు. గోదావరిలో తెలంగాణ నికర జలాల వాటా తేల్చాలని డిమాండ్ చేశారు. తెలంగాణ నీటి ప్రయోజనాలు కాపాడుకునే విషయంలో ఏమాత్రం రాజీపడబోమని కేంద్ర మంత్రికి తేల్చి చెప్పారు. పాలమూరు, సీతారామ, మొడికుంటవాగు, చనాఖా కొరటా, చిన్న కాళేశ్వరం (ముక్తేశ్వర) ఎత్తిపోతల పథకాలకు ఏఐబీపీ కింద ఆర్థిక సాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మిస్తామని, ముంపునకు సంబంధించి మహారాష్ట్ర నుంచి అనుమతులు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు.



కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌కు జ్ఞాపికను అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, చిత్రంలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

అదనపు జలాలను వాడుకుంటామనడం సరికాదు

సమ్మక్క సాగర్, సీతారామ సహా ఇతర ప్రాజెక్టులకు నికర జలాల కేటాయింపులే జరగలేదని, అలాంటప్పుడు గోదావరిలో అదనపు నీళ్లున్నాయని, సముద్రంలో కలిసే ఆ నీళ్లను ఉపయోగించుకుంటామని ఆంధ్రప్రదేశ్ చెప్పడం సరికాదని సీఎం రేవంత్ మీడియాతో మాట్లాడుతూ వ్యాఖ్యానించారు. "తెలంగాణలో శాశ్వత ప్రాజెక్టులకు పూర్తిస్థాయి కేటాయింపులు జరిగిన తర్వాతే.. వరద జలాలు ఉన్నాయా? లేదా అనేది లెక్క తేలుతుంది. గోదావరిపై నిర్మిస్తున్న తెలంగాణ ప్రాజెక్టులకు నీటి కేటాయింపులు పూర్తయిన తర్వాతే ఇతర ప్రాజెక్టులకు అనుమతి ఇవ్వాలి. సమ్మక్క బరాజ్, సీతారామ ప్రాజెక్టులకు సీడబ్ల్యూసీ తుది అనుమతి రాలేదు. వాటిపై ఏపీ అభ్యంతరాలు చెబుతోంది. సముద్రంలో కలుస్తున్న గోదావరి వరద జలాలను బనకచర్ల ద్వారా కృష్ణా బేసిన్‌కు తరలిస్తామని చెబుతోంది. అలాంటప్పుడు తెలంగాణ ప్రాజెక్టులపై ఎందుకు అభ్యంతరాలు చెబుతోంది" అని ప్రశ్నించారు. గతంలో జరిగిన పొరపాటు కారణంగా కృష్ణా జలాల్లోని 811 టీఎంసీల్లో ఏపీ 512 టీఎంసీలు వినియోగిస్తుంటే.. తెలంగాణ కేవలం 299 టీఎంసీలకే పరిమితమైందని, తెలంగాణ ప్రాజెక్టులు పూర్తికాకపోవడమే దీనికి ప్రధాన కారణమని చెప్పారు. గోదావరి వరద జలాల లెక్క తేలిన తర్వాత తమ ప్రాజెక్టులకు సంబంధించి ఏపీ డీపీఆర్‌లు ఇవ్వాలని, వాటిపై చర్చ జరిపి తమ అభ్యంతరాలను చెబుతామని తెలిపారు. కృష్ణా నది విషయంలో ఏ సమస్యనైతే ఎదుర్కొంటున్నామో, అలాంటి సమస్యనే గోదావరి విషయంలోనూ ఎదుర్కోవడానికి తాము సిద్ధంగా లేమని తేల్చి చెప్పారు.

నేటి నుంచి మీనాక్షి సమీక్షలు

హైదరాబాద్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పరిస్థితిపై అవగాహన, పార్టీ నేతలకు దిశానిర్దేశం చేసేందుకు మంగళవారం నుంచి లోక్ సభ నియోజకవర్గాల వారీగా పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ సమీక్షలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా గాంధీభవన్‌లో మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు మెదక్, సాయంత్రం 5 గంటలకు మల్కాజ్‌గిరి నాయకులతో ఆమె భేటీ కానున్నారు. బుధవారం ఉదయం 11 గంటలకు కరీంనగర్, మధ్యాహ్నం 2 గంటలకు ఆదిలాబాద్, సాయంత్రం 5 గంటలకు పెద్దపల్లి నేతలతో భేటీ కానున్నారు.

ఏపీకి అడ్డుకట్ట వేయాలి: మంత్రి ఉత్తమ్

కృష్ణా జలాల విషయంలో తెలంగాణకు అన్యాయం జరుగుతోందని, నీటి తరలింపుపై కేంద్రం జోక్యం చేసుకోవాలని కోరామని, తప్పకుండా జోక్యం చేసుకుంటామని సీఆర్ పాటిల్ హామీ ఇచ్చారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు. సాగర్ కుడి కాల్వ ద్వారా ఏపీ తీసుకెళుతున్న 10 వేల క్యూసెక్కుల నీటిని 5 వేల క్యూసెక్కులకు తగ్గించాలని కోరామని, ఇందుకు కూడా అంగీకరించారని తెలిపారు. "బనకచర్ల ప్రాజెక్టు కోసం ఏపీ సీఎం చంద్రబాబు ప్రతిపాదన పెట్టారు. దానిపై మేం అభ్యంతరం తెలిపాం. ప్రాజెక్టుపై కేంద్రం ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. మాకు ఫీజిబులిటీ, డీపీఆర్ వంటివేమీ రాలేదని, ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని కేంద్ర మంత్రి తెలిపారు" అని వివరించారు. 811 టీఎంసీల కృష్ణా జలాల్లో తెలంగాణకే ఎక్కువ వాటా ఉండాలని కోరామని, పాలమూరు, సీతారామ, సమ్మక్క సాగర్ నీటి కేటాయింపులను త్వరగా పూర్తిచేయాలని విజ్ఞప్తి చేశామని తెలిపారు. కాళేశ్వరం బరాజ్‌లు కుప్పకూలడానికి సంబంధించి ఎన్డీఎస్ఏ విచారణ జరుగుతోందని, దీనిపై త్వరగా నివేదిక తమకు ఇవ్వాలని కోరామని, దాని ఆధారంగానే ముందుకు వెళ్లాలని నిర్ణయించామని స్పష్టం చేశామని వివరించారు. అన్నింటికీ కేంద్రం మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. సమావేశంలో నల్లగొండ ఎంపీ రఘువీర్ రెడ్డి, కేంద్ర జలశక్తి కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ, ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్‌రాజ్, రాష్ట్ర నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, రాష్ట్ర నీటి పారుదల శాఖ ఈఎన్సీ (ఓఅండ్ఎం) విజయ్ భాస్కర్ రెడ్డి, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు.

మార్చి చివరి వారంలో చిన్న కాంట్రాక్టర్లకు బిల్లులు

- సీఎంతో చర్చించి సమస్య పరిష్కరిస్తాం
- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి హామీ

హైదరాబాద్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని చిన్న కాంట్రాక్టర్లను ఆదుకుంటామని, పెండింగ్ బిల్లులపై సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించి సమస్యను పరిష్కరిస్తామని కాంట్రాక్టర్లకు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి భరోసానిచ్చారు. సోమవారం బిల్డర్స్ అసోసియేషన్ మాజీ చైర్మన్లు డి.వి.ఎన్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, చిన్న కాంట్రాక్టర్లు కొంతమంది మంత్రిని కలిసి తమ సమస్యలను విన్నవించారు. చిన్న కాంట్రాక్టర్లకు సంబంధించి రూ.100 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, ఏళ్ల తరబడి బిల్లులు రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్టు మంత్రికి తెలిపారు. కొత్త పనులు కూడా చేయలేకపోతున్నామని వివరించారు. అనంతరం మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ.. చిన్న కాంట్రాక్టర్ల బిల్లుల విషయంపై సీఎంతో చర్చించి, ఈనెల చివరి వారంలో బిల్లులు చెల్లించేలా చూస్తామని హామీనిచ్చారు. అయితే పెండింగ్ బిల్లులు రావడంలేదన్న కారణంగా ప్రస్తుతం నడుస్తున్న పనుల్లో జాప్యం ఉండకూడదని మంత్రి సూచించారు. ప్రజలకు రహదారులే ప్రాథమిక అవసరమని, కాంట్రాక్టర్లు ఈ విషయాన్ని మరవకూడదని, దానిని దృష్టిలో ఉంచుకుని పనులు చేయాలన్నారు.

ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్లకు కేంద్రం ఆమోదం

- మంత్రి పొన్నం లేఖకు కేంద్రమంత్రి గడ్కరీ సమాధానం

హైదరాబాద్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్తగా ఆటోమేటిక్ డ్రైవింగ్ టెస్టింగ్ స్టేషన్ల ఏర్పాటుకు కేంద్రం ఆమోదం తెలిపింది. ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్లకు కేంద్రం 30 శాతం గ్రాంట్ ఇచ్చేందుకు సుముఖత వ్యక్తం చేసింది. కేంద్ర రోడ్డు రవాణా జాతీయ రహదారుల మంత్రి నితిన్ గడ్కరీకి తెలంగాణ రవాణాశాఖలోని పలు అంశాలపై మంత్రి పొన్నం ప్రభాకర్ ఇటీవల లేఖ రాశారు. ఆ లేఖపై కేంద్ర మంత్రి గడ్కరీ స్పందించారు. ఆటోమేటిక్ డ్రైవింగ్ టెస్టింగ్ స్టేషన్లతోపాటు రాష్ట్రంలో కొత్తగా 3 ప్రాంతీయ డ్రైవింగ్ శిక్షణా కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని సూచించారు. రాష్ట్రంలో 'వాహన్ సారథి' సాఫ్ట్‌వేర్ సులభతరం చేసేందుకు ప్రత్యేక బృందాన్ని నియమించినట్లు కేంద్ర మంత్రి తెలిపారు. రవాణా శాఖలో మానవ వనరుల అభివృద్ధికి వర్క్‌షాప్ కం ట్రైనింగ్ ప్రోగ్రాం పథకాన్ని అమలు చేసేందుకు సానుకూలత వ్యక్తం చేశారు. జాతీయ రహదారులపై ఎక్స్‌ప్రెస్ వేలతోపాటు సుమారు 40-60 కిలో మీటర్ల వ్యవధిలో ఈవీ చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటును తప్పనిసరి చేస్తున్నట్లు కేంద్ర మంత్రి వెల్లడించారు.

ప్రభుత్వ విద్యలో.. లోపాలను గుర్తించండి

- ప్రపంచంతో పోటీపడేలా బోధన ఉండాలి
- పాఠ్యాంశాల్లో ఏఐని బోధించాలి: దుద్దిళ్ల



హైదరాబాద్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడుల్లో ప్రమాణాలను అత్యున్నత స్థాయికి తీసుకెళ్లడం ద్వారా పాఠశాల విద్య ముఖచిత్రాన్ని సమూలంగా మార్చాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశించారు. సోమవారం సచివాలయంలో నిర్వహించిన విద్యాశాఖ ఉన్నతస్థాయి సమీక్షలో ఆయన మాట్లాడుతూ.. ఒకప్పుడు ప్రపంచానికి ప్రతిభావంతులను అందించిన ప్రభుత్వ పాఠశాలలు ఇప్పుడు ఆ స్థాయిలో లేవన్నారు. "ప్రభుత్వ విద్య, బోధన తీరులో లోపాలను గుర్తించండి. సర్కారు బడులు ప్రైవేటు స్కూళ్లతో పోటీపడలేకపోవడానికి కారణాలను అన్వేషించండి. తద్వారా మార్పులకు శ్రీకారంచుట్టాలి" అని సూచించారు. బడుల్లో మౌలిక సదుపాయాలను మరింత మెరుగుపరచడానికి సర్కారు సిద్ధంగా ఉందన్నారు. ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను ఏర్పాటు చేసి, పేద విద్యార్థులకు అత్యుత్తమ చదువులను అందించాలని సీఎం రేవంత్‌రెడ్డి సంకల్పించారని, అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. "గుజరాత్ నుంచి ఏటా 30-40 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులను సింగపూర్‌లో శిక్షణకు పంపుతున్నారు. ఆ తరహా ప్రయత్నం మనవద్ద కూడా జరగాలి. ఫిన్లాండ్, ఫ్రాన్స్, బ్రిటన్‌లలో విద్యాప్రమాణాలపై అధ్యయనం చేసి, మన వద్ద కూడా ఆ స్థాయిలో విద్యను ప్రవేశ పెట్టాలి. పాఠ్యాంశాలను మార్చాలి. సింగపూర్ ప్రభుత్వం మన దగ్గర ప్రపంచ స్థాయి విద్యాసంస్థలను ఏర్పాటు చేయడానికి అంగీకరించింది. త్వరలోనే సింగపూర్ బృందం రాష్ట్రంలో పర్యటించనుంది. ఢిల్లీలోనూ ప్రభుత్వ బడుల్లో మెరుగైన విధానాలపై అధ్యయనం చేయాలి" అని వ్యాఖ్యానించారు. విద్యపై ఎంతగా ఖర్చుపెడుతున్నా.. ఆశించిన ఫలితాలు కనిపించడం లేదని, రాబోయే రెండు మూడేళ్లలో మన విద్యావిధానంలో సమూల మార్పులు రావాలని ఆకాంక్షించారు. ఒకప్పుడు డీఈవోలు, ఎంఈవోలు తరచూ స్కూళ్లను తనిఖీ చేసేవారని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంఈవోలు ఇతర పనులు చేస్తున్నారేతప్ప.. విద్యాప్రమాణాలను పెంచే ప్రయత్నాలు జరగడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. కృత్రిమ మేధ(ఏఐ)ను కింది తరగతుల నుంచే పాఠ్యాంశాల్లో చేర్చాలని శ్రీధర్‌బాబు అధికారులను ఆదేశించారు. "భవిష్యత్ అంతా ఏఐదే. దీని వల్ల ఉద్యోగావకాశాలు మెరుగుపడతాయి. మన విద్యార్థులు కూడా ఆ అవకాశాలను అందిపుచ్చుకోవాలి. ఆ మేరకు ప్రయత్నాలు జరగాలి. ఇందుకోసం భేషజాలకు పోకుండా.. ప్రైవేటు కన్సల్టెంట్ల సేవలను వినియోగించుకోవాలి" అని సూచించారు.

సమావేశాన్ని వాయిదా వేయండి

- గోదావరి బోర్డుకు ఏపీ లేఖ

ఈ నెల 5న నిర్వహించే గోదావరి నది యాజమాన్య బోర్డు(జీఆర్ఎంబీ) సమావేశాన్ని వాయిదా వేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కోరింది. ఈ మేరకు సోమవారం ఏపీ జలవనరుల శాఖ లేఖ రాసింది. ప్రస్తుతం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరుగుతున్నందున బోర్డు భేటీకి హాజరుకాలేమని తెలిపింది.

హైదరాబాద్-విజయవాడ హైవే విస్తరణ.. డీపీఆర్ కన్సల్టెంట్ ఖరారు

(మొదటిపేజీ తరువాయి)

దక్కించుకుంది. ఈ సంస్థతో ఈ నెలాఖరు వరకు కేంద్రం ఒప్పందం కుదుర్చుకోనుంది. రహదారి అధ్యయనం, రోడ్డు భద్రత అంశాలు కలిపి డీపీఆర్ తయారీకి రూ.9.86 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఈ ఒప్పందం జరిగిన తరువాత ఆరు నెలల్లో సమగ్ర నివేదికను సదరు సంస్థ కేంద్రానికి అందించాల్సి ఉంటుంది. ఒప్పందంలో ఇదే విషయాన్ని పొందుపరచనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఎన్‌హెచ్-65 రోడ్డును హైదరాబాద్ అవతల.. అంటే దండు మల్కాపూర్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని గొల్లపూడి వరకు దాదాపు 265 కిలోమీటర్ల మేర ఆరు లేన్లుగా విస్తరించనున్నారు. ఈ రోడ్డును మంజూరు చేసి, నిర్మించే సమయంలోనే ఆరు లేన్లకు సరిపడా భూమిని సేకరించడంతో మళ్లీ ఇప్పుడు కొత్తగా భూ సేకరణ చేయాల్సిన అవసరం లేదు. అయితే సాంకేతికంగా కొన్ని అంశాల పరిశీలన, అధ్యయనం చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఉన్న మార్గంలో వాహనాల రద్దీ ఎలా ఉంది, ఏ సమయంలో ఎన్ని వాహనాలు తిరుగుతున్నాయి, రెండు వైపులా ట్రాఫిక్ ఏ సమయాల్లో అధికంగా ఉంటోందనే దానిపై ప్రధానంగా వివరాలు సేకరిస్తారు. అదే సమయంలో భద్రతపరంగా ఆ రోడ్డు ఎలా ఉందన్నదీ పరిశీలిస్తారు.

కొత్తగా మరో రెండు రోడ్లు..

గతంలో విజయవాడకు ఎన్‌హెచ్-65 మార్గమే ప్రధానంగా ఉండేది. ఇప్పుడు సూర్యాపేటకు 10 కిలోమీటర్ల ముందు.. ఖమ్మం-సూర్యాపేట జాతీయ రహదారి అందుబాటులోకి వచ్చింది. మరోవైపు ఖమ్మం నుంచి దేవరపల్లి, రాజమండ్రికి మరో హైవే నిర్మాణం దాదాపు పూర్తికావచ్చింది. దాంతో రాజమండ్రి, భీమవరం, గోదావరి జిల్లాలకు వెళ్లేవారంతా ఈ రహదారులనే అధికంగా వినియోగించే అవకాశాలున్నాయి. కాగా, ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలో పేర్కొన్నట్లుగా చౌటుప్పల్ నుంచి అమరావతి వరకు మరో గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ రోడ్డును మంజూరు చేయాలని ఏపీ సీఎం చంద్రబాబు ఇప్పటికే కేంద్రాన్ని కోరారు. దానిపై కేంద్రం సమాలోచనలు చేస్తోంది. దీనికితోడు బందరు పోర్టుకు వెళ్లేవిధంగా ఒక హైస్పీడ్ కారిడార్‌ను మంజూరు చేయాలని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కూడా కేంద్రాన్ని కోరుతున్నారు. ఈ రెండు రోడ్లు మంజూరైతే హైదరాబాద్-విజయవాడ రహదారి ట్రాఫిక్‌పై ఎంత ప్రభావం ఉంటుందనే వివరాలనూ డీపీఆర్‌లో పొందుపరిచి కేంద్రానికి సమర్పించనున్నారు. అంతేకాకుండా ప్రస్తుతం ఈ రోడ్డుపై ఉన్న టోల్‌ప్లాజాల వద్ద కూడా ప్రత్యేక సర్వే చేపడతారు. ఏ సమయంలో ఎన్ని వాహనాలు తిరుగుతున్నాయి, రోజు మొత్తంలో తిరిగే వాహనాలెన్ని అనేది పరిశీలిస్తారు. ప్రస్తుతం ఈ రహదారిపై ప్రతిరోజూ 50 వేలకు పైగా వాహనాలు తిరుగుతున్నట్లు ప్రాథమిక గణాంకాలు చెబుతున్నాయి. అయితే డీపీఆర్ అనేది సాంకేతిక అంశాలపై స్పష్టత ఇవ్వడానికి మాత్రమేనని, విస్తరణ చేయడం ఖాయమైందని ప్రభుత్వం పేర్కొంటోంది. డీపీఆర్ అందిన తరువాత విస్తరణ పనులు ముందుకు కదలనున్నాయి.

ఎమ్మెల్సీల అంశం తేలగానే మంత్రివర్గ విస్తరణ?

చీఫ్‌విప్, డిప్యూటీ స్పీకర్‌ల నిర్ణయమూ మంత్రులతోపాటే.. ఈ నెలాఖరు కల్లా కొలిక్కి వచ్చే అవకాశం!

హైదరాబాద్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపిక పూర్తి కాగానే.. మంత్రివర్గ విస్తరణపై సీఎం రేవంత్‌రెడ్డి దృష్టి పెట్టనున్నారా? బడ్జెట్ సమావేశాల విరామ సమయంలో దీనికి సంబంధించి కసరత్తు జరగనుందా? ఈ నెలాఖరు కల్లా ఆ కసరత్తు ఓ కొలిక్కి రానుందా? బడ్జెట్ సమావేశాల తర్వాత కొత్త మంత్రులు కొలువుదీరనున్నారా? ఈ ప్రశ్నలకు కాంగ్రెస్ పార్టీ వర్గాలు.. అవుననే సమాధానమే ఇస్తున్నాయి. మరో మూడు, నాలుగు రోజుల్లో ఎమ్మెల్సీ అభ్యర్థులు ఖరారు కానున్నారని.. ఆ తర్వాత సామాజిక సమీకరణలు, ఇతర అంశాల ఆధారంగా మంత్రి వర్గ విస్తరణ కసరత్తు జరగనుందని ఆ వర్గాలు చెబుతున్నాయి. అయితే శాఖల మార్పులతో సరిపెడతారా.. లేక ఒకరిద్దరిని మార్చి కొత్తవారిని నియమిస్తారా అన్నదానిపై స్పష్టత లేదు. కాగా, ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికలో సామాజిక కూర్పు.. మంత్రివర్గ విస్తరణ కసరత్తుపై ప్రభావం చూపే అవకాశమున్నట్లు చెబుతున్నారు. అసెంబ్లీలో కాంగ్రెస్‌కున్న సంఖ్యా బలాన్ని బట్టి 4 ఎమ్మెల్సీ సీట్లు దక్కనున్న సంగతి తెలిసిందే. ఈ 4 సీట్లలో ఒక సీటు అగ్రకులానికి, ఒకటి ఎంబీసీలకు, ఎస్సీ మాదిగ, ఎస్సీ మాలకు చెరో సీటు కేటాయించనున్నట్లుగా పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఎస్సీ మాదిగ నుంచి ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ పేరు ప్రధానంగా పరిశీలనలో ఉంది. ఆయనతోపాటు దొమ్మాటి సాంబయ్య, రాచమళ్ల సిద్దేశ్వర్ రేసులో ఉన్నారు. ఎస్సీ మాల నుంచి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్ పేరు ప్రధానంగా పరిశీలనలో ఉంది. ఓసీల్లో సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, టీపీసీసీ నేత జెట్టి కుసుమ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాల్ రేసులో మిగిలారు. ఎంబీసీల నుంచి సీనియర్ నేతల పేర్లను పరిశీలిస్తున్నారు. అయితే అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు సీపీఐకి ఒక సీటు కేటాయించాల్సి వస్తే మళ్లీ సమీకరణలు మారతాయని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికపై ఈ నెల 6వ తేదీ సాయంత్రంగానీ, 7న గానీ సీఎం రేవంత్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి భేటీఅయి.. 8వతేదీకల్లా అభ్యర్థులను ఖరారు చేయనున్నట్లు సమాచారం.

విస్తరణా.. పునర్వ్యవస్థీకరణా?

రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ పెంచుకునేందుకు వీలుగా రాజ్యాంగాన్ని సవరించాలంటూ కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు సీఎం రేవంత్ అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లనున్నారు. ఇందుకోసం బడ్జెట్ సమావేశాల మధ్యలో ఒక వారం పాటు విరామం ఇవ్వనున్నట్లు చెబుతున్నారు. ఆ విరామ సమయంలో మంత్రివర్గ విస్తరణపై కసరత్తు చేపట్టనున్నట్లు తెలుస్తోంది. అయితే మంత్రివర్గాన్ని పునర్వ్యవస్థీకరించాలా.. లేక శాఖల మార్పుతో సరిపెట్టాలా అనే అంశంపై తర్జనభర్జన పడుతున్నట్టు సమాచారం. ఏడాది పాలనలో మంత్రుల పనితీరుపై అధిష్ఠానం ఇప్పటికే నివేదిక తెప్పించుకుంది. వారిలో ఆశించిన పనితీరు కనబరచని ఒకరిద్దరు మంత్రుల స్థానే కొత్తవారికి అవకాశం ఇవ్వాలా.. లేక వారి శాఖలను మార్చాలా అన్న దానిపై పరిశీలన జరుగుతున్నట్లు సమాచారం. ప్రస్తుతం మంత్రివర్గంలో ఆరు బెర్తులు ఖాళీగా ఉన్న సంగతి తెలిసిందే. అయితే ముదిరాజ్ సామాజిక వర్గ నేతను మంత్రిని చేస్తామంటూ లోక్‌సభ ఎన్నికల సందర్భంగా సీఎం రేవంత్ ప్రకటించిన నేపథ్యంలో.. పార్టీలో ఆ సామాజిక వర్గం నుంచి ఉన్న ఏకైక ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి మంత్రి పదవి దాదాపు ఖరారైంది. అలాగే ఉమ్మడి నిజామాబాద్ నుంచి సుదర్శన్‌రెడ్డికి మంత్రి పదవి కోసం సీఎం రేవంత్‌రెడ్డి పట్టుపడుతున్నారు. అయితే రెడ్డి సామాజిక వర్గం నుంచి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉమ్మడి రంగారెడ్డి నుంచి మల్‌రెడ్డి రంగారెడ్డి, పరిగి రామ్మోహన్‌రెడ్డి ప్రయత్నాలు చేసుకుంటున్నారు. కాంగ్రెస్ అధిష్ఠానం.. సోషల్ ఇంజనీరింగ్‌కు ప్రాధాన్యమిస్తున్న నేపథ్యంలో విస్తరణలో రెడ్డి సామాజిక వర్గానికి ఒక సీటే కేటాయిస్తే.. ఈ ముగ్గురి ఆశలూ గల్లంతైనట్లేనంటున్నారు. పరిగి రామ్మోహన్‌రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డిలో ఒకరికి చీఫ్‌విప్ పదవి దక్కనున్నట్లు చెబుతున్నారు. ఇక.. వర్గీకరణ అంశం తెరపైకి వచ్చాక ఎస్సీ మాదిగ, మాల వర్గాల మధ్య పోటీ మరింత తీవ్రమైంది. మాల సామాజిక వర్గం నుంచి గడ్డం వివేక్ పోటీ పడుతుండగా.. మాదిగ సామాజిక వర్గం నేతలూ క్యాబినెట్లో బెర్తు కోసం పట్టు పడుతున్నారు. అలాగే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి వివేక్‌తో పాటు ప్రేమ్‌సాగర్‌రావు కూడా మంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్నారు. ఇక ముదిరాజ్ సామాజిక వర్గంతో పాటు మరో బీసీ సామాజిక వర్గానికీ విస్తరణలో చోటు కల్పించాలంటూ బీసీ వర్గాల నేతలు ఒత్తిడి తెస్తున్నారు. ఎస్టీ లంబాడా వర్గం నుంచి బాలూనాయక్‌కు మంత్రివర్గంలో చోటు కల్పించాలా.. లేక డిప్యూటీ స్పీకర్‌గా నియమించాలా అన్నదానిపై చర్చలు జరుగుతున్నాయి. ముస్లింల నుంచి పార్టీ సీనియర్ నేతలు ఎవరూ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు లేరు. ఎమ్మెల్సీ అమెరలీఖాన్‌కు మంత్రి పదవి ఇచ్చేంత సీనియారిటీ లేదు. క్యాబినెట్ ర్యాంకుతో షబ్బీర్ అలీని ప్రభుత్వ సలహాదారుగా నియమించిన నేపథ్యంలో ఈ వర్గానికి మంత్రి వర్గంలో చోటు కల్పించాలా.. వద్దా అనే చర్చా నడుస్తోంది. అయితే వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణను నమూనాగా చూపాలని భావిస్తున్న పార్టీ అధిష్ఠానం.. రానున్న నాలుగేళ్లూ మంత్రుల పనితీరుకే ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో మంత్రి వర్గ విస్తరణలో అధిష్ఠానం తన మార్కు చూపించే ఆస్కారం ఉందంటున్నారు.

రేపటి నుంచి ఇంటర్ పరీక్షలు

- 1,532 కేంద్రాలు.. 9.96 లక్షల మంది విద్యార్థులు
- ప్రతి ప్రశ్నపత్రానికి సీరియల్ నంబర్
- ఇంటర్ విద్య కార్యదర్శి కృష్ణ ఆదిత్య

హైదరాబాద్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు బుధవారం నుంచి, ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించనున్న ఈ పరీక్షలకు సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఇంటర్ విద్య కార్యదర్శి కృష్ణ ఆదిత్య సోమవారం మీడియా సమావేశంలో తెలిపారు. ఎండల తీవ్రత నేపథ్యంలో ప్రతి కేంద్రంలో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందికి చెందిన ఏఎన్ఎం/ఆశా కార్యకర్తలను అందుబాటులో ఉంచుతున్నామని చెప్పారు. హాల్ టికెట్‌కు సంబంధించి ఇప్పటికే విద్యార్థులందరికీ ఎస్ఎంఎస్‌లు పంపామని, దానిపై క్లిక్ చేసి వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. పరీక్ష కేంద్రాల కచ్చితమైన చిరునామా తెలిపేందుకు అన్ని హాల్ టికెట్లపై జీపీఎస్ లోకేషన్ ముద్రించామని, దీనిని స్కాన్ చేసి కేంద్రం వివరాలు తెలుసుకోవచ్చని చెప్పారు. ఈసారి అన్ని ప్రశ్నపత్రాలపై ప్రత్యేక వరుస సంఖ్య(యునిక్ సీరియల్ ఐడీ) ముద్రించామని, దీంతో విద్యార్థులకు వెళ్లే ప్రశ్నపత్రం వివరాలు ముందే తెలుసుకోవచ్చన్నారు. ఉదయం 8.30 గంటలకే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని, అనివార్య పరిస్థితుల్లో పరీక్షా సమయం కంటే 5 నిమిషాలు ఆలస్యమైనా కేంద్రంలోకి అనుమతిస్తామన్నారు. పరీక్ష కేంద్రంలో చేతి గడియారాలు అనుమతించమని, ప్రతి 30 నిమిషాలకు ఇన్విజిలేటర్ సమయాన్ని తెలియజేస్తారని చెప్పారు. ఈసారి అన్ని పరీక్ష కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఇక రాష్ట్ర వ్యాప్తంగా 1,532 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈసారి మొత్తం 9,96,971 మంది విద్యార్థులు పరీక్షలకు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 4,88,448 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 5,08,523 మంది ఉన్నారు. హైదరాబాద్ జిల్లాలో అత్యధికంగా 244 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా.. మొత్తం 1,78,874 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. అత్యల్పంగా భూపాలపల్లి జిల్లాలో 8 కేంద్రాల్లో 3,615 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 150 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేశామని, 29,992 మంది ఇన్విజిలేటర్లు, 1,532 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, 1,532 మంది చీఫ్ సూపరింటెండెంట్ అధికారులను పరీక్షల విధుల్లో నియమించామని కృష్ణ ఆదిత్య తెలిపారు.



రెక్కలొచ్చిన రోజీ.. ఖండాలు దాటొచ్చి..

అవును.. నింగి ఎంత గొప్పదైనా రివ్వుమన్న ఆ గువ్వపిల్ల రెక్క ముందు తక్కువే! నాలుగంటే నాలుగంగుళాలు మాత్రమే ఉన్న ఆ బుల్లి విహంగాలు ఎగురుకుంటూ ఎగురుకుంటూ దేశ దేశాలనే కాదు.. ఖండాలనే దాటేసి మన భాగ్యనగరానికొచ్చాయి. రోజీ స్టార్లింగ్ అనే ఈ పక్షులు ఆగ్నేయ ఐరోపా, మధ్య ఆసియా నుంచి ప్రతియేటా ఫిబ్రవరిలో మనదేశానికొస్తాయి. అలా కొన్ని గండిపేట ప్రాంతానికీ వచ్చాయి. పదో, ఇరవయ్యో కాదు.. 300 నుంచి 500 దాకా ఉన్నాయి. జన్వాడ, చిలుకూరు, మంచిరేవుల తదితర ప్రాంతాల్లోని మోదుగుచెట్లను ఆవాసంగా చేసుకున్నాయి. ప్రముఖ చిన్నపిల్లల వైద్యుడు డాక్టర్ సుందరేశన్ బృందం ఆది, సోమవారాల్లో నేచర్ వాక్ నిర్వహించిన సందర్భంగా ఈ పక్షులను కెమెరాల్లో బంధించింది. -నార్సింగ్ (ఆంధ్రజ్యోతి)

భూ భారతికి రూపం..!

- ఫార్మెట్స్ తయారీలో అధికారులు
- సీఎంకు రెండు రోజుల్లో విధివిధానాల ముసాయిదా

హైదరాబాద్, మార్చి3(ఆంధ్రజ్యోతి): లోపాలకు తావు లేకుండా భూభారతి చట్టంలో పేర్కొన్న ప్రతి విషయంపైనా పూర్తి స్పష్టత ఇస్తూ ఫార్మెట్‌లను తయారు చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ఇప్పటికే విధివిధానాల ముసాయిదా సిద్ధమైన నేపథ్యంలో ఒకటి, రెండు రోజుల్లో అవసరమైన ఫార్మెట్‌లను జత చేసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పంపించనున్నారు. ఆబాదీ భూముల సర్వే, మ్యాప్‌ల తయారీ వంటి విషయాలపై ప్రస్తుతానికి నిబంధనలు రూపొందించే అవకాశం లేదు. అలాగే నిబంధనల అమలుకు సాఫ్ట్‌వేర్ కూడా ఆధునీకరించాల్సిన అవసరం ఉంది. నిబంధనల అమల్లో ఏకరూపతను తీసుకొచ్చేలా ఫార్మెట్స్‌ను అధికారులు సిద్ధం చేస్తున్నారు. నోటీసు ఇవ్వాలంటే ఏ తరహా ఫార్మెట్ ఉండాలి. సవరణలకు, రైతు వివరాలను రికార్డుల్లోకి ఎక్కించడానికి ఫార్మెట్ ఎలా ఉండాలనే అంశాలపై స్పష్టత ఇవ్వనున్నారు. సాదా బైనామా, ఆర్వోఆర్ సవరణలు, మ్యుటేషన్, గ్రామ రికార్డులు ఈ నాలుగు అంశాలపైనే ప్రస్తుతం ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు. వీటిపై ప్రభుత్వం రెవెన్యూ నిపుణులు, న్యాయనిపుణులతో చర్చించాక చట్టం అమలుపై తుది నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిసింది.

ఫిరాయింపులపై నేడు సుప్రీం కోర్టులో విచారణ

న్యూఢిల్లీ, మార్చి 3(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ గుర్తుపై గెలిచి కాంగ్రెస్‌లో చేరిన 10 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేసేలా స్పీకర్‌ను ఆదేశించాలని కోరుతూ జనవరి 15న సుప్రీంకోర్టులో దాఖలైన మూడు వేర్వేరు పిటిషన్లపై మంగళవారం విచారణ జరగనుంది. ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎం.సంజయ్ కుమార్, కాలె యాదయ్య, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, టీ ప్రకాష్ గౌడ్, గూడెం మహిపాల్ రెడ్డి, అరెకపూడి గాంధీలపై చర్యలు తీసుకునేలా అసెంబ్లీ స్పీకర్‌కు ఆదేశాలివ్వాలని కోరుతూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ రిట్ పిటిషన్(సివిల్) దాఖలు చేశారు. ఎమ్మెల్యేలు దానం నాగేందర్, తెల్లం వెంకట్రావ్, కడియం శ్రీహరిపైనా చర్యలకు ఆదేశాలివ్వాలని కోరుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, కేపీ వివేకానంద్ వేర్వేరుగా రెండు స్పెషల్ లీవ్ పిటిషన్లు దాఖలు చేశారు. ఈ 3 పిటిషన్లపై సుప్రీం కోర్టు మంగళవారం విచారించనుంది. గత విచారణ సందర్భంగా స్పీకర్ దృష్టిలో రీజనబుల్ టైం అంటే ఎంతో కనుక్కుని చెప్పాలని అసెంబ్లీ కార్యదర్శి తరఫున సీనియర్ న్యాయవాదిని సుప్రీంకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే.

'అధిక సంతానం..అనర్హత' నిబంధన ఎత్తేయండి

వ్యాజ్యాన్ని కొట్టేసిన కోర్టు.. న్యాయవాదికి జరిమానా

హైదరాబాద్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు కంటే ఎక్కువ మంది పిల్లలు కలిగిన వారు పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధిస్తున్న నిబంధనను రద్దు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. ఇద్దరు కంటే ఎక్కువ మంది సంతానం ఉంటే పోటీ చేయకుండా పంచాయతీరాజ్ చట్టం సెక్షన్ 21(3)లో పేర్కొన్న నిబంధనలను రద్దు చేయాలని కోరుతూ నల్గొండ జిల్లాకు చెందిన నాగరాజు హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజాయ్‌పాల్, జస్టిస్ రేణుక ధర్మాసనం విచారణ చేపట్టింది. ఇలాంటి పిటిషన్‌లను గతంలో న్యాయస్థానాలు కొట్టివేసిన నేపథ్యంలో దీన్ని కూడా తిరస్కరిస్తామని ధర్మాసనం తెలిపింది. తీర్పు వెలువరిస్తుండగా పిటిషనర్ తరఫు న్యాయవాది పదే పదే అంతరాయం కలిగిచడంతో రూ.25వేల జరిమానా విధించింది.

అంజనీపుత్ర రియల్ ఎస్టేట్ సంస్థకు గుర్తింపు

- ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు అవార్డు
- 4 లక్షల శ్రీగంధం చెట్లు నాటినందుకు పురస్కారం

మంచిర్యాల కలెక్టరేట్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లాకు చెందిన అంజనీపుత్ర రియల్ ఎస్టేట్ సంస్థకు ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో స్థానం దక్కింది. ఈ మేరకు ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎస్వీఆర్ గార్డెన్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు ఇండియా కో ఆర్డినేటర్ బింగి నరేందర్‌గౌడ్ చేతుల మీదుగా సంస్థ చైర్మన్ గుర్రాల శ్రీధర్, ఎండీ పిల్లి రవి అవార్డును అందుకున్నారు. ఏడు సంవత్సరాలుగా కాలుష్యాన్ని నిర్మూలించాలన్న సంకల్పంతో శ్రీగంధం చెట్లను పెంచడంలో అంజనీపుత్ర రియల్ ఎస్టేట్ కృషి చేస్తోంది. ఉత్తర తెలంగాణలో ఎప్పటికప్పుడు ప్రత్యేకతను చాటుకుంటూ ప్రజల ఆదరాభిమాలను చూరగొంటూ వస్తోంది. వ్యాపార రంగంలో చెట్లు నాటాలన్న ఆలోచనలతో 2017 సంవత్సరంలో ఈ రియల్ ఎస్టేట్ సంస్థను గుర్రాల శ్రీధర్ నేతృత్వంలో ప్రారంభించారు. నాటి నుంచి నేటి వరకు అంజనీపుత్ర సంస్థ 350 ఎకరాల్లో 4లక్షల శ్రీగంధం చెట్లు నాటి జిల్లా ప్రజలందరికీ స్ఫూర్తిగా నిలిచిందని సంస్థ చైర్మన్ శ్రీధర్, ఎండీ రవి తెలిపారు. ప్రజల ఆదరాభిమానాలు చూరగొని అవిశ్రాంత నిబద్ధతతో ప్రతీ ఒక్కరు పడిన కష్టానికి ఫలితం ఈ అవార్డు అని పేర్కొన్నారు. కార్యక్రమంలో కంపెనీ డైరెక్టర్లు, ఇంటర్నేషనల్ వండర్ బుక్ రికార్డు తెలంగాణ ప్రతినిధులు అరుణ్‌కుమార్, శంకర్ పాల్గొన్నారు.

సీతారామ డిజైన్లను జల్లెడపడుతున్న సీడబ్ల్యూసీ

హైదరాబాద్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): సీతారామ ఎత్తిపోతల పథకం/సీతమ్మసాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టు డిజైన్లు/డ్రాయింగ్‌లను కేంద్ర జలవనరుల సంఘం (సీడబ్ల్యూసీ) జల్లెడ పడుతోంది. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ వైఫల్యానికి డిజైన్లు/డ్రాయింగ్‌లే కారణమని కేంద్ర జలశక్తి శాఖకు చెందిన టెక్నికల్ అడ్వయిజరీ కమిటీ (టీఏసీ) అభ్యంతరం వ్యక్తం చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో సీతారామ డిజైన్లు/డ్రాయింగ్‌లను నెల రోజుల్లోగా పక్కాగా పరిశీలించాలని సీడబ్ల్యూసీని ఆదేశించింది. దాంతో టీఏసీ ఆదేశాలతో ఇటీవలే తెలంగాణ ప్రభుత్వం సీతారామ డిజైన్లు/డ్రాయింగ్‌లను సీడబ్ల్యూసీకి సమర్పించింది. దాంతో వీటిని పరిశీలించిన సంతృప్తి చెందితే సీడబ్ల్యూసీ ఈ ప్రాజెక్టును టీఏసీకి రిఫర్ చేయనుంది.ఇప్పటిదాకా ప్రాజెక్టు నిర్మాణానికి పర్యావరణ అనుమతి లేకపోవడంతో దీని నిర్మాణ పనులను ఎన్‌జీటీ నిలుపుదల చేసింది. పర్యావరణ అనుమతి రాగానే సీతమ్మ సాగర్ బ్యారేజీ నిర్మాణ పనుల్లో వేగం పెరగనుంది. సీతారామ ఎత్తిపోతల పథకంలో మూడు పంప్‌హౌస్‌లను ఇప్పటికే పూర్తి చేశారు. ఈ నేపథ్యంలో టీఏసీ సమావేశపు మినిట్స్ కూడా సోమవారం విడుదలయ్యాయి. మూడు అంశాల కారణంగా ఈ ప్రాజెక్టుకు సాంకేతిక అనుమతిని పక్కనపెట్టినట్లు గుర్తు చేశారు. అందులో ఒకటి డిజైన్లను నెల రోజుల్లోగా సీడబ్ల్యూసీ పరిశీలించడం.. మరొకటి కేంద్ర అటవీ పర్యావరణ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖతో ఉన్న సమస్యలను పరిష్కరించుకోవడం, ఈ ప్రాజెక్టు కింద సూక్ష్మసేద్యంతో పాటు పైప్డ్ ఇరిగేషన్ నెట్‌వర్క్‌పై సమగ్ర ప్రణాళికను అందించాలని గుర్తు చేసింది.

నర్సింగ్ కౌన్సిల్.. పైసా వసూల్

ప్రైవేటు కాలేజీల నుంచి భారీగా లంచాలు.. నర్సుల రిజిస్ట్రేషన్లు, రెన్యువల్స్‌లో చేతివాటం

- లెక్కలు చెప్పకుండా నిధుల దోపిడీ
- పదేళ్లుగా ఉన్నతాధికారుల ఇష్టారాజ్యం

హైదరాబాద్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ నర్సింగ్ కౌన్సిల్ అనేక అక్రమాలకు నిలయంగా మారింది. ప్రైవేటు నర్సింగ్ కాలేజీల నుంచి పెద్దమొత్తంలో పైసలు వసూలు చేయడం, నర్సుల ఐడెంటిటీ రిజిస్ట్రేషన్లు, రెన్యువల్స్‌లో భారీగా డబ్బులు దండుకోవడం, పాలనా వ్యవహారాల్లో అందినకాడికి నిధుల దోపిడీ.. ఇలా కౌన్సిల్‌లో అధికారుల అవినీతి అడ్డూ అదుపూ లేకుండా సాగుతోంది. రాష్ట్రంలో నర్సింగ్ విద్య భ్రష్టు పట్టడానికి నర్సింగ్ కౌన్సిల్ పరోక్షంగా కారణమవుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. తెలంగాణలో కొత్త నర్సింగ్ కాలేజీకి అనుమతులు వచ్చిన తర్వాత అధికారులు వరుసగా నాలుగేళ్లపాటు తనిఖీలు చేస్తారు. ఆ తర్వాత నాలుగేళ్లకోసారి తనిఖీలుంటాయి. తనిఖీలకు నర్సింగ్ కౌన్సిల్ నుంచి ఇద్దరు సభ్యులు, హెల్త్ వర్సిటీ నుంచి డాక్టర్లు వస్తారు. రెండుసార్లు తనిఖీలు చేసిన తర్వాత అడ్మిషన్లు ఇస్తారు. ఇక తనిఖీలకు వచ్చే వారిని కొత్త అల్లుడిలా చూసుకుంటామని ప్రైవేటు నర్సింగ్ కాలేజీలు చెబుతున్నాయి. వారికి హోటల్ రూమ్, భోజనం, కారు, ఖరీదైన వస్త్రాలతో పాటు పెద్దమొత్తంలో నగదు ఇస్తామని వెల్లడిస్తున్నాయి. అలా అయితేనే తమకు అనుకూలంగా రిపోర్టులు వెళతాయని.. ఇలా ఏటా రూ.లక్షల్లో సమర్పించుకోవాల్సి వస్తోందని అంటున్నాయి.



ఎస్ఆర్‌టీఎస్ పోర్టల్‌తో మోసం..

కోర్సులు పూర్తి చేసుకున్న నర్సులు నర్సింగ్ కౌన్సిల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అంతకంటే ముందు వారికి నర్స్ యూనిక్ ఐడెంటిఫికేషన్ నంబరు(ఎన్‌యూఐడీ) ఉండాలి. అందుకోసం అభ్యర్థులు నర్స్ రిజిస్ట్రేషన్ అండ్ ట్రాకింగ్ సిస్టమ్(ఎన్ఆర్‌టీఎస్) వెబ్‌సైట్‌లో నమోదు చేసుకొని, ఎన్‌యూఐడీ కార్డును డౌన్‌లోడ్ చేసుకోవాలి. నర్స్ కోర్సులు చేసిన వారు విధిగా ఈ కార్డును పొందాలి. అయితే ఈ పోర్టల్ కేవలం నర్సింగ్ కౌన్సిల్‌లోనే ఓపెన్ అవుతుందని కొందరు నర్సులు చెబుతున్నారు. ప్రైవేటులో చదివిన విద్యార్థులను కాలేజీ యాజమాన్యాలే కౌన్సిల్‌కు తీసుకువచ్చి రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేస్తున్నట్టు విద్యార్థులు చెబుతున్నారు. అందుకోసం ఒక్కొక్కరి నుంచి రూ.2-5 వేల వరకు వసూలు చేస్తున్నారు. రోజూ సగటున 70-100 మంది వరకు రిజిస్ట్రేషన్, రెన్యువల్ కోసం కౌన్సిల్‌కు వస్తారు.

కౌన్సిల్ నిధులపై లెక్కలేవి..?

ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ మాదిరిగా ప్రతీ ఏడాది వార్షిక ఆదాయ, వ్యయ వివరాలను రాష్ట్ర నర్సింగ్ కౌన్సిల్ వెల్లడించడం లేదు. అలాగే రాష్ట్ర వైద్యమండలికి జరిగినట్లు నర్సింగ్ కౌన్సిల్‌కు ఎన్నికలు నిర్వహించడం లేదు. తెలంగాణ ఏర్పాటైనప్పటి నుంచి ఇదే తంతు నడుస్తోంది. కౌన్సిల్ ఉన్నతాధికారులు కొంత మంది నామినేటెడ్ సభ్యులను పెట్టుకొని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. అలాగే కౌన్సిల్‌కు సంబంధించిన న్యాయపరమైన వ్యవహారాలను పర్యవేక్షించేందుకు స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులుగా తమ కుటుంబీకులను నియమించుకుని, వారికి పెద్దమొత్తంలో ఫీజులు చెల్లించినట్లు ఆరోపణలున్నాయి. అలాగే నర్సింగ్ కౌన్సిల్ క్యాష్ బుక్‌ను మెయింటెన్ చేయడం లేదని చెబుతున్నారు. రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటిదాకా ఒక్కరికే కౌన్సిల్ బాధ్యతలు అప్పగించడం వెనుక అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. నర్సింగ్ కౌన్సిల్‌లో దశాబ్ద కాలంగా పాతుకుపోయిన ఉన్నతాధికారుల నుంచి సిబ్బంది వరకు అందరినీ బదిలీ చేయాలని నర్సులు కోరుతున్నారు.

ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు



నర్సింగ్ కౌన్సిల్ ఉన్నతాధికారులపై ఇప్పటికే వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, ఆరోగ్య కార్యదర్శి వైద్య విద్య సంచాలకులకు ఎన్నోసార్లు ఫిర్యాదు చేశాం. కానీ ఇంత వరకు చర్యలు తీసుకోలేదు. నర్సింగ్ కౌన్సిల్ నిధులు రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన కౌన్సిల్ భవనం నిరుపయోగంగా మారింది. తనిఖీల సమయంలో పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారు. కౌన్సిల్‌కు ఏళ్లుగా ఎన్నికలు నిర్వహించడం లేదు.

- నక్కా సూర్య కుమార్, రాష్ట్ర అధ్యక్షుడు, నర్సింగ్ వెల్ఫేర్ అసోసియేషన్

టిప్పుసుల్తాన్ వారసుడినంటూ..

రూ.5.56 కోట్లకు టోకరా

- 8 నెలలుగా పరారీలో నిందితుడు
- అరెస్టు చేసిన జనగామ పోలీసులు

జనగామ రూరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): టిప్పుసుల్తాన్ వారసుడినంటూ పలువురి వద్ద రూ.5.56 కోట్లకు టోకరా వేసిన ఘరానా మోసగాడిని జనగామ పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జనగామ డీసీపీ రాజ మహేంద్రనాయక్ వివరాలను వెల్లడించారు. తమిళనాడులోని కంభం ప్రాంతానికి చెందిన అబ్దుల్ రహీం సుల్తాన్ రజా ఎంబీబీఎస్ పూర్తి చేసినట్లు చెప్పుకొంటూ.. జనగామలో కేకే ఆస్పత్రిని నిర్వహిస్తున్నారు. తనను తాను టిప్పుసుల్తాన్ వారసుడినని రహీం చెప్పుకొనేవారు. టిప్పుసుల్తాన్ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నట్లు నమ్మబలికేవారు. కర్ణాటక ప్రభుత్వం ద్వారా ట్రస్ట్‌కు రూ.700 కోట్లను కేటాయించారని, ఆ మొత్తంతో హైదరాబాద్‌లో మెడికల్ కాలేజీని నిర్మిస్తానని చెప్పేవారు. అందులో ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించారు. ఉద్యోగాల పేరుతో.. వేర్వేరు కారణాలతో జనగామ పట్టణానికి చెందిన ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టర్ వసీం అక్తర్ వద్ద రూ.1.17కోట్లు, 2014లో కరీంనగర్‌కు చెందిన సీహెచ్ అనిల్ వద్ద రూ.2కోట్లు, హైదరాబాద్‌కు చెందిన ఎస్వీఎస్ చారి అలియాస్ ఆచార్య(ఆడిటర్) వద్ద రూ.1.70 కోట్లు, రాజు అనే వ్యక్తి వద్ద రూ.50లక్షలు, 2021లో హైదరాబాద్ ఈఎస్ఐ ఆస్పత్రిలో ఉద్యోగాలిప్పిస్తానంటూ జనగామకు చెందిన మేకల ఆనంద్‌కుమార్ వద్ద రూ.3.75లక్షలు, గాదెపాక రాజ్‌కుమార్ వద్ద నుంచి రూ.5.50 లక్షలు, పిపిరె సిద్ధార్థ వద్ద రూ.5.50లక్షలు, మరో ముగ్గురి నుంచి రూ.14.75లక్షల చొప్పున వసూలు చేశారు. 2023లో ఆస్పత్రిలోని ఎక్స్‌రే మిషన్, 10 బెడ్లు, ప్రింటర్లు, కంప్యూటర్లు, ఇతర సామగ్రిని తక్కువ ధరకే ఇస్తానంటూ జనగామకు చెందిన మారబోయిన పాండు వద్ద రూ.5లక్షలు తీసుకున్నారు. ఇలా రూ.5.56 కోట్లను కొల్లగొట్టిన రహీం..జనగామ నుంచి ఉడాయించాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఎనిమిది నెలల క్రితం కేసు నమోదు చేశారు. సోమవారం సాయంత్రం రహీం జనగామకు వచ్చినట్లు సమాచారం అందడంతో.. సీఐ దామోదర్‌రెడ్డి నేతృత్వంలోని బృందం అతణ్ని అరెస్టు చేసింది.

'దక్షిణాది మండలి' పునరుద్ధరించాలి

- దానికి రూ. లక్ష కోట్ల బడ్జెట్ కేటాయించాలి
- దక్షిణాది జేఏసీ చైర్మన్ గాలి వినోద్‌కుమార్
- హైదరాబాద్‌ను దేశ రెండో రాజధాని చేయాలి
- ప్రకాశ్ యశ్వంత్ అంబేడ్కర్



మాట్లాడుతున్న గాలి వినోద్‌కుమార్, ప్రకాష్‌యశ్వంత్ అంబేడ్కర్

రాంనగర్, బర్కత్‌పుర, మార్చి 3(ఆంధ్రజ్యోతి): దక్షిణాది రాష్ట్రాలను అభివృద్ధి చేయడానికి కేంద్ర ప్రభుత్వం తక్షణమే దక్షిణాది అభివృద్ధి మండలిని పునరుద్ధరించి, దానికి రూ. లక్ష కోట్ల బడ్జెట్ కేటాయించాలని దక్షణాది జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మండలికి ఉపప్రధాని స్థాయిలో చైర్మన్‌ను నియమించాలన్నారు. హైదరాబాద్‌లో ఉత్తర భారతీయులు మకాం వేసి పూర్తి ఉద్యోగాలను వారే పొందుతూ స్థానిక నిరుద్యోగులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. నాన్ ముల్కి నార్త్ ఇండియా గో బ్యాక్ అన్న నినాదంతో ఉద్యమం చేపడతామని అన్నారు. ప్రైవేట్ ఉద్యోగ నియామకాలలో 75 శాతం తెలంగాణకు మిగతా 25 శాతం దక్షిణాది రాష్ట్రాలకు కేటాయించాలని కోరారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన మాట్లాడారు. దక్షిణాదిలో ఐటీ, ఇండస్ట్రీయల్ కారిడార్లను ఏర్పాటు చేయాలని కోరారు. జాతీయ స్థాయిలో నిర్వహించే అన్ని పోటీ పరీక్షలను తెలుగులో రాసే విధానాన్ని వెంటనే ప్రవేశ పెట్టాలన్నారు. డీలిమిటేషన్ పేరుతో దక్షిణాది రాష్ట్రాలలో ఎంపీ సీట్లను తగ్గిస్తే ఊరుకు బోమని హెచ్చరించారు.

హైదరాబాద్‌ను రెండో రాజధాని చేయాలి

హైదరాబాద్‌ను దేశ రెండో రాజధాని చేయాలని, ఇక్కడ సుప్రీంకోర్టు బెంచ్‌ను ఏర్పాటు చేయాలని, పార్లమెట్ శీతాకాల సమావేశాలు ఇక్కడే జరపాలని బీఆర్ అంబేడ్కర్ మనవడు ప్రకాశ్ యశ్వంత్ అంబేడ్కర్ డిమాండ్ చేశారు. సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. దేశ రాజధాని పాకిస్తాన్ సరిహద్దు నుంచి కేవలం 300 కిలోమీటర్ల దూరంలో ఉందని, శత్రు దేశాలు రాజధానికి చాలా దగ్గరగా ఉండడం దేశ రక్షణకు శ్రేయస్సు కాదన్నారు. భారతదేశం బలమైన ప్రజాస్వామ్య దేశంగా ఎదగాలంటే కులమతాలకతీతంగా ఐక్యం కావాలన్నారు. ప్రాంతాల మధ్య అసమానతలు తొలగిపోవాలన్నారు. ఒకే భాష, ఒకే రాష్ట్రం అనే సూత్రం పనికిరాదని పేర్కొన్నారు.



టన్నెల్‌లోకి వెళ్లేందుకు సిద్ధమవుతున్న రెస్క్యూ బృందాలు

ఎస్ఎల్‌బీసీ సహాయక చర్యలు..

కన్వేయర్ బెల్టుకు మరమ్మతులు

- 5 చోట్ల కొనసాగుతున్న తవ్వకాలు.. టీబీఎంను కట్ చేస్తేనే చివరకు

అచ్చంపేట/పదర, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఉబికివస్తున్న ఊట నీరు.. 5-10 మీటర్ల వరకు పేరుకుపోయిన బురద మట్టి.. టీబీఎం యంత్రాన్ని కట్ చేశాక, బయటకు తీసుకవచ్చే ఏర్పాట్లు లేకపోవడం.. బురదను బయటకు తరలించే కన్వేయర్ బెల్ట్‌కు మరమ్మతులు.. వెరసి నాగర్‌కర్నూల్ జిల్లాలోని ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాద స్థలిలో సహాయకచర్యలకు అడుగడుగునా ఆటంకాలేర్పడుతున్నాయి. ప్రమాదం జరిగి 10 రోజులు అవుతున్నా.. గల్లంతైన 8 మంది జాడ తెలియడం లేదు. ఉపగ్రహ సెన్సర్‌తో ఐదు చోట్ల బురదలో మెత్తటి అవశేషాల జాడను గుర్తించినా.. అక్కడ తవ్వకాలు కొనసాగుతూనే ఉన్నాయి. టీబీఎంను పూర్తిగా కట్‌చేసి, శకలాలను తొలగిస్తేనే.. టన్నెల్ చివరకు చేరుకునే అవకాశాలున్నట్లు అధికారులు చెబుతున్నారు. మరోవైపు బురద తొలగింపును వేగవంతం చేసేందుకు కన్వేయర్ బెల్ట్ మరమ్మతులకు 8మంది సింగరేణి ఇంజనీర్లు, ఫిట్టర్లు అహరహం శ్రమిస్తున్నారు. యంత్రాల సాయంతో టన్నెల్‌లోని నీటిని తోడే ప్రయత్నాలను వేగవంతం చేయగా.. మరో ఎక్స్‌కవేటర్‌ను లోనికి పంపేందుకు యత్నిస్తున్నట్లు అధికారులు వివరించారు. కాగా, సొరంగంలో చిక్కుకున్న ఎనిమిది మంది సిబ్బందిని రక్షించడానికి అన్నిరకాల సహాయ చర్యలు తీసుకుంటున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం సోమవారం హైకోర్టుకు నివేదించింది. నేషనల్ యూనియన్ ఫర్ మైగ్రెంట్ వర్కర్స్ సంస్థ దాఖలు చేసిన పిల్‌పై విచారణ సందర్భంగా ఈ మేరకు ఏజీ సుదర్శన్ రెడ్డి వివరించారు. వాదనలు విన్న ధర్మాసనం..ప్రస్తుత దశలో ఈ అంశంపై విచారణ చేపట్టడం సమంజసం కాదని తెలిపింది. విచారణను ముగిస్తున్నట్లు పేర్కొంది.

మూసీ నిర్వాసితులను

కలిసిన మేధాపాట్కర్

అనుమతి లేదంటూ పంపించి వేసిన పోలీసులు



స్థానికుల వివరాలు తెలుసుకుంటున్న మేధాపాట్కర్

ఓల్డ్‌మలక్‌పేట, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సామాజిక కార్యకర్త మేధా పాట్కర్ మూసీ నిర్వాసితులను పరామర్శించేందుకు రాగా, అనుమతి లేకుండా రాకూడదంటూ పోలీసులు ఆమెను అక్కడి నుంచి పంపించి వేశారు. సోమవారం ఉదయం ఓల్డ్‌మలక్‌పేటలోని ఓ సామాజిక కార్యకర్త ఇంటికి వచ్చిన ఆమె ఆ తర్వాత మూసీ రివర్ బెడ్‌లో ఇళ్లు కోల్పోయిన బాధితులను కలిసి మాట్లాడారు. కొంద మంది స్థానికులతో కలిసి ఇళ్లు కూల్చివేసిన ప్రాంతాన్ని పరిశీలించారు. ప్రభుత్వం కేటాయించిన డబుల్ బెడ్రూం ఇళ్ల వివరాలు, అక్కడి వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. మేధా పాట్కర్ సందర్శన గురించి తెలుసుకున్న పోలీసులు ఆమె ఉన్న ప్రాంతానికి చేరుకున్నారు. సమాచారం ఇవ్వకుండా పర్యటించడానికి అనుమతి లేదంటూ ఆమెను వాహనంలో పంపించి వేశారు.

మెట్రో స్టేషన్ల నుంచి స్కైవాక్‌లు

- సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, బస్టాండ్‌ను కలుపుతూ 800మీటర్ల మేర స్కైవాక్
- మెట్రోకు అనుసంధానంగా ప్రైవేటు సంస్థలూ స్కైవాక్‌లు నిర్మించుకోవచ్చు
- ఇప్పటికే ముందుకొచ్చిన పలు సంస్థలు

హైదరాబాద్ సిటీ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మెట్రో స్టేషన్ల నుంచి సమీపంలోని వాణిజ్య, నివాస భవనాల సముదాయాలకు స్కైవాక్‌ల (పైవంతెనల) నిర్మాణాన్ని ప్రోత్సహించాలని కాంప్రెహెన్సివ్ మొబిలిటీ ప్రణాళిక (సీఎంపీ) సమావేశంలో సూత్రప్రాయంగా నిర్ణయించారు. హైదరాబాద్ నగరంలో జటిలంగా ఉన్న ట్రాఫిక్ సమస్యకు కొంతవరకు పరిష్కారంగా, వాతావరణ కాలుష్యాన్ని తగ్గించే విధంగా ప్రజారవాణా వ్యవస్థను మరింత పటిష్ఠం చేయడానికి స్కైవాక్‌లు దోహదపడనున్నాయి. ఇప్పటికే ఉప్పల్ జంక్షన్‌లో పలు బస్టాప్‌లకు అనుసంధానంగా ఉన్న స్కైవాక్‌కు మెట్రో స్టేషన్‌ను కనెక్టివిటీ చేయగా.. జేబీఎస్(జూబ్లీ బస్‌స్టేషన్), పరేడ్ గ్రౌండ్ మెట్రో స్టేషన్‌లను కలుపుతూ ప్రయాణికులు రోడ్డు దాటే అవసరం లేకుండా స్కైవాక్‌లు నిర్మించారు. రాయదుర్గ్ మెట్రో స్టేషన్ నుంచి రహేజా మైండ్ స్పేస్ కాంప్లెక్స్‌లో 11 టవర్లలో నెలకొని ఉన్న అనేక అంతర్జాతీయ సంస్థలలో పనిచేస్తున్న వారు సులభంగా చేరుకునే విధంగా రహేజా వారు ఒక అధునాతనమైన స్కైవాక్ ని అనేక సౌకర్యాలతో నిర్మించారు. ఇదే తరహాలో ప్రైవేటు సంస్థలకు కూడా అవకాశం కల్పించాలని తాజాగా హెచ్ఎండీఏలోని స్వర్ణజయంతి కాంప్లెక్స్‌లో జరిగిన సీఎంపీ సమావేశంలో కమిషనర్ సర్ఫరాజ్ ఆహ్మద్, మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, ప్లానింగ్, ఉమ్టా అధికారులు నిర్ణయించారు. సికింద్రాబాద్ మెట్రో స్టేషన్ నుంచి ప్రస్తుతం రేతిబౌలి బస్టాండ్‌లోకి స్కైవాక్ ఉండగా.. ఈ స్కైవాక్ నుంచి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌తో పాటు పశ్చిమ వైపు గల మరో సికింద్రాబాద్ వెస్ట్ మెట్రో స్టేషన్‌కు అనుసంధానం చేయాలని నిర్ణయించారు. మెట్రో స్టేషన్లు, బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్లకు అనుసంధానంగా 800 మీటర్ల మేరకు స్కైవాక్‌ను నిర్మించడం వల్ల ప్రజా రవాణా వ్యవస్థ మెరుగుపడుతుందని, ప్రైవేటు వాహనాల వినియోగం తగ్గుతుందని అంచనాలు వేశారు. ఈ ప్రాజెక్టును హెచ్ఎండీఏ లేదా జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో నిర్మాణం చేపట్టాలని సూచనలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయానుసారంగా 800 మీటర్ల స్కైవాక్‌ను త్వరలోనే చేపట్టే అవకాశాలున్నాయి.

ప్రైవేటు సంస్థలకు అవకాశం!

మెట్రో స్టేషన్ల నుంచి ఇప్పటికే ఎల్అండ్‌టీ ఆధ్వర్యంలో పంజాగుట్ట, హైటెక్ సిటీ, ఎర్రమంజిల్ మెట్రో స్టేషన్ల నుంచి వారు అభివృద్ధి చేసిన మాల్స్‌కు స్కైవాక్‌లు నిర్మించారు. ప్రయాణికులు నేరుగా ఈ వాణిజ్య సముదాయాలకు చేరుకునే సౌలభ్యాన్ని కల్పించారు. అదే విధంగా ప్రస్తుతం డాక్టర్ అంబేడ్కర్ బాలానగర్ మెట్రో స్టేషన్ నుంచి దాని సమీపంలో నిర్మాణంలో ఉన్న ఫీనిక్స్/ల్యాండ్ మార్క్ మాల్‌కు ఆ సంస్థ వారే స్కైవాక్ నిర్మిస్తున్నారు. అలాగే ఎల్‌బీ నగర్ మెట్రో స్టేషన్ నుంచి దాని సమీపంలో నిర్మాణంలో ఉన్న వాసవీ ఆనంద నిలయం నివాస భవనాల సముదాయానికి వాసవీ గ్రూప్ స్కైవాక్ నిర్మిస్తున్నది. అదేవిధంగా మరికొన్ని సంస్థలు నాగోల్ స్టేడియం, దుర్గం చెరువు, కూకట్‌పల్లి మెట్రో స్టేషన్ల నుంచి ఈ తరహా స్కైవాక్‌లు నిర్మించడానికి ఎల్అండ్‌టీతో చర్చలు జరుపుతున్నారు. ప్రైవేట్ సంస్థలు స్కైవాక్‌లు నిర్మించదలిస్తే ఎల్అండ్‌టీ మెట్రోరైల్ రిటైల్ అధికారి నాగేంద్ర ప్రసాద్‌ను ఫోన్ నెంబర్ 9900093820 సంప్రదించవచ్చని ఎల్అండ్‌టీ మెట్రో ఎండీ తెలిపారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.